అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి: 37 సంచిక: 4 మార్చి-మే 2014
పేజీలు: 68 వెల: రు. 20

స్వేచ్ఛ
ఎంత చిన్నదైనా
మాకది సముద్రమే
జీవితం కన్నా సమున్నతమే
అంతర్ బహిర్ ఆధిపత్యాల మీద
యుద్ధమే

పత్రికా ప్రకటనలు : 2

మరోసారి చుండూరు దళితులపై హత్యాకాండ

1991 ఆగస్టు 6 ఉదయం చుండూరు దళితుల నెత్తురు పులుముకుని ఈ దేశంలో అంటరాని చట్టాన్ని, బూటకపు ప్రజాస్వామ్యాన్ని ఎత్తి చూపింది. కుల దురహంకారంతో రెడ్లు పోలీసుల కనుసన్నలలోనే అత్యంత హేయంగా 8 మంది దళితుల్ని నరికి చంపి కాలువలో పడేశారు. ఏళ్ళ తరబడి దళితులు, పౌరహక్కుల సంఘం, కులనిర్మూలనా పోరాట సంఘాలు దీనిపై న్యాయపోరాటం చేసిన ఫలితంగా చుండూరులో ప్రత్యేక కోర్టు ఏర్పడి విచారణ జరిగింది. 2008లో కోర్టు 56 మందిని నేరస్తులుగా తేల్చి అందులో 21 మందికి జీవిత ఖైదు విధించింది. అయితే ఈ రోజు హైకోర్టు కింది కోర్టు విధించిన శిక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. నిందితులు ఇన్నేళ్ళు అనుభవించిన శిక్షను పరిగణించి కాదు ఈ తీర్పు వచ్చింది. కింది కోర్టు ఇచ్చిన తీర్పు మొత్తంగానే రద్దయింది. నిజానికి ప్రత్యేక కోర్టు ఏర్పడింది దళితులకు న్యాయాన్ని చేరువ చేయాలని సుదీర్ఘ పోరాటం జరిగిన ఫలితంగా. విచిత్రంగా ఈ దేశంలో చట్టాలు అటు తిరిగి, ఇటు తిరిగి చివరికి బలవంతులకే న్యాయం అందేటట్లు చేస్తాయి. హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్న సందర్భంలోనే మాకు విశ్వాసం పోతున్నది అంటే - న్యాయవాదులపై కోర్టు ధిక్కార నోటీసులు ఇవ్వడం ఇందులో మరొక పార్శ్వం. అయితే కేసు విషయంలో పోలీసు శాఖ ప్రాసిక్యూషన్‌కు తగినన్ని బలమైన ఆధారాలు ఇవ్వలేకపోయిందనేది గడ్డు వాస్తవం. మొత్తం మీద దళితులు పోరాడి సాధించిన విజయం రద్దయిపోయి మరోసారి దళితులకు ఘోరమైన అన్యాయం జరిగింది. ఇది దళితులపై జరిగిన హత్యాకాండతో పోల్చదగ్గది. చిట్టచివరి అవకాశం ఉన్నంత వరకు న్యాయపోరాటం కొనసాగుతుంది. విరసం దానికి మద్దతునిస్తుంది. ఈ దేశ ప్రజాస్వామ్యానికి, న్యాయవ్యవస్థకు చుండూరు ఒక సవాలు. ఎంత మేరకు దళితులకు న్యాయం జరుగుతుందో అంతమేరకైనా అవి తమ ఉనికిని నిలబెట్టుకుంటాయో లేదో అనుమానమే.

- పి.వరలక్ష్మి

22-04-2014

కార్యదర్శి, విప్లవ రచయితల సంఘం

విప్లవ ప్రజాస్వామిక వేదిక ఉపప్రధాన కార్యదర్శి జీఎన్ సాయిబాబా అరెస్టు, సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా

'ప్రజాస్వామిక హక్కులు - ప్రపంచీకరణ - హిందుత్వ' అనే అంశంపై సదస్సు

ఆర్.డి.ఎఫ్. జాతీయ నేత సాయిబాబా అరెస్టును విప్లవ రచయితల సంఘం తీవ్రంగా గర్హిస్తున్నది. ఒక చట్ట విరుద్ధ అరెస్టును సమర్థించుకోవడానికి ప్రభుత్వం, పోలీసులు ప్రయత్నిస్తున్న తీరును ఖండిస్తున్నది. రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛ గురించి బోధించి విద్యార్థులను, సమాజాన్ని చైతన్యమంతం చేయాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉంది. దీనికి విరుద్ధంగా రాజ్యాంగ విహిత సాయిబాబా నిర్బంధాన్ని సమర్థించే రీతిలో ఢిల్లీ యూనివర్సిటీ వ్యవహరించడం, సాయిబాబాను సస్పెండ్ చేయడం ఆందోళన కలిగిస్తున్నది. రిమాండ్‌లో ఉన్న సాయిబాబాకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి మీడియా, పోలీసులు గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు, భారత రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా జరిగిన సాయిబాబా అరెస్టు చెల్లనేరదని విప్లవ రచయితల సంఘం నినదిస్తున్నది. ఆయనను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది.

మరో 48 గంటల్లో మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి వస్తుందనగా... సాయిబాబాను అరెస్టు చేయడం యాదృచ్ఛికం కాదు. అంతేకాదు, ఎన్నికల సన్నాహాలు జరుగుతుండగా ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు ఆకుల భూమయ్యను రోడ్డు ప్రమాదం రూపంలో హత్య చేయడానికీ, ఫలితాలు రావడానికి నాలుగు రోజుల ముందు టీఆర్ఎస్ నాయకుడు కొనపురి రాములును ప్రైవేట్ సాయుధ ముఠా కాల్చి చంపడానికీ సంబంధం ఉంది. అక్కడ ఢిల్లీలో, ఇక్కడ తెలంగాణలో ఎలాంటి ప్రభుత్వాలు రావాలని తాము కోరుకుంటున్నది అటు ప్రపంచ బ్యాంకు, ఇటు పోలీసులు ఈ ఘటనల ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపించారు. పాలకవర్గాలు, మతవాదులు, పోలీసులతోపాటు తమది బ్లూ బ్లడ్ అని నమ్ముతున్న విశ్వవిద్యాలయాల పెద్దలూ వచ్చే ఐదేళ్ల కాలంలో ఎలాంటి భారతాన్ని నిర్మించాలనుకుంటున్నారనేందుకూ ఇది నిదర్శనం. కాబట్టి, సాయిబాబా అరెస్టును మావోయిస్టులతో లింకులున్న వ్యవహారంగా విప్లవ రచయితల సంఘం చూడదలుచుకోవడం లేదు. ఆయనకు మావోయిస్టు పార్టీతో ఏ లింకు లేదని చెప్పి, నిరూపించడంతోనే సమస్య తీరిపోదని భావిస్తున్నది. ఫాసిస్టు స్వభావం, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యం కలిగిన భారత పాలకవర్గాల రాజకీయార్థిక విధానంలో భాగంగానే ఆర్.డి.ఎఫ్. ఆంధ్రప్రదేశ్ శాఖపై నిషేధాన్ని, ఆ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గంటి ప్రసాదం హత్యను, ఇప్పుడు 'ఉపా' చట్టం కింద సాయిబాబా అరెస్టు, సస్పెన్షన్‌లను విప్లవ రచయితల సంఘం చూస్తున్నది. ఈ నేపథ్యంలోనే "ప్రజాస్వామిక హక్కులు - ప్రపంచీకరణ - హిందుత్వ' అనే అంశంపై ఆదివారం (25-05-14) ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబుల్లా సెల్లార్ హాల్‌లో సదస్సు జరుగుతున్నది. విరసం సీనియర్ సభ్యుడు రవిచంద్ర అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డే, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ హర్జీందర్ సింగ్, ప్రొఫెసర్ కేఆర్ చౌదరి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కావేరి ఇందిర పాల్గొంటారు.

23-05-2014

- పి. వరలక్ష్మి (కార్యదర్శి), వరవరరావు, రవిచంద్ర (సీనియర్ సభ్యులు), పాణి, కాశీం, రివేరా, రాంకి, రుక్మిణి, రవి, చిన్నయ్య, అరసవెల్లి కృష్ణ, బాసిత్, ఉజ్వల్ (కార్యవర్గ సభ్యులు)

3
KLVA101M168

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

304 సంపుటి : 37 ◆ సంచిక : 4 ◆ మార్చి-మే, 2014

సంపాదక లేఖ...

ఈ దేశంలో జరుగుతున్న పరిణామాలను దగ్గరగా పరిశీలిస్తే ఈ 'ప్రజాస్వామ్యం' ఏపాటిదో అర్థమవుతుంది. దేశ రాజధాని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ జి.ఎన్. సాయిబాబాను అరెస్టు చేయడం, హైదరాబాద్‌లో ఇఫ్లూ విశ్వవిద్యాలయంలోని దళిత ఆదివాసీ విద్యార్థులు మోహన్ ధారావత్, సతీష్ కుమార్ నైనాల, సుభాష్ కుమార్‌లను విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించడం, చుండూరు హత్యాకాండకు కారకులైన దోషులను సాక్ష్యాలు సరిగా లేవని హైకోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టడం, రాష్ట్ర విభజనలో భాగంగా అత్యంత ప్రజా వ్యతిరేకమైన, లక్షలాది ఆదివాసీలను నిర్వాసితులను చేసే పోలవరం ప్రాజెక్టును అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేయడం ఇవన్నీ మన 'ప్రజాస్వామ్య' స్వాభావాన్ని చాటి చెపుతున్నాయి. ఇంకా కొత్త ప్రభుత్వాలు అధికారం చేపట్టక ముందే గవర్నర్ పాలనలోని హైదరాబాద్‌లో స్వల్ప ఘర్షణల నేపథ్యంలో మే 14న ముగ్గురు ముస్లిం యువకులు (షౌజా ఉద్దీన్ (38), మహమ్మద్ ఫరీద్ (26), మహమ్మద్ వాజిద్ (20)) పోలీసు కాల్పులకు బలైయ్యారు. మొత్తంగా ప్రశ్నించే వారిని, రాజకీయ ప్రత్యర్థులను ఖైదు చేయడం, ప్రత్యామ్నాయ ఆలోచనలు ఉన్నవారిని, పోరాడుతున్న వారిని భౌతికంగా అంతమొందించటం లక్ష్యాలుగా రాజ్యం పనిచేస్తోంది. రాబోతున్న ఫాసిస్టు అణచివేతకు ఇవన్నీ సంకేతాలు. ఈ అణచివేత చర్యలను అడుగడుగున నిలదీయాల్సిన, ఎదురించాల్సిన అవసరం మునుపెన్నటికన్నా పెరిగిపోయింది. ప్రజలను అప్పుల ఊబిలో ముంచి, పథకాల ఎరలు వేసి ప్రశ్నించే అవకాశమే లేకుండా పకడ్బందీగా రాజ్యం అడుగులు వేస్తోంది. విద్యా, వైద్యం, మంచినీళ్ళు, ఉపాధి, స్వచ్ఛమైన గాలి వంటి కనీస మౌలిక అవసరాలను కూడా వ్యాపారం చేసేసి ప్రభుత్వాలు ఎప్పుడో చేయి దులుపేసుకున్నాయి.

ఇటీవల వచ్చిన ఎన్నికల ఫలితాలు ఈ క్రమాన్ని మరింత జోరుగా అమలు చేయడానికి కావలసిన బలాన్ని చేకూర్చాయి. కోట్లాది రూపాయలు పంచి, కోట్ల లీటర్ల మద్యం ఏరులుగా పారించి, కులం, మతం, ప్రాంతం ఇంకా రకరకాల ప్రలోభాలతో ఈ ఎన్నికలు జరిగాయి. సగటున శాసనసభ్యులు 10 నుంచి 20 కోట్ల రూపాయలు, పార్లమెంటు సభ్యులు 40 నుండి 60 కోట్ల రూపాయలు తమ గెలుపు కోసం ఖర్చు పెట్టడానికి వెనకాడని చోట అసలు నిజమైన ప్రజాభిప్రాయానికి అవకాశం ఏపాటిదో మనమే తేల్చుకోవాలి. పదేళ్ళ యూపిఏ పాలనపై విసుగెత్తిపోయిన ప్రజలు గత 30 ఏళ్ళలో ఏ పార్టీ సాధించని మెజార్టీని (పోలైన ఓట్లలో బి.జె.పి.కి వచ్చిన ఓట్లు 31 శాతం మాత్రమే) మోడి నాయకత్వంలోని బిజెపికి అంటగట్టారు. సంకీర్ణ అవసరం లేని స్పష్టమైన మెజార్టీని ఇచ్చాయి. ఇప్పటికే మోడికి ఎజెండాను సంఘ పరివార శక్తులు నిర్దేశిస్తున్నాయి. ప్రజల మధ్య వైషమ్యాలను తీవ్రతరం చేసే రామలయ నిర్మాణం, రాజ్యాంగంలోని అధికరణం 370 రద్దు, యూనిఫార్మ్ సివిల్ కోడ్, పాఠ్య పుస్తకాలలో బోధనాంశాల మార్పుతో సహా తమ కాషాయ ఎజెండాను దూకుడుగా ముందుకు తెస్తున్నాయి. సంఘ పరివార శక్తులు మోడి విజయంతో దేశం నలుమూలల ఇప్పటికే విజృంభించడం ప్రారంభించాయి. కర్నాటకలో ఒక చికెన్ షాపు ముస్లిం యజమానిని మోడీ విజయానంతర సంబరాలలో పాల్గొనలేదని దాడి చేశారు. మరోచోట ముస్లింల ప్రార్థన స్థలం వద్ద బాణసంచా కాల్చి సంబరాల పేరిట రెచ్చగొట్టే చర్యలకు పూనుకున్నారు. పట్నాలో ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాను విడుదల చేయాలంటూ ఏర్పాటు చేసిన బహిరంగ సభ నిర్వాహకులపై ఏ.బి.వి.పి. కార్యకర్తలు దాడిచేశారు. సోషల్ మీడియా (ఫేస్‌బుక్)లో మోడికి వ్యతిరేకంగా తన అభిప్రాయాలు ప్రకటించినందుకు ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై కేసు నమోదు చేశారు. ఇలాగే గతంలో శివసేనపై అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు ఇద్దరు మహిళలను అరెస్టు చేయడం తెలిసిందే.

ఏ చైతన్యమైనా సమిష్టి ఆచరణను మరింత ప్రజాస్వామికీకరించి మరింత సంఘటిత పరచడానికి, ముందుకు పోవడానికి దోహదపడాలి. ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులన్నీ సంఘటితమవ్వడానికి ఉన్న అవరోధాలను తొలగించడానికి ఉన్నతమైన, విశాలమైన దారులు కనుక్కోవలసిన బాధ్యత పోరాడే వారిపైనే ఉంది. సమాజం అసాంతం మారాలనుకునే వారిదే ఆ బాధ్యత.

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి.టి.పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి
1, 4 కవర్ డిజైన్
పి. వరలక్ష్మి, క్రాంతి
2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి

http://www.facebook.com/arunatara.virasam
Virasam website : www.virasam.in

ఈ సంచిక వెల : రు. 20/-

సంచిక - 304

సంపాదకీయాలు (5-7)
బూటకపు ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మౌలిక సమస్యల్ని పరిష్కరించలేవు - **పి. వరలక్ష్మి**

సంస్మరణ (7-9)
మార్క్వెజ్ నూరేళ్ల ఏకాంతం - **ముక్తవరం పార్థసారథి**
స్వేచ్ఛను, న్యాయాన్నీ ప్రేమించే మార్క్వెజ్‌కు నివాళి - **విప్లవ సాంస్కృతిక వేదిక, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, కొత్త ఢిల్లీ.** (అనువాదం : బాసిత్)

పాటలు/కవిత్వం (10-20)
నిర్బంధం నిర్బంధం - **తంగెళ్ల సుదర్శనం**
కంట నీరు పెట్టకే ... విప్లవ కెరటమా - **మీరా**
కాll గద్దం లక్ష్మి జోహార్లు - **దప్పు రమేష్**
ఆదివాసీలపై రాజ్యం కత్తిగట్టింది - **రాంరెడ్డి**
పోరుహోరు - **జమీన్**
స్వేచ్ఛ ఎంత చిన్నదయినా - **ఉదయ మిత్ర**
అతడు - **శాఖమూరి రవి**
అజ్ఞాత పలవరింత - **మేడక యుగంధరరావు**
చమట చుక్క మధనం - **వేలుపుల నరేష్, వంగల సంతోష్**
మట్టి - మనిషి - **మచ్చ ప్రభాకర్**
నగరం వాకిటిల్ పాలపిట్టలు - **అరసవిల్లి కృష్ణ**
మనుధర్మ మూర్తి సుభాషితాలు - **వివి**
మనువాదాలయాలు - **పోటు నారాయణ**
నాకింకా... పారా హుషార్.... - **కెక్యూబ్ వర్మ** కవితలు రెండు
రక్తం మరిగిన తుటా - **భీమ్**
నేను మనిషిని కాదు - **బిరుసు సురేష్ బాబు**
ఏ గుట్టను తడిమినా నెత్తుటి చెమ్మే - **పచల కిరణ్ కుమార్**
దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పు! - **రాగో**

వ్యాసం (21-23)
అణుధార్మిక భావజాలం - ఈనాడు దినపత్రిక - **పి.వరలక్ష్మి**

కథలు (24-34)
చైతన్యం - **మహమూద్**
జ్ఞానం కనిపించటంలేదు - **వివిన మూర్తి**
ఎడారి అధ్యాపకురాలు - **ఆంద్రెయ్ ప్లతొనొవ్**

సీరియల్ (35-36) 11వ భాగం
సూర్యుడు - **కె.వి. కూర్మనాథ్**

ఎన్నికల దృశ్యం (37-46)
ఎన్నికలలో.... ఎన్నికళలో... ఎన్నికల్లో!
- **బమ్మిడి జగదీశ్వరరావు**

ప్రసంగ పాఠం (47-53)
దండకారణ్య మహిళా ఉద్యమాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి?
- **వల్లూరి రుక్మిణి**

వ్యాసం (54-59)
సాహిత్యంలో సమాజ చలనపు ప్రతిఫలనం : అవకాశాలూ అవరోధాలూ - **ఎన్ వేణుగోపాల్**

నివేదిక (59-60)
హిందూ ఫాసిజాన్ని ఐక్యంగా ప్రతిఘటిద్దాం! - **బాసిత్**

స్పందన (61-61)
గంగాధర్ మరణం ఏం చెబుతోంది - **శాఖమూరి రవి**

లేఖ (61-63)
రెండు పోరాట గాథలు - **సాబిత్**

కరపత్రం (64-65)
హిందూ ఫాసిస్టు వ్యతిరేక దినంగా జరుపుకుందాం!
తొలి తరం విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ రఫూఫ్‌ను స్మరించుకుందాం

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి! చదివించండి! చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల : రు. 15/-; సంవత్సర చందా: రు. 160/-; జీవితచందా : రు. 1500/-

సంపాదకీయం

బూటకపు ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రజల మౌలిక సమస్యల్ని పరిష్కరించలేవు పోరాటాల ద్వారా నూతన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకోవడమే ఏకైక మార్గం

- పి. వరలక్ష్మి

"మన చమటను పీల్చుకొని, మన నెత్తురు చల్లుకొని పుట్లకొద్దీ ఓట్ల పంట తీయడానికి, కోట్ల కొద్దీ నల్ల డబ్బు దాయడానికి ఓట్ల బరిలోకి దింపుతారు వాళ్ళు, ఎన్నికల చెరలోకి తోస్తారు వాళ్ళుతరాల మన పరాధీనతలోంచి, వశీకరణలోంచి, విస్మృతిలోంచిమసక చూపుల మీదుగా, మట్టిచేతుల మీదుగాముస్తాబై వస్తున్నారు వాళ్ళు, పడగ విప్పి వస్తున్నారు వాళ్ళు"

అవును, ఎన్నికలు వచ్చేశాయి మరి. చిలక పలుకుల డేగల్లా మళ్ళీ వస్తున్నారు రంగు రంగుల పార్టీల నాయకులు. వాళ్ళలో ఎవర్నైనా సరే స్వేచ్ఛగా ఎన్నుకునే మహత్తరమైన ఓటు హక్కు మీకుందని, అది హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడానని ప్రజాస్వామ్యానికి కాపాలాదారు అయిన మీడియా కోడై కూస్తూ ప్రజల్ని నిద్రలేపుతోంది. ఇన్నేళ్ళు దేశాన్ని అమ్ముకుతిన్న నాయకులకు, పార్టీలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పండని వివిధ పార్టీల నాయకుల నుండి ఎన్జీవోలు, సినిమా తారలు, మేధావుల దాకా అన్ని పక్షాలు ఏకగ్రీవంగా ఓటు పక్షాన ప్రచారం చేస్తున్నాయి. ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదీ అంటున్నాయి. ఎన్నడూ ప్రజాస్వామ్యం అనే మాట ఉచ్ఛరించని వారు కూడా ఎన్నికల ప్రజాస్వామ్యం గురించి గంభీరమైన మాటలు మాట్లాడుతున్నారు. అట్లా మాట్లాడుతూ ఈ దేశంలో ప్రజాస్వామ్యం దాని నిజమైన అర్థంలో ప్రజాప్రాతినిధ్య రూపంలో ఎక్కడా లేదన్న నిజాన్ని మరిపింపజేయాలని ప్రయత్నిస్తున్నారు.

వాస్తవంగా ఇక్కడ ప్రజల భాగస్వామ్యంతో ప్రజాప్రయోజనాలకు అనువుగా ఏ ఒక్క విధానం రూపొందటం లేదు. అణువణువునా ప్రజాభిప్రాయాన్ని నిరంకుశంగా అణచివేసి పిడికెడుమంది దోపిడిదారుల ప్రయోజనాల కోసమే నిర్ణయాలు జరుగుతున్నప్పుడు కేవలం ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పించినంత మాత్రాన అది ప్రజాస్వామ్యం కాజాలదు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా పవిత్రమైనదని, దానిని నోటుకు అమ్ముకోవద్దని అందరూ నీతి సూత్రాలు చెప్తున్నారు గాని ఈ దేశంలో ప్రజలకు బాధ్యత పడాల్సిన ఏ ఒక్క వ్యవస్థా సవ్యంగా లేదన్న విషయం అందరికీ తెలుసు. కాని వాటిని ప్రశ్నించరు. వేల కోట్లు కొల్లగొట్టిన దోపిడి దొంగలు డబ్బు వెదజల్లి శాసనకర్తలవుతున్నారు. బ్యూరోక్రసీ కార్పొరేట్ దోపిడికి మార్గం సుగమం చేస్తున్నది. చట్టం, న్యాయవ్యవస్థ సామాన్యులకు కాకుండా అయిపోయాయి. అత్యాచారాలు, అరాచకాలు అప్రతిహతం అయ్యాయి. పాలనా వ్యవస్థ మొదళ్ళ నుండి కుళ్ళిపోయి అవినీతికి ఆనవాలం అయింది. ప్రజాప్రతినిధులు, దళారీ బూర్జువావర్గం, బహుళజాతి కంపెనీలు ఈ దేశాన్ని పంచుకు తినడానికి దేశంలో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం లైసన్స్ ఇస్తున్నది. అందుకోసం ప్రతి ఐదేళ్ళకొకసారి తమను ఎవరు దోపిడీ చేయాలో ప్రజలు ఎంపిక చేసుకునే తంతు మాత్రమే ఈ ఎన్నికలు.

భారతదేశంలో బూర్జువా ప్రజాస్వామ్య వ్యవస్థ అన్ని విధాలుగా విఫలమై సంక్షోభంలో కూరుకుపోయిన వైనం ఎప్పటికప్పుడు ఎన్నికల్లో మరింత నగ్నంగా బట్టబయలవుతూనే ఉంది. ఈసారైతే ఎన్నికల రాజకీయాలు మరింత జుగుప్సాకరంగా తయారయ్యాయి. పార్టీలకు సిద్ధాంతాలుండడమన్న మాటటుంచి డబ్బు కోసం తాము స్థాపించిన పార్టీలనే అమ్ముకునే ట్రెండు కూడా వచ్చేసింది. ఏ నాయకుడు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలీదు. ఈ పూట ఒక మాట మాట్లాడితే రేపు దానికి కట్టుబడి ఉంటాడన్న గ్యారెంటీ లేదు. ఈరోజు అసహ్యంగా తిట్టుకున్న నాయకులే మరునాడు ఆలింగనం చేసుకుని ఒకటవుతారు. ఎవరైనా అడిగితే రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని అంటారు. అవకాశవాద రాజకీయాల్లో అది వాస్తవమే కాని అంతకన్నా వాస్తవం ఏమంటే ఈ బూర్జువా పార్టీల నాయకులు ప్రజలకు శాశ్వత శత్రువులే. దాదాపు ఏడాది నుండే ఈ ఎన్నికలకు వ్యూహ ప్రతి వ్యూహాలు సిద్ధం చేసుకుని, తెలుగు ప్రజల భావోద్వేగాల మీద ఓట్ల ప్రయోజనాలు పొందడానికి ఈ పార్టీలు ఎన్నెన్ని ఎత్తులు వేశాయో, ఎన్ని నాటకాలాడాయో చూశాం. తెలంగాణ ఏర్పాటు మా వల్లే సాధ్యమయిందని పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్న పార్టీలే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో విభజన పాపం మీదంటే మీదని దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. తమది ఉద్యమ పార్టీ అని గొప్పలు పోయిన వాళ్ళు అదే ఉద్యమానికి ద్రోహం చేసిన వాళ్ళతో నిస్సిగ్గుగా కలిసిపోయారు. నిజానికి తెలంగాణ సాధనను తమ ఖాతాలో వేసుకోవాలని ఆరాటపడే పార్టీలేవీ పోలవరం గురించి, గవర్నర్ పాలన గురించి, పదేళ్ళ ఉమ్మడి రాజధాని గురించి గట్టిగా మాట్లాడిరది లేదు. కాబట్టి రేపు తెలంగాణలో ఎవరు అధికారంలోకి వచ్చినా కేంద్ర ప్రభుత్వ విధానాలను కాదని ప్రత్యేకంగా చేయబోయేదేమీ ఉండదు. కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్పొరేట్ అభివృద్ధి గురించి అన్ని పార్టీలు ఆర్భాటంగా మాట్లాడుతున్నాయి కాని విధ్వంసక ప్రాజెక్టులు, కంపెనీలకు వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలను కనీసంగా పట్టించుకున్నది లేదు. అన్ని పార్టీలదీ పేదల్ని కొట్టి పెద్దలకు పెట్టే ఒకే అభివృద్ధి నమూనాయే. అట్లాగే రాయలసీమ, కళింగాంధ్ర ప్రాంతాల వెనబాటుతనం గురించి, ప్రాంతీయ అసమానతల్ని రూపుమాపే దిశగా ఏదైనా కార్యాచరణ గురించి ఎవరి మ్యానిఫెస్టోల్లో లేదు. ప్రజల మధ్య వైరుధ్యాలు పెంచి పోషించడమే తప్ప సమస్యల్ని పరిష్కరించే చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదని రాష్ట్ర విభజన సందర్భంలో తేటతెల్లమయింది.

జెండాలు, రంగులే వేరు తప్ప బూర్జువా రాజకీయ పార్టీలన్నీ ఒకటే. పైకి వాటి మధ్య వైరుధ్యాలున్నట్లు కనపడినా, ఒకళ్ళనొకళ్ళు ఎంత తిట్టిపోసుకున్నా విధానపరంగా వాటి మధ్య మౌలిక తేడా ఏమీ లేదు. సామ్రాజ్యవాద మార్కెట్ అనుకూల విధానాలు అమలు చేయడంలో, వాటిని ప్రతిఘటించే ప్రజల్ని అణిచేయడంలో అందరూ ఒకటే. ఇప్పటికే అంతా కలిసి దేశ సంపదను బడా కంపెనీలకు ధారాదత్తం చేశారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో ఆర్థిక విధానాలు రూపొందించి దేశాన్ని దివాళా తీయించారు. ఈ క్రమంలో

అన్ని పార్టీల నాయకులు అందినంత మేరా అంతులేని సంపదను అక్రమంగా కూడబెట్టుకున్నారు. అదే ఎన్నికల్లో పెట్టుబడి అవుతూ పాత కథే పునరావృతమవుతూ వస్తోంది. ఈరోజు పెచ్చరిల్లుతున్న ఆర్థిక సంక్షోభం పైన ఏవేవో లేపనాలు పూసి అంతా బాగుందని అంటున్నారు కాని రోజురోజుకూ అధికమవుతున్న ధరలతో సగటు మనిషి బతుకు మరింత భారమవుతూ ఉండటం దాచేస్తే దాగే సత్యం కాదు. మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో దేశంలోని సంపన్నులు కేవలం వంద మంది దగ్గర 25శాతం సంపద కేంద్రీకృతమై ఉంటే కోట్లాది మంది ప్రజలు రోజుకు 20 రూపాయల కన్నా తక్కువ ఆదాయంతో బతుకీడుస్తున్నారు. బహుళజాతి మార్కెట్ అనుకూల విధానాలు వ్యవసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేశాయి. ఒకవైపు లక్షలాది రైతులు ఆత్మహత్యలు చేసుకుని చచ్చిపోతుంటే ఆర్థిక వృద్ధి గురించి, అభివృద్ధి గురించి గొప్పలు చెప్పి ఓట్లడుగుతున్నారు నాయకులు. బహుళజాతి కంపెనీల కోసం, మైనింగ్ మాఫియా కోసం, దేశ సంపద అక్రమంగా విదేశాలకు తరలించడం కోసం లక్షలాది మందిని నిర్వాసితుల్ని చేశారు. కార్పొరేట్ కంపెనీల స్థాపనతో చదువుకున్న యువకుల్లో కొంత మందికి ఉద్యోగాలు లభించడం మధ్యతరగతికి అభివృద్ధిగా కనపడొచ్చుగాని ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ లక్షలాది మంది కార్మికులను రోడ్డున పడేశాయి. మార్కెట్ అనుకూల ఆర్థిక విధానాలు ఉద్యోగుల, కార్మికుల హక్కులను శాశ్వతంగా రద్దు చేసే దిశగా తీసుకుపోతున్నాయి. ప్రభుత్వం విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతల నుండి కూడా తప్పుకుని అన్నిటినీ మార్కెట్ పరం చేసింది. చివరికి మన నీళ్ళు మనం తాగాలన్నా ఎవరికో డబ్బులిచ్చి కొనుక్కోవాలి. మన రోడ్డు మీద మనం ప్రయాణం చేయాలన్నా దాని మీద తారుపోసిన కంపెనీ వాడికి టోల్ టాక్స్ కట్టే కదలాలి.

అన్నిటినీ అమ్మకం, కొలుగోలుగా మార్కెట్‌కు అనుసంధానం చేశాక ఎన్నికలు కూడా అదే పద్ధతిలోకి రావడంలో ఆశ్చర్యం ఏముంది? దేశాన్నే అమ్ముకోవడంతో పోలిస్తే ఓటుకు నోటు చాలా చిన్న విషయం. ఇటీవలి కాలంలో మీడియా మేనేజ్‌మెంట్ పేరుతో అంతర్జాతీయ సంస్థలు ఎన్నికల ప్రచార వ్యాపారంలోకి దిగాయి. దేశ ప్రజలంతా తమను కష్టాల నుండి గట్టెక్కించే నాయకుడి కోసం ఎదురుచూస్తున్నట్లు అవి తమ సృజనాత్మక శక్తులన్నిటినీ వినియోగించి టీవీలు, పత్రికలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం సాగిస్తున్నాయి. పన్నెండేళ్ళ క్రితం ప్రపంచ దేశాల్లో భారతదేశ ప్రతిష్టను దిగజార్చిన గుజరాత్ ఈ ఎన్నికల సందర్భంగా అభివృద్ధికి నమూనాగా కొనియాడబడుతోంది. బాబ్రీ మసీదు కూల్చివేత నుండి మొన్నటి గుజరాత్, నిన్నటి కంధమాల్, ఇవ్వాల్టి ముజఫర్‌నగర్ దాకా మతోన్మాద రాజకీయాలతో వేలాది ముస్లింల, క్రైస్తవుల నెత్తుటి ఎరువుతో ఎదిగిన బిజేపీ, దాని ప్రతినిధి మోడీ ఇప్పుడు అభివృద్ధి సూటు తగిలించుకుని ముందుకొచ్చాడు. ప్రజాధనాన్ని జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు రాయితీల రూపంలో దోచిపెట్టడమే ఆ అభివృద్ధికి నమూనా. వాస్తవానికి సామ్రాజ్యవాద పెట్టుబడి అనుకూల విధానాల వల్ల గుజరాత్‌లో సామాన్య ప్రజల బతుకు కుదేలయింది. ఆ అభివృద్ధి ప్రాజెక్టుల కింద లక్షలాది మంది ఆదివాసులు, దళితులు నిర్వాసితులయ్యారు. మార్కెట్ మోసానికి వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సరళీకరణ విధానాల వల్ల కార్మికులు రోడ్డున పడ్డారు. 2012 -13 వరకు ఆర్థిక సంవత్సరంలోనే ఆ రాష్ట్రం అప్పు 45వేల కోట్ల నుండి లక్ష కోట్ల రూపాయలకు మించింది. మొత్తంగా దేశ చిత్ర పటం ఎలా ఉందో గుజరాత్ కూడా అలాగే ఉంది. ఎన్నో అంశాల్లో అంతకన్నా దిగజారింది. 2002 ఊచకోతల తర్వాత ముస్లింలు నిరంతరం అభద్రతతో బతుకుతున్నారు. ముస్లింలే కాదు, ఎవరూ ప్రశ్నించడానికి వీలులేని శక్తివంతమైన నాయకుడిగా నరేంద్రమోడీ అవతరించాడు. సామ్రాజ్యవాద పెట్టుబడికి అటువంటి నాయకుడే కావాలి. దేశ వ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా, మైనింగ్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ప్రజా పోరాటాల్ని అణచివేయడానికి ఫాసిస్టు పాలకులు అవసరం. అందుకే ఒకప్పుడు మోడీకి వీసా నిరాకరించిన అమెరికా నేడు అతని పట్ల సానుకూలంగా ఉంది. కార్పొరేట్ శక్తుల నియంత్రణలో ఉన్న మీడియా మోడీ, గుజరాత్ అసలు ముఖాలపై మేకప్ దిద్ది అందంగా చూపుతోంది. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోంది. కుంభకోణాల్లో, క్రిమినల్ కేసుల్లో తమ ఎంపీలే కూరుకుపోయి ఉంటే బిజేపీ అవినీతి రహిత పాలనను అందిస్తానని చెప్పుకుంటోంది. దాన్నే పాట కట్టి పాడుతోంది మీడియా.

ఇక దేశ సంక్షోభానికి కారణం అవినీతేనని, దాన్ని అంతమొందించి దేశాన్ని మార్చేస్తానని అవతార పురుషుడి అవతారమెత్తి మరొకరొచ్చారు. ఎన్నికల ద్వారా వ్యవస్థను మారుస్తామన్న వాళ్ళు నిజానికి తమను తామే మార్చుకున్నారు. పార్లమెంటు బురద గుంటలోకి దిగాక కమ్యూనిస్టు పార్టీలు ఏమయ్యాయో అందరికీ తెలిసిన విషయమే. ఆ మాట కొస్తే ఆమ్ ఆద్మీ పార్టీ విధానాలు కాంగ్రెస్, బిజెపి కన్నా మౌలికంగా భిన్నంగా ఏమీ లేవు. పెట్టుబడిదారీ విధానం ఉండొచ్చుగాని, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఉండకూడదని చెప్పడం అంటే దేశ సంపదను మీ ఇష్టం వచ్చిన వాళ్ళకు కారు చవకగా ధారదత్తం చేయడం కాదు, కాస్త న్యాయంగా అమ్ముకొమ్మని చెప్పడమే. దేశ సంపద దేశ ప్రజలకే చెందాలని ఏ ఒక్క రాజకీయ పార్టీ అనడం లేదు. ప్రజల నిత్యావసరాలన్నిటినీ అంబానీ, టాటాల దయకో, లేక అమెరికా కంపెనీల దయకో వదిలేశాక ఏ అవినీతిని ఎవరు నిర్మూలిస్తారు? మంచి నీళ్ళ దగ్గరి నుండి వంటగ్యాసు, పెట్రోలు, ఆహారం, మందులు వగైరాలన్నీ దేశంలో అతి పెద్ద కంపెనీల చేతుల్లో ఉన్నాయి. ఇవే విద్యాసంస్థలను నెలకొల్పుతాయి. పుస్తకాలు ముద్రిస్తాయి. యూనివర్సిటీలకు స్పాన్సర్ చేస్తాయి. మీడియా సంస్థలను నడిపిస్తాయి. వీటి దోపిడిని చట్టాలు, న్యాయవ్యవస్థ, పార్లమెంటే నియంత్రించలేవు. నిజానికి ఇవే వాటిని నియంత్రిస్తున్నాయి.

దేశ సంపదైన ఖనిజాలు, చమురు, సహజవాయువులు చివరికి భూమీ, సముద్రం, ఆకాశాన్ని సైతం అమ్మకానికి పెట్టి, ఇది అన్యాయమని అరిచిన వాళ్ళనంతా చావబాదడం మాత్రమే ఈ రోజు ప్రభుత్వాలు చేస్తున్న పని. రేపు ఎవరు అధికారంలోకి వచ్చినా దేశాన్నంతా తెగనమ్మి బహుళజాతి సంస్థల మార్కెట్ కోసం విధానాలను రూపొందించే ఎగ్జిక్యూటివ్ పాత్రను పోషించడమే చేసేది. దళితులకు రాజ్యాధికారం, దళిత బహుజనుల ప్రాతినిధ్యం అని చెబుతూ, కొంత మంది దళిత కులాల సంపన్నులు పాలనలో భాగస్వామ్యం సంపాదించినా వాస్తవానికి ఈ దేశ పార్లమెంటు మౌలిక స్వభావం మారదు. ప్రజల స్థితిగతులు మారవు. వ్యవస్థకున్న దోపిడి, కుల, మత స్వభావం పోవాలంటే వ్యవస్థలోపల ఒక ఫార్సు గా జరిగే ఎన్నికల ద్వారా సాధ్యమే కాదు. వ్యవస్థ మారాలంటే పోరాటాలే శరణ్యం. దానిని దండకారణ్య ప్రజలు రుజువు చేస్తున్నారు. దోపిడి ప్రభుత్వాలకు

సంస్మరణ

మార్కెజ్ నూరేళ్ల ఏకాంతం

- ముక్తవరం పార్థసారథి

మాజిక్ రియలిజం అన్న మాటకు సరైన నిర్వచనం లేదు. అత్యంత వాస్తవికమైన కథనంతో, స్వాప్నిక, అద్భుత (మాజిక్) అంశాలను మేళవించే ధోరణి ఇది. 1920లలో Post Expressionist German Art గురించి ఆర్ట్ క్రిటిక్ Franz Roh తొలిసారిగా ఈ మాట వాడాడు. ఆ తర్వాత Jose Yortega లాంటి లాక్షణికులు దీన్ని సాహిత్యానికి అన్వయించారు. నిజానికి లాటిన్ అమెరికన్ రచయితలు అనేకులు - కిరోగా, కార్టజార్, ఓనెటి, మురిలో రుబియో, ఫుమెంటిస్, ఆలెహో కార్పెంటీర్ మరీ ముఖ్యంగా హోర్హెలూయిస్ బోర్హెస్ వగైరాలు నిత్యజీవితంలో అద్భుత వాస్తవికతనూ, అద్భుతాలే నిత్యజీవితంగానూ చిత్రిస్తూ అనేక కథలు, నవలలు, నాటకాలు రాశారు. అయితే, 1967లో Latin American Boom లో భాగంగా One hundred years of solitude ను ఒక అర్జెంటీనా ప్రచురణ కర్త ప్రపంచానికి పరిచయం చేసిన తర్వాత మాత్రమే దీని గురించి అందరికీ తెలిసింది. మాజిక్ 'రియరిజలిజం ఇలా ఉంటుంది' అంటున్నారంటే, ఈ లక్షణాలన్నీ ఈ నవలలో ఉండటమే కారణం. ఉదాహరణకు, ఈ నవలలో ప్రధానంగా పాఠకులను ఆనకట్టుకునే విషయాలు :

1. ఫాంటసీ మిళితమైన వాస్తవిక కథనం.
2. సంఘటనలన్నీ హేతుబద్ధమే అనే భ్రమ కలిగిస్తాయి గాని లాజిక్‌కు అతీతం.
3. ఇంద్రియ జ్ఞానపరమైన వర్ణనలు ఎక్కువుగా ఉంటాయి.
4. కథలో కాలం సరళరేఖలా సాగదు. వర్తులాకార చిత్రణవల్ల ఏది ప్రారంభమో, ఏది ముగింపో తెలియదు.
5. కార్యకారణ సంబంధాలు తారుమారు కావటం ఓ ప్రత్యేకత.
6. జానపద గాథల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
7. ఏకకాలంలో అనేక దృక్కోణాల నుండి కథ నడుస్తుంది. ఏది వాస్తవమో, ఏది కల్పనో తెలియదు.

సెర్వాంటేస్ రాసిన 'Don Quixote' తో తులతూగ గలిగిన నవల 'One Hundred Years' అన్నాడు పాబ్లో నెరుడా. బైబిల్ తర్వాత మానవాళికి అవశ్య పఠనీయ గ్రంథం యిదే అంటూ ప్రశంసించింది న్యూయార్క్ టైమ్స్.

అయితే, ఇది అందరూ చదవగలిగినంత సరళమైన పుస్తకమేమీ కాదు. కథన సంక్లిష్టత, శైలీ విన్యాసాలు పాఠకుల మేధస్సును, ఏకాగ్రతను పరీక్షిస్తాయి. పైగా ఇది వందేళ్ల జరిగిన కథ. 'మాకాండో' అనబడే చిన్నపాటి నగరం గురించిన కథ అనిపిస్తుంది గాని అది శతాబ్దాలుగా నిలువుదోపిడీకి గురైన లాటిన్ అమెరికన్ ఖండానికే ప్రతీక. ఓ మూలకు విసిరెసినట్టుగా ఉన్న దక్షిణ అమెరికాను సంపద కోసం, ప్రకృతి వనరుల కోసం యు.ఎస్.ఎ., ఇతర యూరోపియన్ దేశాలు నిర్దాక్షిణ్యంగా అమానుషంగా దోచుకున్న వైనాన్ని హృదయ విదారకంగా, భీభత్సరస ప్రధానంగా చిత్రిస్తుందీ నవల.

'One Hundred Years' కథ గేబ్రియల్‌గార్సియా మార్కెజ్ (6.3.1927 / 17.4.2014)కు 1950లోనే తట్టిందట. తన అమ్మమ్మ కథలు చెప్పడం విని, నవలకు అదే 'tone' బాగుంటుందను కున్నాడు. ఆమె దయ్యాలు, భూతాల గురించి చెప్పినా, అదంతా నిజమేనని నమ్మించేది అంటాడు. చివరికి 1965లో 'One Hundred Years' రచన ప్రారంభించి, పద్దెనిమిది నెలల అవిశ్రాంత కృషితో - అప్పుల మీద అప్పులు చేసి, రాతప్రతిని పబ్లిషర్‌కు పంపటానికి పోస్టేజి కూడా కొనలేని దశలో నవల ముగించాడు. మొత్తం మీద ప్రచురణ అయిన వెంటనే చరిత్ర సృష్టించింది. 'నవలా రచనలో కొత్త శకం ప్రారంభమైంది' అన్నారు.

'One Hundred Years' లో కథనం ఎంత గజిబిజిగా ఉన్నా, కనీసం రేఖామాత్రంగానైనా 'మాకాండో' గాథను తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

హోసె ఆర్కాడియో బుమెండియా, అతడి కజిన్ ఉర్సులా పెద్దల కిష్టం లేని పెళ్లి చేసుకుంటారు. రక్త సంబంధీకుల మధ్య పెళ్లి అవాంఛనీయమంటుంది ఉర్సులా. పంది తోకలతో పిల్లలు పుడతారని ఆమె భయం. అందువల్ల పెళ్లి తర్వాత కాపురం చెయ్యటానికి నిరాకరిస్తుంది. ఒకనాడు బుమేండియా కోడి పందాల్లో గెలిచి, ఓడినవాడు అవమానించటంతో వాణ్ణి చంపి, ఆ కోపంలోనే ఇంటికి వచ్చి భార్యను బలవంతంగా లొంగ దీసుకుంటాడు. మరోవైపు, ఆ చచ్చినవాడు ప్రేతంలా మారి దంపతులను వెంటాడి చివరికి వాళ్లు కొత్త నగరం 'మాకాండో'ను ఏర్పరచుకున్న దాకా వదలడు.

వీళ్లకిద్దరు కొడుకులు. పెద్దవాడు హోసె ఆర్కాడియో. బలిష్ఠుడు, చిన్నవాడు ఆరెలియానో. పుస్తకాల పురుగు. మేధావి. మాకాండోలోని

వ్యతిరేకంగా పోరాడుతూ, తమ అడవిని ఆక్రమించుకో బోతున్న సామ్రాజ్యవాద మార్కెట్ విస్తరణను అడ్డుకుంటున్నారు. ఈ దేశ సంపదను కాపాడుతున్నారు. "మా కోసం మా రాజ్యం" అని వారు ఏర్పాటుచేసుకుంటున్న "క్రాంతికారీ జనతన సర్కార్" దేశ ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం చూపెడుతోంది. ప్రజా ప్రాతినిధ్యం అంటే ఏమిటో, మహిళా సాధికారత అంటే ఏమిటో ఈ రోజు మనం బస్తర్ ఆదివాసుల్ని చూసి నేర్చుకోవాలి. ఆదివాసుల స్వయం పాలనను (జనతన సర్కార్‌ను) నాశనం చేయడానికి, అడవిని బహుళజాతి కంపెనీలకు అప్పగించడానికి దోపిడి సర్కార్ పంపిన లక్షలాది సైన్యంతో అక్కడి విప్లవ ప్రజానీకం పోరాడుతోంది. యావత్ భారతదేశ భవిష్యత్తు అటువంటి పోరాటాల్లోనే ఉంది. ఆ పోరాట దారిలోనే నూతన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుందాం.

ఒంటరి జీవితంతో విసుగెత్తిన ఆర్కాడియో సముద్రానికి దారి కనుగొనే ప్రయత్నంలో బయటి ప్రపంచంతో సంబంధాలు ఏర్పడతాయి. అలా, 'మాకాండో' గురించి ప్రభుత్వానికి తెలిసి, తన ప్రతినిధిని పంపుతుంది. పెద్ద కొడుకు ఒకమ్మాయితో సంబంధం పెట్టుకుని ఆమెకు గర్భం చేస్తాడు. క్రమంగా కుటుంబం పెరుగుతుంది.

ఒకసారి నగరంలో మహమ్మారి వ్యాపిస్తుంది. నిద్రలేమి, మతిమరుపు దాని ప్రధాన లక్షణాలు. ఇదే అదునుగా, గతంలో ఆర్కాడియోను వేధించిన ప్రేతం, అతణ్ణి వెదుక్కుంటూ వస్తుంది. రాత్రంతా దాంతో గడిపిన ఆర్కాడియో తెల్లవారే సరికి మతిభ్రమించి ఉన్మాదిలా మారతాడు. ఆ గోల భరించలేక, అతణ్ణో చెట్టుకు కట్టేస్తారు. ఎవరికీ అర్థం కానీ కొత్త భాష మాట్లాడతాడు ఆర్కాడియో.

దూరదేశాలకు వెళ్లిన పెద్ద కొడుకు తిరిగి వచ్చి రెబెకా అనే అమ్మాయితో ప్రేమలో పడి వెంటనే పెళ్లి చేసుకుంటాడు. చిన్న కొడుకు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రభుత్వ ప్రతినిధికి వ్యతిరేకంగా లిబరల్ రెబల్స్‌తో జతగడతాడు. వరస యుద్ధాలు చెలరేగుతాయి. ఓసారి, ఫైరింగ్ స్క్వాడ్ ముందు మరణించే వాడేగాని తండ్రి అతణ్ణి రక్షిస్తాడు.

'ఆధునికత, అభివృద్ధి' ముసుగు కప్పుకుని వచ్చిన సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు మాకాండాలోని అరటి తోటల్ని స్వాధీనం చేసుకుని స్థానిక రైతుల్ని కూలీలుగా, కట్టుబానిసలుగా మార్చివేస్తారు. రైతులు సమ్మె చేస్తారు. కొత్త యజమానుల పక్షం వహించిన ప్రభుత్వం వేలాదిమంది రైతుల్ని ఊచకోత కోస్తుంది. కుళ్లిన వాసన భరించలేక, శవాల్ని సముద్రంలోకి విసిరేస్తారు. ఆ తర్వాత అయిదేళ్ల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తాయి. మాకాండోకు వరదలు వస్తాయి. నగరంతో పాటే బుయేండియా కుటుంబ పతనం ప్రారంభమవుతుంది. పెట్టుబడిదార్ల దురాశ, ప్రకృతి భీభత్సాలకు నాశనమైన మాకాండో నిర్మానుష్యమవుతుంది. ఇప్పుడిక్కడికెవరూ రారు. చివరికి మిగిలిన ఒక్క బుయేండియా వంశస్థుడు. "ఇదంతా యిలా జరుగుతుందని ముందే జోస్యం చెప్పారు" అంటాడు.

కథలో మనకు అడుగడుగునా కనిపించేవి వరుస యుద్ధాలు, వలసవాదుల కుట్రలు, వనరుల దోపిడీ, స్థానికుల ప్రతిఘటనలు. శతాబ్దాల లాటిన్ అమెరికన్ దేశాల రక్తచరిత్రకు కథా రూపం ఈ నవల.

కొలంబియాలో పర్వతాలకూ, కరీబియన్ సముద్రానికీ మధ్యనున్న అరకాటకాలో జన్మించాడు మార్క్వెజ్. తండ్రి టెలిగ్రాఫ్ ఆపరేటర్. పేద సంసారం. పన్నెండు మంది పిల్లల్లో పెద్దవాడు మార్క్వెజ్. మాతామహుల పెంపకంలో పెరిగాడు. గేబో (లాటిన్ అమెరికాలో మార్క్వెజ్‌ను ఆప్యాయంగా ఈ పేరుతోనే పిలుస్తారు). 1955లో తన తొలి కథా సంకలనం "లీఫ్‌స్టార్మ్ అండ్ అదర్ స్టోరీస్" ప్రచురించాడు. పారిస్‌లో ఐదేళ్లు ఉన్నాడు. క్యూబన్ విప్లవం తర్వాత లాటిన్ అమెరికాకు తిరిగి వచ్చి జర్నలిస్టుగా, సినిమా రచయిత / స్క్రిప్టురైటర్‌గా పనిచేశాడు.

ఈయన ఇతర రచనలు "నో వన్ రైట్స్ టు ది కల్నల్", "ది ఆటమ్ ఆఫ్ ది పేట్రియార్క్", "ఇన్నోసెంట్ ఎరెండిరా అండ్ అదర్ స్టోరీస్", "ఇన్ ఈవిల్", "క్రానికల్స్ ఆఫ్ ఎ డెత్ ఫోర్‌టోల్డ్", "లవ్ ఇన్ ది టైం ఆఫ్ కలరా", "ది జనరల్ ఇన్ హిజ్ లేబరింత్", "మెమొరీస్ ఆఫ్ మై మెలంకలీ వోర్స్", "స్ట్రేంజ్ పిల్గ్రిమ్స్" వగైరా. మార్క్వెజ్ ఆత్మకథ 'లివింగ్ టు టెల్ ది టేల్' సాహితీప్రియులను విశేషంగా ఆకర్షించింది.

"అయిడియాలు, ఇతివృత్తం ఆధారంగా నేను కథలు రాయలేను. రచనకు స్పందన మనసులో ఏర్పడిన దృశ్యం నుండి వస్తుంది. అది క్రమంగా పెరిగి, ఒక కాన్వాసులా, ఒక సినిమారీలులా నా కళ్ల ముందర తిరుగుతుంది. అదే కథ, ఉదాహరణకు నా తొలికథ (లీఫ్ స్టార్మ్) మా ఊరు అరకాటకా వెళ్లినప్పుడు తట్టింది. బాల్యమంతా కళ్లముందు పునరావృతమైంది. ఆ పేదరికం, అరటి తోటల్లో పని చేసే కూలీలు, వేడి, భరించలేని ఉక్క నాకు సుపరిచితమే, అనుభవాన్ని కాగితం మీద పెట్టడానికిన్నాళ్లేందుకు నిరీక్షించానా!" అనిపించాలి అంటాడు.

1982లో మార్క్వెజ్‌ను నోబెల్ పురస్కారం వరించింది. ప్రముఖ అమెరికన్ రచయిత విలియం ఫాక్నర్‌ను తన గురువుగా చెప్పుకున్నాడు మార్క్వెజ్. నోబెల్ ప్రసంగంలో కూడా "హి ఈజ్ మై మాస్టర్" అని గర్వంగా ప్రకటించాడు.

మార్క్వెజ్ విపరీతంగా అభిమానించిన, ఆరాధించిన మరో మహానుభావుడు చిలీలో జన్మించిన విశ్వకవి పాబ్లో నెరుడా (1904-73) ఆయన గురించి 1980లో ఓ కథ కూడా రాశాడు. అందులో ఆయన గురించిన స్మృతులను యిలా నెమరేసుకున్నాడు మార్క్వెజ్.

(రెండవ) ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి స్పానిష్ నేల మీద అడుగు పెట్టాడు నెరుడా. వాల్పరేసో వెళ్లటానికి అక్కడికి వచ్చాడు. ఉదయమంతా మేం పాత పుస్తకాల దుకాణాల్లో వేటాడాం. రంగూన్ కాన్సులేట్‌లో పని చేసినప్పుడు రెండు నెలల జీతంతో అట్టలు చిరిగిన పాత పుస్తకమొకటి కొన్నాడు నెరుడా. ఆయన కళ్లకీ లోకం మరబొమ్మలా కనిపిస్తుంది. ఎవరో 'కీ' ఇచ్చి వదిలనట్టుగా కదులుతుంటారు జనం. ఒకసారి వీధిలో ఆగి తన బిలియన్ యాసలో చిలుకలతో చాలా సేపు మాట్లాడాడు. లంచ్ తర్వాత మళ్లీ వీధుల్లో నడక కొనసాగించాం. అతణ్ణి చూస్తే రెనాసాన్స్ కాలంలోని పోప్ గుర్తుకొస్తాడు. మర్యాదలు తెలియవని కాదు గాని మహా తిండిపోతు. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోగానే మెటిల్డా (భార్య) భర్త మెడకో నాప్కిన్ కడుతుంది. (మంగలి షాపులో నాప్కిన్ లాగుంటుందది). మహాకవి సూప్‌తో స్నానం చెయ్యకూడదనుకుంటే ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకోక తప్పదు మరి. సర్జన్, స్కాల్పెల్‌ను పట్టుకున్నట్టుగా టేబుల్ నైఫ్‌తో రెడీగా కూర్చున్నాడు నెరుడా. ఒకదాని తర్వాత మరొకటి మూడు లోబ్స్టర్స్ ఆరగించి మా ప్లేట్ల వైపు ఆబగా చూశాడు. ఆ కళ్లలోని అమాయకత్వానికెవరైనా ముగ్ధులు కాక తప్పదు. నత్తలు, ఆయిస్టర్స్, రొయ్యలు, అనేక ఇతర జలచరాలు లాగించి తనకు (ఇంకా) తినాలనిపించిన భోజన పదార్థాల గురించి ఉపన్యసించాడు. చిలీలో మాత్రమే దొరికే ప్రీహిస్టారిక్ షెల్‌ఫిష్ అంటే ఆయనకు మహా ఇష్టం.

ఒకావిడ తనకున్న అతీంద్రియ శక్తుల గురించి మాట్లాడింది.

"ఇవన్నీ నేను నమ్మను. కవిత్వం మాత్రమే నిజమైన దివ్యజ్ఞానం. Only Poetry is clairvoyant" అన్నాడు నెరుడా.

లంచ్ తర్వాత మళ్లీ విధుల్లో నడక కొనసాగించాం.

మూడింటికి కాసేపు కునుకు తీస్తాడు నెరుడా. నిద్రక్కూడా

స్వేచ్ఛను, న్యాయాన్నీ ప్రేమించే మార్క్వెజ్ కు నివాళి

- విప్లవ సాంస్కృతిక వేదిక, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, కొత్త ఢిల్లీ.

(అనువాదం: బాసిత్)

"ఏమైనప్పటికీ, మాపై జరుగుతున్న అణచివేత, దోపిడీ, నిషేధాలపై మేము మా జీవితంతో స్పందిస్తాం. ప్లేగు వంటి ప్రాణాంతక రోగాలు, వరదలు, కరువులు, శతాబ్దాల నిరంతర యుద్ధాలు కూడా మృత్యువుపై జీవితం సాధించే విజయాన్ని నిరోధించలేకపోయాయి... మిథ్యా ప్రపంచంలా కనబడే భయంకర వాస్తవం మధ్య మనం నిలబడి ఉన్నాం. కథలు సృష్టించే మేము, ఏ విషయాన్నైనా నమ్మేసే వాళ్ళమైన మేము, ఈ భయానక వాస్తవానికి వ్యతిరేకమైన కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించడానికి సమయం మించిపోలేదని నమ్ముతాము. మనం సృష్టించబోయే ఆ ప్రపంచం ఒక నూతన ప్రపంచం. అది జీవితాన్ని వివరించే ప్రపంచం. అక్కడ ఇతరుల చావును ఏ ఒక్కరూ శాసించడానికి వీలు ఉండదు. అక్కడ ప్రేమ నిజమని రుజువవుతుంది. అక్కడ ఆనందం సాధ్యమని ధ్రువపడుతుంది. అక్కడ వందేళ్ల ఒంటరితనానికి గురిచేయబడిన జాతులు చిట్టచివరికి శాశ్వతంగా భూమి మీద తాము పొందదగిన అవకాశాల్ని పొందుతాయి."

–గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్

అది ఇట్లాంటి రోజుల్లో ఒకటి.

అది జామపండ్ల తాజాదనంతో పరిపక్వమైన రోజు. అణచివేతలో ఒంటరి బతుకుల్ని మోస్తున్న రోజు. అది ఎన్నో చావుల్ని ముందే పసిగట్టిన రోజు. మిలియన్ల కొలది ప్రజలు నిరాశ్రయులై, నిరాదరణకు గురైన కథలను చెప్పడం కొనసాగించిన రోజు. అది ప్రజాస్వామ్యం, అభివృద్ధి పతాకల కింద పరిపాలన సాగిస్తున్న నియంతలు రాలిపోయే రుతువు.

అతడు చనిపోయిన రోజు; భారత ప్రజలకు ఓటు వేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని చెప్పబడుతున్న రోజు. ఒక సామూహిక నరహంతకుడిని ప్రధానమంత్రిగా ఎన్నుకునేలా ప్రజల్ని మభ్యపెడుతున్న రోజు. పార్లమెంటరీ "ప్రజస్వామ్యాన్ని" నడిపిస్తున్న శక్తుల్లో ఒకటైన కార్పోరేట్ భూతం రిలయన్స్ తన లాభాల వేటలో గొప్ప ఊపు మీద ఉన్న రోజు. సామ్రాజ్యవాద దోపిడి చరిత్రలో అమెరికా ఆక్రమిత ఇరాక్ నందు మరో విధ్వంసక బాంబుదాడిలో ముగ్గురు హత్యగావించబడ్డ రోజు. అమెరికా ఫెడరల్ కోర్టు ఇరాన్ ఆస్తుల్ని తెగనమ్మే ప్రణాళికలకు ఆమోదం తెలిపి తన సామ్రాజ్యవాద దుర్మార్గాల తదుపరి అధ్యయనం మొదలవుతున్న రోజు.

అట్లాంటి రోజు అతడు చనిపోయాడు.

సామ్రాజ్యవాదానికి, ప్రజల అణిచివేతకు వ్యతిరేకంగా మాట్లాడే గొంతుల్లో ఒకటైన మార్క్వెజ్ సామ్రాజ్యవాద దోపిడి, దురాక్రమణ మనిషితనాన్ని దిగజారుస్తున్న వైనాన్ని రాసిన రచయిత. అతడు బడా కార్పొరేషన్లు, వ్యాపార సామ్రాజ్యాల లాభాల కోసం తమ శ్రమనే కాదు, తమ వనరులు, తమ సంస్కృతులు, తమ జ్ఞాపకాలు దోపిడికి గురైన ప్రజల గాథల్ని రచించినవాడు. అతడు ఆకలికి అలమటించిన ప్రజల గురించి, వాళ్ళ ఒంటరితనం గురించి, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సంతోషం, ప్రేమ, కలలు నిరాకరించబడిన వాళ్ళ గురించి, వాళ్ల ప్రతిఘటనా పోరాటాల గురించి రాసినవాడు. ఏవైతే సామాజిక దురభిప్రాయాలు, అపోహలు ఒక అన్యాయపు సమాజంలో ఆమోదపు రూపు దిద్దుకుంటాయో, ఎక్కడైతే సామూహిక అంగీకారం పేరిట హత్యలు, ఎన్‌కౌంటర్ హత్యలు, హత్యాకాండలు, ఊచకోతలు, విస్థాపనలు నిర్వహించబడుతున్నాయో అటువంటి వాటి గురించి రాసిన వాడు.

ఎంత కాలమైతే ఒక న్యాయబద్ధమైన స్వేచ్ఛా సమాజం కోసం ఒక కలం రాస్తుందో, ఒక గొంతు పాడుతుందో, ఒక కుంచె చిత్రిస్తుందో అంత కాలం గ్రేసియా మార్క్వెజ్ మ్యాజిక్ మాటలు మరణించవు. రాయవలసిన ఎన్నో పదాలు, విప్పి చెప్పవలసిన మార్మికత మిగిలి ఉండగా వాటి మహిమ శక్తివంతంగా, సజీవంగా ఉంటుంది. అది న్యాయం కోసం, స్వేచ్ఛ కోసం జరిగే అన్నిపోరాటాల్లో జీవిస్తుంది. అది పితృస్వామ్యంపై, భూస్వామ్యంపై, భారత ప్రభుత్వ సామ్రాజ్యవాద అణిచివేతపై ప్రజల ప్రతిఘటనలో, పోరాటంలో సజీవంగా ఉంటుంది. అది దోపిడి పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఆఫ్రికా,లాటిన్ అమెరికా ప్రజలు చేస్తున్న సంఘటిత పోరాటాల్లో నిలిచి ఉంటుంది. అది అణిచివేతకు గురై స్వేచ్ఛకోసం పోరాడుతున్న జాతుల విముక్తి గీతపు ఆనందాన్ని పాడుతుంది.

ఊహల్ని వాస్తవం చేసేవి అటువంటి కలలే. కేవలం అణిచివేతకు గురైన ప్రజల పోరాటాలు మాత్రమే అతని స్మృతిని అజరామరంగా నిలబెడతాయి. అతని మాటల్ని కూడా ...

ఆ మాటలకు వందనాలు!

చాలా సౌకర్యాలు కావాలాయనకు. జపనీస్ టీ సెరెమనీ అంత సంక్లిష్టమైన విషయమది. కొన్ని కిటికీలు తెరవాలి. మరికొన్ని మూయాలి. చలి గానూ ఉండకూడదు. వేడిగానూ ఉండకూడదు. పూర్తి నిశ్శబ్దం అత్యవసరం. చీమ చిటుక్కుమనకూడదు. క్షణంలో నిద్రలోకి జారుకుని పది నిమిషాల్లో కళ్లు తెరిచాడు నెరుడా. అంతా పసిపిల్లల్లాగే. మనం ఊహించనప్పుడు లేచి కూర్చుంటారు వాళ్లు. ఫ్రెష్‌గా మిలమిలా మెరిసే కళ్లతో హాల్లోకి ప్రవేశించాడు. ఒక చెంపకు దిండు మీద అల్లిన డిజైన్ల ముద్ర స్పష్టంగా కనిపించింది.

సాయంత్రం ఆరింటికి వాల్పరేసో కోసం షిప్ ఎక్కి, మాకు వీడ్కోలు చెప్పి, ఓ మూలన కూర్చుని, తన ఆకు పచ్చా సిరాతో పద్యరచన ప్రారంభించాడు నెరుడా. పుస్తకాలు ఎవరికైనా ఇచ్చేటప్పుడు అదే రంగుతో ఆయన పువ్వులు, చేపలు, పక్షులు కూడా గీస్తాడు.

పాటలు / కవితలు

నిర్బంధం నిర్బంధం

- తంగెళ్ల సుదర్శనం

నిర్బంధం నిర్బంధం మాటపైన నిర్బంధం
ఆటపైన నిర్బంధం పాటపైన నిర్బంధం
బతుకుపైన నిర్బంధం ఇది పాలకుల నరమేధం ॥నిర్బం॥

కూసేటి పక్షులను కూత ఆపమంటున్నరు
పాడేటి కోయిను గొంతునొక్కివేస్తున్నరు
ఆటలాడే జింకలను గంతులాపమంటున్నరు ॥నిర్బం॥

పిల్లజెల్లలంత కలసి విత్తనం పండుగంటు
అందరికి భుక్తి కొరకు భూములను పంచుతుంటె
బాసగూడ గుండెల్లో గుండ్లనే దించినారు ॥నిర్బం॥

ఇండ్లు తగులబెడుతుండ్లు ఊళ్ళు కొల్లగొడుతుండ్లు
ఆదివాసి బిడ్డలపై అత్యాచారం జేస్తుండ్లు
ఆదివాసి హక్కులను కాలరాసివేస్తుండ్లు ॥నిర్బం॥

పర్యావరణం పాడైతే ప్రతిజీవికి ప్రమాదమని
జీవవైద్యమును ధ్వంసంజేసేటి
అణువిద్యుత్ కేంద్రాలను అడ్డుకుంటె నిర్బంధం ॥నిర్బం॥

ప్రజలకొరకు ప్రాణమిచ్చి పోరాడే శక్తులతో
భావాలు లక్ష్యాలు సారూప్యత జూపిస్తే
అనుభంధ సంఘమంటు అణీచివేత జేస్తుండ్లు ॥నిర్బం॥

భావ ప్రకటన స్వేచ్ఛ భారత పౌరుల హక్కు
నిరసన తెలిపే హక్కు న్యాయమును అడిగె హక్కు
జీవించే హక్కు కొరకు పోరాడె హక్కుంది

కంట నీరు పెట్టకే... విప్లవ కెరటమా

- మీరా

కంటనీరు పెట్టకే
విప్లవ నిప్పుకెరటమా
నీకు ఎవ్వరు సాటి ఓ నేస్తమా....

చీకటిపై రేపటి వెలుగయ్యే
ఆశయాల ఆకాశమా
నింగిపై వెలిగే నక్షత్రమా ॥కంట॥

ఓటమిపై గెలుపుకై
ఉరకలేసే సముద్రమా
ఉద్యమాలకు ప్రతిరూపమా ॥కంట॥

రక్తబంధంకన్న వర్గబంధమిన్న
అన్నమాటకు ఆదర్శమా
త్యాగాల సంకేతమా ॥కంట॥

అస్తమించిన వెంట ఉదయించే
అరుణ కిరణమా
అలుపెరగని పోరాటమా.... ॥కంట॥

కా॥ గడ్డం లక్ష్మి జోహార్లు

- దప్పు రమేష్

బందుకు బట్టిన భాగ్యక్క నీకెర్రా దండాలూ
బందుకు లెత్తిన వీరుల కన్నీటి దండాలూ

నువ్వు నల్లగొండ ఎర్రమల్లెవు
నువ్వు ఓరుగల్లు పోరుజల్లువు
నువ్వు అంజన్న అయిలన్న సెల్లెవు
నీవు స్వర్ణక్క త్యాగాల సాలువు

నువ్వు రాడికల్ రగల్ జెండవు
నువ్వు రైఫోల్ల దండుకు అండవూ... ॥బందు॥

నువ్వు గుంటూరులో రూపక్కవు
నువ్వు నల్లమల్ల భాగ్యక్కవు
నువ్వు ఎ.ఒ.బి.లో మాధవక్కవు
నువ్వు డి.కె.లో మహితక్కవు

నువ్వు అక్కలాకు వేగుచుక్కవు
నవ్వు ఉదయించే తూర్పు దిక్కువూ... ॥బందు॥

నువ్వు కన్నవాళ్ళను వదిలి పెట్టినవ్
నువ్వు ఉన్న ఊరును విడిచి పెట్టినవ్
నీ జీవిత సహచరుడ్నొదిలినవ్
నీ కన్న కొడుకును వదిలి పెట్టనవ్

నాకు విప్లవమే ఊపిరన్నవు
నాకు విప్లవమే ప్రాణమన్నవు ॥బందు॥

నువ్వు పట్టణ మహిళా ఉద్యమం
నువ్వు బాధ్యురాలుగ పనిజేసినవ్
నువ్వు స్త్రీల సమస్యల పోరులో
నువ్వు సింహంలా గర్జించినవ్

నువ్వు విప్లవానికీ అక్కల సెల్లెల
ఎందరినో చేర్పించినవ్ ॥బందు॥

మహిళలూ లేకుండ విప్లవం

అది గెల్వదని గట్టిగా నమ్మినవ్
మీరు విప్లవంలో చేరకుండా
స్త్రీ విముక్తి జర్గదని చాటినవ్

నీవు బందుకు భుజానికేసినవ్
యుద్ధరంగంలో ముందదుగేసినవ్ ॥బందు॥

నువ్వు బక్క పల్చని అక్కవైనా
నువ్వు భారి గుండెతో కొండలెక్కినవ్
నీకు దమ్ము దగ్గు అల్సరున్నా
దాని లెక్క జేయక సాగిపోయినవ్

ఒక్క నిముషమైనా వృథా చేయకుండా
చేరావు ఉన్నత శిఖరము ॥బందు॥

నీ పట్టుదల పరనాశక్తీ
నిన్ను పొలిటికల్ టీచర్నుజేసే
నీవు విప్లవ సబ్జెక్టులల్లో
నీవు బోధించే పట్టుసాధించావ్

ఎకనమిక్స్‌ను గాని ఎన్.డి.ఆర్‌ను గాని
పార్టీహిస్టరీగాని సక్కగా జెప్పేవు ॥బందు॥

నిన్ను మలేరియా చుట్టిముట్టి
నిన్ను కాల్చి పీల్చి పిప్పి జేస్తే
ఆడ దొరికినా మందుల్నివాడి
నిన్ను కాపాడకొన - వాళ్ళుజూస్తే

విప్లవం వర్ధిల్లమంటూ
ఆ ప్రజల ఒడిలో కన్ను మూస్తివా ॥బందు॥

నీ విప్లవా పట్టుదల త్యాగం
నీ వారసుల కిస్తుంది స్ఫూర్తి
నీ త్యాగాల ఎర్ర జెండాను
ఎత్తి పట్టీ ముందుకొస్తున్నం

సమసమాజం కొరకు నువ్ కోరినా కలలు
సాధించ సాగుతున్నాము ॥బందు॥

ఆదివాసీలపై రాజ్యం కత్తిగట్టింది

-రాంరెడ్డి

శివసాగర్ అన్నట్లు -
విరగ్గాస్తున్న వెన్నెలను రాజ్యం వెంబడిస్తుంది
ఆత్మవిశ్వాసంతో అరణ్యం తిరుగబడుతుంది
రాక్షస రాజ్యంలో దళారీ పాలకుల కన్నులకు
కలిసి బ్రతకటమే కంటగింపయ్యింది
విత్తనాల పండుగ కోసం జమగూడిన జనంపై
గుండ్లు గురిపెంచి బాసగూడను రక్తసిక్తం జేసి
ఏడాదైనా గడవక ముందే ఎలకమేట
ఆదివాసీ ప్రజలపై ఎక్కుపెట్టింది తుపాకులు
ముక్కుపచ్చలారని చిన్న పిల్లలను సహితం
హతమార్చింది అత్యంత పాశవికంగా
అయినా అదరలేదు ప్రజలు బెదరలేదు
రాజ్యాన్ని ప్రశ్నించి నిలదీసి ఎదురు తిరిగిండ్రు
పోలీస్టేషన్నే దిగ్బంధించిన తీరుకు
రాజ్యమే దిగివచ్చి రాయబారం చేసింది
ప్రజల ఐక్యతకు పరేషానై శవాలకు వెలకట్టింది
అయినా పోరాటం ఆగదంది అరణ్యం
ఆదివాసీ శపథం చేసే నెత్తుటి బాకీ తీర్చుకుంటామని
ఎలకమేట ఆదివాసీకి ఎక్కడి ధైర్యమది
పోరు విత్తనం వేసిన జనతన సర్కార్ ఇచ్చిన
పోరాట స్ఫూర్తికి మురిసిపోయింది అరణ్యం
సాయుధులై నిరాయుధులతో కాదు తలపడేది
సాయుధులతో తలపడమని సవాలిసిరింది
నిరాయుధులైన ఆదివాసీలపై దాడి చేస్తే
ఆగుతుందా ఆదివాసీ ఉద్యమం
నిలుస్తుందా ప్రజా పోరాటం
విప్లవం విరబూస్తున్నది వెన్నెలలా అడవంతా
కాలం కత్తులపై నిలబడి పోరుకు సై అంటుండ్రు ఆదివాసీలు
భారతదేశ ప్రజల ఓట్లతో సీట్లెక్కిన
దళారీ పాలకుల దగాకోరు తనాన్ని ఎదిరించి
అప్పనంగా దేశ వనరులను ఎంగిలి మెతుకులకాశపడి
సామ్రాజ్యవాదులకప్పగించే కుట్రలు సాగనియ్యమని
సాయుధులై తిరగబడుతుండ్రు
భారతదేశ విముక్తికై విప్లవాన్ని కలగంటుండ్రు
రాజ్యహింసను హింసను గుండెనిబ్బరంతో ఎదిరించి
రాజ్యానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తుండ్రు
టాటా, బిర్లా, ఎస్సార్, మిట్టల్, ఆదిత్య, ఎన్రాన్
పోస్కో, స్టెర్లైట్ దేశ విదేశీ దోపిడిదార్లకు
కొమ్ముకాసే దళారీ పాలకులారా కబడ్దార్ అంటూ
భారత విముక్తి పోరుకు దివిటీలపై నిలుస్తుండ్రు
గెరిల్లా వీరులై పోరుకెరటాలై లేస్తుండ్రు
అంతిమ విజయం మాదేనంటూ
కదం తొక్కుతూ శపథం చేస్తుండ్రు
సామ్రాజ్యవాదం నశించాలని నినదిస్తుండ్రు
భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యంకై కదం తొక్కుతుండ్రు

పోరుహోరు

- జమీన్

నాకప్పుడు
తెలంగాణ పోరాటం గురించి తెల్వదు
నక్సల్బరీ గురించీ తెల్వదు

శ్రీకాకుళం గురించీ తెల్వదు
తెల్సిందల్లా
మా ఇంటి ముంగటున్న
దొడ్డి కొమురయ్య గోరీ కాడ ఆడుకోవడమే!
గుర్తున్నదల్లా
మా ఊరు ఆ గోరీ దిక్కు గర్వంగా చూడ్డమే!
నాకప్పుడు
వర్గపోరాటం అంటే తెల్వదు
నూతన ప్రజాస్వామిక విప్లవం అంటే తెల్వదు
దీర్ఘకాలిక ప్రజాయుద్ధం అంటే తెల్వదు
తెల్సిందల్లా
వెంకట రమణ అమరత్వమే!
గుర్తున్నదల్లా
ఆ వార్త విన్న మా ఊరు
కన్నీటి జెండై అవనతమవడమే!
నాకు నిన్నటి దాకా
సోమన్నా!
మా వెంకటరమణ కన్నుమూస్తూ
తన ఊపిరిని నీకిచ్చిండని తెల్వదు
ఆ ఊపిరికి నువ్వు కొనసాగింపయినవనీ తెల్వదు
నాకిప్పుడు మాత్రం ఖచ్చితంగా తెల్సు
సోమన్నా!
నీ ఊపిరి ఎన్నటికీ ఆగదని
అది ఉత్తర తెలంగాణ పోరుహోరై
మాకు విముక్తి ప్రాంతాన్నందిస్తుందని

స్వేచ్ఛ ఎంత చిన్నదయినా

- ఉదయ మిత్ర

ఈ గొంతు
చిన్నదేగావొచ్చు
బలహీనమైనదే గావొచ్చు
విచ్చుకున్నందుకు సంతోషంగా ఉంది

ఈ పక్షులు
బెదిరి ఉండవచ్చు
కాలంతోబాటు చెదిరి ఉండవచ్చు
ఓ చెట్టును జేరి
ఓ పెట్టున గొంతెత్తినందుకు సంతోషంగా ఉంది

ఈ నేల
గురుకుది గావొచ్చు
ఇనుపరథ చక్రాలకింద పొక్కిలే గావొచ్చు
దాన్ని పొందినందుకు సంతోషంగా ఉంది

ఆ భవనం
సర్పాలంకార శోభితమే గావొచ్చు
సంగీత నాట్యాల ఉగ్రూతలూపొచ్చు
దాన్ని వదిలించుకున్నందుకు సంతోషంగా ఉంది

స్వేచ్ఛ
ఎంత చిన్నదైనా
మాకది సముద్రమే
జీవితం కన్నా సమున్నతమే
ఇక
అంతర్ బహిర్ ఆధిపత్యాల మీద యుద్ధమే

అతడు

- శాఖమూరి రవి

ముప్ప మొగిలి
నరేష్ పేర్లు వేరు
దేహం ఒక్కటే
మాట ఒక్కటే
ఆశయం ఒక్కటే
విప్లవం
స్వాతంత్ర్యం బూటకం
దురాక్రమణ నాటకం
విద్రోహ వివరాలను
ఊరూర దండోరేసిన తెలంగాణ విప్లవ మొనగాడు
పోచంపల్లిలో ఎత్తిన పిడికిలి
పోరు విత్తుల్ని
పోరుగల్లు ఖమ్మం మీదుగా సాలేసి
శబరిదంకా వెదజల్లిన రైతుకూలతను
ఎండా వానా చలి
రుతువేదైతేనేం
ఉదయం పగలు రాత్రి
సమయమేదైతేనేం
నిరంతర సాయుధపోరు ప్రసారమతను
అనారోగ్యం వెన్ను సలుపుతున్నా
ఆయుధాన్ని
ఆశయాన్ని
కలగలిపి ముద్దాడుతూ
వెనుదిరుగక నేలకొరిగిన వీరుడతను
పుట్టినూరు పోచంపల్లే
వేల పోచంపల్లెల పొలిమేరల్లో
పహారరా కాసిన పీడిత ప్రజల సైనికుడతను
తల్లి సారవ్వే
తండ్రి రాజయ్యలే కావచ్చు
వేల సారవ్వ రాజయ్యల దుఃఖమతను
అతని స్వప్నమొక్కటె
నూతన ప్రజాస్వామిక విప్లవం

అజ్ఞాత పలవరింత

- మేడక యుగంధరరావు

సహజాతం ఎలా ఉన్నావ్?
రాత్రికి రంగులద్దే
ప్రేమికులంతా క్షేమమేనా?
కందిరీగల చుట్టేతలో
గాయపడిన పిచ్చుక కోలుకున్నదా?
సరిహద్దుల్ని
అడ్డదిడ్డంగా దున్నేసిన వేర్లు
ఎక్కడెక్కడ జెండాలు పాతాయ్

అజ్ఞాత పలవరింతా!
ఎక్కడున్నావ్
ఏం చేస్తున్నావ్?

వాకిట్లో కొబ్బరిపూత
చెట్టుపై సుత్తికొడవలి
మగ్గాల రెక్కల్లోంచి
రంగు రంగున దుల్లేత రాగం
ఓ అరుణ పతాకమా...
........రెడ్ శాల్యూట్స్
వేసవి సాయంత్రం
అమ్మ చేతి గుగ్గిళ్ళ ప్రసాదం
గుర్తొస్తున్నాయా?
కాళ్ళు బార్లా చాపిన
విరామ సమయాలలోనైనా

కిస్తీ ఫీజుల
డివిడెండ్ డివైజర్ల మధ్య
ఈక్వేషన్స్ కుదరక
బ్లాక్ బోర్డుపై గీచిన
ఆల్జీబ్రా గీతల్లో
దారి వెతుక్కుంటూ నేను

నత్తగుల్లలా ముడుచుకుపోయే
మనుషులున్న నా దేశంలో
భరోసాలేని బతుకును
ఏ తక్కెడతో తూయాలి

మన్నించమని చెప్పు
నిశాచర దీపశిఖలతో
వేలు పట్టిన ముంజేతిని
మార్గమధ్యాన విడిచినందుకు
ఆకుపచ్చని శిల్పాల మధ్య
అక్షరాలు దిద్దక పారిపోయినందుకు

గొర్ల కాపరి పాటలోని
పురాతన గాయాల్నుండి
నిషిద్ధ మెలకువ నుండి
రాత్రి విరిచి పగలు కంటున్నా

భద్రం
సందుగొందుల్లో
గుడ్ల గూబల పహారాలుంటాయ్
నీడల్ని మింగేసే వడగాల్పులుంటాయ్
తలవాకిట తలంపు భద్రం
మట్టిని చీల్చే విత్తు భద్రం
వెంట వచ్చిన నెమలీక భద్రం

చెమట చుక్క మథనం

- వేలుపుల నరేష్, వంగల సంతోష్

చుక్క చుక్క
తొలకరి జల్లుల వర్షపు చుక్క
నెత్రలు పారిన నేల తడిపిన చుక్క
వరదలై పొంగి వాగులై పరవళ్ళు దొక్కిన చుక్క

వలపోతల తెగిపోని బంధనాలకై
విలపించిన చుక్క
కన్నీటి చుక్క
బందీయయిన బిడ్డలకై
రాల్చిన చుక్క

ఆకుపచ్చ వేటకు అడవి రాల్చిన చుక్క
అది నెత్తుటి చుక్క
విముక్తిపోరులో అమరత్వమై మెరిసిన చుక్క
అధికారం పల్లకయి
జన మాన ప్రాణాలు తీస్తుంటే
ప్రశ్న అయి హక్కులడిగిన చుక్క

సర్వస్వం దోచే దొంగను,
సర్వాంతర్యామి అయిన శత్రువును
పట్టి ఇచ్చే చుక్క
చెమట చుక్క
అసంఘటిత ప్రజలను పోరు
సమూహంలోకి ఏకం జేసే చుక్క
నూతన ప్రజాస్వామిక విప్లవంలో
సోషలిజాన్ని కలగంటున్న చుక్క

మన బాటను తీరుస్తూ కార్మిక వాడలో
సమరభేరి మోగించే బాటలో

నిన్నూ నన్నూ నడవమంటున్న చుక్క
నీ కోసం మధనపడుతున్న నీ చమట చుక్క
అది నీ వేగు చుక్క

మట్టి - మనిషి

- మచ్చ ప్రభాకర్

మట్టిని
నమ్ముకున్న మనిషి
నోట్లో
మట్టి కొట్టిన
వ్యవస్థను చూచి
మట్టి గుండె
మండి ఎగిసింది
మట్టికి
మనిషికి
మధ్యనున్న
పేగుబంధం
అనాదిది
మట్టిన
పుట్టిన రాబందులారా!
ఖబడ్దార్
మా బందం తెంచ
ఏ ఒక్క అడుగు ముందుకేసినా
అంగబలం చూపి చేతులెత్తినా
మనిషి కన్నెర్రజేస్తే
భస్మం కావడం
ఖాయం! ఖాయం!

నగరం వాకిలిలో....

- అరసవిల్లి కృష్ణ

అందరూ ఒకేసారి పిలుస్తున్నారు
వెన్నెల నీడలో
నేలకొరిగిన చెట్టుపై
పావురాలు వాలి నక్షత్రాలుగా కనబడుతున్నాయి

అమరుల పాదాల ముద్రలలో
నా కవితా రక్తపు మరకలు
అరణ్యం నగరంలో కనబడింది
పోరాట రూపం రహదారి అంచుపై నడుస్తుంది
నేల నుండి మొలకెత్తుతున్న
కాంతి స్వప్నాలు

అరణ్యానికి తొలి అడుగు నగరం
చమబాలధార పసివాడి
తల్లి అయిన నగరం,
నగరానికి విరామం లేదు
నగరం పొత్తిళ్ళలో
మరణ దీపాలు వెలుగుతుంటాయి

ఊరి హృదయంపై
కాగడాలతో నడుస్తున్నప్పుడు
నేలకి దిగిన చందమామ
అమరుల గాయాల్ని తడిమి
మబ్బుల్లోకి జారిపోయింది
వెలుతురు చీకటి సారంగం
దివిటీల మధ్య
జన సందోహం

అమరత్వ చిరునామా
ప్రజలే కదా!
తెగిన పేగుబంధాల నుండి
పురుడు పోసుకుంటున్న అరణ్యం
తల్లి చిటికెన వేలి నుండి
తప్పి పోయిన బాలుని వెతుకులాటలా
విప్లవాల పురిటి గడ్డను చూస్తున్నా
ప్రవాసంలోకి పంపబడిన
సముద్రం చేతివేళ్ళు చూస్తున్నా

అయినా
తుపాకీ నీడన
సేద తీరుతున్న ఊరిలోకి
సముద్రం – ఓ నది
నీ పాట దారిచేస్కోని వెళ్ళాయి –

నగరం వాకిలిలో పాలపిట్టలు
దేశమంతా ఎగిరి
ఆకాశంలో ఓ గుంపుగా కనబడుతున్నాయి
ప్రియమైన శత్రువా!
తుపాకీ శబ్దం చేయకు

నీడ అదృశ్యం కాదు
నాగలి విరిగినా మళ్ళీ మళ్ళీ అతుక్కుంటుంది
ప్రతి అన్నపు మెతుకులో
రక్తాశ్రువులు నిశ్శబ్దం

పసిపిల్లల వైద్యుడా
రామనాథం సార్!
మీ సమాధి చెంతన
పూలు వికసించాయి
(వరంగల్ మహాసభల వెలుగులో)

మనుధర్మ మూర్తి సుభాషితాలు

- వివి

హత్యలు వాస్తవమే కానీ
హంతకులు నిర్దోషులు

పోయిన ప్రాణాలు తిరిగి రావు
బాధితులు వేదనలు వెలకట్టలేనివి
అందుకే హంతకుల
విడుదలకు వెలకట్టవచ్చు

ఎదురీత తప్ప వాలీతరానివాళ్లు
తండ్రినీ రక్త బంధువుల్నీ చంపినా తిరిగొచ్చి
తల కత్తి కింద పెట్టే హృదయం లేనివాళ్లు
చెప్పే సాక్ష్యాలు నేను నమ్మను

ఆవిటివాడు అరచేతిలోకి కాలే కాదు
కత్తి కూడ తీసుకొని కరకర కోసాడని
చెప్పే సాక్ష్యాలూ నేను నమ్మను

పోలీసుల ఎఫ్ఐఆర్‌లు
బలహీనంగా ఉన్నాయనే నెపం పెట్టి
హంతకుల్ని వదిలేస్తాను

ప్రాసిక్యూషన్ న్యాయవాదుల అవిశ్వాసాన్ని
ధిక్కార నోటీసుతో తిరస్కరిస్తాను
అయినా నేనే విచారిస్తాను నేనే తీర్పు చెపుతాను
తరతరాలుగా నేను రాసిందే చేసిందే చెప్పిందే న్యాయం

వాళ్లను పండుగ చేసుకోవద్దని చెప్తానులే
మీ వాళ్లు నిరసన తెలుపకుండా బందోబస్తు చేస్తాను
హంతకులూ బాధితులూ సామరస్యంతో కలిసుండే
గ్రామీణ శ్మశాన శాంతిని నేను కోరుకుంటాను

మనువాదాలయాలు

- పోటు నారాయణ

అవి ఒక్కప్పుడు విశ్వవిద్యాలయాలు
విప్లవ ఆలోచనలతో
గేట్ల ముందు జెండాలు
రెప రెపలాడేవి
ఏ విద్యార్థి ఎటు పోవాలో
దారి చూపే
దిక్సూచి లు గా ఉండేవి
కాని నేడు అవి
లైబ్రరీ లో చదువుకుంటాం
అంటేనే బహిష్కరిస్తున్నవి
ప్రగతి శీల ,సామాజిక
బోధనలకు బదులుగా
మనువాద పండితులు
మూఢనమ్మకాల బోధనలు
చేస్తున్నారు
మతం మత్తుగా మారింది
కులం కుట్రగా మారింది
అగ్రభాగంలో అగ్రవర్ణాల్
ఉండాలని మనువు గాని
బొయిల బలవంతపు కోరిక
పరిశోధక శోధనకై
గ్రంథాలయం తెర్వలన్నందుకు,
పదునెక్కిన మెదడులో
ప్రసరించే స్వేచ్ఛా గాలుల
ఆలోచనలు దళిత, ఆదివాసీ
మోహన్, సతీష్, సుభాష్ లవి
అందుకే కాబోలు వాళ్ళ బహిష్కరణ

కెక్యూబ్ వర్మ కవితలు రెండు

నాకింకా...

నాకింకా అతడి చేయి నా భుజంపై
ఉన్నట్టే ఉంది..

అతడు నేనూ కలసి ఆ దారులు లేని
రాదారిలో నడుస్తున్నట్టే ఉంది...

అతడు చురుకైన చిరుత చూపులతో
జింకలా రాళ్ళ గుట్టల్ని సుతారంగా
తొక్కిపెడుతూ ఎక్కుతుంటే..

నాకింకా అతడి చేయి నా భుజంపై
ఉన్నట్టే ఉంది..

అతడు ఆప్యాయంగా చేయందిస్తూ
నవ్వుతుంటే ఆకాశంలో చందమామ
అందినట్లే ఉండేది..

నాకింకా అతడి చేయి నా భుజంపై
వున్నట్టే ఉంది...

అతడు మాటాడుతుంటే తను చేస్తున్న
వ్యవసాయం పట్ల రైతుకు ఉన్న
నిబద్ధత కలిగిన ప్రేమ వ్యక్తమై
గుండెను తాకేది...

నాకింకా అతడి చేయి నా భుజంపై
ఉన్నట్టే ఉంది...

అతడు అలసటను మరపిస్తూ నన్నగా
స్మృతి గీతమాలపిస్తుంటే
నడకలో దూరం తెలియనితనం...

నాకింకా అతడి చేయి నా భుజంపై
ఉన్నట్టే ఉంది...

అతడు ఓ రహస్య ప్రేమికుడిలానో
స్నేహితుడిలానో కనిపించి
గొప్ప ఓదార్పునిచ్చేవాడు..

నాకింకా అతడి చేయి నా భుజంపై
ఉన్నట్టే ఉంది...

అతడి గుండెల్లో దిగిన తూటా
నవ్వుతూ పిడికిలెత్తిన
ఆ రూపం నీకెన్నటికీ
నిద్రపట్టనీయదు
నా ప్రియ శతృవా...

నాకింకా అతడి చేయి నా భుజంపై
ఉన్నట్టే ఉంది...
(18 ఏళ్ళకే కోపర్గంగ్ దగ్గర జరిగిన ఎదురుకాల్పులలో
అమరుడైన కా.కిరణ్ స్మృతిలో)

పారా హుషార్....

అప్పుడే వాడు పగ్గాలు చేపట్టినంత
హుషారుగా ఈ నేల నాలుగు చెరగులా
తన ఇనుప రథ చక్రాలతో కమ్మేయ వస్తున్నాడు...

వాడు రక్తం రుచి మరిగిన పులి కదా!
నాలుక చాచి నీ క్రొన్నెత్తురు జుర్రుకొనేందుకు
పంజా విసురుతూ మూలలన్నీ వెతుక్కొస్తున్నాడు...

వాడికి అధికార దాహమొక్కటే కదా
నేటి అత్యవసర చికిత్సగా మత్తు మందు చల్లుతూ
పేట పేటకూ పరుగులు పెడుతూ వస్తున్నాడు...

జనం మీదికి అంగలేసుకుంటూ ఎగబడుతూ
సమస్త బలగాలనన్నీ పోగు చేసుకుంటూ
విసురుగా వల విసురుకుంటూ తానొక్కడే
దేశోద్ధారకునిలా అవుతోలు కప్పుకుని కుమ్ముకు వస్తున్నాడు...

చేను కాపలా కాస్తున్న రైతులా
ఈ మంచెపై వడిసెల రాయిని విసురుగా తిప్పుతూ
సూటీగా వాని కణతపై గురి చూస్తూ ప్రతి ఒక్కరూ
కాచుక్కూచోవాలసిన సమయమిది...
(క్షమించు గుజరాత్)

రక్తం మరిగిన తుటా

- భీమ్

రక్తం మరిగిన తుటా వెంటాడుతుంది
ఆకుల్ని చీల్చుకుంటూ.,
కొండల్ని దాటుకుంటూ.,
కనుమూసి తెరిసే లోపు
గాలి కన్నా వేగంగా.., నా వైపు దూసుకొస్తోంది

అంత నేరం నేనేం చేసానని...!
అరణ్యం దద్దరిల్లేలా లాల్ సలామ్ అన్నానాన
అమాయక ప్రజల కోసం అలసిన మనుసుని సైతం
లెక్కచేయకుండా.. ఆటనై.., పాటనై.., కవితనై

విప్లవ పోరాటంలో ముందుకు సాగుతున్నానని
పోలిసోడి తుటా నా వైపు దుసుకోస్తుంది..,

ఓ రక్తం మరిగిన తుటా...!
నన్ను చంపటమే నీ లక్ష్యం అయితే
చెబుతున్న విను...!
నా గొంతు మూగపోయేలోపే
ఏ యునివర్సిటీనుంచో.., పూరిగుడిసె నుంచో
లేక., చెడిన బతుకు నుంచో
మరో గొంతు పుడుతుంది..,
నీవు మమ్ము చంపే కొద్ది
మేము చరిత్రలో నిలుస్తాం
రా:., వచ్చి నా గుండెలపై వాలిపో...!

నేను మనిషిని కాదు

- బిరుసు సురేష్ బాబు

అవును
మీరు విన్నది నిజమే
మాట్లాడుతున్నది మనిషి కాదు

ఎలెక్షన్లు కదా!
ఈ కొన్నాళ్ళు నేను మనిషిని కాదు
ఓటర్ని

ఈ కొన్నాళ్ళు
కోడిపిల్లనైన నన్ను
రాజకీయ డేగలు
ఎంతో ప్రేమతోనూ...
అనురాగంతోనూ చూస్తాయి.

నామినేషన్ల నక్కలు
నా నోట్లో ఓటు ముక్క కోసం
నన్ను మునగ చెట్టెక్కిస్తాయి

ఈ ఊసరవెల్లులు
నేను ఏడ్వకపోయినా సరే
నన్ను ఓదారుస్తాయి

ఈ తెల్ల కాకులు
ఓట్ల నీళ్ళ కోసం
కోట్ల రాళ్ళు విసురుతాయి

ఈ కొన్నాళ్ళు
అంటరానోళ్ళకు మినహాయింపుంది
మనిషి అంటరానోటు కావచ్చుగాని
ఓటు కాదు కదా

ఎలెక్షన్లొస్తే చాలు
నా గతమూ నాక్కనిపించదు
ఓటర్నైనాను కదా

ఓట్ల పండగలో తేలియాడి
వాణ్ణి మరోసారి ఆహ్వానించి
సీటుకున్న దుమ్ము దులిపి.. మరీ
కూసోబెడతాను

వాడు గెలిచినందుకు
నాలోని ఓటరు ఎగిరి గంతేస్తాడు
అయిదేళ్ళకు వాడికి
బందీనవుతాను

ఈ రాత్రి ఎప్పటిలాగే తెల్లవారుతుంది
ఈ పొద్దు ఎప్పటిలాగే కుంగుతుంది
రహస్యం తెలిసిన రోజు
నన్ను నేను తెలుసుకున్నాను

అందరూ అంటుంటే
ఓటు నా ఆయుధమనుకున్నా గాని
అది వాడి వజ్రాయుధమని అర్థమయింది

పాలకులు మారుతున్నారుగాని
పాలన మారదని నా కిప్పుడిప్పుడే తెలుస్తోంది
ఇప్పుడు నా ఆయుధం తిరుగుబాటే
నేను ఓటర్ని కాదు మనిషిని

ఏ గుట్టను తడిమినా నెత్తుటి చెమ్మే

- పచల కిరణ్ కుమార్

కాళోజినగర్
ప్రసాదం ప్రాంగణం
అమరుల తల్లుల దుఃఖాల మధ్య
నింగికెగసిన నెత్తుటి జెండా

ఆటుపోటులను ఎదుర్కొంటూ
పురోగమనం వైపు ప్రయాణం
అమృత జనార్దన్ వేదిక

మిత్రుల సందేశాలు
ప్రజల పోరాటాలు
వీరోచిత గాథల వెల్లువల ఆవిష్కరణలు

బాసగూడ దుఃఖాన్ని
కళ్ళముందు నాటకీకరణతో
దిశను నిర్దేశించిన మిత్రుల ప్రదర్శన

ఊర్మిళ నర్సక్క
ఆర్కె అప్పారావు నడిచిన నేలపై
ప్రజాకళల ప్రదర్శనలు
డప్పుల మోతల పాటలతో
ఎరుపెక్కిన పోరుగడ్డ

పుష్పక్క సుధాకర్
కౌముది యాదన్న
నడిచిన తోవలో
కాగడాల వెలుగుల లాంగ్‌మార్చ్
ఆర్ట్స్ కాలేజి ఆవరణలో మిన్నంటిన నినాదాలు

కాళోజి సాహిత్యం
అభివృద్ధి భావజాలం
విచ్ఛిన్నమవుతున్న మనిషి
కాళోజి ప్రజాస్వామిక తెలంగాణ
విప్లవ జ్వాలల్ని రగిలించాయి

చిలకల గుట్ట
పద్మాక్షిగుట్ట
పాండవుల గుట్ట
నూరేళ్ళ కాళోజీ చూపులో నుండి
ఏ గుట్టను తడిమినా నెత్తుటి చెమ్మే
(వరంగల్‌లో జరిగిన విరసం 24 రాష్ట్ర మహాసభల సందర్భంగా)

దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పు!

- రాగో

అడవి అందాలకు
ఆదివాసీలు ప్రతిబింబాలు
అడుగడుగునా అడవిలో
తెలిసివచ్చే అపురూప వనరులకు
వాళ్లే సొంతదారులు
భూమి పొరల్లో దాగిన
సంపదలకు వాళ్లే యజమానులు
అడవి అందాలు
ఏ కవి కలానికీ అందనివవి –
అడవి సంపదలకు ఖరీదు కట్టే
షరాబులెవరు?
అద్భుతమైన అందాలు
అమూల్యమైన సంపదలు
తరగని వనరులు
వన్నెతగ్గని – వెన్నెల రాత్రులు
అందుకు తగినట్టు
అడవి బిడ్డల నృత్యాలు
రిలో, రేలా రాగాలు; నానోలివయా
సంవాదాలు
అదో ప్రపంచం,
తనదైన ప్రపంచం
తనలో తానైన ఆ ప్రపంచం
ప్రమాదవుతుందట నేడు
ఆ చిన్ని ప్రపంచం!?
ఆదివాసీలు అతి ప్రమాదకరశక్తులట!
ఎవరికో!!

దూరపు కొండల్లో
ఎత్తైన శిఖరాలపై
కానరాని ప్రదేశాల్లో
కారడవుల్లో దాగిన చిన్న కాపురాలు
కోహల, కోసిరి సహా
మరేవేవో చిరుధాన్యాలు
వారి పంట దినుసులు,
కడుపాకలి తీర్చే తిండిగింజలు
కాలం కాటువేస్తే
కందమూలాలే కడుపాకలికి దిక్కు
ఇప్పపూలు, రేఖపండ్లు
అడలి మామిళ్లు
తీరొక్క పండ్లు
అడవి వాసులకు పొట్టనింపే
ప్రకృతి వరాలు – సరుకులు కావవి
ఆకు, అలము సహా
పలు రకాల కూరగాయలు
కొర్రి చీమలు సైతం
చట్నీకీ, చారుకూ పనికొచ్చేవే!
పిట్టలేతేనేమి, పక్షులైతేనేమి
వేటలో దొరికే ఏ జంతువైనా
కడుపాకలి తీర్చేవే తప్ప
కాసుల కోసమో, వినోదాల కోసమో
బలి తీసుకునే ప్రవృత్తి
గతంలో తెలియనివాళ్లు – ఆదివాసులు
ప్రకృతిని ఆరాధిస్తూ, ఆస్వాదిస్తూ
తల్లూర్ ముత్తె, మారైశేడోలను
భక్తితో పూజిస్తూ
'తనలో తానైన వస్తువు'లా
జీవిస్తున్న ఆదివాసీలు
అంతరంగిక భద్రతకు
పెనుప్రమాదమయ్యారట! ఎందుకో!!

తరతరాల ఆ అబూజ్ జీవితాలు
నా బోటి కవిగాడికి
నేడు కవితలవుతున్నాయి
కథకులకు
కథా వస్తువులవుతున్నాయి
నవలాకారులకు
నవలలవుతున్నాయి
ఔత్సాహికులకు డాక్టరేట్లు ఇప్పిస్తున్నాయి
కథలు, కవితలు, పాటలు
నవలలు, చిత్రాలు, విచిత్రాలు
ఆ చిన్ని ప్రపంచం
అతలాకుతలమవుతున్న ప్రపంచం
హితులకు, సుతులకు
కేంద్రకమవుతూంది
అడవికీ, అడవి అందాలకూ
అడవిగాచిన వెన్నెలలకు
ఎన్నడూ లేని
కొత్త అర్థాలనిస్తోందా ప్రపంచం
'హరితవేట'లో ఛిద్రవవుతోన్న
ఆదివాసుల జీవితాలు
అంతర్గత భద్రతకు
ఎన్నడూ లేని విధంగా
అతి ముప్పైనాయంటున్నారు ఔనా!

నిన్నటి వరకూ అబూజ్ అన్నారు
నేడేమో ప్రమాదమంటూ
అబూజ్‌ను బూజ్ చేస్తున్నారు
నిన్నటివరకూ తాము చేసిందంతా
ఏకంగా తప్పంటున్నారు –
ఒప్పేసుకుంటున్నారు
ఆ ఫలితమే
పెను ప్రమాదరూపంలో
ముంచుకొచ్చిందంటున్నారు
నేడంతా – శివమెత్తిన చందంగా
'అభివృద్ధి'ని గానం చేస్తున్నారు
హైవేలు అభివృద్ధికి సోపానాలట
అభయారణ్యాలు, జాతీయపార్కులు
పులుల, అడవిపోతుల;
లేళ్ల, పక్షుల పోషక కేంద్రాలు వెలుస్తున్నాయి
సంపన్నుల విహారస్థలాలవుతున్నాయి
నక్షత్రాల విడిది కేంద్రాలు
మిరుమిట్లు గొలిపే
నియాన్ బుగ్గల వెలుతుర్లు
అడవిలో పిచ్చి ఆకర్షణ కేంద్రాలయ్యాయి
కానీ ఆ వెలుతుర్ల వెనుక
దాగిన చీకట్లలో
బలవుతున్న కణికలు
పడకగదుల్లో నలిగిపోతున్న
పసిడి వయసు భావితరాలు
దగాపడిన చెల్లెళ్లు
దేహవ్యాపారానికి బలవుతున్న
వ్యాపారం 'వికసిస్తోంది'
కోళ్ల సొమ్ము తరలింపు కోసం
దారుల్లేని అడవుల్లో
ఇనుప దారులు వేస్తున్నారు
జలమార్గాలు, మృద మార్గాలు
కొత్త మార్గాలు సృష్టిస్తున్నారు
నిక్షిప్తమైన నిధుల తరలింపుకై
సంక్షోభ జనకులు
కొండ కోనల్లో పరిచేదారులు
ఎవరి వికాసానికో, మరెవరి వినాశనానికో!
గడిచిన ముప్పై వసంతాల
అడవుల చరిత్ర తెల్సినవాళ్లకు

చెప్పాల్సిందేముంది!
చేయాల్సిందే వాళ్లముందెంతో ఉంది
పెనుప్రమాదమెవరో,
పడగలు విప్పి బుసలు కొడుతుందెవరో
పచ్చని అడవుల్లో
చిచ్చుపెడుతూ
తుపాకులతో వేటలు చేస్తూ
కలషికోవ్‌లతో కాపలా కాస్తూ
పల్లెలపై విరుచుకు పడుతూంటే
బతుకు కోసం మేమంతా
చావుకు సిద్ధపడితే
శంభూకుడు, ఏకలవ్యుడు
ఏమయ్యారంటూ
ఎరుపు ప్రమాదం సహించమంటూ
భద్రత పేరుతో బరితెగించి
పల్లెలను వల్లకాడు చేస్తోన్న వైనాన్ని
అసలు ప్రమాదాన్ని, దాని కుట్రలను
లోకానికి మరింత గట్టిగా
'చాటాల్సిన సమయమిది -
మిత్రులారా - ఏమంటారు?'
ప్రజల భద్రతకు ముప్పెవరో
మీరంతా గుట్టు విప్పి చెప్పండి - మన కోసం

అడవుల చరిత్రను వెలికితీస్తే
ఆత్మరక్షణ కోసం, అడవుల కోసం
ఆయుధాలతో పోరాడిన గతమే మాదంతా
పోరాటయోధుల వారసత్వం మాది
సిద్ధూ, కానూలే కాదు
గుండాదుర్, గేండ్‌సింగ్
సమ్మక్క్ బాబూరావు, కొమురం భీం
అడవి కోసం, ఆత్మగౌరవం కోసం
అధికారం కోసం
ప్రాణాలను పణంగా పెట్టిన
జనం నేతలు - వీర యోధులు
ఆ వరుసన నిల్చినవాడు
ప్రవీర్ చంద్ర భాంజ్‌దేవ్
ఏ తరం చరిత్ర చూసినా
మా తరాలన్నీ పోరుతరాలే
నెత్తుర్లు చిందిన అడవుల్లో
పోరు మొలకలకు చావు లేదు
అడవుల కోసం మేము
వనరుల కోసం మీరు
అస్తిత్వం కోసం మేము
ఆస్తుల కోసం మీరు
ఆత్మరక్షణ కోసం మా ఆయుధాలు

మా విధ్వంసం కోసం మీ మర తుపాకులు
ఏనాటికా పేరుతో
ఏ పూటకా సాకుతో
సాగుతోంది మీ బలగాల మోహరింపు
పదేళ్ల క్రితం సల్వాజుడుం అన్నారు
ఐదేళ్ల క్రితం హరిత వేటకు దిగారు
ఏ రూపంతో మీరు దిగి వచ్చినా
జరిగేదంతా ఒకే తీరులో
నర సంహారం, రక్తపు హేళి
పైగా ప్రజలంతా ప్రమాదకరం - హవ్వా!

చట్ట సభలలో చేసే చట్టాలన్నీ
జనం హితం కోసమంటారు!
చట్ట సభలకు ఎగబడేవాళ్లంతా
జనం మేలు కోరేనంటా!
పార్లమెంటరీ ప్రజాస్వామ్యం
ప్రజల ప్రజాస్వామ్యమంటా!
కర్మలు, కశ్యప్‌లు, పొట్టావీలు
ఏండ్ల తరబడిగా ఊళ్లో ఏలింది వాళ్లే
రాయపూర్, ఢిల్లీలో
'ప్రజాతంత్రం'లో రాజ్యమేలుతోంది వాళ్లే
మేం పేదలమన్నారిన్నాళ్లు
ఇప్పుడు మరో మెట్టు దించి
పేదల్లోకి పేదలమంటున్నారు
నిర్వచనాల్లో మార్పులు ఏ సంకేతానికో!
సానుభూతితో విసిరే ఎంగిలి మెతుకులు
అయితే మాత్రం సారీ!
అక్కర లేదా జాలీ, సానుభూతీ
మాలో రగుల్తోన్న
వర్గ కసి వ్యక్తీకరణకా
అయితే, స్వాగతం - సంతోషిస్తాం!
బాన పొట్టలతో గూడాల్లో
తచ్చాడే మా చిన్నారులు
అర్ధ నగ్నంగానే
మీ సంతలకు
సైతం రాకతప్పని
మా ఆడపడుచులు
బుడ్డగోచితో దేశమంతా
సంచరించే మా మగాళ్లు
మేం నివాసముండే
మా గుడిసెలు
అంబలి లేకుండా
తీరని మా ఆకలి బాధలు
రేపటిపై ఆశతో జీవించే మా వ్యథలు మీకేం
తెలుసు?

మీ అంత్యోదయ లెక్కల్లో
మీరిచ్చే బిపిఎల్ కార్డుల్లో
మా బతుకులు దరిద్రరేఖ దిగువేనంటూ
మమ్మల్ని నిరుపేదలంటూ
మీరు చెప్పడం వెనుక దాగిన
మర్మం మేమెరుగనిది గాదు
మీకన్న తెలివైన మీ గురువులు
యావత్తు దేశాన్ని దోచిన మీ తెల్లవాడు
'భారత దేశం సుసంపన్నమైనది
భారతీయులు మాత్రం దరిద్రులన్నాడు;
మీరు మీ బాస్‌ల బాటలో
మమ్మల్ని నిర్వచిస్తున్నారు
సర్వేలు చేయిస్తూ
వివరాలు సేకరిస్తున్నారు
సర్వేలు చేయిస్తూ
వివరాలు సేకరిస్తున్నారు
ఉచిత ఉప్పంటున్నారు
రూపాయికి కిలో ముక్కిన బియ్యం
మా మూఖాన కొడుతున్నారు
మా కొంపలు కాలుస్తున్నారు
రూకలు పంచుతున్నారు
రాజ్యాంగానికి సవరణలన్నారు
గ్రామ సభలకే సర్వాధికారాలనిపించారు
అడవి భూములపై అధికారం అని
మురిపించారు
జరుగుతుందంతా భిన్నమే
భూమిపట్టాల అడ్రస్ లేదు
పంట భూములు గుంజుతున్నారు
మీ చట్టాల చిట్టా విప్పుతున్నాం
అసలు నైజాలు బయటపెడుతున్నాం
ముంచుకొచ్చిన ముప్పు వెనుక
దాగిన మీ అల్సర్ ముఖాలు
మాకే కాదు ప్రపంచ మానవళికే
ఎంత ప్రమాదకరమో
జనం గ్రహిస్తారు, జంగ్ నడిపిస్తారు
జగన్నాథ రథ చక్రాలు
మిమ్మల్ని నుజ్జు చేయక తప్పదు
పచ్చని అడువుల్లో
ఖాకీలు కానరాని చోటే లేదు
పల్లెల్లో, పొరల్లో
వీధుల్లో, దారుల్లో
కొండల్లో, కోనల్లో
నీడలో, నీటి తావులో
నీ మర తుపాకులతో
మా మనుషులను నిలిపావు

శాంతి భద్రతలంటూ
అశాంతినీ, అభద్రతనూ
అదివంతా పరచావు
నెత్తుటి వాసనలతో నిండిన
పొద్దులెరుగని హత్యాకాండలతో
నెత్తుటి మడుగులు సృష్టిస్తున్నారు
సార్కెన్‌గూడ, ఎడ్స్‌మెట్టలు
ఓంగ్‌నార్‌లు, తాకిలోడ్‌లు, ఎన్నెన్నో ఊళ్లు
ఉంగాలు, కోసాలు, మాడాలు
మూరాలు, మూయెలు, ఎందరెందరో
మనుషులు
పచ్చని అడవులు నెత్తుటి
చరిత్రకు ప్రసిద్ధమవుతున్నాయి.
ఆడపడుచుల జీవితాలతో
నీ హింసోత్సాతం
అక్షరాల్లో మలచలేని తీరులో
అతిహేయంగా వ్యవహరించిన
నీ దుష్టుల దాష్టీకం క్షణ క్షణం
కళ్లకు కదుతూంటే, మనస్సులో క్రోధాగ్నిని
రగిలిస్తోంటె
మాసే, బుదిరి, సుక్కి, లక్కె, అయితే, మల్లి,
సీదో, రాగో, రామే
ఏ పేరని చెప్పాలి! ఎన్నని పేర్లు రాయాలి!!
అనార్యులం, ఆదివాసులం, అన్నీ భరించాలి
ఎంతకాలం? అని ఎదురు తిరుగుతే!
సివిక్ ఆక్షన్‌లు, సల్వాజుడుంలు,
హరితవేటలు
ఏ హంటింగ్‌లైనా, ఆక్షన్‌లైనా
ఎన్ని రియాక్షన్‌లైనా
గుండె నిబ్బరం సడలని మాలో
నీ ప్రతి చర్య, ప్రతి ప్రతిక్రియ
వేనవేల ప్రశ్నలను ప్రేరేపిస్తున్నాయ్
నెత్తుటి బాకీ తీర్చుకోమంటున్నాయ్
ఖాకీల క్రౌర్యానికి మూలం
కామ పైశాచికానికి ప్రేరకం
ఖద్దరు నేతల లాభాకాంక్షలో
టాటా, అంబానీ, బిర్లా, మిత్తల్‌ల
జిందల్‌లు, వేదాంతల
ఎస్సార్ పెట్టుబడులలో
తప్ప మరోచోట కాదనేది వాస్తవం
బైబిల్‌లు, ఏసు ప్రవచనాలు
మనువులు, మత గ్రంథాలు
మంట గలుపుతున్న
తరతరాల మా సామాజిక నీతి నియమాలకు
ముసుగులు
పుట్టిన బిడ్డకు మేం పెట్టే పేరు సైతం
మీ బడిలో చేరాక మారక తప్పడం లేదు
స్వేచ్ఛగా జరిగే మా సంప్రదాయ పెళ్లిళ్లు
పోయి
సర్కారీ పెళ్లిళ్లు - సామూహిక వివాహ
వేడుకలు
మీ కుసంస్కరణలలో భాగమయ్యాయి
వరకట్నాలు వచ్చి చేరుతున్నాయి
గోటుల్ మా జీవితంలో
గ్రామ రాజకీయ - సాంస్కృతిక వేదిక
కానీ మీ విధానాలు
తరతరాల మా రివాజులను
భ్రష్టు పట్టిస్తున్నాయి
మీ దేవీ దేవతలు
మా పల్లెల్లో ఊరేగుతున్నాయి
మా మాతృదేవతలను
దొంగిలించి మీ మగ దేవుళ్లకు
పెళ్లిళ్లు చేస్తున్నారు
దంతేశ్వరీలు, దసరా ఉత్సవాలు
గణేశ్ నవరాత్రులు, దీపావళి వేడుకలు
గతంలో మాకెక్కడివి?
రావణుడిని దైవంగా కొలిచిన వాళ్లతో
రామనామం స్మరింపచేస్తూ
రాక్షస సంహారం అంటూ
రావణ సంహారం చేయిస్తున్న
ఆర్య సుపుత్రులు మీరు
మాలో ద్విజత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు
'కత్వా' అంటూ మాలో ఎన్నడూ లేని
అంటరానితనాన్ని సృష్టిస్తున్నారు
మీ మహిమలు మతి తప్పిస్తున్నాయి
మమ్మల్ని అతి ప్రమాదకరం చేస్తున్నాయి,
కాదంటారా!

మేం బతకాలి
మరొకరిని దోచుకుని కాదు
మేం తలెత్తుకు తిరగాలి
మరొకరి తలలు ఉత్తరించి కాదు
ఈ అడవి మాది
మీ కోసం కాదిది
అడవిలోని అడుగడుగూ మా సొంతం
మీ కెందుకిస్తాం!
సంపదల తరలింపులకు ఒప్పందలా!
ఎవరితో?
మీ అవగాహన పత్రాలు మాకక్కరలేదు
మీ సంక్షోభ నివారణకు మా వనరులు
కావాలా
మీ దురాశలకు వనరులెన్నైనా సరిపోవు
మీ పుట్టుకతోనే వచ్చిపడిన సంక్షోభం
పుడకలతోనే పోతుంది నిజం
మీ రాజ్యం మాకక్కర లేదు
మా జనసేన మీ అంతం కోసం
ఉత్తరం వైపు కవాతు చేస్తున్నది
త్యాగాలకు మేం అన్ని వేళలా సిద్ధం
అమూల్యమైన త్యాగాలు మీకు అర్థం గావు
సంత సరుకు కాదు త్యాగం
మాడ్ కొండల్లో
రగులుతున్న జనం గుండెల్లోని
మంటలనార్పడం నీ తరమా!
మమ్మల్ని మార్చిస్టులంటావా,
మావోయిస్టులంటావా,
వామపక్ష ఉగ్రవాదం అంటావా
నీ ఇష్టం -
కానీ
నీ దోపిడీ వ్యవస్థకు పెను ప్రమాదమన్నది
నిజం!
ఎన్ని ఓటములు ఎదురైనా
ప్రజలు అజేయులు
రానీబోదిలి, ముకరం, కొంగెర, జీరంగాటి,
తోంగ్‌పాల్‌లు
నిన్నెప్పుడూ వెంటాడుతాయి.
నీ బలగాల గుండె ధైర్యం నే చెప్పాలా!
నిత్యం నీ ఖాకీల ఆత్మహత్యలను లెక్కిస్తున్న
నీ పాపాల చిట్టానే విప్పాలా!
కొలువుకు సలాం కొట్టి
ఇంటిదారి పడుతున్న వేల కొద్దిన నీ బలగాల
బండారం నే బయట పెట్టాలా!
వాళ్లంతా నా పక్షం చేరక తప్పదు
నీ ఆధునికానంతర ఆయుధాలు
ఇ-బాంబులు, స్మార్ట్‌బాంబులు
ప్రయోగించే నా వాళ్లు
నా కొండల్లో నిల్చుని
నీ గుండెలపైకి గురిచూసి
కాల్చే రోజు ఎంతో దూరం లేదు
మేమంతా అతి ప్రమాదకర శక్తులమే
కష్టజీవులం మేం కమ్యూనిస్టులం
నీకు ఘోరి కట్టే వీరయోధులం
మేం కలలు కంటున్నాం
కానీ అవి మరణించడం సహించలేం

అణుధార్మిక భావజాలం -ఈనాడు దినపత్రిక

- పి.వరలక్ష్మి

ఏడాదిన్నర క్రితం ఈనాడు దినపత్రిక (10.12.2012) ప్రచురించిన తప్పుడు వార్తా కథనంపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఫిర్యాదు చేసాను. అది ఈ ఫిబ్రవరి 10న ప్రెస్ కౌన్సిల్ ముందు విచారణకు వచ్చింది. ఈ ఫిర్యాదు ఈనాడు వంటి పత్రికా దిగ్గజం వైఖరిని, మీడియా భావజాలాన్ని కొత్తగా కాకపోయినా దగ్గరగా అనుభవంలోకి తెచ్చింది. ఫిర్యాదుకు కారణమైన వార్త నేపథ్యం కూడంకుళం వెళుతున్న అఖిల భారత నిజనిర్ధారణ బృందం అరెస్టు. అరెస్టు దగ్గరి నుండి ప్రెస్ కౌన్సిల్ "ఈనాడు"ను తప్పుబడుతూ ఫిర్యాదుదారు చెప్పిన విషయాల్ని ప్రముఖంగా అచ్చువేస్తూ అంతకు ముందు ప్రచురించిన వార్తకు క్షమాపణ చెప్పాలని ఆదేశాలు జారీ చేసేదాకా, ఆ తర్వాత నామ మాత్రంగా "చింతిస్తున్నామని" ఈనాడులో ఒక మూలన ప్రకటన వచ్చేదాకా మీడియా తెంపరితనం, పొగరు అడుగడుగునా కనపడింది. సమాజంలో ప్రగతిశీల పాత్ర పోషించిన మీడియా స్థానంలో ఏకు మేకైన పెట్టుబడిదారి మీడియా సామ్రాజ్యం కింద నిజానికి ఇది చాలా చిన్న సంఘటనే కావచ్చు కాని ఇటు వంటి వార్తల వెనక ఉన్న భావజాలం గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

కూడంకుళం అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమం, దానిని అణిచివేయడానికి రాజ్యం చేస్తున్న దుర్మార్గాలను తెలుసుకుందామని నిజనిర్ధారణకు పోయి స్వయంగా వాటిని అనుభవిస్తూ బోలెడన్ని అనుభవాల సముద్రంతో సంభాషణ చేస్తున్న క్రమంలో ఈనాడు దినపత్రికలో మా అరెస్టు గురించి వచ్చిన వార్త ఎంత కల్లోలం రేపిందో విడుదలై వచ్చాక గాని పూర్తిగా అర్థం కాలేదు. నిజానికి తిరుచ్చి సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడే తమిళ దినపత్రిక "దిన మలర్"లో మా అరెస్టు గురించి నా ఫోటోతో పాటు ప్రచురితమైన సెన్సేనల్ వార్తను చూసాను. అప్పుడు కలిగిన అసహనం మీడియా మీద కోపంతో పాటు, ఆ వార్త ముందు ముందు నేను ఎదుర్కోవలసిన ఏ కొత్త పరీక్షకు సంకేతమో అని కేసు గురించిన టెన్షన్ వల్లనే. బైటికొచ్చాక తెలిసింది, అదే వార్త ఈనాడు దిన పత్రిక (అక్టోబరు 12, 2012)లో ప్రముఖంగా వచ్చిందని. నలభై ఏళ్ళుగా తెలుగు సమాజానికి చిరపరిచితమైన విరసం గురించి ఈనాడుకు తెలియకపోవడం అసంభవం. తరచుగా ప్రకటనలు పంపే విరసం కార్యదర్శి గురించిన విషయాలు తెలుసుకోవడమూ పెద్ద కష్టమేం కాదు. మరి ఈ అసంబద్ధ వార్త ఎందుకు రాయవలసి వచ్చింది?

ఈనాడు మెయిన్ ఎడిషన్‌లో విరసం మహాసభల ప్రాంగణంలోని అమరుల స్థూపం పక్కన నిలుచున్న నా ఫోటో, దానితో పాటు నేను మావోయిస్టు పార్టీలోని ముఖ్యనేతకు భార్యనని రాసిన వార్త మా ఇంట్లో అలజడి రేపింది. అయితే విప్లవోద్యమ ప్రభావం ఏ మాత్రం లేని ప్రాంతంలో ఇటు వంటి గాలి వార్త ఒకటి విసిరితే అది ఒక మహిళ వ్యక్తిగత జీవితాన్ని ఎంత దెబ్బతీయగలదో అంతగా నా విషయంలో జరగలేదు. "మీ అమ్మాయి పెళ్ళి చేసుకుందంట కదా" అని చుట్టుపక్కల వాళ్ళు అడిగితే అదే నిజమైతే మీకు విందు ఇస్తానని సమాధానం చెప్పే తల్లిదండ్రులు ఉంటారని, వాళ్ళు లోపలెంత బాధ ఉన్నా పరామర్శించే వాళ్ళతో "మేం చేయలేని పని (పెళ్ళి) తమిళనాడు పోలీసులు చేశార"ని జోకులు వేయగలిగేంత దృఢంగా ఉంటారని నామీద మానసిక యుద్ధం చేయాలనుకునే వాళ్ళే కాదు, నేనూ అనుకోలేదు. దాన్నలా ఉంచితే ఈ వార్తా కథనం మీడియా వైఖరి ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నదో తెలయజెప్పే ఒక ఉదాహరణ అనిపించింది. నిజానికి ఒకటీ అరా పత్రికలు కాదు, దాదాపు తమిళ మీడియా మొత్తం ఈ వార్తను ఎంత సెన్సేషన్ చేసాయో మేం కండీషన్ బెయిలు మీద అక్కడున్నప్పుడు మమ్మల్ని గుర్తుపట్టి "మీ గురించి ఇలా రాశారు కదా" అని అక్కడక్కడా మా కెదురైన ప్రశ్నలు విని ఆశ్చర్యపోయాము. ఒక నిజనిర్ధారణ మీద ఇంత టార్గెట్ చేయగలరా అని ఊహకందని రీతిలో అక్కడి పోలీసు, ఇంటలిజెన్స్, మీడియా ప్రవర్తించాయి. ఇక అభివృద్ధిని వ్యతిరేకిస్తున్నామన్న ప్రశ్నలు సరేసరి.

ఈ అనుభవం రాజ్యం తన చేతులు ఎంత దూరం చాచగలదు అనే కాదు దాని భావజాలం ఎంతగా ఇంకింప చేయగలదో కూడా చెప్పింది. రెండు విషయాల్లోనూ మీడియా దాని అంగంగా పనిచేయ గలదు అని అర్థమయింది. మేము "మావోయిస్టు తీవ్రవాదులమ"ని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రాన్ని ముట్టడించ డానికొచ్చామని మీడియా చేసిన ప్రచారం మా కేసును ప్రభావితం చేయగలగడం ఒక అంశమైతే, అణువిద్యుత్ కేంద్రానికి అనుకూల భావజాలాన్ని, ముఖ్యంగా మధ్యతరగతి నుండి కూడగట్టగలగడం రెండో అంశం. (దాని శక్తి ఇటీవలి సమైక్యాంధ్ర భావజాలంలో ఇంకా బాగా అర్థమై ఉంటుంది) ఈ రెండు అంశాల్లోనూ వాటి అవతలివైపున్న వాస్తవాన్ని చూడడానికి, చెప్పడానికి మీడియా ఆసక్తి చూపలేదు. ఈనాడు వార్తను ఖండిస్తూ విరసం ప్రెస్‌మీట్‌ను నామమాత్రంగా రిపోర్టు చేశారు తప్ప కనీసం వాస్తవాలను సరిచూడాలనే స్పృహ ఈనాడుకు లేదు. మిగతా పత్రికలకైతే ఈ విషయం పట్టించుకునే అవసరం కూడా లేదు. కూడంకుళంపై దేశవ్యాప్త చర్చ జరుగుతున్నప్పుడు అణుశక్తి దేశానికి ఎంత అవసరమో నొక్కి చెప్పే ప్రయత్నమే మీడియా ఎక్కువగా చేసి, దాని విధ్వంసం గురించిన ఆందోళనను ప్రాక్టికాలిటీకి దూరంగా ఉండే మేధో చర్చల స్థాయికి పరిమితం చేసింది. అన్ని చర్చల్లోనూ అభివృద్ధి అవసరమే కాని నష్టం జరగకుండా చూసుకోవాలని హితవులు పలికింది. అది అత్యంత అసహజమే. ప్రజాస్వామికంగా కనపించడానికి ప్రయత్నించే పత్రికల్లో కూడా మీడియా యాజమాన్యం ప్రాతినిధ్యం వహించే రాజకీయాలు, పాపులర్ వార్తలు మొదటి పేజీలో వస్తే, వాటిపై ప్రజానుకూల చర్చ ఎడిటోరిల్ పేజీ మూలల్లో సాధారణ పాఠకులు పట్టించుకోని వ్యాసాలుగా వస్తాయి. నిజనిర్ధారణకు పోయి తమిళనాడులోని ఒక

మారుమూల ప్రాంతంలో నెలరోజుల నిర్బంధంలో ఉన్న వాళ్ల గురించి ఏ మీడియా పట్టించుకోకపోగా తీవ్రవాద ముద్రవేసి వదిలేసింది. మద్రాసు అసెంబ్లీని చుట్టుముట్టిన కూడంకుళం ఆందోళనలు, అరెస్టుల వార్తల నేపథ్యంలో కూడా అంతకు ముందు అరెస్టయిన నిజనిర్ధారణ బృందం ఏమయిందన్న ఆసక్తి కూడా వాళ్ళకు లేదు.

తమిళనాడు నుండి తిరిగొచ్చాక చాలా ఆలస్యంగా అయినా ఫిర్యాదు ఇవ్వాల్సిన గడువులోపలే ఈనాడుకు ఒక ఉత్తరం రాసాను.

ప్రొద్దుటూరు
11.12.2012

ఈనాడు దినపత్రిక సంపాదకులవారికి

విషయం: అక్టోబరు 17, 2012న "అణుకేంద్రం ముట్టడిలో మావోయిస్టు మద్దతుదారులు" అనే శీర్షికతో ప్రచురింపబడిన తప్పుడు వార్తా కథనానికి సంబంధించి

తమిళనాడు రాష్ట్రంలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు, దానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజల పోరాటం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుండి విప్లవ రచయితల సంఘంతో పాటు దేశంలోని వివిధ ప్రజాసంఘాల సభ్యులతో కలిసి ఒక అఖిలభారత బృందం నిజనిర్ధారణకు వెళ్ళింది. అక్టోబరు 12, 2012న కూడంకుళం చేరుకోబోతున్న మమ్మల్ని దారి మధ్యలోనే అక్కడి పోలీసులు అరెస్టు చేసి పోలీసు అధికారుల విధులు అడ్డుకున్నట్లు, వారిపై దాడి చేసినట్లు, దుర్భాషలాడినట్లు, 144 సెక్షన్ ఉల్లంఘించినట్లు ఆరోపణలు చేసి కేసు నమోదు చేశారు. అయితే ఈ సంఘటనల నేపథ్యంలో మీ ఈనాడు దినపత్రికలో అక్టోబరు 17, 2012న "అణుకేంద్రం ముట్టడిలో మావోయిస్టు మద్దతుదారులు" అనే శీర్షికతో మెయిన్ ఎడిషన్ 5వ పేజీలో తప్పుడు వార్తా కథనం ప్రచురించింది. నాతో పాటు మిగిలిన పది మంది నిజనిర్ధారణ కోసం వెళ్ళగా మీరు "ముట్టడి కోసం వెళ్ళి పోలీసులకు చిక్కారంటూ" అవాస్తవాలతో కూడిన వార్తను ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్‌లో విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న నన్ను పలు రాష్ట్రాల్లో మావోల అజెండాను ప్రచారం చేస్తుంటానని రాశారు. అంతే కాక అవివాహితురాలినైన నా గురించి "ఆమె భర్త ఆంధ్ర ప్రదేశ్‌లోని ఓ నిషేధిత మావోయిస్టు సంస్థలో ముఖ్యుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారంటూ" కనీస పాత్రికేయ విలువలు కూడా పాటించకుండా నా వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు ప్రచారం చేస్తూ రాశారు. మీరు ప్రచురించిన ఏ ఒక్క విషయమూ పోలీసుల ఎఫ్.ఐ.ఆర్‌లో కూడా నమోదు కాలేదు. మరి ఏ సమాచారం ఆధారంగా మీరు ఈ వార్త రాశారో ఆశ్చర్యం కలుగుతున్నది.

విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నేను పనిచేస్తున్న విషయం రాష్ట్రంలో అందరికీ బహిరంగంగా తెలిసిందే. నా పేరుతో మీ పత్రికకు అనేక పత్రికా ప్రకటనలు కూడా పంపడం జరిగింది. అయితే మీరు మాత్రం "వర్సిటీ విద్యార్థిని అయిన వరలక్ష్మి విరసంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం" అంటూ అనుమానాస్పదంగా రాసి ఒక బహిరంగ, చట్టబద్ధ, ప్రజాస్వామిక సంస్థగా పనిచేస్తున్న విరసాన్ని నిషిద్ధ, రహస్య సంస్థ అనే భావన వచ్చేటట్లు కథనం రాశారు. పై వార్తతో పాటు "మావోయిస్టు అరెస్ట్" అనే వార్త ప్రచురించి, నా ఫోటో పక్కనే మావోయిస్టుగా చెప్పబడుతున్న వ్యక్తి ఫోటో ప్రచురించి తప్పుడు సంకేతాలు వెళ్ళేలా కూడా చేశారు. ఒక మహిళ వ్యక్తిగత జీవితంపై కనీస సభ్యత కూడా మర్చిపోయి ఇలా రాసి నాతోపాటు నా కుటుంబ సభ్యులను తీవ్ర మానసిక వేదనకు గురి చేశారు.

మీరు ప్రచురించిన తప్పుడు వార్తా కథనం స్థానంలోనే ఆ కథనం తప్పు అని చెప్తూ వాస్తవాలు ప్రచురించగలరని కోరుతున్నాను.

ఇట్లు
పి.వరలక్ష్మి

ఈ ఉత్తరానికి స్పందన రాలేదు కాని అరెస్టును ఖండిస్తూ ఒక నాలుగు లైన్లలో ప్రచురితమైన విరసం ప్రకటన జిరాక్స్ కాపీ ఒకటి పోస్టులో వచ్చింది. ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశాక రెండు నెలలకు ఈనాడుకు షోకాజ్ నోటీసు పంపామంటూ వారి నుండి నాకు ఉత్తరం(12.02.2013) అందింది. ఆ తర్వాత దాదాపు ఈ విషయం మర్చిపోయాక అనుకోకుండా కా.వివి ద్వారా హైదరాబాదు వచ్చిన ప్రెస్ కౌన్సిల్ సభ్యులొకర్ని కలిసే అవకాశం రావడంతో ఈ విషయం ఆయన దృష్టికి తెచ్చాను. సహజంగానే ఇటు వంటి ఫిర్యాదుల విషయంలో ప్రెస్ కౌన్సిల్ మెల్లగా కదులుతుందని ఆయన అన్నట్టే ఇది 2014 ఫిబ్రవరి 10న హియరింగ్‌కు వచ్చింది. అయితే ఇన్ని రోజులు చీమ కుట్టనట్టుండని ఈనాడు, ప్రెస్ కౌన్సిల్ హియరింగ్‌కు మూడు రోజుల ముందు ఫిబ్రవరి 7న "అణువిద్యుత్ కేంద్ర ముట్టడితో సంబంధం లేదు" అని విరసం ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వరలక్ష్మి ప్రకటించినట్లు ఒక విచిత్రమైన వార్తను ప్రచురించింది. అది కూడా తిరునెల్వేలి నుండి వచ్చినట్లు ఉంది. ఇది చూసిన మిత్రులు కొంతమంది ఫోన్ చేసి "కూడంకుళం కేసు ఏమైంది? తమిళనాడు ఎప్పుడు పోయినావు? ఈనాడులో నీ స్టేట్‌మెంట్ చూసినామని" అడిగారు. నిజానికి నేనప్పటికి చాలా రోజులుగా ప్రొద్దుటూరులోనే ఉన్నాను. ఉద్యోగం, ఇతరత్రా పనుల్లో ఉండి ప్రెస్ కౌన్సిల్ హియరింగ్ కోసం ఢిల్లీ పోలేక నా తరపున హాజరుకమ్మని నా సహముద్దాయి ప్రియదర్శినిని కోరాను. కాని నేను తిరునెల్వేలి నుండి ప్రకటన ఇచ్చినట్లు వార్త వస్తుంది. ప్రెస్ కౌన్సిల్ నుండి నోటీసు అందుకున్నాకైనా గతంలో తాను "పొరపాటు"గా ప్రచురించిన వార్తను తానుగా సవరించుకొని ఉండొచ్చు. ఇదెంత చిన్న విషయం. దీని వల్ల వాళ్లకు పోయేదేముంది? కాని ఈనాడు పొగరు ఎంతటిదంటే మీరు కోరుకున్నట్లు వార్త వేసాం కదా, ఇక కంప్లైయింట్ వెనక్కి తీసుకోండని సంప్రదింపులు చేస్తారు. వారు ఇదే వార్తను కౌన్సిల్ ముందు పెట్టి దీనిని రిజాయిండర్‌గా గుర్తించమని అడిగితే అది ఒప్పుకోలేదని, ఈనాడుపై చాలా సీరియస్ అయిందని అక్కడ నన్ను రెప్రెజెంట్ చేసిన ప్రియదర్శిని, అడ్వకేట్ సోనియాల ద్వారా తెలిసింది. రిజాయిండర్ ఎట్లా రాయాలో ప్రెస్ కౌన్సిల్ ఈనాడుకు చాలా స్పష్టమైన ఆదేశాలిచ్చింది. వాళ్ళు రాయవలసిన విషయాన్ని నేను ఉత్తరం ద్వారా వారికి తెలియజేయాలని సోనియా చెప్పారు. అది నేనెప్పుడో వాళ్ళకు రాసాను గనక ప్రెస్ కౌన్సిల్ ఆదేశాల కాపీ కోసం (తర్వాత చాలా ఆలస్యంగా అందింది), ఈనాడు వార్త కోసం చూశాను. ఏదీ రాకపోయేసరికి చివరికి మళ్ళీ 19.02.2014న ఈనాడుకు ఇలా రాయవలసి వచ్చింది.

ప్రొద్దుటూరు
తేదీ:19.02.2014

ఈనాడు దినపత్రిక సంపాదకుల వారికి

విషయం: అక్టోబరు 17, 2012నాటి "అణుకేంద్రం ముట్టడిలో

మావోయిస్టు మద్దతుదారులు" అనే తప్పుడు వార్తా కథనంపై ప్రెస్ కౌన్సిల్ ఆదేశాలను పాటించమని కోరుతూ

ఎడిటర్ గారూ,

ఈ విషయం మీకు పదేపదే గుర్తు చేయాల్సి రావడం విచారకరం. తమిళనాడులో కూడంకుళం అణువిద్యుత్ కేంద్రంపై జరుగుతున్న ఆందోళన, దానిపై ప్రభుత్వ ఫాసిస్టు దమనకాండను గురించి ఈ దేశప్రజలకు చెప్పాలని నిజనిర్ధారణ బృందంగా వివిధ సంఘాల వాళ్ళం వెళ్ళాం. మా బృందంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఝార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాల నుండి ప్రజాసంఘాల ప్రతినిధులున్నారు. ఊహించని విధంగా, దేశంలో ఎన్నడూ జరగని విధంగా పోలీసులు మా నిజనిర్ధారణ బృందాన్ని దారికాచి అడ్డగించి, సోదాలు చేసి, రోజంతా ఒక ప్రైవేటు భవనంలో నిర్బంధించి, తప్పుడు ఆరోపణలతో అర్ధరాత్రి కావస్తుండగా మమ్మల్ని మెజిస్ట్రేటు వద్దకు తీసుకుపోయి జైలుకు పంపారు. ఆ తర్వాత బెయిల్ రాకుండా ఇబ్బందులు పెట్టారు. వచ్చాక కూడా మూడు వారాల పాటు మమ్మల్ని మానసికంగా చిత్రహింసలు పెట్టారు. కూడంకుళం ప్రజల మీద ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలనే కాదు, మా పట్ల జరిగిన అన్యాయాన్నీ మీడియా పట్టించుకోలేదు. పైపెచ్చు రాజ్య దుర్మార్గాన్ని మించి మాపై తప్పుడు వార్తలు రాసింది. సుదీర్ఘ ప్రజాస్వామిక ఉద్యమాల చైతన్యం వెల్లివిరిసిన తెలుగు సమాజంలో అన్నీ తెలిసిన తెలుగు దిన పత్రిక మా గురించి "అణుకేంద్రం ముట్టడిలో మావోయిస్టు మద్దతుదారులు" వంటి వార్తను ప్రచురించడం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. నలభై ఏళ్ళపైగా సుపరిచితమైన సంఘం విరసం. మీ మీడియా ప్రతినిధులు మా సభ్యుల ఇంటిని వెతుక్కుంటూ వచ్చి మరీ వివిధ సామాజిక సమస్యలపై అభిప్రాయాలు రికార్డు చేసుకుంటారు. అటువంటిది విరసం కార్యదర్శి గురించి వార్త రాసేటప్పుడు, అది ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించింది కూడా అయినప్పుడు కనీసం విచారించాలని (వరవరరావు, చలసాని ప్రసాద్ వంటి వారికి ఒక్క ఫోన్ కాల్ చేసినా చాలు) మీ వాళ్ళకు అనిపించలేదు. (కాని నా ఫిర్యాదును ఉపసంహరించుకోమని చెప్పడానికి వారిని సంప్రదిస్తారు) ఏ విధంగా చూసినా అదెంత నిరాధారమైన వార్తో ఎవరికైనా అర్థమవుతుంది.

అణుకేంద్రం ముట్టడి అనే మాట ఎక్కడి నుండి వచ్చింది? కూడంకుళం వ్యతిరేక ఆందోళనలో కష్టం చేసుకోను రెండు చేతులు తప్ప ఏమీ లేని ప్రజలు ఆ రెండు చేతులెత్తి దండం పెట్టి మా జీవితాలు నాశనం చేయకండని అడుగుతున్నారు తప్ప వారి చేతుల్లో ఏ ఆయుధమూ లేదు. మీడియా పరిభాషలో చెప్పాలంటే అది శాంతియుత పద్ధతిలో జరుగుతున్నది. నిరాయుధులైన ప్రజలపై తుపాకులు కాల్చారు. వందల కొద్దీ రాజద్రోహం కేసులు పెట్టారు. ఎవ్వరూ మాట్లాడలేని ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. ప్రభుత్వం ఫాసిజాన్ని అమలు చేస్తూ దానికి చట్టబద్ధత కల్పించుకోడానికి చేసే ప్రచారానికి ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా ఉండాల్సిన పత్రికలు వాహికలవుతున్నాయి. మరో వైపు సెన్సేషన్ కోసం ప్రచారం చేస్తున్నవి చాలాసార్లు వ్యక్తిగత జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. నాపై రాసిన ఇటువంటి వార్త వల్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు దూరమవవచ్చు, ఉద్యోగం పోవచ్చు, పోలీసులు మరిన్ని తప్పుడు కేసులు పెట్టొచ్చు. ఇది నా వంటి వారి సమస్య మాత్రమే కాదు. జర్నలిస్టు నైతికత, నిబద్ధతలకు సంబంధించింది కూడా. ఇది మా వంటి వ్యక్తులతో, సంస్థలతో, ప్రెస్ కౌన్సిల్‌లో చెప్పి చేయించాల్సిన పని కాదు. మీ విశ్వసనీయతను మీరే చాటుకోవాలి. మళ్ళీ ప్రెస్ కౌన్సిల్ వద్దకు పోనీయక మీరు దీనిని ప్రచురించగలరు.

10.02.2014 నాడు ప్రెస్ కౌన్సిల్ ఆదేశించిన విధంగా అక్టోబరు 17, 2012 నాటి "అణుకేంద్రం ముట్టడిలో మావోయిస్టు మద్దతుదారులు" అనే వార్త తప్పని (నేను చెబుతున్నట్టుగా కాదు), అసలు జరిగిన విషయం ఇదని మీరు ప్రచురించాలని విజ్ఞప్తి.

అసలు అక్కడ ముట్టడి వంటిదేమీ లేదు. శాంతియుత పద్ధతిలో నిరసన తెలుపుతున్న నిరాయుధులైన ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపారు. వందల కొద్దీ రాజద్రోహం కేసులు పెట్టారు. దీనిపై నిజనిర్ధారణకు వెళుతున్న అఖిల భారత నిజనిర్ధారణ బృందాన్ని పోలీసులు అరెస్టు చేశారు. వారు పోలీసు అధికారుల విధులు అడ్డుకున్నట్లు, వారిపై దాడి చేసినట్లు, దుర్భాషలాడినట్లు, సెక్షన్ 144ను ఉల్లంఘించినట్లు కేసులు పెట్టారు. విరసం కార్యదర్శి వరలక్ష్మి సహా ఆ బృందంలోని వారెవరిపైనా మావోయిస్టు ప్రచారం చేస్తున్నట్లుగానో, అణుకేంద్రాన్ని ముట్టడిస్తున్నట్లుగానో ఏ కేసులూ నమోదు కాలేదు. ఆమె భర్త నిషేధిత మావోయిస్టు సంస్థలో ముఖ్యుడన్న విషయం పూర్తిగా తప్పు. నిజానికి ఆమె అవివాహిత. ఆమె ఏ యూనివర్సిటీ విద్యార్థీ కాదు, కాలేజీ లెక్చరర్. రచయిత, విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి. మా పత్రికలో జరిగిన ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. ఈ వార్త వల్ల ఇబ్బందులు పడిన వారికి, పాఠకులకు మా క్షమాపణలు.

ధన్యవాదాలు

ఇట్లు

పి.వరలక్ష్మి

"ఇలా రాయమని మీరే సూచించండి" అని ప్రెస్ కౌన్సిల్ అన్నది కాబట్టి కాని, లోకానికంతా భాష నేర్పంచే ఈనాడు వంటి పత్రికకు వార్త ఎలా రాయాలో చెప్పాలా అనుకున్నాను. చివరికి మార్చి 12న ఈనాడు 12వ పేజీలో ఒక మూల దానిని ప్రకటించారు కాని శీర్షిక ఇది! "అణు విద్యుత్ కేంద్రం ముట్టడి జరగలేదు"! నేను రాసిన ఉత్తరం నుండే వారు అసంబద్ధంగా శీర్షిక ఎన్నుకుని జర్నలిస్టు తెలివి ప్రదర్శించారు. ప్రెస్ కౌన్సిల్ ఆదేశాల ప్రకారం ఇది ప్రముఖంగా అచ్చు కాలేదు. "మొత్తానికి సాధించారు" అని కొంత మంది మిత్రులు అభినందించారు. మరి కొంత మంది మిత్రులు ఈ ప్రకటనతో సంతృప్తి చెందలేదని మళ్ళీ కౌన్సిల్‌కు రాయమని సలహా ఇచ్చారు. కాని ఏ సందర్భం లేకున్నా ఒకే వార్త పరమ అసంబద్ధంగా మళ్ళీ మళ్ళీ రావడం నాకే విసుగు తెప్పించింది. నేను, ఈనాడు, ప్రెస్‌కౌన్సిల్ కాక మా మధ్య పాఠకులున్నారు. వాళ్ళను కన్‌ఫ్యూజ్ చేయడం సమంజసమా అని అనుమానమొచ్చింది. ఆ చీకాకులోకి మళ్ళీ పోలేదు.

సముద్రంతో సంభాషణలో "కోర్టులు, జైళ్ళు, ఆసుపత్రులు జీవితాల్ని కొంచెం కొంచెంగా హరించివేస్తాయ"ని రాసిన వాక్యం చదివి డా. సత్యలక్ష్మి గారు "రేడియేషన్ లాగా" అని దానికి జోడించారు. రేడియేషన్ మెల్ల మెల్లగా జీవకణాల్ని నాశనం చేస్తుంది. వ్యవస్థ రేడియేషన్ (అణుధార్మికత) వెదజల్లే అభివృద్ధి విధానాల్నే కాదు, దాని కోసం ఒక భావజాలాన్ని అభివృద్ధి చేస్తుంది. ఆ భావజాలానికి వాహిక అవుతూ మీడియా దానిని పరివ్యాప్తి చేస్తున్నది.

కథ

చైతన్యం

- మహమూద్

బాగా పేరున్న పత్రిక లో సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్న నాకు నా విలేఖరి జీవితం గొప్ప అనుభవాలనేం మిగల్చలేదు. మొనాటనీకి కేరాఫ్ అడ్రస్ గా మారిపోయిన రంగమిది.

సృజనాత్మకత అన్న పదానికి అర్థం మారుతున్న కాలం కదా! కావలసినంత గ్రామా ఉన్న ఈ రంగానికి సేవ చేసేందుకు ఆవేశ కావేశాలతో, ఉద్వేగ-చైతన్యాలతో తెగతెంపులు జరిగిపోయి రాజకీయ నాయకుల బాకా ఊదే బాదుగ పత్రికలైపోయాయి. అందరూ నాతో ఏకీభవించక పోవచ్చు కానీ నా అనుభవం తెలుసుకున్న సత్యం ఇది.

ఎంత సేపు రాజకీయ నాయకుల ప్రెస్ కాన్ఫరెన్సు లకు పోవడం - అధికార, ప్రతిపక్ష పార్టీల కుమ్ములాటల ప్రశ్న-సమాధానాలను రాసి రాసి, చూసి చూసి ఈ రంగం మహాబోరు కొట్టేసింది.ఒక్క రాజకీయ నాయకుడికి నాయకుడు అనిపించుకునే అర్హత లేకపోగా గూండాలకూ, క్రిమినల్స్‌కూ అధికారం అందుతున్న నేటి సామాజిక పరిస్థితుల్లో నా లాంటి జర్నలిస్టులకి జీవితాలను ఫణంగా పెట్టేంత పనేం మిగల్లేదు.

ఏ మాత్రం రిస్కునీ, మార్పుని అంగీకరించని మా ఎడిటర్ కూడా ఈ మధ్య "అబ్బే! ఏం బాగాలేదయ్యా వ్యవహారం ఎప్పుడూ వీళ్ళ గొడవలేనా? వార్తలని ప్రజలకు చేరవేయడం కోసం కాకుండా పత్రికలను రాజకీయ నాయకుల కోసం పెట్టుకున్నట్టుగా ఉంది. ఈ కీచులాటల్ని ఎన్ని రోజులు ప్రచురిస్తాం. ఏవన్నా కొత్త విషయాలుంటే చూడవయ్యా భద్రం" తన బట్టతల గోక్కుంటూ అన్నాడు.

నిజమే కానీ ప్రత్యామ్నాయాలేం ఉన్నాయని, ఇంట్రెస్టింగ్ టాపిక్స్‌ని ఆకాశంలో వెతకలేం కదా!

సాధారణ జనం కూడా రాజకీయ నాయకుల సణుగుడుకి అలవాటు పడిపోయారు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అందరూ ఈ రాజకీయాల వెనకాలే నడుస్తున్నారు.

పత్రికలేం తక్కువ తిన్నాయనీ.

"అవకాశాల్లేక ఇక్కడ పనిచేస్తున్నాం....అంతే!" అన్న మాటలు చెవులకు తాకని రోజు లేదు.సమాజంలోని స్క్రాప్ అంతా ఇక్కడ పేరుకుపోతుంటే చూసి మామీద మాకే జాలివేస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం, కాంట్రాక్టర్ల కోసం వస్తున్నట్టూ ఇక్కడిక్కూడా రికమెండేషన్ లెటర్స్ రావడం మొదలై చాలా కాలమైంది.

రికమెండేషన్ల మీద పనిచేసే వాళ్ళ మానసిక స్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడం పెద్ద పనేం కాదు. "సార్ ఈ వార్తని ఎలా రాయాలో చెప్పరూ" అని చాలా మంది నా దగ్గరికి వస్తుంటారు. ఎమర్జెన్సీని తెలుగులో "అత్యయిక పరిస్థితి" అంటారని నేనంటే, "సార్ అత్యవసర పరిస్థితి అంటారేమో?" అని నా జ్ఞానాన్ని పరీక్షకు పెట్టిన సబ్-ఎడిటర్ జ్ఞానాన్ని చూసి నవ్వుకోవాలో, జాలిపడాలో అర్థం కాలేదు.

ఇటీవలి కాలంలో అయితే మరీనూ- రాజకీయ నాయకులతో, ముఖ్యమంత్రులతో లాబీయింగ్ చేసి చేసి పత్రికా యాజమాన్యాల మధ్య ఫ్యాక్షనిజం చూసే రోజొస్తుందని కలలో కూడా ఊహించలేదు.

సృజనాత్మకత చచ్చిపోయిన చచ్చు కాగితంలా తయారైంది వార్తా పత్రిక!

ఒకప్పుడు శ్రీశ్రీల్ని, చలాల్నీ, గిడుగుల్నీ తీసుకొచ్చిన పత్రికలకి ఈనాడు జగన్లూ, నాయుళ్ళే సర్వస్వం అయిపోయారు. ఆనక వాళ్ళే సొంత పత్రికల్ని ప్రారంభించేసి పత్రికల సాధికారతని తుంగలో తొక్కేస్తున్నారు. ఒక నిజవార్తలనేవేవీ మిగల్లేదు.సొంత డబ్బాలు తప్ప! రాజకీయాలతో సంబంధం లేకుండా మిగిలున్న మాలాంటి అర, కొర పత్రికలకక్కూడా శాస్త్రీయత ఏం మిగిలి చచ్చిందనీ? రాజకీయాలూ లేదా బాబాల గోల, సినిమాలు- సినీ హీరోల గోల, అన్నింటికంటే ఇష్టమైన విషయంగా యుగాంతం లేదా గ్రహాంతర వాసుల గోల, సర్వమత భక్తి పారవశ్యాలకూ కొదవలేదు. కొరవడందల్లా- శాస్త్రీయ జ్ఞానం.

"డిస్కవరీ ఛానల్లో స్టీఫెన్ హాకింగ్ క్యూరియాసిటిని చూసి ఇన్స్పైర్ అయి తెలుగులోకి అనువదించుకొని ఓ కుర్రాడొస్తే, "దేవుడి అస్తిత్వాన్ని నిరాకరించే ఈ లాంటివాటిని ప్రకటించి భక్తుల మనోభావాలు దెబ్బతీయలేం! తిరుమల బ్రహ్మోత్సవాల్నో, తీర్థయాత్రల్నో కవర్ చేయవయ్యా పైకొస్తావ్" అన్నాడు మా ఎడిటర్.

కాంట్రవర్సీని కన్నార్పకుండా చేసే మనకు వాస్తవాల్ని అంగీకరించే దమ్ము లేకుండా పోయింది.ఆ మధ్య ఓ వేశ్య పట్టుబడింది. తీగలాగితేసనీ జగత్తంతా కదిలే సూచనలున్నా బలిపశువుగా ఓ బలహీనురాల్ని మిగిల్చిన మన పత్రికల నైతికతను ఏ త్రాసులో వేసి తూచాలో అర్థం కాక ఇంకా అందులోనే మగ్గుతూ మసిపూసుకు తిరుగుతున్న నాలాంటి వారికి ఊపిరిపోస్తున్న ఈ రంగాన్ని ప్రపంచం ఆశించిందేమీ మిగల్లేదు.ప్రైవేటు ధనానికి పత్రిక రంగం కూడా ఓ సెక్యూర్డ్ ప్రాఫిట్స్‌ని అందిస్తోంది. పత్రికలకు ఇక ఆదర్శాల కంటే, కంటెంట్ కంటే - కవరేజి, రీడర్షిప్, పర్సెంటేజి తప్ప ఇంకో విలువ మిగల్లేదు అని నేనే చెబితే అసహ్యంగా ఉంటుంది. చేసేదేమీ లేదు.

ఆ ఆలోచన మా ఎడిటర్ కు ఎందుకొచ్చిందో నాకు తెలియదు కానీ మొదట ఆశ్చర్యమేసింది. తర్వాత ముచ్చటేసింది. ఆ తర్వాత ఉత్సాహమేసింది.

"దిస్ ఈస్ ఎ లైఫ్ టైమ్ ఆపర్చ్యునిటీ! డౌటేమన్నా ఉందా? యూ ఆర్ ది కరెక్ట్ పర్సన్ ఫర్ దిస్ జాబ్. కంప్లీట్ ఇట్ అట్ బెటర్ టైం అండ్ విత్ బెస్ట్ రిజల్ట్స్" అన్నాడు.

"ష్యూర్ సర్!" ఎండపొడకు కందిపోయిన కరవు నేల మీద తొలకరి కురిసినట్టైంది.

నేననుకున్న పని కాస్త ఆలస్యంగానైనా విజయవంతంగా

ముగించుకొచ్చాను.

వాళ్ళు చెప్పింది నాకు నచ్చకపోవచ్చు. వాళ్ళ దృక్పథంతో నాకు పేచీ ఉండొచ్చు. కానీ నేను విన్నదానికి చూసిందానికి భూమికి ఆకాశానికున్నంత తేడా ఉంది. ఆ తేడాని నాకున్న దృక్పథానికి చెడకుండా వాస్తవాన్ని ఉన్నదున్నట్టు రాశాను. కొంత నా ఎమోషనల్ ఎలిమెంటు ఉంది.

చాలా హాయిగా ఉంది.

జాబ్ సాటిస్ఫక్షన్! చాలా రోజుల తర్వాత.

ఈ రోజు కోసం చాలా రోజుల్నించి ఎదురు చూస్తున్నాను. గుమ్మం ముందు పేపర్ ఎత్తుకొని గబగబా పేజీలు తిప్పి ఆ శీర్షిక చూసుకున్నాను. చూసి షాకయ్యాను. ఇన్ని రోజుల నా శ్రమ వృథా అయినందుకు కాదు నా బాధ, నేను వాళ్ళ దృష్టిలో ఎంత దిగజారిపోయాను. నా అస్తిత్వం మీద ఎవరో గాండ్రించి ఉమ్మినంత అసహ్యకరమైన భావం నన్ను చుట్టుముట్టింది.

నేను రాసిన ఆ ఐటమ్ కు పెట్టి ఇచ్చిన టైటిల్ కి భిన్నమైన టైటిల్ నిర్ణయించడమే కాక నా కంటెంట్ అంతా అట్లా టాంపర్ చేయబడుతుందని నేను కలలో కూడా ఊహించలేదు.

రాజకీయ నాయకులతో ఇంటర్వ్యూలు పిచ్చిపాటీలు, అంతర్జాతీయ రాయబారులతో ఇంటర్వ్యూలు చాలా చేశాను. వాస్తవానికి నాకు నా పత్రికలో చాలా గౌరవం ఉంది. అందరూ నన్నో మంచి ప్రొఫెషనల్ గా చూస్తారు. పత్రికా రంగంలో ఇగోలు, క్లాషస్ సాధారణమే అయినా నాకు అవన్నీ అడ్డు కాలేదు. బహుశా టైమ్లీగా ఉండే నా పని తీరే కారణం కావొచ్చు.

ఇటీవలి కాలంలో జర్నలిజం మంచి ప్రొఫెషన్‌గా పరిగణించకపోవడానికి చాలా కారణాలే వున్నా అవి నా జోలికి రాలేదు. మొట్టమొదటిసారి నా పనికి అవమానం జరిగిన సంఘటన ఇది.

ఇప్పుడు నేనెక్కడ నిలబడి ఉన్నాను. ఇన్ని ఏళ్ళుగా నాకు సంతృప్తి మిగిల్చిన పనిలోకి అవాంఛనీయత జొరబడి కలుషితం అవుతున్న విధానం తెలుసు గానీ, అది నా వరకూ రానందుకు సంతోషంగా గడిపిన నా బటహీనతో, లేక నిబద్ధతకు, తనదాకా వస్తేగానీ తెలియదు అనే నానుడి ఇప్పుడు నగ్నంగా కనబడుతుంది. ఇన్ని కాంప్రమైజ్ అవుతూ వస్తున్నావు. ఇప్పుడు అనుభవించు. అని నా చొక్కా పట్టుకొని నిలదీస్తున్నది. నేను సమాధానం వెతికే పనిలో ఉన్నాను. తీవ్రమైన నిరాశ నన్ను ఆవహిస్తూ ఉంది. ఇంతా జరిగాక కొనసాగగలనా? ఇంకే పని చేత కాని నాకు బతుకుతెరువు ఎట్లా?

నేను నా రాజీనామా పత్రాన్ని ఎడిటర్ టేబుల్ మీద పెడుతూ "నా రిజగ్నేషన్" అన్నాను,

"ఎందుకయ్యా అంత కఠినమైన నిర్ణయం తీసుకున్నావ్? నో! ఐ విల్ నాట్ యాక్సెప్ట్! నీ లాంటి డెడికేటెడ్ జర్నలిస్టుని మేం వదులుకోలేం"

"నేను నిజాయితీతో, నిబద్ధతతో చేసిన పనికి రికగ్నిషన్ లేనపుడు నేను పని చేసి ఏం లాభం సార్"

"అలాంటిదేమీ లేదు భద్రం"

"నా శీర్షిక "ఆదివాసీలకు అన్నల చైతన్యం" అని పెట్టాను. మీరు దాన్ని పోలీసుల, మావోయిస్టుల మధ్య నలుగుతున్న ఆదివాసీలు అని పెట్టారు. అంతకంటే పచ్చి అబద్ధం ఇంకోటి ఉండదు సార్. వాస్తవానికి నా కెరీర్ లోనే ఇంత ఇంప్రెసివ్ వర్క్ జరగలేదు. ఐ వాస్ సో సాటిస్ఫైడ్ విత్ మై వర్క్"

"నీకు తెలియందేముంది భద్రం. వీ కాంట్ గో యగైనెస్ట్ స్టేట్"

"థాంక్ యూ సర్! పత్రికలు కూడా రాజ్యంలో భాగమని చెప్పినందుకు. మీకో విషయం చెప్పనా సార్! మేధావులమనో, చదువుకున్నవాళ్ళ మనో మనకుండే కాంప్లెక్స్ ఆదివాసీల పోరాట చైతన్యం ముందు ఓడిపోయింది సార్! వాళ్ళ పోరాటాన్ని ఎప్రీషియేట్ చేస్తున్నవాడిగా ఐ కెనాట్ కంటిన్యూ విత్ దిస్ జాబ్. దే ఆర్ ఫార్ బెటర్ పీపుల్ దాన్ అస్. మన నమ్మిందాన్ని ఆచరించడం లేదు సార్ కానీ ఏ ఆధునికత తెలియని అమాయకులు వాళ్ళు తమ అస్తిత్వాన్ని నిటబెట్టుకోవడం కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు అన్న నిజాన్ని అంగీకరించలేని మన మనస్తత్వాన్ని ఏమనాలి సార్! ఇక ఇంతకంటే దిగజారడానికి ఏమీ మిగల్లేద్సార్. సో ఐ హావ్ డిసైడెడ్ టు లీవ్"

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

1970లలో తొలినాళ్ళలో వచ్చిన ప్రత్యేక సంచికలతో మొదలుకొని - 2013లో సాహిత్య విమర్శ ప్రత్యేక సంచికగా వచ్చిన 301వ సంచిక వరకు

డివిడి

అమ్మకానికి సిద్ధంగా ఉంది!

ప్రతులకు :

నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్. ఫోన్ : 040-24652387

దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్. ఫోన్ : 040-27640574

వెల : రు. 125/-

కథ

జ్ఞానం కనిపించటంలేదు

- వివిన మూర్తి

రాత్రి పదకొండు.

విశాఖపట్టణం సముద్రపు ఒడ్డునే ఉన్న అపార్టుమెంట్లలో, ఓధాని పై అంతస్తులో, ప్లాస్టిక్ పడకకుర్చీలో కూర్చుని చిన్ని బల్ల మీద కాళ్లు పెట్టుకుని ఉన్నాడు భారతచౌదరి. అతని గుండెల మీద రస్సెల్ పుస్తకం ఎనాలిసిస్ ఆఫ్ మైండ్ ఉంది. తలలో రస్సెల్ తిరుగుతున్నాడు. మనిషి చేతలల్లో అతనికే తెలియని కొన్ని ప్రేరణలు, ఉద్దేశ్యాలూ ఉంటాయి. ఓ వ్యక్తి మంచిచెడ్డలను బేరీజు వేసేటపుడు వాటిని పరిగణనలోకి తీసుకోకపోటం జరుగుతుంది. ఈ రెండూ రెండు పరిశీలనలు. వాటిని పరిగణనలోకి తీసుకోవాలనో వద్దనో రస్సెల్ అంటే అది నైతిక చర్చ. కాన్షస్‌నెస్.. అంటే.. చైతన్యం సరైనపదమా..చేతనా.. అన్నది ఓ ఆలోచన. భారతదేశపు కులం భారతచౌదరి తలలోకి జొరబడుతోంది. చదువుతున్నదానితో సంబంధం పెట్టటానికి ప్రయత్నం.

"మూర్తీ.. ఫోను మోగుతోంది.". స్వరాజ్యం అరుపు చెవినపడ్డాకనే ఫోను మోత చెవినపడింది.

"హాయిగా తిని తొంగున్నావా?"

మత్తు వదిలిపోయింది. ఆలోచనలు దిగిపోయాయి.

"మీరెవరు?"

"నేనెవరయితే నీకెందుకురా.. జ్ఞానానికి ఫోనియ్యి.."

"జ్ఞానమా!! ఏం మాటలాడుతున్నారు.. రాంగ్ నంబర్"

"నువ్వు భారతచౌదరివి. ఇప్పుడైనా నా జ్ఞానానికి ఫోనియ్యి.. వాళ్ల నాన్న ఏడుస్తున్నాడని చెప్పు,,"

"జ్యోతా!?"

"ఆc! జ్ఞానజ్యోతి.. అల్లారుముద్దుగా నేను పెంచుకున్న నా బంగారుతల్లి.. ఈ బాపనోళ్లు తరతరాలుగా మనలని అణగదొక్కారు.. అవమానించారు.. దరిద్రంలో అజ్ఞానంలో మనల్ని ముంచేసారు.. వద్దమ్మా.. వాళ్లని దగ్గరకి రానివ్వకు.. నువ్వు వెళ్లకు.. అని చెవిలో ఇల్లు కట్టుకుని చెప్పాను.. వినలేదు.. మీతరం ఆలోచనలు వేరు.. మావి వేరు.. వాళ్లు మనలని మనుషులుగా చూడకపోటం వల్ల వాళ్లే మనుషులు కాకుండా పోయారు. మనమూ అపనే చెయ్యాలా.. ఎవరైనా మనుష్యులు కావాలంటే ఇతరులను మనుష్యులుగానే చూడాలి... అంది. మీవాడి మాయలో పడింది. వాడు దాన్ని లొంగదీసుకున్నాడు. "వద్దమ్మా తల్లీ.. వినమ్మా.. వాళ్లు దుర్మార్గులు.. వాళ్ల రక్తమే అట్టాంటిది. సొంత బిడ్డలను అమ్ముకున్నారు. ఎక్కువ ముదుతుందంటే, ముసిలాళ్లకైనాసరే, దయా కరుణా లేకుండా తమ ఆడబిడ్డలను అమ్ముకుని పెళ్లిళ్లు చేసారు. ఆ ముసిలాళ్లు చస్తే వాళ్ల శవంమీదేసి కాల్చేసేరు. అలాంటాళ్లు ఇప్పుడు మారిపోయామని అంటున్నారు. వాళ్లది ఉత్తి డ్రామా. రుచిమరిగిన పులి, రక్తం తాగకుండా ఉంటుందా!? ఆధిపత్యం మరిగిన కులాలు దానిని వదులుకుంటాయా!? ఇంకోలా.. ఇంకోలా దాన్ని నిలబెట్టుకోటానికే మనలని దువ్వుతాయి. వద్దమ్మా జ్ఞానం.. నా మాట వినమ్మా".. అంటూ వొంద రకాలుగా చెప్పాను. "నువ్వు వాడినే పెళ్లాడితే నీకూ నాకూ సంబంధం ఉండదు." అని బెదిరించాను. మాప్రేమ కూడా మరిచిపోయేలా చేసేసాడు నీ కొడుకు. "పోన్లే అని నేను మీతో సంబంధం పెట్టుకుంటే, మీ పెళ్లి ఒప్పుకుంటే వాళ్లు ఎలా అర్థం చెప్పుకుంటారో తెలుసా.. మాలపిల్లని వాళ్లింటిలో పెట్టి .. వాళ్ల కులం .. వాళ్ల గొప్పా .. మైలచేసేసామంటారు. అందుకు మేం పొంగిపోతున్నామంటారు.. నీ మంచీ చెడ్డా చూడ్డానికి కుదరదు. నీకేమైనా అయితే మేం బతకలేం తల్లీ" అంటూ గెడ్డంపుచ్చుకుని బతిమాలాను. విందా!? లేదు .. విన్లేదు.. "నీ కొడుక్కి జ్ఞానమంటే ఆరాధన అంది. వాడి పేరే ఆచరణ్ అంది. వాడు మనిషంది. మేం మనుషులుగా బతుకుతామంది.... మనుష్యుల ప్రపంచం సృష్టిస్తామంది.. మీ గతంతో మా భవిష్యత్తుకీ, ఈ ప్రపంచ భవిష్యత్తుకీ సంకెళ్లు వేయకండీ.." అంది..

అవతలనుంచి అణుచుకుంటున్న దుఃఖంలో మాటలు చేతన అచేతనల మధ్య ఊగిసలాడుతున్నాయి.

ఆ మాటల ప్రవాహానికి అడ్డుబడుతూ.. సర్..సర్ అంటున్నాడు భారతచౌదరి.

"మీరు సర్.. సర్.. అంటూ మునగచెట్టు ఎక్కించనవసరం లేదు. మీరు దాచేసిన నా జ్ఞానాన్ని నాకు ఇవ్వండి. ఒక్కమారు దానిగొంతు వినిపించండి"

"నామాట నమ్మండి. తను ఇక్కడెందుకుంటుంది?"

"చంపేసావా!??"

"షటప్!!" టక్కున ఫోను పెట్టేసాడు.

"ఈ నాయాళ్లని సర్ సర్ అంటూ.. భయం.. ఇంతదాకా వీళ్లని రానివ్వటమే తప్పు.." భగ్గుమంది కోపం.

కోపంతో శరీరమంతా వణుకు.

"ఛ.. ఏంటి నేనే.. నాకే.. ఇలాంటి ఆలోచనా?"

తనమీద తనకే జుగుప్స.. గుండె దడ.

"ఆలోచనలని ఎవరు కంట్రోల్ చెయ్యగలరు.. ఆచరణని అదుపు చెయ్యగలం గాని.. అదైనా సాధ్యమేనా.." మళ్లింపు ఆలోచనలు. కాళ్లు చల్లబడినట్టు ఫీలింగ్. ఓపిక కూడగట్టుకుని ఫ్రిజ్ లోంచి సీసా తీసుకుని చల్లటి నీరు గొంతులో ఒంపుకున్నాడు. శరీరం కాస్త స్వాధీనంలోకి వస్తోంది. మెదడు కాస్త పని చేస్తోంది. కోపం, ప్రశ్చాత్తాపం కరిగి వాస్తవంలోకి ఉరికింది.

"ఏంటయింది.. వాడూ ఆ పిల్లా దెబ్బలాడుకున్నారా? ఆచరణ్ కి ఫోను చెయ్యాలి"

మళ్లీ ఫోను మోత.. లోపలినుంచి స్వరాజ్యం అరుపు.. "ఏంటి..

నిద్దరోతున్నావా.. ఫోనలా అరుస్తోంది"

"నేను మెలకువగా ఉన్నానోయ్.. చూసుకుంటా.. నువ్వు పడుకో.."

అందుకొనేలోగా .. ఫోను ఆగిపోయింది.

మళ్లీ మోగగానే అందుకుని.. "హలో"

"ఈసారి ఫోను పెట్టేసావంటే నేనేం చేస్తానో నువ్వు ఊహించలేవు. మేం మునుపటిలా మీరున్న వీథుల్లో నడవటానికే భయపడే రోజుల్లో లేం. ఎక్కడున్నా ఒక్కటిగా ఉన్నాం. హైదరాబాదు నించి ఒక్క కాల్...ఏంటీ..., ఒక్క కాల్ చాలు నువ్వున్న విశాఖపట్టణంలో మావాళ్లు వచ్చి.. నీ తోక కోస్తారు. చట్టాలన్నీ మా వైపున్నాయి. పోలీసు కంప్లైంటు చేస్తాను.."

"ఏమని?"

"నా కూతురుని నీ కొడుకూ, నువ్వూ, నీ పెళ్లాం కలిసి చంపేసారని"

"మాకు వాళ్లతో సంబంధం లేదు. నేను వాళ్లని కలిస్తే చస్తానంటోంది నా భార్య."

"ఎందుకనదూ..? ఆవిడ పేరు చెప్పుకుని నువ్వూ ఆడతావు డ్రామాలు.. నేనేం ఫూల్నా..?"

"మేమూ వాళ్లూ కలిసుండటం లేదు.."

"అయినా మీ భార్యాభర్తలూ, నీకొడుకూ ఓ కుటుంబమే.."

"అవం.."

"నువ్వు కాదంటే చట్టం ఒప్పుకుంటుందా.. ఎస్సీఎస్టీ అత్యాచారాల చట్టం ఉంది.. గృహహింస చట్టం ఉంది"

"చట్టాలకి రుజువులు కావాలి"

"కోర్టులకి కావాలి.. బొక్కలో వేసి కుళ్లబొడవటానికి పోలీసులకి అక్కరలేదు.. తన్ని మీచేత ఒప్పించి అదే రుజువుగా కోర్టులో నిలబెడతారు.."

"చూడండి.. మీపేరు.. ?"

"కందుల విక్టర్రాజు.. నాపేరు కూడా నీకు తెలియదు. నీ గురించి మొత్తం నాకు తెలుసు.. మా పిల్లలకు మార్కులు వెయ్యకుండా .. అవకాశాలు లేకుండా చెయ్యాలని చూసే అగ్రవర్ణ ప్రొఫెసర్లలో నువ్వొకడివి. ప్రొఫెసర్ భారతచౌదరీ.. చెప్పు.. నా జ్ఞానం ఏమయింది? నా కూతురు.. నా బంగారు తల్లి.." ఆవేశం.. దుఃఖం.. జమిలిగా అతని మాటలని మింగేస్తున్నాయి.

"చూడండి రాజుగారూ.."

"నేను రాజుని కాదు. విక్టర్రాజు.. విక్టర్రాజుని.."

"సరే సరే .. విక్టర్రాజు గారూ.. మీరు ఆవేశంలో ఉన్నారు. బాధలో ఉన్నారు. అసలేం జరిగిందో నాకు తెలియదు. హైదరాబాదులోనే నా కొడుకూ, మీ కూతురూ ఉన్నారు.. మీరు ఫోను చేసే వరకూ .."

"నేను నమ్మను.."

"నమ్మొద్దు.. నమ్మొద్దు.. దయచేసి ఏ జరిగిందో చెప్పండి.."

"ఖచ్చితంగా నీకు తెలుసు.. పైకి ఎన్ని సంస్కరణ కబుర్లు చెప్పినా .. నీవి నాటకాలు.. దొంగేషాలు.."

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు.. ?"

"ఎందుకంటే...... ఎందుకూ .. అంటే.. జ్ఞానం చెప్పింది.. తనే చెప్పింది.."

"ఏం చెప్పింది?"

"ఆమెకు నువ్వంటే గురి. నమ్మకం. ట్రస్టు. మాటలాట్టం వచ్చుగదా.. నీ కబుర్లకి పడిపోయిందది."

"పడిపోయిందనే అనుకుందాం.. ఏం చెప్పింది?"

"తన భర్తతో గొడవ వస్తే మీ వద్దకే వస్తానంది"

"నా దగ్గరకా!?"

"అవును.. మామయ్య గారు ఆచరణ్ ని కన్నారు. నాకోసం ఇంత అద్భుతమైన మనిషిగా తీర్చిదిద్దారు. నాకు జన్మను ఇచ్చారు కనక మీరు ప్రేమించగలరు. నాకోసం ప్రాణం ఇవ్వగలరు.. అవసరమైతే తియ్యగలరు.. కాని భారతచౌదరి గారు..ఎందరో నాలాంటి విద్యార్థులని తయారుచేసారు.. జ్ఞానం అంటే ఏమిటో ఎలా ఉండాలో నేర్పారు.. నాకు ఏ సమస్య ఉన్నా ఆచరణ్ ఉన్నాడు. ఆచరణ్ వల్లనే సమస్య వస్తే.. ప్రేమ కోసం మీ దగ్గరకు వస్తాను. ఆలోచన కోసం ఆయన దగ్గరకు వెళ్తాను. .. అని ఒకసారి కాదు.. వందసార్లు చెప్పింది.."

"ఆచరణ్ తో గొడవ పడిందా?"

"అందులో డౌటు లేదు.. నాదగ్గరకు రాలేదంటే.. మీ దగ్గరకే వచ్చింది.. చెప్పు.. ఏం చేసావు నా జ్ఞానాన్ని?"

"..........."

"హలో.. హలో.."

"..........."

"నాకు తెలుసు- నువ్వు వింటున్నావు.. ఎలా తప్పించుకోవాలా .. ఏం చెప్పాలా .. అని ఆలోచిస్తున్నావు"

"అవును. వింటున్నాను. ఆలోచిస్తున్నాను. తప్పించుకోటానికి కాదు. అసలేం జరిగిందీ అని. నన్ను నమ్మండి. వాడికి ఫోను చేసి కనుక్కుందామన్నా మీరు వదలటం లేదు. ప్లీజ్.. అసలేం జరిగిందీ దయచేసి దయచేసి చెప్పండి."

"..........."

"విక్టర్రాజు గారూ.. హలో.. హలో.."

"నిజంగా మీ దగ్గర జ్ఞానం లేదంటావు!?"

"నాకు నమ్మకాలు లేవు. ఒట్లు వేద్దామన్నా వెయ్యలేను."

"నాకున్నాయి. ఒట్టేసి చెపుతున్నాను. మా నాన్నది అమలాపురం. మా వాళ్లకూ అగ్రవర్ణాలకూ గొడవలు మీకు గుర్తుండే ఉంటాయి. కోర్టులో మా నాన్నా.. వాళ్లూ ఏం చెప్పారో తెలుసా.. మేం చస్తే మా పెళ్లాలు ఎప్పట్లాగే పొలాల్లోనే పనిచేసుకు బతుకుతారు.. మీరు చస్తే మీ పెళ్లాలకు లాడ్జిలే గతి. అదీ మానాన్న కారెక్టర్. మీరు అబద్ధం ఆడేరని.. మాట్లాడిందంతా అబద్ధమని.. డ్రామాలని తెలిసిందో.. మిమ్మల్ని చంపేసి నేను జైలుకు పోతాను. నా బంగారుతల్లి మీద.."

"సరే.. సరే.. అలాగే చంపేద్దురు గాని.. జరిగిందేమిటో ఇప్పటికైనా చెప్పండి.."

కొంతసేపు నిశ్శబ్దం.

భారతచౌదరి.. మరోమారు నీళ్లతో గొంతు తడుపుకున్నాడు.

"కాస్త స్థిమితపడ్డారు గదా.. జరిగింది చెప్పండి."

"ఆచరణ్ ఫోను చేసి జ్ఞానం కనిపించటంలేద"ని చెప్పాడు...

* * *

"నేను సార్.. ఆచరణ్.. మీ అమ్మాయి జ్ఞానం సహచరుడిని.."

"ఆశీర్వాదం వాళ్ల అబ్బాయి దగ్గరకు వెళ్లింది."

"అత్తయ్యగారి సంగతి అడగటం లేదు. జ్ఞానం మీఇంటికి వచ్చిందా?"

"మా ఇంటికెందుకు వస్తుంది.. నువ్వు స్వంతం చేసేసుకున్నాక?"

"ప్రతిరోజూ ఆరయ్యేసరికి కాలేజి నుంచి ఇంటికి వచ్చేస్తుంది. పనేమైనా ఉంటే ఫోను చేస్తుంది. అదీ ఇంటి దగ్గర వదిలేసింది. మీ ఇంటికి గాని వచ్చిందా?"

"నేను జ్ఞానం మొహం చూసి.."

"మీరు నావద్ద దాచనవసరం లేదు. మీకు ఫోను చేసినపుడల్లా మేం అన్నీ మాటలాడుకుంటాంసార్.. మామధ్య దాపరికాలు లేవు. మాటలాడేది అత్తయ్య గారే అయినా స్పీకర్ పెట్టటం.. మీరు వినటం .. అంతా మాకు తెలుసు సార్.. జ్ఞానం మీ కాంటాక్ట్ లో ఉందని నాకు పక్కాగా తెలుసు"

"తండ్రీ కూతుళ్లం తప్పా.."

"తప్పు కాదు. మీ గతం మీ వర్తమానం మనందరి భవిష్యత్తు.. జ్ఞానం అన్నీ చెపుతూనే ఉంటుంది. మీ ప్రస్తుత ప్రవర్తన చాలాసార్లు అనలైజ్ చేసాం. చెప్పండి.. మీ ఇంటికి రాలేదా?"

"మాయింటికా.. రాలేదు.. మీ ఇద్దరూ దెబ్బలాడుకున్నారా.."

ఫోను పెట్టేసాడు.

ఏమయింది జ్ఞానానికి? ఆచరణ్ గాడికి మోజు తీరిపోయిందా? కాడి దించేసాడా? ఇంక మిగిలింది నాటకమేనా? ఆచరణ్ జ్ఞానాన్ని వదిలేసాడా.. కొంపదీసి చంపేసాడా? ఆ స్వరాజ్యం పెద్ద సైతాను. అది ఎవరినీ కలిసి బతకనియ్యదు. మొగుడూ పెళ్లాలని కలిసి ఉండనిస్తుందా? నేనూ తప్పు చేసానేమో.. అది రానివ్వనపుడు నేనెందుకు వాళ్లని రానివ్వాలనుకున్నాను. పౌరుషం లేని జాతి.. మమ్మలిని ముంచేసి వాడిని వశపరుచుకుని.. అంటారని.. ఎంతపని చేసాను..! అందరూ కలిసి మా జ్ఞానాన్ని చంపేసారా. ?

ఫోను.. ఎంగేజ్.. ఫోను.. ఎంగేజ్.. ఎంగేజ్.. ఎంగేజ్.. ఔటాఫ్ రీచ్.. బిజీ..

ఏదో జరిగింది.. ఇక్కడకు రాలేదంటే?.. ఆ ప్రొఫెసర్.. ఆ పెద్దమనిషి దగ్గరకే.. పెద్దమనిషి.. పెద్దపెద్ద కబుర్లు చెపుతాడు గదా.. పిచ్చి పిచ్చిగా నమ్మింది. నిజంగా వాడివి డ్రామాలు కాకపోతే పెళ్లాన్ని తన్ని నోరుమూసి, జ్ఞానాన్నీ, అచరణ్ నీ ఇంట్లో పెట్టుకోడా.. కపటం.. దగా.. హిపోక్రసీ.. మోసం.. భారతచౌదరి.. భారతచౌదరి.. ఎంత పనిచేసావు..!

* * *

"విక్టర్రాజు గారూ! మీ కష్టం నాకు అర్థమవుతుంది. తమాయించుకోండి. ఆవేశపడి.. పాతవిషయాలను తలుచుకుని.. ప్రయోజనం లేని సందర్భం ఇది. జ్ఞానం మీకు ఎంత ముఖ్యమో నాకూ, స్వరాజ్యానికీ అంతే ముఖ్యం. ఏం చెయ్యాలో ఆలోచిద్దాం."

"దెబ్బ తిన్నది నేను. కొట్టింది మీరు. మీరు నిదానం నిదానం అనగలరు. అంటున్నారంటే.. నా జ్ఞానాన్ని.. నా తల్లిని.. ఏదో మీరే చేసి ఉంటారు.. అమ్మా.. ఏమయిందమ్మా నీకూ.. ఉన్నావా.. వాళ్లు చంపేసారా బంగారం.."

"ప్లీజ్.. కూల్ గా ఉండండి... జ్ఞానం లేకపోతే ఆచరణ్ ఉంటాడా .. మమ్మల్ని నమ్మొద్దు.. భవిష్యత్తు వాళ్లది.. తను మీ కూతురే కాదు. నా కొడుకు జీవిత సర్వస్వం.."

"నో.. నో.. నేను నమ్మను గాక నమ్మను"

"సరే సర్ నమ్మకండి.. ఈ ముసిలాడిని నమ్మొద్దు. మా స్వరాజ్యాన్ని నమ్మొద్దు. మా కుర్రాడిని నమ్మొద్దు. విషయం నిర్ధారణ అయివరకూ కాస్త సహకరించండి. నేను చెప్పినట్టు చెయ్యండి.. ప్లీజ్ విక్టర్రాజు గారూ.. లేదంటే మీరు ప్లాన్ చెయ్యండి. నేను ఫాలో అవుతాను. చెప్పండి ఏం చెయ్యాలో"

"చెప్పండి.." కొంత ఆగి, అన్నాడు.

"మనమిద్దరం వాళ్లకి ఫోన్ చేస్తూ ఉందాం.. మనమిద్దరం కాంటాక్ట్ లో ఉందాం. ఎవరికి ఏ సమాచారం దొరికినా చెప్పుకుందాం.. మీరు టాక్సీ చేయించుకునో.. ఎవరిదైనా స్నేహితుడి కారు దొరుకుతుందేమో చూడండి. ఆసరాగా ఉంటుంది...వాళ్ల ఇంటికి బయల్దేరండి. ఏం జరిగిందో కనుక్కోండి. జ్ఞానం మూడు నాలుగు రోజులుగా నన్ను ఫోనులో ప్రశ్నలు వేస్తోంది. నేను నాకు తెలిసింది చెపుతున్నాను. అవి జిజ్ఞాస నుంచి .. పుస్తకాలు చదవటం వల్ల కలిగినవా? ఎదురైన అనుభవాల వల్ల ఏర్పడినవా? అంటూ తెలుసుకోటానికి సైతం ప్రయత్నం చేసాను. తను చెప్పలేదు. ఈ సమాజంలో చైతన్యం, బాధ్యత కలిగిన వ్యక్తి ఏం చెయ్యాలి? అదీ జ్ఞానం సమస్య. వింటున్నారా?"

"చెప్పండి"

"జ్ఞానం గందరగోళంలో ఉంది. అది స్పష్టం. అదేమిటో నాకు అర్థం కాలేదు. నాశక్తి చాలలేదేమో! తనకే స్పష్టత లేనిది నాకు స్పష్టం చెయ్యలేకపోయిందేమో! బంధాల గురించి ప్రశ్నలు వేసింది. "అవి రక్షణలా కనిపిస్తాయి. జీవితమంతా మనకి లభించిన అనుబంధాలనే నిలబెట్టుకోటానికి బతుకుతాం. అనుబంధాల సంకెళ్లు తగిలించుకుని.. ఆలోచించటానికీ, ఆలోచించిన దానిని ఆచరించటానికీ.. ఉన్నచోటునే ఉండిపోటం .. గడ్డి దొరికిన పశువు అది తిని నెమరేసుకుంటూ బతకటం కన్న ఏవిధంగా మెరుగు?". వయసులో ఉన్నపుడు ఆలోచనాపరులకి ఎప్పుడో అప్పుడు ఇలాంటి ప్రశ్నలు కలుగుతాయి. వయసు వాలటం మొదలెట్టేక ఏదో తత్వం వెనక దాక్కుని ఈ ప్రశ్నల దాడిని తట్టుకోగలుగుతాం.. మీరు వెంటనే బయల్దేరండి."

"నిజంగా అది మీ దగ్గరకు రాలేదంటారా? మీరు దాన్ని చంపెయ్యలేదంటారా చౌదరిగారూ?"

"ఆలోచనలు ఎప్పుడూ ప్రమాదకరమైనవే. ఆ దృష్ట్యా నేనెంత బాధ్యుడినో తర్వాత తెలుస్తుంది. జరిగింది తెలుసుకోటానికి ముందు ప్రయత్నించండి. ఆ తరవాత మీరు ఏమైనా చెయ్యొచ్చు. మీ పక్కన చట్టాలు, పోలీసులు.."

"అవన్నీ నాబిడ్డను నాకు ఇస్తాయా.. భారతచౌదరి గారూ.. నాకు నా జ్ఞానం కావాలి.. నా బంగారు తల్లి కావాలి."

"ముందు బయల్దేరండి.."

* * *

భారతచౌదరి ఆచరణ్ ఫోనుకి ప్రయత్నించాడు. బిజీ.. నాట్

రీచబుల్.. నెట్ వర్క్ బిజీ..

నెమ్మదిగా లేచి స్వరాజ్యం దగ్గరకి వెళ్లాడు.

"స్వరాజ్యం.. స్వరాజ్యం.."

"అబ్బ.. ఏంటి.." అంటూ విసుగ్గా లేచి, కళ్లజోడు పెట్టుకుంది. భారతచౌదరి ముఖంలో ఆందోళన గమనించగానే 66ఏళ్ల స్వరాజ్యం విసుగు ఎగిరిపోయింది. "కూర్చో.. కూర్చో .." అంటూ కూర్చోపెట్టి నీళ్లు ఇచ్చింది. కాస్త తేరుకున్నాక -ఏం జరిగింది- అంది అనునయంగా.

"జ్ఞానం కనిపించటం లేదు."

"ఏంటి జ్ఞానమా.. ఓ౯ .. జ్ఞానజ్యోతా.."

"ఆఁ! తనే.. ఆచరణ్ భార్య.."

"చఛ.. కనిపించకపోవటమేంటి? చంటిపిల్లా! .."

ఆచరణ్ నంబరు రింగవుతోంది.

"ఉండుండు.. వాడు దొరికాడు.."

రింగయి, రింగయి రికార్డెడ్ మెసేజ్ మొదలు.. వ్యస్త్ హై.. కృపయా ఫిర్ కోషిష్ కీజియే..

మళ్లీ ఫోను మౌనం.

తిరిగి డైల్ చెయ్యబోతే స్వరాజ్యం లాక్కుని పక్కన పెట్టింది.

"చెప్పండి.. అసలేం జరిగిందో.."

విక్టర్రాజు ఫోన్.. జ్ఞానం కనిపించకపోటం.. ఆచరణ్ ఫోనుమీద దొరక్కపోటం.. తనిచ్చిన సలహా..

హఠాత్తుగా స్వరాజ్యం బిగ్గరగా ఏడవటం మొదలుపెట్టింది.

భారతచౌదరి ఓదార్పులతో, ఉపచర్యలతో కాస్త సేదతీరాక.. వెక్కుతూ.. వెక్కుతూ.. నోరు విప్పింది.

"పాపిష్టిదాన్ని.. నేనే .. నేనే.. చేసాను. వాడిని విడిచి ఉండలేకపోయిదాన్ని.. పాషాణమైపోయాను.. పాపం.. ఓ్బడుసార్లు తీసుకువచ్చాడు ఆ తిప్పులాడిని. నా కొడుకుని వల్లో వేసుకుంది. ఏం చూసాడో ఏంటో దానిలో.. నల్లగా బొగ్గు రంగు.. మోహాన బొట్టు కూడా లేదు.. పెద్దలు చెప్పినట్టు.. తావలచింది రంభ.. తామునిగింది గంగ.. ఏదో వాళ్ల బతుకు వాళ్లేదుస్తున్నారు గదా అని ఊరుకున్నాను. నేను ఆదరిస్తే ఆ కడజాతి వాళ్లకి లోకువై పోతానని ఆలోచించాను గాని.. ఎవరో ఒకరు .. పోన్లే అని సరిపెట్టుకుని.. ఇంట్లో పెట్టుకుని .. మంచీచెడ్డా చెప్పుకుని .. మనబుద్ధులు నేర్పుకుంటే ఇలా జరిగేదా.. అక్కడికీ మీరు చెపుతూనే ఉన్నారు.. నేనే కానుకోలేకపోయాను.. నా కొడుకు ఏమైపోతాడో.. దానికేం.. ఎవడితో పోయిందో.. వాళ్లకి అలవాటేగదా.."

"ఛీ నోర్ముయ్.. నా సంస్కారం అడ్డమొస్తోంది గాని .. చంపేద్దును ఆమాట అన్నందుకు.. త్ఫూ.." అంటూ ఉమ్మేసి అక్కడ నుంచి హాల్లోకి గబగబా నడిచాడు.

ఫోన్లు చెయ్యటానికే కాదు.. ఆలోచించటానికి కూడా నిస్సత్తువ.. కుర్చీలో కూలబడ్డాడు. రెండు చేతులలోనూ ముఖం పెట్టుకుని కణతలు నొక్కుకుంటూ ..

"..ఏంటీ స్వరాజ్యం.. ఎన్ని పాట్లు పడితే లభించింది... అనాథని.. గర్భవతిని ప్రేమించి చేసుకున్నాడు.. తన పుట్టుక ఆమెకి తెలియదు. ఆమె ఒకనాటి వివాహం ఆమె నేడు కావలించుకుంటున్న సాంప్రదాయానికి పూర్తి వ్యతిరేకం. ఆమెకు ఈ విషయం తెలియదా...? అయినా తనది ఉన్నత జన్మ అని నమ్మించుకోటానికే ఉన్న శక్తులన్నీ ఊడ్చిపెడుతుంది. భాషతో సహా ప్రతీదీ.. మార్చుకుంది. పూజలూ.. వ్రతాలూ.. నోములూ.. స్వరాజ్యం ఇతరులకన్న తనది అధికజన్మ అనిపించుకోటానికే అన్నీ చేసింది. ఏమిటీ పిచ్చి.. ఈ అనుకరణ.. అసహ్యించుకుంటూనే దాన్నే మనసులో నింపుకోటం.. ప్రాచీనత.. ఆధిక్యత.. బలహీన వ్యక్తులు బలంగా భావించేవి."

చల్లని చేతులు నుదురుకి తాకగానే కళ్లు తెరిచాడు. ఆ చేతులను తోసెయ్యటానికి వ్యర్థ ప్రయత్నం.. ఆమె వైపు చూసాడు.

స్వరాజ్యం ముఖంలో భావాలు భావాలకి అతీతంగా ఉన్నాయి. కళ్లలో నీటి కుండలు.. ఎంత చిన్న కుదుపైనా.. ఒలకటానికి సిద్ధంగా.. కన్నీరు దుఃఖానికి సంకేతం కాదు.. దుఃఖం ప్రశ్చాత్తాపానికి సంకేతం కాదు..

"మనిషి చేతలలో అతనికే తెలియని కొన్ని ప్రేరణలు, ఉద్దేశ్యాలూ ఉన్నట్టే ఈ దేశంలో మనుషుల మాటల వెనక సైతం అవి ఉంటాయేమో! తను పుట్టిన కులమేదో తనకే తెలియని ఈ స్వరాజ్యం తనది పెద్ద కులమని నమ్మించుకోటానికే ఎందుకు ప్రయత్నిస్తుంది? మామూలు మనుష్యుల చేత మాటలాడించేది ఏమిటి? సంస్కృతి.. కులం.. మతం.. అవన్నీ సమాజంలో భాగమైనవే.. బాహిరమైనవే.. అంతరంగాన్ని నిర్దేశిస్తాయా? ఆలోచనలా.. మాటలనా.. చేతలనా.."

ఫోను మోత..

"హలో.."

"బయల్దేరాను. .. అక్కడకి చేరగానే ఫోను చెస్తాను. ఆచరణ్ ఫోనులో దొరికాడా.. ఏంటన్నాడు?"

"ట్రై చేస్తున్నాను. దొరకటం లేదు.."

"దొరికితే నాకూ ఫోను చెయమని చెపుతారా.."

"తప్పకుండా............... పెట్టేదా.."

"వన్ మినిట్.. నిజం చెప్పండి.. జ్ఞానం మీ దగ్గరకు రాలేదా?"

"ఎందుకు సార్ అంత అనుమానం..!?"

"మగాడి మీద అనుమానం.. తల్లీతండ్రీ సపోర్టు లేని ఆడపిల్లను ఏం చెయ్యటానికైనా మగాడు పెద్దగా ఆలోచించనవసరం లేదు. మీ కొడుకూ మగాడే.. మీరిన్ని అభ్యుదయం ఉపన్యాసాలిస్తూ కూడా వాళ్లని దగ్గరకు రానియ్యలేదు. పొందినదానికన్న పోగొట్టుకున్న దానికే ఏడుపు. అసలు మగాడికీ ఆడదానికీ చిన్నదో పెద్దదో గొడవలు తప్పవు. అలాంటి గొడవ వస్తే.. మీ దగ్గరకే వస్తానని చెప్పింది నా కూతురు. పిచ్చి నమ్మకం.. మూఢ విశ్వాసం.. వస్తే.. వస్తే.. మీరు .. అవకాశం దొరికింది గదా అని.."

"బాధపడకండి విక్టర్రాజు గారూ.. మీరన్నది నాకు అర్థమవుతుంది.. మీ బాధ అర్థమవుతుంది.. మరొకరు ఇలా నన్ను అనుమానించేరేమని నేను బాధపడటం లేదు. ఎంతో పరిచయం.. ఎంతో సాన్నిహిత్యం.. స్నేహం ఉన్న నాభార్యే..అనకూడని మాట అంటుంది.. అది అనుద్దేశితంగా అందా.. అసంకల్పిత ప్రతీకార చర్య అంటారే అలాంటిదా.. ఇది మన దేశపు కులవ్యవస్థ ప్రత్యేకతా.. తెలీదు. అంతెందుకు.. నామీద నాకే అనుమానం.. ఒక్క క్షణంలో కోపంలో నేనే అంగీకరించని ఆలోచనలు ఛక్ మని బయటపడతాయి.

నేనొకడినే కాదు.. రకరకాల ఉద్యమాలలో ఉండే నాలాంటి ఎందరో.. కొడుకులకి సంప్రదాయక వివాహాలు చేస్తారు. కొందరు కట్నాలూ తీసుకుంటారు. మావాడిని నేను రానియ్యనట్టే రానియ్యని వాళ్లూ ఉంటారు. వాళ్లంతా చెప్పేది ఒక్కటే జవాబు. భార్య. సమాజాన్ని ఎదిరించగలిగేవారు భార్యని ఎదిరించలేరా? ఒకపక్క కుటుంబ నిర్ణయాలలో ఆడదానికి ఎలాంటి స్థానమూ లేదని సర్వేసర్వత్రా అంటారు. మరోపక్క ఆడదే శాసిస్తున్నట్టు కనిపిస్తుంది. ఏది సత్యం.. ఏది నటన.."

"మీమాటలు నాకు పూర్తిగా బోధపడటంలేదు. మిమ్మల్ని అనుమానించటం తప్పేమో.."

"మాటలు మాయచేసే అవకాశం ఉంది. జరిగింది తెలుసుకోండి .. మీ నిర్ణయాలు మీరు తీసుకోండి.."

"సరే.. మీకు ఫోనొస్తే.. ప్లీజ్ నాకు ఫోన్ చెయ్యండి.."

"బై.."

ఫోను ముగియగానే స్వరాజ్యం అతన్ని అల్లుకుపోయింది.

"సారీ.. పిచ్చిదాన్ని.. నా మాటలు .. ఓ తల్లిగన్న బిడ్డని.. సాటి ఆడదాన్ని.. అంతమాటనటానికి.. మనసెలా ఒప్పిందో.. పాపిష్టిదాన్ని.. తలబద్దలుగొట్టుకు చావాలనిపిస్తోంది.. అందరికీ ఆవేశాలే.. పెళ్లి చేసుకునేటపుడూ ఆవేశాలతోనే.. కలిసి బతికేటపుడు చిన్నా చితకా గొడవలకే చావటాలూ.. చంపుకోటాలూ.. ప్రాణమంటే ఖాతరులేని తరం..రోజులు.. ఆ పిల్లంటే వాడికి పిచ్చిప్రేమ. ఆచరణ్ జ్ఞానం లేకుండా బతకగలడా.. ఏం బాధలు పడుతున్నాడో.. అసలీరోజుల్లో ఓ ఆడపిల్లకేదైనా అయిందంటే .. మగాడివైపు వాళ్లయితే నేను మాట్లాడినట్టు మాట్లాడతారు.. ఆడపిల్ల వాళ్లైనా, పైవాళ్లైనా ఆపిల్లను దాని మొగుడే ఏదో చేసేసాడనే అంటారు.. వెంటనే ఫోను చెయ్యండి.. నా బిడ్డ ఎలావున్నాడో.. ఆ వెర్రిది ఏమయిందో.."

భారతచౌదరి స్వరాజ్యం చెయ్యిపట్టుకుని దగ్గరకు తీసుకుని..

"ఏడవకు.. ఏమీ జరిగుండదు.. వాడు తొందరపడి ఆయనకు ఫోను చేసుంటాడు.. చదువుకుంది.. ఉద్యోగం చేస్తోంది.. టైముకి రాకపోయేసరికి .. ఫోను మరిచి పోయుంటుంది.. నువ్వన్నట్టు ఈతరానికి.. కంగారు.. ఆవేశం.. చావటానికున్న తెగింపు.. బతకటానికి కావలసిన ధైర్యం కన్న హెచ్చు.."

ఆచరణ్ ఫోను రాటంతో..

"హలో నాన్నగారూ.."

"ఏమయిందిరా.. జ్యోతి కనపట్టంలేదని .. వాళ్ల నాన్నగారికి ఫోను చేసావుట.."

"అదే అర్థం కావటం లేదు.. బెంగగా ఉంది."

"మీయిద్దరూ గొడవాడుకున్నారా?"

"..........."

"ఫరవాలేదు.. నాతో చెప్పు..ప్లీజ్.."

"మీరంటే కూడా నాకు పరమ.. పరమ.. అసహ్యం కలుగుతోంది.. అవును, జ్ఞానాన్ని చంపేసి.. హుస్సేన్ సాగర్ లో పారేసాను.. స్మశానంలో కాల్చేసాను.. చిచ్చీ..చిచ్చీ.."

అదికాదురా నాన్నా.. ప్లీజ్.. సారీ.. నా ఉద్దేశ్యం – అంటూనే ఉన్నాడు తండ్రి.

"సారీ.. మీరు నన్ను కనటం కాదు.. పెంచారు.. మౌల్డ్ చేసారు..ట్రస్ట్ లేనిచోట బంధాలుండవని నా బుర్రలో నాటింది మీరు.. మీరే మీరే.. యూ టూ బ్రూటస్.. లా...." – అంటూనే ఉన్నాడు కొడుకు.

"నామాట వెనక్కి తీసుకుంటున్నాను.. సారీ.. నా మాట కాస్తవినరా.."

"ఏంవినమంటారు.. ఇప్పటి దాకా మా మామగారు.. అనేదీ ఇదే.. ఏం చేసావు నా కూతుర్ని.. పోలీసులు.. చెప్పిస్తారు.. ఫోను చేసిన ఫ్రెండ్సందరి మొదటి ప్రశ్న.. మీ ఇద్దరి మధ్యా గొడవేమైనా అయిందా.. నీతులు.. ఆశ్చర్యాలూ..ఓదార్పులూ.."

"నీ పాయింట్ అర్థమయిందిరా.."

"ఏడుస్తూ చెపితే అర్థమవుతుంది.. కోపంతో చెపితే అర్థమవుతుంది.. నాకు బోధ పడనిదేంటంటే.. అసలు మనుషులంతా పెర్సనల్ విషయాల మీదనే ఆధారపడి ప్రవర్తిస్తారా!?.. పెళ్లాంతో గొడవపట్టంవల్లే బుద్ధుడి అన్వేషణ ఆరంభమయిందా.. జ్ఞానం ఏదీ మరిచిపోదు.. ఫోను మరిచిపోయే అవకాశం లేదు.. వదిలేసి ఉంటుంది.. తను ఉత్తరం లాంటిది కూడా రాయలేదు.. తను (అస్తిత్వాన్ని) అన్నదాన్ని వదులుకుని వెళ్లిపోయిందని నా అనుమానం.. ఈ ప్రేమ కూడా సంకెలే గదా.. అంది ఒకటి రెండుమార్లు."

"నాన్నా.."

"జ్ఞానం ఎనిమిదో అంతస్తు. నేను గ్రౌండ్ ఫ్లోర్.. నేను తనను అందుకోవాలని పరుగులు పెడుతున్నాను. నన్నొదిలి వెళ్లిపోయింది నా జ్ఞానం. నా జ్ఞానం నాకు కావాలి నాన్నగారూ.. జ్ఞానం లేని ఆచరణ్ కి భవిష్యత్తు లేదు.. నాన్నా.. నాన్నా.."

"బాధ పడకు నాన్నా.. నిన్నొదలటం సాధ్యం కాదు .."

"ఎందుకు కాదూ.. మీలాంటి పడకకుర్చీ సిద్ధాంతులు ఉన్నపుడు..! "జీవితానికి లక్ష్యం ఏమిటన్న ప్రశ్నకు జవాబు కోసం ఇతరుల వైపు చూస్తే వాళ్లు గురువులు అవుతారు. గురువుల ఆలోచనలు శిష్యులకు విశ్వాసాలు మాత్రమే అవుతాయి. స్వయంగా ఆలోచించుకుని శోధన చేయటమే జ్ఞానం లక్షణం. సంసారం పై 'detachment' జన్మరాహిత్య కాంక్షతో, ముక్తి లాంటి భ్రమల కోసమే ఈదేశంలో జరిగిందన్నది పాక్షిక సత్యం. అలాగే ప్రతీ 'detachment' లోకం పట్ల 'attachment' గా మారటం కూడా పాక్షిక సత్యమే. అలా 'detach' అయిన వ్యక్తులకి ఈ దేశంలో 'attach' అయ్యే జనం జాస్తి అన్నది పూర్తిసత్యం. అలా వెనకబడే జనాన్ని బాధ్యతగా ముందుకి తీసుకువెళ్లేవారు ఈనాటి అవసరం." అన్నారు మీరు. దాని పర్యవసానం నేటి జ్ఞానం నిష్క్రమణ. కాదంటారా?"

"నాన్నా.. నా మాటలు తనని ప్రభావితం చేసాయంటావా?"

"తెలియదు. జీవితానికి లక్ష్యం ఏమిటన్న ప్రశ్న తనని కొంతకాలంగా వేధిస్తోంది. మీ మాటలు తనని ట్రిగ్గర్ చేసాయనో.. నిర్ణయం తీసుకునేట్లు చేసాయనో అనుకోక తప్పటం లేదు. పోతే..."

"చెప్పు.."

"నిజంగా నేను మీకు.. పుట్టి ఉంటే.. మీ రక్తాన్ని అయి ఉంటే.. మీ కోడలికి ఇలాంటి సలహా ఇచ్చేవారా?"

"భరత్.. నన్ను ఇలాంటి మాటంటావా?"

"మీకు కోపం రావచ్చు.."

కథ

ఎడారి అధ్యాపకురాలు

- ఆంద్రేయ్ ప్లతొనొవ్

(రష్యన్ మూలం నుండి హిందీ అనువాదం: యోగేంద్ర నాగ్‌పాల్,

హిందీ నుండి అనువాదం : షహీదా)

అస్త్రాఖాన్ ప్రాంత ఇసుక మైదానాల్లో తన జాడని కోల్పోయిన ఒక పట్టణం ఇరవై ఏండ్ల మరీయా నరీష్కినా నివాసం. ఆమె గుండ్రంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఆమె భుజాలూ, కాళ్లూ పురుషులకున్నంతటి శక్తిని కలిగి ఉండేవి.

మరీయా నరీష్కినాకి చెందిన ఈ సంపద కేవలం ఆమె తల్లిదండ్రులు ఆమెకిచ్చినది మాత్రమే కాదు. ఆమె యుద్ధం, విప్లవం రెండిటి నుండీ దాదాపుగా దూరంగా ఉండిపోవడం వల్ల కలిగిన ఫలితం కూడా అది. ఇసుక మైదానాల్లో జాడ కోల్పోయిన ఆమె జన్మభూమి ఎర్ర, తెల్ల సైన్యాల సమర మార్గాల నుండి దూరంగా ఉండింది. సోషలిజం దృఢంగా నిలబడ్డ కాలంలో ఆమె చైతన్యం వికసించింది.

స్కూలు మాస్టారు అయిన తండ్రి, కూతురి బాల్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమెకి దేశంలో జరుగుతున్న ఘటనల్ని అర్థం చేయించేవాడు కాదు. అలా చేస్తే ఆమె కోమల హృదయం మీద జీవితాంతం బాధించే లోతైన గాయాలు అవుతాయేమోనని ఆయన భయపడ్డాడు.

మరీయా కాస్పియన్ సముద్రతీరాన గల ఇసుక మైదానాల్ని చూస్తూ ఉండేది. అక్కడ గాలి మంద్రంగా వీచినా కూడా ఇసుక పొగమేఘంలాగ పైకి లేచేది. పర్షియా వెళ్లే ఒంటెల బిడారాల్నీ, ఎండలో నల్లగా మాగిన వ్యాపారుల్నీ ఆమె చూస్తుండేది. పగలూ, రాత్రీ ఇసుకను పీల్చుకోవడంవల్ల వారు బొంగురు గొంతుతో మాట్లాడేవారు. ఇంటి వద్ద ఆమె ఆనందంలో మునిగి తేలుతూ తండ్రికి చెందిన భూగోళం పుస్తకాలు చదువుతుండేది. ఎడారి ఆమె దేశం అయితే భూగోళం ఆమె కవిత.

ఆమెకు పదహారేండ్ల వయసు రాగానే తండ్రి ఆమెను అస్త్రాఖాన్‌కు తీసుకుపోయి అక్కడ అధ్యాపకుల శిక్షణా కేంద్రంలో చేర్పించాడు. అక్కడివారు ఆమె తండ్రి నెరుగుదురు. వారు ఆయన్ని గౌరవించేవారు. అలా మరీయా విద్యార్థినిగా మారిపోయింది.

నాలుగేళ్లు గడిచిపోయాయి. మనిషి జీవితంలో అన్నిటికంటే అనిర్వచనీయమైన సంవత్సరాలు. ఆ వయసులోనే యువ హృదయాలు ఎగిసిపడుతుంటాయి. స్త్రీత్వం మొగ్గ విచ్చుకుంటుంది. చైతన్యం మేల్కొంటుంది. విచిత్రమైన విషయం ఏంటంటే ఈ వయసులో యువ హృదయాల్లో తలెత్తే చింతల్నీ, సందేహాల్నీ తీర్చుకోవడంలో ఎవ్వరూ, ఎన్నడూ సహాయం చేయరు. సందేహాల గాలి ఈడ్చి కొట్టే దెబ్బల్నీ, ఎదుగుదలకి సంబంధించిన భూకంపాల్నీ అనుభవించే ఆ నాజూకు దేహాలకి ఎవరూ ఆసరాగా నిలవరు. అయితే యవ్వనం నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోని రోజు ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా వస్తుంది సుమా.

ఆ - మరీయాకీ ప్రేమ కలిగింది. ప్రాణాల్ని పట్టి ఉంచే ఆ పగ్గాల్ని తెంపుకోవాలని ఆమె ఆరాటపడింది కూడా. ఎదిగే ప్రతి జీవితపు మొక్కా ఈ కటువైన నీటితో సాగు కావల్సిందే.

అయితే అంతా గడిచిపోయింది. చదువు పూర్తయిపోయింది.

"కాదు బాధ"

"క్షమించండి. పోనీ .. అదే.. నన్నీ ఆలోచన తినేస్తోంది. చెప్పకుండా ఉండలేను. ఇప్పుడు ఈ దేశంలో ప్రతిదీ పుట్టుకకే, రక్తానికే ముడిపెట్టి ఆలోచిస్తున్నారు. ఇది కొత్తది కాదు. కొత్తదనమంతా దీని సమర్థన కోసం పుట్టిన కొత్త సిద్ధాంతాలు. కులమే వర్గం... సామాజిక సమస్యే ఆర్థిక సమస్య కన్న ప్రధానం.. నా మాటలో.. నా ప్రవర్తనలో నేనెంత మారానో అన్న లెక్కలేదు.. నేనెంత మారలేదన్నదే లెక్క.. ఆచరణ్ ఎటువైపు అన్నది ప్రధానం కాదు. నాలో ఏ తప్పు.. ఏ పొరపాటు.. కనిపించినా ఆచరణ్ లోపాలన్నీ పుట్టుక ఫలితాలే.".

స్వరాజ్యం ఫోను తీసుకుంది.

"బాబూ.. కంగారు పడక.. ఆడదాన్ని చెపుతున్నాను.. సుఖసంసారాన్ని వదులుకోటం ఆడదానికి అంత సులువుకాదు.. ఆడబిడ్డలకి బయట లోకంనిండా అభద్రతలే. రాక్షస హస్తాలే.. సరిగ్గా ఆలోచించు కన్నా.."

"కాలింగ్ బెల్ మోగుతోంది.. మళ్లీ ఫోను చేస్తాను."

* * *

మూడు నెలలు గడిచాయి.

జ్ఞానం జాడలేదు.

విక్టర్రాజు పోలీసులకి ఫిర్యాదు చేసాడు.. నా కూతురిని దాని భర్తా, అత్తమామలూ ఏదో చేసారని..

బెయిల్ మీద బయటకు వచ్చారు ముగ్గురూ.

ఆచరణ్ సైతం తన జ్ఞానాన్ని వెదికిపెట్టమని అదే పోలీసులని ఆశ్రయించాడు.

వాళ్లు ఆ కేసూ నమోదు చేసుకున్నారు.

భారతచౌదరి విక్టర్రాజుతో మాట కలపటం కోసం మనసు విప్పటం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

జ్ఞానం కోసం వెదుకులాట నడుస్తూనే ఉంది. ప్రస్తుతానికి ఎవరికి వారే వెతుకుతున్నారు

తగువు తగువుగానే ఉంది.

అమ్మాయిల్ని హాలులో జమ చేశారు. ప్రాంతీయ శిక్షణా విభాగం బాధ్యుడు వచ్చాడు. ఆయన ఈ అసహన జీవులకు వారు భవిష్యత్తులో సహనంతో నెరవేర్చాల్సిన కర్తవ్యాల ప్రాధాన్యతను వివరించసాగాడు. అమ్మాయిలు ఆయన మాటల్ని వింటూ చిరునవ్వులు చిందిస్తున్నారు. ఉపన్యాసంలోని పదాలు వారి చైతన్యంలోకి అస్పష్టంగానే జారుతున్నాయి. వారి వయసులో అంతరంగంలోనే కోలాహలం ఉంటుంది. బయటి ప్రపంచం చాలా వికృతంగా మారిపోతుంది. ఎందుకంటే వారు మెరిసే కళ్లతో దాన్ని చూస్తారు.

మరీయా నరీష్కినాకి మధ్య ఆసియాలోని నిర్మానుష్య మైదానాల సరిహద్దుల్లో వున్న ఒక చిన్న గ్రామమైన ఖోషుతోవోలో అధ్యాపకురాలిగా పని ఇచ్చారు.

2

ఖోషుతోవోకి వెళ్లే దారిలో నిర్మానుష్యమైన ఎడారి తన చుట్టూరా పరుచుకున్నప్పుడు మరీయాని లోతైన విచారం ముంచెత్తింది.

జులై మాసపు ఆ ప్రశాంతమైన మధ్యాహ్నంపూట కళ్ల ముందు విశాలంగా పరుచుకుని ఉన్న ఆ మరుభూమి చిత్రపటాన్ని ఆమె పరికించింది.

భయానకంగా ఉన్న ఆకాశం నడినెత్తిన సూర్యుడు నిప్పులు చిమ్ముతున్నాడు. భగభగలాడుతున్న ఇసుక దిబ్బలు, మేటలు దూరంగా కణకణలాడుతున్న నిప్పుకణికల్లా అవుపిస్తున్నాయి. వాటి మధ్య క్షారవంతమైన భూమి శవంపై కప్పే తెల్లటి గుడ్డలా పరుచుకుని ఉంది. హఠాత్తుగా తుపాను లేచింది. పసుపుపచ్చటి రేణువులు సూర్యుడ్ని దట్టంగా అలుముకున్నాయి. గుసగుసలాడే గాలి విలపిస్తూ ఇసుకను లేపుకుపోతోంది. గాలి ఎంత వేగంగా వీస్తే, దిబ్బల మీద నుంచి ఇసుక అంత దట్టంగా లేస్తోంది. గాలి నిండా ఇసుక నిండిపోతోంది. అది తన పారదర్శకతను కోల్పోయింది. ఆకాశంలో సూర్యుడు ఎక్కడ ఉన్నాడో అవుపించడం లేదు. మిరిమిట్లు గొలిపే పగలు హఠాత్తుగా అమావాస్య రాత్రిగా మారిపోయింది.

మరీయా మొదటిసారిగా ఎడారిలో అసలైన తుపానుని చూస్తోంది.

సాయంత్రం అవుతుండగా తుపాను శమించింది. ఎడారి తిరిగి తన పూర్వరూపాన్ని సంతరించుకుంది. శిఖరాలపై మంద్రంగా పొగమేఘాల్ని చిమ్ముతున్న ఇసుకమేటల అంతులేని సాగరం, అలిసిపోయేలా చేసే శుష్క విశాలత్వం. దానికి అవతల జీవన కోలాహలంతో తొణికిసలాడే తడినీ, యవ్వనాన్నీ, అలసిపోని అవనినీ మనసు ఊహించుకుంటోంది.

మూడో రోజు సాయంత్రం మరీయా నరీష్కినా ఖోషుతోవో చేరుకుంది.

ఆమెకు కొన్ని డజన్ల ఇండ్లూ, పాఠశాల పక్కా భవనం, లోతైన బావుల వద్ద ఎర్ర పేము పొదలూ కనిపించాయి. వారి దేశంలో బావులు అన్నిటికంటే విలువైన వస్తువులు. వాటి నుండి ఎడారిలోకి జీవనం ప్రవహిస్తుంది. ఈ బావుల్ని తవ్వడానికీ, వాటిని నిలిపి ఉంచుకోవడానికీ ఎంతో శ్రమా, బుద్ధీ అవసరమౌతాయి.

ఖోషుతోవో దాదాపుగా పూర్తిగా ఇసుకలో కూరుకుపోయి ఉన్నది. వీథుల్లో పామీర్ పర్వతశ్రేణుల నుండి వచ్చే సూక్ష్మమైన తెల్లటి ఇసుక మేటలు వేసి ఉంది. ఇండ్ల కిటికీల వరకూ ఇసుక పోగుబడి ఉంది. వాకిళ్లలో ఇసుక దిబ్బలున్నాయి. అవి మనుషుల శ్వాసను రాకుతున్నాయి. ప్రతిచోటా పారలు పెట్టి ఉన్నాయి. అవి ఇసుక ఖైదు నుండి రైతుల్ని విడుదల చేసే పని చేస్తుంటాయి.

మరీయా కఠోరమైన, కానీ దాదాపు అనవసరమైన శ్రమను అక్కడ చూసింది. ఒక చోటును శుభ్రం చేయగానే వెంటనే ఇసుక ఎగిరి వచ్చేది. మౌనం దాల్చిన దారిద్ర్యాన్నీ, నిస్సహాయమైన నిరాశనూ ఆమె చూసింది. ఆకలిగొన్న, అలిసిపోయిన రైతులు ఎన్నిసార్లు తమ శక్తినంతా ఉపయోగించి పని చేసి ఉంటారో. కానీ ఎడారి శక్తి ముందు వారు ఏమీ చేయలేకపోయారు. వారు ధైర్యం కోల్పోయారు. ఇప్పుడిక ఏదైనా అద్భుతమైన సహాయం దొరుకుతుందేమోననే ఆశతో ఉన్నారు వాళ్లు. లేదా ఉత్తరంలోని తడి ప్రదేశాలకు తమను తరలిస్తారేమోనని ఎదురు చూస్తున్నారు.

మరీయా నరీష్కినా స్కూల్లోనే ఒక గదిలో నివసించసాగింది. మౌనంలో, ఒంటరితనంలో మగ్గిపోతున్న ముసలి చౌకీదారు ఆమెను చూసి తన స్వంత కూతురే తిరిగి వచ్చిందన్నంతగా సంబరపడ్డాడు. తన అనారోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా ఆమెకు ఆ గదిని నివాసయోగ్యం చేయడంలో నిమగ్నమయ్యాడు.

3

ఎలాగో అలాగ పాఠశాలను కొంత మంచిగా చేసి, జిల్లా కేంద్రం నుండి అవసరమైన సామాన్లు తెప్పించి మరీయా నరీష్కినా రెండు నెలల తర్వాత పాఠాలు చెప్పడం మొదలుపెట్టింది.

పిల్లలు పాఠశాలకు రావడం మొదలయ్యింది గానీ ఒక రోజు ఐదుగురు వస్తే, ఒక రోజు మొత్తం ఇరవైకి ఇరవైమందీ హాజరయ్యే వారు.

త్వరలోనే శీతాకాలం వచ్చి మీద పడింది. ఈ ఎడారిలో వేసవికాలం ఎంత కఠినమైనదో శీతాకాలమూ అంతే. భయంకరమైన మంచు తుపానులు హోరుగా వీచేవి. మంచుతోపాటు ఇసుక కూడా లేస్తుంది, కాటు వేసినట్టే గుచ్చుకుంటుంది.

గ్రామం నిండా నిశ్శబ్దం నెలకొంది. రైతులు దారిద్ర్యపు వేదనలో మునిగిపోయారు.

పిల్లలకు కాళ్లకు తొడుక్కోవడానికి గానీ, ఒంటిని కప్పుకోవడానికి గానీ ఏమీ లేవు. తరచూ పాఠశాల పూర్తిగా శూన్యంగా ఉండేది. గ్రామంలో ధాన్యం నిండుకుంటోంది. మరీయా కళ్ల ముందే పిల్లలు బక్కపడసాగారు. కథలూ, కాకరకాయల్లో వారి ఆసక్తి నిలవడం లేదు.

కొత్త సంవత్సరం వచ్చేవరకూ ఇరవైమంది విద్యార్థుల్లో ఇద్దరు చనిపోయారు. వాళ్లని ముడి ఇసుక సమాధుల్లో పూడ్చేశారు.

నవ్వుముఖంతో, సాహసంగా, పట్టుదలగా ఉండే మరీయా ఏం చేయాలో పాలుపోని ఈ స్థితిలో తన తేజస్సును కోల్పోతోంది.

సుదీర్ఘ సాయంత్రాలూ, ఈడ్చుకుంటూ వెళ్లే పగళ్ల మధ్య యుగాలు గడిచిపోతున్నాయి. మరీయా కూచుని ఆలోచిస్తూ ఉండేది – కొనవూపిరితో ఉన్న ఈ గ్రామంలో తను ఏం చేయాలా అని. ఆకలిగొన్న, రోగాలతో ఉన్న పిల్లలకు చదువు చెప్పడం సాధ్యం కాదు అన్నంత వరకూ స్పష్టమే.

రైతులు పాఠశాల పట్ల ఉదాశీనంగా ఉన్నారు. వారి స్థితిలో వారికి పాఠశాల అవసరం ఏమాత్రం లేదు. ఈ పనికిమాలిన ఇసుక

నుండి విముక్తి పొందడంలో వారికి ఎవరు సహాయం చేసినా వారి వెంబడి ఎక్కడికైనా పోవడానికి వారు సిద్ధంగా ఉన్నారు. కానీ రైతుల ఈ పనితో స్కూలుకి ఏం సంబంధం లేదు.

ఆఖరికి మరీయాకి మార్గం తట్టింది : ఇసుకను ఎదుర్కోవడమే స్కూలుకు సంబంధించిన ప్రధాన విషయంగా ఉండాలి. ఎడారిని జీవమున్న నేలగా మార్చడాన్ని నేర్పాలి.

అప్పుడు ఆమె రైతుల్ని పాఠశాలలోకి పిలిచింది. వారి ముందు తన ఉద్దేశాల్ని ఉంచింది. రైతులకు ఆమె మాటలపై విశ్వాసం కలుగలేదు. అయినా వాళ్లు, "ఈ పని మంచిదే," అన్నారు.

జిల్లా విద్యా విభాగానికి మరీయా పొడుగాటి అర్జీ రాసింది. దాని మీద రైతుల సంతకాలు తీసుకుని జిల్లా కేంద్రానికి బైల్దేరింది.

విద్యా విభాగంలో ఆమె మాటల్ని సానుభూతితో విన్నారు. ఆమె చెప్పిన విషయాల్లో కొన్నిటితో వారికి ఏకీభావం లేదు. ఇసుక విజ్ఞానానికి సంబంధించిన ప్రత్యేక ఉపాధ్యాయుడిని వారు ఆమెకి ఇవ్వలేదు. ఆ – పుస్తకాలు ఇచ్చారు. ఇసుక విజ్ఞానాన్ని ఆమెనే స్వయంగా బోధించమని సలహా ఇచ్చారు. ఆమెకేమైనా సహాయం కావలిస్తే తన ప్రాంతంలోని వ్యవసాయ నిపుణుడిని కలవమన్నారు.

మరీయా నరీష్కినా నవ్వేసింది. వ్యవసాయ నిపుణుడు వందమైళ్ల దూరంలో నివసిస్తున్నాడు. ఆయన ఖోషుతోవో ఎన్నడూ రాలేదు.

జవాబుగా అధికారి కూడా నవ్వాడు. సంభాషణ ముగిసిందని సూచిస్తూ ఆమెతో చేతులు కలిపాడు.

4

రెండేళ్లు గడిచిపోయాయి. అతి కష్టమ్మీద మొదటి వేసవి చివరి రోజుల్లో మరీయా రైతులను ఒప్పించగల్గింది – ప్రతి సంవత్సరం వాళ్లు శ్రమదానం చేయాలని – ఒక నెల వసంతకాలంలో, మరో నెల శీతాకాలానికి ముందు ఆకురాలు కాలంలో.

ఒక్క ఏడాది గడిచేసరికే ఖోషుతోవో గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. నీళ్లు పారే కాలవలకి నాలుగు వైపులా ఎర్ర పేము పొదల రక్షణ కవచం నవనవలాడసాగింది. ఎడారి నుంచి వచ్చే గాలుల మార్గంలో పొడవాటి పొదల కవచాలు ఖోషుతోవోని చుట్టుముట్టాయి. విచారంగా కనిపించే వారి ఇండ్లకు కళ వచ్చింది.

ఎడారిని సంపూర్ణంగా ఎదుర్కోవడం కోసం పాఠశాల వద్ద దేవదారు వృక్షాలను పెంచడానికి నర్సరీని తయారు చేయాలని మరీయా నరీష్కినా ఆలోచించింది.

గ్రామంలో ఆమెకు చాలామంది మిత్రులయ్యారు. వారిలో ఇద్దరు – నికితా గావ్కిన్, యెర్మోలాయ్ కోబోజెవ్‌లైతే ఈ నూతన విశ్వాసానికి ప్రవక్తలే అయిపోయారు.

మరీయా పుస్తకాల్లో చదివింది – దేవదారు వృక్షాల వరుసల నడుమ పండించే పంటలు రెండింతలు, మూడింతలు దిగుబడి నిస్తాయి అని. ఎందుకంటే ఈ చెట్లు మంచు తడిని నిలిపి ఉంచుతాయి. మొక్కలు వేడి గాలిలో మాడిపోకుండా కాపాడుతాయి. ఎర్ర పేము పొదల వల్లే పశుగ్రాసం బాగా పెరిగింది. ఇక దేవదారు వృక్షాలైతే వాటికంటే ఎంతో బలమైనవి.

ఖోషుతోవోలో ఎప్పుడు చూసినా వంటచెరుకు కరవుగా ఉండేది. పొగ చిమ్మే కట్టెలూ, పిడకలూ వాడేవారు. ఇప్పుడు ప్రజలకు పేము పొదలు ఇంధనంగా దొరుకుతున్నాయి. రైతులకు గతంలో ఎటువంటి అదనపు ఆదాయమూ లేకుండింది. ఏడాదిలో సగం రోజులు వాళ్లు చేతులు ముడుచుకుని కూచునేవారు. ఇప్పుడు వారికి ఈ పేము పొదల నుండే బద్దలు దొరికాయి. దాంతో వారు బుట్టలు అల్లడం నేర్చుకున్నారు. హస్తనైపుణ్యం ఉన్నవారు వాటితో కుర్చీలు, మేజాలు, ఇతర వస్తువులూ కూడా తయారు చేయసాగారు. దీంతో మొదటి శీతాకాలంలోనే రెండు వేల రూపాయల ఆదాయం వచ్చింది.

ఖోషుతోవో నివాసులకు దారిద్ర్యం నుండి కొంత ఉపశమనం లభించింది, శాంతి లభించింది. ఎడారిలో మెల్లమెల్లగా పచ్చదనం కళకళలాడసాగింది.

మరీయా నరీష్కినా పాఠశాల ఎప్పుడు చూసినా నిండుగా ఉండేది. పిల్లలే కాదు పెద్దలు కూడా అక్కడ జమ అవుతుండేవారు. అధ్యాపకురాలు వారికి ఇసుక మైదానాల్లో జీవితానికి సంబంధించిన విజ్ఞానదాయకమైన విషయాలు చదివి వినిపించేది.

మరీయా నిరంతరం పనుల్లో ఉరుకులు పరుగుల మీద ఉన్నా ఆమె నునుపు దేరింది. ఆమె ముఖంలో యవ్వనపు మెరుపు ఎక్కువైంది.

5

మరీయా ఖోషుతోవోకి వచ్చి మూడేళ్లు గడిచిపోయాయి. ఆగస్టు నెల. ఇసుక మైదానాల్లో పచ్చదనం అంతా ఎండిపోయింది. కేవలం దేవదారు, ఎర్ర పేము పొదలు మాత్రం పచ్చగా ఉండినాయి. అప్పుడే ఒక ఆపద వచ్చిపడింది.

ఖోషుతోవోలోని పెద్దతరం వాళ్లకు తెలుసు – ఆ ఏడాది సంచార జాతి వారు తమ మందల్ని తీసుకుని తమ గ్రామం పక్క నుండి ప్రయాణిస్తారని. ఎడారి స్వీయ కాలచక్రం ప్రకారం వాళ్లు ప్రతి పదిహేను ఏండ్లకోసారి ఇటువైపు నుండి ప్రయాణిస్తారు. ఈ పదిహేను ఏండ్లుగా ఖోషుతోవో మైదానాలు పడావు పడి ఉన్నాయి. సంచార జాతుల కాలచక్రం పూర్తి కావస్తోంది. వారు వస్తారు. ఈ పదిహేను ఏండ్ల విరామంలో నేలతల్లి పెంచి పోషించిన వాటినన్నిటినీ వాళ్లు పోగేసుకుని తీసుకుపోతారు.

వాళ్లు వసంతకాలానికి దగ్గరలో వచ్చేవారు. కానీ ఈసారి ఎందుకో తెలీదు, వాళ్లు రావడం ఆలస్యం అవుతోంది.

"తప్పక వస్తారు," పెద్దతరం వాళ్లు అంటున్నారు. "వారితో పాటు ఆపదా ముంచుకొస్తుంది."

మరీయా నరీష్కినాకి వాళ్ల మాటలు పూర్తిగా అర్థం కాకపోయేవి. ఆమె ఎదురుచూస్తోంది. మైదానాలు ఎన్నడో నిర్మానుష్యం అయిపోయాయి. వసంతకాలంలో వచ్చిన పక్షులు ఎగిరిపోయాయి. తాబేళ్లు తమ బిలాల్లో దాగుండిపోయాయి. వాటిలో సహజసిద్ధమైన జలాశయాలున్నాయి. ఆగస్టు 25 నాడు గ్రామానికి అత్యంత దూరంలో పెంచిన పేము పొదల వైపు నుండి బావి మనిషి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతను అందరి ఇళ్ల వద్దకూ తిరుగుతూ అరవసాగాడు:

"సంచార జాతుల వాళ్లు వచ్చేశారు!"

రోజులో ఆ సమయంలో మైదానాల్లో గాలి వీచదు గానీ క్షితిజం మీద ఇసుక పొగమేఘంలా పైకి లేస్తోంది. సంచార జాతుల వారి

వేలాది గుర్రాలూ, మందలూ ముందుకు రాసాగాయి.

మూడు రోజుల తర్వాత ఎర్ర పేము పొదల జాడా లేదు, దేవదారు వృక్షాల జాడా లేదు. సంచార జాతుల వారి గుర్రాలూ, పశువులూ అన్నిటినీ మేసేశాయి. అన్నిటినీ తమ గిట్టల కింద తొక్కేశాయి. బావుల్లో నీళ్లు కూడా మిగలలేదు. రాత్రిపూట సంచార జాతివారు పశువుల్ని గ్రామంలోని బావుల వద్దకు తోలుకొచ్చి నీళ్లన్నీ తోడేసేవారు.

ఖోషుతోవోలో చావుకళ వుట్టిపడుతోంది. రైతులు నోళ్లు కుట్టుకుని ఒకరినొకరు అనుకుని దగ్గరగా ఉంటున్నారు.

తన జీవితంలోని ఈ మొదటి నిజమైన దుఖ్ఖం మరీయాని వ్యాకులపరిచింది. ఆమె యువదేహంలో క్రోధం ఉప్పొంగుతుండగా సంచార జాతుల సర్దార్‌ని కలవడానికి బైల్దేరింది.

సర్దార్ మౌనంగా, వినమ్రంగా ఆమె మాటలన్నీ విన్నాడు. అప్పుడిలా అన్నాడు:

"ఏం చేయగలం, బీబీ! మందీ మార్బలం చాలా ఉంది. ఖోషుతోవోలో సంచార జాతుల వారికంటే ఎక్కువమంది మనుషులు ఉండింటే వాళ్లు మమ్మల్ని ఎడారిలో చనిపోవడానికి తరిమేసేవారు. వారి రీతిలో వారు నిజాయితీగానే ఉన్నట్టు, మా వైపు నుండీ మేం నిజాయితీగా ఉన్నట్టే. మేం దుర్మార్గులం కాదు, వాళ్లూ దుర్మార్గులు కారు. ఎవరో ఒకరు చావాల్సిందే. చనిపోయేవాళ్లు ఎదుటివారిని శాపనార్థాలు పెడతారు."

"ఏదేమైనా గానీ మీరు నీచమైన పని చేశారు," అంది మరీయా. "మేం మూడేళ్ల పాటు రక్తమూ, చెమటా చిందించాం. మీరు మూడు రోజుల్లో ఆ పచ్చదనాన్నంతా నాశనం చేసేశారు. నేను సోవియట్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాను. మీ మీద కేసు నడుస్తుంది."

"బీబీ, ఈ మైదానాలు మావి. రష్యావాళ్లు ఇక్కడకెందుకొచ్చారు? ఆకలిగొని తన దేశానికి చెందిన గడ్డిని తినేవాడు నేరస్తుడు కాడు."

'సర్దార్ తెలివైనవాడు,' మరీయా మనసులోనే అనుకుంది. అదే రోజు రాత్రి ఆమె పొడుగాటి నివేదిక తయారు చేసుకుని జిల్లా కేంద్రానికి బయలుదేరింది.

జిల్లా విద్యా విభాగం బాధ్యుడు ఆమె చెప్పిందంతా విని జవాబిచ్చాడు :

"తెలుసా మరీయాగారూ, ఇప్పుడు ఖోషుతోవో ప్రజలు మీరు లేకుండానే తమ పని నడిపించుకోగల్గుతారు."

"అంటే అర్థం?" మరీయా నిశ్చేష్టురాలైంది. ఆమెకు వెంటనే తెలివైన సర్దార్ గుర్తుకొచ్చాడు. అతనికి ఈ బాధ్యునితో ఏమాత్రం పోలిక లేదు.

"అంటే అర్థం ఇదీ : అక్కడి ప్రజలు ఇసుకని యెలా ఎదుర్కోవాలో నేర్చేసుకున్నారు. ఇప్పుడిక సంచార జాతులు వెళిపోగానే వాళ్లు ఎర్ర పేము పొదలు నాటడం మొదలుపెడతారు. మిమ్మల్ని సఫూతాకి బదిలీ చేస్తే ఎలా ఉంటుందంటారు? మీరు అక్కడకు వెళ్తారా?"

"ఈ సఫూతా ఏంటండీ బాబూ?" ప్రశ్నించింది మరీయా నరీష్కినా.

"సఫూతా కూడా ఒక గ్రామం," బదులిచ్చాడు బాధ్యుడు. "కానీ అక్కడకి రష్యన్ వాళ్లు వెళ్లి నివాసం ఏర్పర్చుకోలేదు. సంచార జీవనాన్ని విడిచిపెట్టుకున్న సంచార జాతులవాళ్లు అక్కడ నివసిస్తున్నారు. ప్రతి సంవత్సరం వారి సంఖ్య పెరుగుతూ పోతోంది. సఫూతా చుట్టుపక్కల ప్రాంతంలో ఇసుక మీద పల్చటి మట్టి పొర ఉన్నది. అందుకని ఇసుక ఎగరదు. అందువల్ల దిబ్బలూ, మేటలూ ఏర్పడవు. కానీ మా భయం ఏంటంటే ప్రజలు ఆ నేల మీదకి ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడతారేమో అని. అప్పుడిక సఫూతా కూడా ఖోషుతోవో లాగ ఇసుకతో నిండిపోతుంది. ప్రజలు దరిద్రులవుతారు. తిరిగి సంచార జీవనం మొదలుపెడతారు."

"కానీ నాకూ దీనికీ ఏంటీ సంబంధం?" ప్రశ్నించింది మరీయా. "నేనేమైనా సంచార జాతుల్ని అదుపు చేసే పనిని గుత్తకి తీసుకున్నానా?"

"నా మాట వినండి మరీయాగారూ," అంటూ బాధ్యుడు లేచి ఆమె ఎదురుగా నుల్చున్నాడు. "మీరు సఫూతా వెళిపోయి అక్కడి సంచార జాతుల వారికి ఇసుక నుండి కాపాడుకోవడం నేర్పిస్తే వేరే సంచార జాతుల వారు కూడా సఫూతా వైపు ఆకర్షితులౌతారు. అక్కడే నివాసం ఏర్పర్చుకున్నవారు ఇక దానిని వదిలిపోరు. ఇప్పుడు నా మాటలు అర్థమయ్యాయా మరీయాగారూ? అలా జరిగితే రష్యావారి నివాసాల్లో నాటిన చెట్లూ చేమా తక్కువ నాశనం అవుతాయి...ఎన్నో సంవత్సరాలుగా సఫూతాకి పంపడానికి మేం మనుషుల్ని వెతుకుతున్నాం. ఎవరూ ఒప్పుకోవడం లేదంటే. చాలా సుదూర ప్రాంతం. ఏమంటారు, మరీయాగారూ?"

మరీయా నరీష్కినా ఆలోచించసాగింది:

'నేను నా యవ్వనాన్నంతా ఈ ఎడారిలో, ఆదిమ సంచార జాతుల మధ్య పాతిపెట్టాల్నా? ఎర్ర పేము పొదల వరుసల మధ్యనే చనిపోవాల్నా? ఎడారికి చెందిన ఈ సగం జీవం ఉన్న పొదనే నాకు అత్యుత్తమ స్మారకంగా భావించాల్నా? దానినే నా జీవితంలోకెల్లా అతి పెద్ద కీర్తి కిరీటంగా భావించాల్నా?....'

ఎక్కడ ఉన్నాడు తన భర్త, తన జీవన సహచరుడు?

మరీయాకి మరోసారి సంచార జాతుల తెలివైన, శాంతచిత్తుడైన సర్దార్ గుర్తుకొచ్చాడు. ఎడారిలోని తెగల జటిలమైన, నిగూఢార్థాలతో నిండిన జీవనం గుర్తుకొచ్చింది. ఇసుక మేటల మధ్య చిక్కుకున్న రెండు జాతుల నిరాశామయ జీవనం మొత్తం ఆమెకు బోధపడింది. తృప్తి నిండిన స్వరంతో ఆమె ఇలా అన్నది :

"సరే, నేను ఒప్పుకుంటున్నా...మళ్లీ మిమ్మల్ని కలవడానికి వచ్చే ప్రయత్నం చేస్తాను, ఏ యాభై ఏండ్ల తర్వాతో, ముసలిదానిగా. .... ఇసుక నిండిన దారుల గుండా కాదు, అడవి దారుల మీదుగా నడిచొస్తాను. మంచిది, సంతోషంగా ఉండండి. ఎదురు చూడండి మరి."

ఆశ్చర్యచకితుడై బాధ్యుడు ఆమె దగ్గరగా వచ్చాడు.

"మరీయాగారూ, మీరు పాఠశాలకు కాదు, మొత్తం ప్రజలందరికీ బాధ్యులు కాగలరు. నాకు చాలా సంతోషంగా ఉంది. మీ మీద కొంచెం జాలిగా ఉంది. ఎందుకో తెలీదు కొంచెం సిగ్గుగా అనిపిస్తోంది నాకు...కానీ ఎడారి భవిష్యత్ ప్రపంచం. మీరు దేనికీ భయపడవద్దు, మీరు భయ పడదగిన విషయం ఏదీ లేదు. ఎడారిలో చెట్లు పెరిగితే ప్రజలు మీకు కృతజ్ఞులై ఉంటారు. మీకు సకల సుఖసంతోషాలూ కలగాలని కోరుకుంటున్నా."

సీరియల్

సూర్యుడు

- కె.వి. కూర్మనాథ్



(11)

(జూలై - ఆగస్టు 2013 సంచిక తరువాయి...)

రమ స్నేహితురాలు

మోహన్ అన్నాడు ఓ రోజు, సూర్యుడి స్నేహితురాలు అనుకోకుండా కలిసింది నిన్న. “నువ్వు రాస్తున్న ప్రాజెక్ట్‌కి ఏమైనా ఉపయోగపడుతుందేమో చూడు,” అన్నాడు.

అంతకంటే కావాల్సింది ఏముంది? సూర్యుడి గురించి ఎంతమంది దగ్గర సాధ్యమైతే అంత మంది దగ్గర విందామనే బయల్దేరాను కాబట్టి, వెంటనే “సరే” అన్నాను.

ఎవర్ని కలిసినా, ఎలా కలిసినా నాకు నేను ఒక నియమం పెట్టుకున్నాను. వాళ్ళు చెప్పింది వినడమే కాని, ఎక్కడ కలిశాడు, ఎలా కలిశాడు, ఎందుకు కలిశాడు, ఎవరిద్వారా కలిశారు ఇలాంటి ప్రశ్నలు అడగొద్దనే అనుకున్నాను ముందే. అవి తెలియడం నాకు ఏమంత ముఖ్యం కాదు. (పార్టీలో ఒకరి సంబంధాలు మరొకరికి తెలియనక్కర్లేదు. తెలియకూడదు అనే వాడు సూర్యుడు.)

* * *

“తను రమ,” అని పరిచయం చేశాడు ఓ రెండు రోజుల తర్వాత వాళ్ళింట్లో.

ఇంతకు ముందు ఎక్కడో చూసినట్టే ఉందామె. అందరి ఏక్టివిస్టుల్లాగానే ఉంది, చాలా మామూలుగా.

మోహన్ అప్పటికే నా గురించి, నా ప్రాజెక్టు గురించి చెప్పి ఉన్నాడు కాబట్టి టీ తాగిన కాసేపటికి మొదలయ్యింది మా సంభాషణ. నా గురించి, నా ప్రాజెక్టు గురించి ఏం చెప్పేడో నాకు తెలీదు కాబట్టి నేను చెప్పాల్సింది చెప్పడం మంచిదని నేను పెట్టుకున్న నియమాలు చెప్పేను.

తల ఊపింది. అవును నాకు అంగీకారమే అన్నట్టు, అప్రెషియేట్ చేస్తున్నట్టు.

ఏమైనా ప్రస్తావించడం వద్దనుకుంటే చెప్పమని చెప్పేను.

ఆమె మాటల్లోనే...

* * *

ఓ మంచి పుస్తకం చదివేక మనకి అనిపిస్తుంది మనం అంతకు ముందులా లేమని. మనలోకి ఏదో ఒక కొత్త ఆలోచన లేక కొత్త సంస్కారం చేరినట్టు అనిపిస్తుంది. కొన్ని పాత్రలైతే నిజంగా మనతోనే ఉన్నట్టు ఉంటాయి, రక్త మాంసాలు సంతరించుకుని.

కొందరు మనుషులు కూడా అంతే. వాళ్ళే లేకపోతే, వాళ్ళే పరిచయం కాకపోతే మనం ఎలా ఉండేదోనని. అంటే, వాళ్లేదో అయస్కాంతంలా వచ్చి మనల్ని పూర్తిగా మార్చేస్తారని కాదు. వాళ్ళు వచ్చేక మనలో ఒక సంభాషణ, చర్చ మొదలవుతుంది. మనకి తెలియని కొత్త ప్రపంచాలు, మనకి పరిచయంలేని కొత్త ఊసులు తెలుస్తూ ఉంటాయి. మానవ సంబంధాల విస్తృతి ఎంత విస్తారంగా ఉంటాయో తెలుస్తుంటాయి.

సూర్యుడితో పరిచయం నాకు అలా అనిపించింది. తను జైలునుంచి వచ్చిన రోజుల్లో. ఒక మిత్రుడి ఇంట్లో చూశాను ఓ రోజు. ఈయన ఎవరై ఉంటారబ్బా అని అనుకుంటుండగానే ఎవరో పరిచయం చేశారు. అప్పటికే తన గురించి విని ఉన్నాను కానీ, తను ఎలా ఉంటాడో తెలియదు. అదే చూడడం.

ఇక అంతే, "అవును నీ గురించి విన్నాను. నువ్వు ఫలానా పనిలో ఉన్నవట కదా," అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. అవుననే లోపలే, చర్చ మొదలు పెట్టేశాడు. నాకు తెలియకుండానే చర్చలోకి ఎంటరయిపోయాను.

ఎట్లాంటి అనవసర మర్యాదలూ, మొహమాటాలూ, అరమరికలూ లేకుండా అలా మాట్లాడేస్తుండడం నాకు భలే అనిపించింది.

ముఖాతా పరిచయం ఒక ఫార్మాలిటీ మాత్రమే అని తెలిసిపోయింది. కలవాల్సిన సందర్భాల్లో, కలవాల్సిన మనుషులు తప్పక కలుస్తారు. అప్పుడు మొదలైన ఆ సంభాషణ చివరివరకూ కొనసాగుతూ ఉంది.

* * *

అసాధారణం సాధారణంలోనే ఉంటుంది. సూర్యుడితో పరిచయం ఉన్నవాళ్లకి ఈ విషయం తెలుసు. చాలా మామూలుగా, మనలో ఒకడిగా ఉండేవాడు. కానీ అసాధారణమైన వ్యక్తిత్వం మనకి తన మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో బయటపడుతుండేది.

మీకు చెప్తా తను టైమ్ ఎలా మేనేజ్ చేసే వాడో. టైమ్, మనం చాలా తేలికగా తీసుకునే అంశం. మనలో చాలా మంది దాన్ని taken for granted గా తీసుకుంటాం. అంటే టైమ్‌కి అస్సలే గౌరవం ఇవ్వమని కాదు. కానీ, టైమ్ కి ఇవ్వాల్సిన ప్రాముఖ్యం ఇవ్వం.

తానైతే నిమిషాలూ, సెకెండ్లతో సహా లెక్క పెట్టుకునే వాడు. (సమయం మీద ఈ గౌరవంతోనే లక్ష్యాలను ఎంతో నిశితంగా ఛేదించడం నేర్పించగలిగాడు.) అయిదు నిమిషాలు దొరికితే అయిదు నిమిషాల్లో చెయ్యగలిగిన పని, అరగంట దొరికితే అరగంటలో చెయ్యగలిగిన పని - ఇలా ప్రతి నిమిషంని ఉపయోగించుకునే వాడు.

మీటింగుల మధ్య కొంత టైమ్ దొరికితే కిట్ లోంచి పేపర్ క్లిప్పింగులు తీసేవాడు. చదివి, నోట్ చేసుకునే విషయాలుంటే నోట్ చేసుకునే వాడు. (రాసుకోవాల్సిన విషయాలు తప్పనిసరిగా రాసుకోవాలనేవాడు. నల్గురికి చెప్పడానికి, కోట్ చెయ్యడానికి అలా రాసుకోవడం అవసరం అనేవాడు.)

టీ టైమ్‌లో జేబులోంచి చదవాల్సిన ఉత్తరాలు తీసి చదివేవాడు.

నాకు బాగా గుర్తు, తను ఒక ప్రో ఫార్మా తయారుచేసేడు. ఒక రోజులో ఎవరేం చేశారని. ఎంత సమయం చదువుకి కేటాయించారని. ఇక మన టైమ్‌కి మనమే లెక్క తీసుకోవాలి కాబట్టి టైమ్‌కి అకౌంటబిలిటీ వచ్చేసింది. ఇన్ని సంవత్సరాలు గడిచేక ఇప్పటికీ నాకీ అలవాటు పోలేదు. ఏ రోజు ఎవరిని కలవాలి, ఏయే పుస్తకాలు చదవాలి - వీటన్నిటికీ ప్లానింగ్ ఉండాల్సిందే.

తన ఎన్‌కౌంటర్ జరిగిందని తెలియగానే వెంటనే నాకు అనిపించింది ఒకటే - తను చెయ్యాల్సిన పనులకి టైమ్ టేబిల్ వేసుకుని ఉంటాడు కదా. అది ఏమై ఉంటుందని! ఆ రోజు, లేదా ఆ వారం, లేకపోతే నెలలో ఏమేం పనులు చేద్దామని అనుకుని ఉంటాడు. ఎవరెవరిని కలుసుకుందామని ప్లాన్ చేసుకుని ఉంటాడు. వాళ్లందరితో ఏయే పనులగురించి మాట్లాడదామని అనుకుని ఉంటాడు? ఆ పూట దొరికిన చిల్లర నిమిషాల్లో ఏయే ఉత్తరాలు చదువుదామని అనుకుంటాడు? ఇలాటి ఎన్నో ప్రశ్నలు నన్ను చుట్టుముట్టాయి.

నాకు తెలుసు - ఎవరెవరితో ఏమేం మాట్లాడదామని అనుకుని ఉంటాడో ఆ మాటలు జరగక పోవచ్చు. కానీ, తను ఏయే సలహాలు ఇచ్చి ఉండేవాడో వాళ్ళకు తెలుసు. నాకు తెలుసు. అందువల్లనే, తను లేడనే సమస్య తప్ప, లోటు తప్ప, ఖాళీ తప్ప తను చెప్పిఉండిన పనులు ఏవీ ఆగలేదు. అంతేకాదు,తన భాగస్వామ్యం లేని పనులలో ఉన్న వాళ్ళకి కూడా తెలుసు తను ఉంటే ఏయే తీర్ల తన సహాయం ఉండేదో.

* * *

కలవాల్సిన సందర్భాల్లో, కలవాల్సిన మనుషులు తప్పక కలుస్తారు. వాళ్ళు ఇక ఎన్నటికీ కలవకపోయినా ఏ మాత్రం లోటులేని భరోసా ఇస్తారు. సూర్యుడు నాకు అలాటి భరోసా ఇచ్చాడు.

ఎన్నికలలో.... ఎన్నికళలో... ఎన్నికల్లో! - బమ్మిడి జగదీశ్వరరావు

కథ :

రాజకీయ నాయకులు

పూర్వం దేశాలన్నింటినీ దేవుడే పరిపాలించేవాడట. అవసరాలను బట్టి ఆపదలను బట్టి అవతారాలెత్తేవాడట. ఆయుధాలను ధరించేవాడట. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ ఏకైక లక్ష్యంగా తన విధుల్ని నిర్వహించేవాడట దేవుడు!

మనుషుల్లోనూ జంతువులు ఉండడం దేవుని దృష్టికి వచ్చిందట. అలాంటి మనుషులు మృగాలకు ఏమాత్రం తీసిపోరని కూడా దేవుడు గ్రహించాడట. అదిగో అప్పుడే

అసత్యం పలికిన నాలుకను తెగ్గోసాడట!

అన్యాయం జరిగినా చూసీ చూడనట్లుండే కళ్ళను పెకిలించి పారేసాడట!

ఆక్రందనలు వినవచ్చినా వినీ విననట్లుండే చెవులను కోసి అవతల పడేసాడట!

స్వార్థమే ఊపిరిగా జీవిస్తున్న ముక్కును మొదలంటా కోసి తీసేసాడట!

దాహం... ధనదాహం అధికమయిన గొంతును కోసి పారేసాడట!

ఏ చేత్తో దొంగతనం చేస్తే ఆ చేతినే నరికి పడేసాడట! రెండు

గల్పికలు / అల్పికలు

యథా రాజా!

దశా దిసా లేకుండా దినమొలలతో నిలువు దోపిడీనిచ్చి నిలబడ్డారు జనం!

కోట్లాది జనం ముందు వేలాది నాయకులు చేతులు చాచి అభ్యర్థించారు!

ఇవ్వడానికి ఇంకేం ఉందని మొలమీది మొలతాడూ ముడ్డి మీది గోచీ తీసి వాళ్ళ ఎదాన కొట్టిన కొందరు అరచేతుల్నే అంగవస్త్రాలు చేసుకున్నారు.

అయినా నాయాళ్ళు... సారీ నాయకులు ఆపలేదు 'అమ్మా... తల్లీ... దయ చూపించమ్మా' 'అయ్యా... బాబూ... ధర్మం చెయ్యయ్యా...' అని మైకులు పెట్టి మరీ అడుక్కుంటున్నారు... దేశ సేవకు దిగిన వాళ్ళందరూ!

అయిదేళ్ళకోసారి ఊరూ వాడా మీద పడి... పద్దెనిమిదేళ్ళు నిండిన ప్రతొక్కరి మీదా పడి యాచించడం జనానికేం కొత్తకాదు!

'ఒక్క ఓటుంటే ఎయ్యయ్యా' అని కొందరు అంటే 'ఎన్ని ఓట్లు ఉంటే అన్ని ఓట్లూ వెయ్యండయ్యా' అని మరి కొందరు చేతులు జోడిస్తున్నారు. ఇంకొందరు నెత్తిమీద చేతులు పెడుతున్నారు.

"ఈ అయిదేళ్ళూ" మా నోటికి పోవాలి కదా?' దీనంగా దర్జాగా ఎలా పడితే అలా అడుగుతూ అక్కడితోనే ఆగలేదు!

"మీరు ఓటు ధర్మం చేస్తే, మీకు పుణ్యం వస్తుంది. మీ ఇంటికొక ఉద్యోగమొస్తుంది. మీ ఆడాళ్ళకు రక్షణ నిస్తాం. మీ ముసలాళ్ళకు పెన్షన్ ఇస్తాం. మీ అప్పులు తీర్చేసినట్టే... మీ రుణాలు మాఫీ చేస్తాం. రెండు గదుల ఇల్లు... ఇంటికి పెరడు ఇస్తాం. మీ పిల్లలకు చదువు చెప్పిస్తం. మిమ్మల్ని ఆసుపత్రిలో చేర్పిస్తాం. బియ్యం ఫ్రీగ ఇస్తాం. కరెంటు ఫ్రీగ ఇస్తాం. బంగారు భవిష్యత్తు ఇస్తాం. నవ నిర్మాణం చేస్తాం. అభివృద్ధి చేసి పారేస్తాం..." పలువురు పది విధాలుగా ఏకరువు పెట్టారు.

'రేపటి సంగతి కాదు, ఇవ్వాల ఏమిస్తారు?' అనుభవం పండి ఆకలి మీద ఉన్న అతనడిగాడు.

అడిగిన వాళ్ళకే కాదు అడగని వాళ్ళకీ - ఇంటింటికీ డబ్బు ప్రసాదం పంచారట. తాగినోళ్ళకి తాగినంత మద్యపు తీర్థం పంచారట. పంచని వాడూ పలుచనైన వాడూ లేనేలేడట.

'మనం దాన ధర్మాల కింద ఇచ్చింది ఓటు కాదు, ఈ దేశాన్ని! ఈ దేశ సంపదని! ఈ దేశ ప్రజల్ని! ప్రజల మీద అధికారాన్ని!' అని అరిచి అడవులు పట్టిన వాడు ఎన్‌కౌంటరయిపోయాడు.

తెల్లవారింది!

ప్రసాదం పాచి కంపు కొట్టింది! డబ్బు ఢబ్‌మని గుండెని పేల్చింది! నోటు కాటు వేసింది. చూపుడు వేలి మీద వెక్కిరిస్తూ దొంగనోటు! నకిలీ నోటు?

జనం ఘొల్లుమన్నారు!

తీర్థం తీసుకున్నవాళ్ళు... వాంతులు చేసుకున్నారు. కళ్ళు తేలేసారు. ఎగశ్వాస దిగశ్వాస... ఊపిరి ఆడడం లేదు. గుండెలోకి వచ్చీ పోయే గాలి స్తంభించింది. నకిలీ మద్యం!

హాహాకారాలు! ఆసుపత్రుల నిండా ప్రజాస్వామ్యం!

ప్రాణాలు పోయి స్వర్గలోకం తలుపు తట్టింది ప్రజాస్వామ్యం!

నకిలీ నోట్లతో నకిలీ మద్యంతో సింహాసనం అధిష్టించిన

సామెతలు :

ఒక ఒరలో రెండు
కత్తులు ఇమడవు!

ఒక పొత్తులో
ఎన్నో కత్తులు
ఇముడుతాయ్!

* * *

నీరు పల్లమెరుగు,
నిజం దేవుడెరుగు!

మద్యం
మత్తు నెరుగు,
ఓటు
దెయ్యమెరుగు!

* * *

త్యాగఫలం

అరవై యేళ్ళ సంది కొట్లాట ఆవిరైపోయెరో
అమరులైన పన్నెండొందల మంది ఎటు పోయెరో
అమ్మే తెలంగాణ తెచ్చింది యిచ్చిందని చెప్పెరో
అయ్య రాహులుని ప్రధాన మంత్రిని చేస్తే చాలంటరో

మద్దెల దరువు

మెనూ రెడీ తినూ అని చేరిందొక కొత్త వంటకం!
సీమాంధ్ర పాత వారసులే ఇక్కడ తెలంగాణ వంటగాళ్ళు!
వడ్డించే ఒక్క గాడిదే తన్నింది మనల్ని నిన్నటిదాకా!
ఇక రెండు గాడిదలతో ఎడాపెడా తన్నులు ఎప్పటిదాకా?

దొంగనోట్ల దొంగ వోట్ల రాజ్యం ఒక రాజ్యమా? / లంచగొండి వెధవలిచ్చు సాక్ష్యం ఒక సాక్ష్యమా? - శ్రీశ్రీ

కథ :

చేతులతో దోపిడీ చేస్తే రెండు
చేతులూ శరీరం నుండి వేరు
చేసేసాడట!
మానభంగము చేసిన
అంగమును కోసి పారేసాడట!
కామ క్రోధ మద మత్సరాలతో
సిగ్గూ ఎగ్గూలేని మందం తోలు
చర్మాన్ని ఒలిచి విసిరేసాడట!
నీతి తప్పి అవినీతి వేపు
అడుగువేసిన కాళ్ళను నరికి పోగులు
పెట్టాడట!
నిత్యమూ కుట్రలూ
కుతంత్రాలతో ఉన్న తలను నరికి
మొండాన్ని మిగిల్చాడట!
దేవుని పని పూర్తయ్యింది!
దేవుడు శాంత కపోతాల్ని ఎగుర
వేసుకుంటూ దేవలోకం
వెళ్ళిపోయాడట!
అయితే - తెగిన నాలుకా,
పీకేసిన కళ్ళూ కోసేసిన చెవులూ
ముక్కూ గొంతూ నరికేసిన చేతులూ
కాళ్ళూ ఒలిచేసిన చర్మమూ తెగ్గోసిన
అంగమూ తెగ నరికిన తలా...
అన్నీ ఒకదానికొకటి
అతుకున్నాయట. అవయవాలు
ఎక్కడివక్కడ చేరి అక్కడో మనిషి
మొలిచాడట!
ప్రజలు అడగకముందే నేను
దేవుని ప్రతినిధిని అని చెప్పాడట!
మీకు నాయకుణ్ణి అని కూడా
సెలవిచ్చాడట!
దేవలోకం నుండి దేవుడింకా

గల్పికలు / అల్పికలు

నాయకులు నకిలీ పాలనతో మరింతగా రాణించారు!

తథా ప్రజ!

ఓట్లు వెయ్యడానికి సిద్ధమయ్యారు ప్రజలు!

బూత్‌వైపు వెళ్ళడం మానేసి బూతులు... బండబూతులు తిట్టడం మొదలు పెట్టారు!

స్లిప్పులు తీసుకు వెళ్ళిన ఏజెంటుని నిన్నటి వరకూ దండం పెట్టినా - మనోడన్నా గాని - వాడు దొరకగానే బడితె పూజ చేసారు. నెత్తి బద్దలు గొట్టారు.

జెండాలు మోసిన కర్రని తిరగేసి దొరికిన వాళ్ళని దొరికినట్టు కొట్టారు... చోటా నాయకులు చేతికి చిక్కకుండా తుప్పాడొంకా దాటి చెరువూ ఎరువులో పడి పారిపోయారు.

గొంతెండి పోతోంది...!

పిల్లా పాపని పక్కన పెట్టి ఎండా వానా కానకుండా ఎదురు చూస్తూనే ఉన్నారు!

'ఎప్పుడూ ఇలాంటి కరువు లేదు... దొంగ నాయాళ్ళు దొరకాలి... అడికి మూడేసిందీ..' పల్లు లేని వాళ్ళు కూడా పల్లు పట పట కొరికారు.

వేళ మించిపోతోంది...

'రండ్రా బాబూ... మీ పవిత్రమైన ఓటుని వేసేసి... ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండ్రా...' కలక్టరుగారు మందీ మార్బలంతో వచ్చారు. గడ్డం పట్టుకు బతిమాలారు.

అప్పుడు అసలు కథ బయటకొచ్చింది...

"ముసుగులో గుద్దులాట ఏల? ఓటుకు వెయ్యో పయ్యో... ఈ ఏడు కాదు, ప్రతి ఏడు ఇచ్చేవాళ్ళే కదా? మేం కొత్తగా అడగడం లేదు, ఓటు వెయ్యిమనీ చెప్పడం లేదు! ముడి విప్పాడో ముసలాడు అందరికీ ఇచ్చారు, మాకెందుకివ్వరు? మా ఓటు చెల్లదా?' చెల్లమ్మ చెరిగిపోయింది. 'ఒక ఫుల్ ఇస్తే... వచ్చేస్తామా?' పెద్దయ్య నిలదీసాడు.

'ఓట్లు బహిష్కరించడం నేరం...' కలక్టరు గాంభీర్యంగా గొణిగాడు.

'ఓట్లుని బహిష్కరించడమేటండీ? మమ్మల్నే బహిష్కరించితే? అందరికీ ఇచ్చి మాకే ఇవ్వలేదంటే, మమ్ముల్ని బహిష్కరించినట్టు కాదా?' లాజిక్‌తో దంచి పడేసాడు ప్రెసిడెంటు.

'ఆల తరుపున మీరిస్తారా చెప్పండి' ఒకడు కలక్టర్ని నిలదీస్తే, 'కలక్టరేమిస్తాడు ఆల తరుపున?' మరొకడు అంటే, 'మరి ఆల తరుపున ఏల వచ్చినాడు?' పోరా బాబు అన్నట్టు చూసారు జనం.

'ఏదో స్కీము కింద డబ్బులు తీసి ఇవ్వండి...' ముసల్ది అడ్డ పొగ వదిలింది. 'అప్పుడది స్కీమవదు, స్కాముపుతుంది' చదువుకున్న కుర్రాడు అన్నాడు. 'ఏదో ఒకటి డబ్బిచ్చి మాట్లాడు. ఒక్క రూపాయి ఎక్కువివ్వొద్దు. అందరికి ఎంతిస్తే అంత...!' మధ్యవర్తి తీర్పు చెప్పేశాడు.

కలక్టరుకు తల తిరిగింది. కళ్ళు మూసుకున్నాడు. కాసేపటికి కళ్ళు తెరచి చూస్తే - పార్టీ ఆఫీసులూ, పార్టీ నాయకుల శిలా విగ్రహాలూ, జెండాలు బేనర్లూ... అన్నీ తుపాన్ వచ్చినట్టు తుత్తినియలు అయిపోయి ఉన్నాయి!

ఫ్యామిలీ మేనిఫెస్టో

'పట్టు చీరలేం ఖర్మ? ఏడు వారాల నగలు చేయించి యిస్తానే!' ప్రాధేయపూర్వకంగా పెళ్ళాం వంక చూసాడు... ఎలక్షన్లకు రెడీ అయిన నాయకుడు.

'నీకు బిఎమ్‌డబ్ల్యూ కారు కొనిస్తాను, సరేనా?' కొడుకు వంక ప్రేమ పూర్వకంగా చూసాడు నాయకుడు.

'అల్లుడిగారి పేరున ఇంజనీరింగ్ కాలేజీ, నీ పేరున మెడికల్ కాలేజీ పెట్టి నీ చేతికిస్తాను, సరేనా?' కూతురు వంక వాత్సల్యపూర్వకంగా

సామెతలు :

తుమ్మితే
ఊడిపోయే ముక్కు!
ఆంధ్రాలో తెలుగు
దేశం బీజేపి పొత్తు!

* * *

కాలు జారితే
తీసుకోగలం. నోరు
జారితే తీసుకోలేం!

కాలు జారితే
తీసుకోగలం. వేలు
జారితేనే
తీసుకోలేం!

* * *

సోకొకడిది

అమ్మకు గుడికడతారు, అమరులని మరుస్తారు!
తల్లి రుణం ఓటేసే తీర్చుకోవాలట, వీరు వీర భక్తులట?
తెచ్చింది మేమంటే ఇచ్చింది మేమని డప్పులు వాయిస్తున్నారు!
ప్రాణాలను ఇచ్చి పోరాడిన వాళ్ళంతా యాదిలోన సోదిలోన లేకుండా ఉన్నారు!

జాగర్త!

గడియలిడిసి గడపలిడిసి పారిపోయే అలనాటి దొరలు!
తెలంగాణకు జైకొట్టి ఊరిలోకి మళ్ళ వచ్చె ఆహా ఏమి దొరలు?
దొంగవడో దొరవడో తెలియకుంట రానిచ్చిన రాణిస్తరు!
సోయి ఇడిస్తే బలిదానాల బతుకమ్మ బతుకుని కుక్కలు చించిన విస్తిరి చేస్తరు!

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి / చిలుక పలుకుల డేగలు / రక్తం తాగే రాబందుల మూకలు..... - చెరబండరాజు

రాలేదు, అందుకే మనం ఇంకా అలాంటి రాజకీయ నాయకుల పాలనలోనే ఉన్నాం... ఉండి పోయాం!

వల

సింహం వలలో పడింది. ఒక్క సింహమే కాదు, అడవిలోని అన్ని సింహాలూ పులులూ ఎక్కడివక్కడ వలల్లో ఇరుక్కున్నాయి! క్రూర జంతువులన్నీ సాధు జంతువుల్లా ప్రేమగా లాలనగా బుజ్జగింపుగా చూస్తున్నాయి!

అయిదేళ్ళకోసారి వలలో ఇరుక్కోవడం అదో సాంప్రదాయం.

అంతకు మించి అడవికి అర్ధరాత్రి వచ్చిన స్వాతంత్ర్యానికి కొండ గుర్తు!

అలవాటుగా చిట్టెలుక వచ్చింది. ఒక్క చిట్టెలుకే కాదు, అడవిలోని అన్ని చెట్టెలుకలూ చెవుల పిల్లులూ ఉడతలూ మిడతలూ తేళ్ళూ తాబేళ్ళూ చిలుకలూ కోయిలలూ ఎక్కడివక్కడ వలల ముందుకు చేరాయి! అల్ప ప్రాణులన్నీ ఆశగా ఆందోళనగా అయోమయంగా చూసాయి!

అయిదేళ్ళకోసారి వలల్ని కొరికేయడం అదో సాంప్రదాయం. అంతకు మించి అడవికి అర్ధరాత్రి వచ్చిన స్వాతంత్ర్యానికి కొండ గుర్తు!

"ఊc.. కానివ్వండి... మీ నోటిలోని పళ్ళే ఈ రాజ్య వ్యవస్థను చూసాడు.

'ఒరే బామ్మర్దీ... నువ్వు ఎక్కడ కావాలంటే అక్కడ తవ్వుకో. మైనింగులే నీవి...' గెడ్డం పట్టుకు బతిమాలాడాడు.

బంధుమిత్ర సపరివారం వంక చూసి 'నా బినామీ ఆస్తులన్నీ మీ పేరు మీదనే రాస్తాను, సరేనా?' అన్నాడు నాయకుడు. అందరూ కలసి అదోలా చూశారు.

'ఎలక్షన్లు జరిగి నేను గెలిస్తే...' దీనంగా చూసాడు నాయకుడు. నమ్మమన్నట్లుగా.

'పబ్లిక్కి హామీలిచ్చినట్టు మాకు హామీలిస్తే నమ్మం. మీరు చెప్పినవన్నీ ఫేమిలీ మ్యానిఫెస్టోలో చేర్చండి...' ముక్త కంఠంతో డిమాండ్ చేసారంతా!

గీతాసారం

'అంతన్నారు, ఇంతన్నారు, చివరకు సంతన్నారేం మావా?' అల్లుడి గుండె గుభ గుభ లాడింది.

బతుకు సంతయి పోయిందని మరోసారి బావురుమన్నాడు మావ.

'జెండా పీకేద్దాం, కండువా మార్చేద్దాం...' నిలబడి కలబడిపోయాడు అతగాడి తమ్ముడు. పార్టీ ఆఫీసుకు నిప్పెట్టెయ్యడానికి సిద్ధమైపోయాడు.

'నువ్వాగరా... మీ పార్టీ అధ్యక్షుడేమన్నాడు మావా?' అడిగాడు అల్లుడు.

'ఎగస్పార్టీని వీక్ చెయ్యడానికీ ఎగస్పార్టీ వోడిని పార్టీలో చేర్చుకొని మరీ టికెట్టు యిచ్చాడట...' మావ చెప్పడం పూర్తి కాలేదు, 'మరి మనం ఇన్నాళ్ళూ పార్టీలో ఉండి జెండాలు మోసింది దేనికి?' పెట్రోల్లా భగ్గుమన్నాడు తమ్ముడు.

'ఎమ్మెల్సీ ఉందన్నాడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఉందన్నాడు, మున్సిపాల్టీలు... కార్పోరేషన్లూ...' మావకి మళ్ళీ చెప్పే అవకాశం లేకపోయింది. అన్నీ ఉన్నాయి, అల్లుడి నోట్లో శని ఉంది...' తమ్ముడు తైతక్కలాడాడు.

'పార్టీని గెలిపించు, నీకు తగిన న్యాయం చేస్తాను... అని అన్నాడ్రా...' చెప్పాడు మావ. 'నిన్నటి దాక తిట్టినోణ్ని ఎలా పొగడాలిరా?' తమ్ముడు తగ్గలేదు.

'మన పార్టీ యిక్కడ ఓడిపోవాలి. అప్పుడే మన విలువ తెలుస్తుంది. వేపచెట్టుని వేస్తే మఱ్ఱి చెట్టయిపోతే మరి పీకలేం, లాగలేం, వాడు గెలిచాడా... ఇక సిటింగు ఎమ్మెల్యే అయిపోడూ?' అల్లుడు ఆలోచనగా చూశాడు.

అంతా నిశ్శబ్దంగా చూసారు.

'మనం మన పార్టీకి ఓటెయ్యకూడదు. మనం మన పక్షంలోనే ఉండాల. మన పక్కనున్న వాడి తల పగిలి పోవాల... అదీ... అర్ధమయింది గదా? ఒక్కోసారి మనం ఓడిపోవడం వల్లే గెలుస్తాం!' చెప్పాడు అల్లుడు.

అర్థమయినట్టు ఒకర్నొకరు చూసుకొని, పార్టీ ప్రచారానికి ఉత్సాహంగా బయల్దేరారు!

చాయ్ చిత్రం

కొన్నిసార్లు నిప్పు లేకుండా కూడా పొగ వస్తుంది! ప్రజా రాజ్యాన్ని, సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్‌లో కలిపేసిన చిరంజీవి ఆ పార్టీని అందరూ వదిలి వెళ్ళినా తనే సైన్యంగా పనిచేస్తున్నాడు. అలాంటి పెద్ద మనిషి మీద ఒక నింద పడింది. నింద కాదు, నిరూపిస్తాం' అని కొందరు ముందు కొచ్చారట!

పరమ పద సోపానం

అయిపోయిన పెళ్ళికెందుకు భజంత్రీల బాజా!
దాహమేసిన మనిషికెందుకు నీళ్ళు లేని కూజా!
పోయినోళ్ళందరూ మంచోళ్ళంటే కుదురుతుందా వైకుంఠయాత్ర?
పోయి నాలుగేళ్ళయినా ఓదార్పేనంటా కలిసోస్తుందా ఎన్నికల మాత్ర?

దర్శనం 2020

పచ్చకామెర్ల కళ్ళకి లోకమంతా పచ్చన!
పసుపు పూస్తే కాళ్ళకి, నోరు ఎర్రగ పండునా?
సింగపూరు చేసి పెడితే కన్నతల్లి ఆంధ్రని
పూర్ పూరి గుడిసెలన్నీ తొలగి వెలగి పోవునా?

సామెతలు :

తల్లికు
కూడు పెట్టని వాడు
పిన తల్లికి చీర
పెడతాడట!

గెలిచాక ముఖం
చూపించని వాడు
ముఖ చిత్రం
మార్చేస్తాడట!

* * *

వెనుకటికి కూలిచ్చి
గుద్దించుకున్నట్టు

ముందటికి ఓటేసి
వాపోయినట్టు

* * *

ఇంటింట చీకటే ప్రతికంట కన్నీరె / రాజ్యమెవరికి వచ్చెనో - రాజన్న / సుఖములెవరికి దక్కెనో.... - చెరబండరాజు

కథ :

నిలబెట్టే సాధనం, కాదు
ఆయుధం... మీ పళ్ళను
ఉపయోగించండి... ప్రజాస్వామ్యాన్ని
కాపాడండి...' అని రాజ గురువులూ
వ్యవస్థ మూల స్తంభాలుగా ముద్ర
పడ్డ నక్కలు ఊలలు వేసాయి!
నగారా మోగింది!
అల్పజీవులన్నీ ఊపిరి తియ్యడం
మరిచిపోయి చూస్తూ
నిలబడిపోయాయి!
'మీరే మా దేవుళ్ళు. మీరే మా
తలిదండ్రులు. మీరే మా
స్నేహితులు...' వలల్లోంచి క్రూర
జంతువులన్నీ చేతులు చాచి
అల్పప్రాణుల ఒళ్ళంతా నిమిరాయి.
మీకిలాగే సేవ చేస్తామన్నాయి.
బానిసలమంటూ చేతులు
జోడించాయి. మీకు ఇల్లిస్తాం...
ఉద్యోగమిస్తాం... మా పాలనలో
మిమ్మల్ని చల్లగా చూసుకుంటాం...
అని ఆత్మీయ వచనాలు పలికాయి!
'మా బలం మీదే...
మీరిచ్చిందే...' మాటకు
అల్పప్రాణులు అల్ప సంతోషంతో
ఒళ్ళు మరిచి గంతులేసాయి.
వలను మన పళ్ళు
ఉపయోగించి కొరక్కుంటే - పెద్ద
జంతువులు పంజా విసిరి వలను
తామే చించి బయటకు వచ్చి
ప్రజాస్వామ్యాన్ని ఎలా
కాపాడుకుంటాయో తెలిసిన
వయసెరిగిన అనుభవంతో

గల్పికలు / అల్పికలు

చిరంజీవి మోడీని సమర్థిస్తూ పాటలు పాడుతూ ఉన్నాడని హస్తిన వరకూ హాట్ వార్త వెళ్ళింది. ఆరా తీస్తే ఆంధ్రా అంతటా కమలం రథ చక్రాలకి మైకులు బిగించి ఆ పాటే వేస్తున్నారట? చిరంజీవి గొంతుతోనే పాట!

"ఏ ఛాయ్ చటుక్కున తాగరా బాయ్
ఈ ఛాయ్ చెమక్కులే చూడరా బాయ్
ఛాయ్ గరీబ్‌కీ బంధువేనోయ్...'

కాంగ్రెస్ పార్టీని చిరంజీవి బీజేపీలో కలిపేస్తాడని కొందరు కార్యకర్తలు కంగారు పడితే - అలా అయితేనే గెలుస్తాం, అందులో తప్పేముంది?' అని మరి కొందరు కార్యకర్తలు వాదించారట.

మోడీజీ చిరంజీవికి ఫోన్ చేసి థాంక్స్ చెప్పేడనీ - చిరంజీవి కూడా 'పార్టీలు వేరయినా మనమంతా ఒక్కటే'నని అన్నారనీ - కొంతమంది గుసగుస లాడుకున్నారట.

అన్నదమ్ములిద్దరూ ఒకే పార్టీకి మద్దతివ్వడం బాఉందని పవన్ కళ్యాణ్ ఫాన్స్ తెగ సంబరపడిపోయారట!?

రూలర్

విశ్వాసానికి విశ్వరూపమే నేను...' అన్నదా కుక్క. తనను నమ్మమంది. నమ్మి తనకు ఓటేస్తే రక్షణ కల్పిస్తానంది. ఎన్నికల వేళ కదా... మనుషులతో మసలి మసలి మాటలు నేర్చడమే కాదు, మనుషుల్ని అనుసరించడమూ వచ్చింది!

'నీకు ఓటేస్తే నువ్వేం చేస్తావ్?' కుక్కను అడిగారెవరో.

'ఎప్పటిలా నా తోకను వంకర పోనివ్వకుండా ఈ అయిదేళ్ళూ తోకను తిన్నగా రుళ్ళ కర్రలా ఉంచి రూల్ చేస్తాను' అని తోకని తిన్నగా లాగినట్టు చేసి ఒక ఊపు ఊపింది కుక్క.

అది నిజంగా కుక్క తోకో రాజకీయ నాయకుల బుద్ధో ఆ కుక్క చుట్టూ గుమికూడిన వారెవరికీ అర్థం కాలేదు!?

గెలుపు

'మా పార్టీయే గెలుస్తుంది!' అంటే - 'మా పార్టీ అభ్యర్థులే గెలుస్తారు' అని అంటే - 'మా పొత్తులదే గెలుపు' ఏ పార్టీకా పార్టీ... అన్ని పార్టీలు 'గెలుపు మాదే' అని ప్రకటించేసాయి!

చెప్పినట్టుగా అందరూ గెలిచారు! అందరి మాట నిజమయ్యింది!?

జెను మరి 'మా పార్టీని వదిలి వెళ్ళిన మా వాళ్ళే గెలిచారు' అని ఒక పార్టీ అంటే - 'మా పార్టీనే గెలిపించారు' అని మరొక పార్టీ అంటే - 'మా సమీకరణలే గెలిపించాయి' అని పొత్తుల పార్టీలు అన్నాయి.

నిజమే మరి... అందరి మాట నిజమయ్యింది!?!

గీ....

మైక్ టెస్టింగ్ వన్ - టూ - త్రీ -' అన్నంత వరకూ పని చేసిన మైకులు ఆ తర్వాత ఒక్కసారిగా 'గీ' మన్నాయి! అన్ని సభల్లోనూ అదే తంతు! పొలిటీషియన్లు మైక్ అందుకోగానే 'గీ'మని ఒకటే గోల! టెక్నీషియన్లు వాల్యూమ్ తగ్గించినా యేం చేసినా 'గీ'మని మొరాయించడం మానలేదు మైకులు! ఈ విషయమై పరిశోధకులు వివిధ రకాల పరిశోధనల్లో భాగంగా రకరకాల వ్యక్తులకు మైకిచ్చి మాట్లాడించారట! అప్పుడు మైకులన్నీ బ్రహ్మాండంగా పని చేసేసాయట!? పొలిటీషయన్లు అందుకుంటే మాత్రం మైకులు 'గీ'మని మొరాయించేయట!?!

ప్రాబ్లమ్ అర్థం చేసుకున్న పరిశోధకులు ఎప్పుడూ మాట్లాడేదే మాట్లాడ వద్దని పొలిటీషయన్లకు సూచించారట. కొత్త విషయాలు మాట్లాడమని కోరారట. దాంతో కొందరు పొలిటీషియన్లు అవమానం

సామెతలు :

ఇంట్లో
ఈగల మోత...
బయట
పల్లకీల మోత

* * *

పార్టీల
పదిమంది లేరు...
పొత్తుల్లో
మాత్రం ఎచ్చులు
పోయినట్టు

* * *

చదివేది
రామాయణం
పడగొట్టేది
దేవాలయం

కోరింది
ప్రజాక్షేమం
దోచింది
దేశ ఖనిజం

* * *

కొత్త సీసా

జెండా కొత్తదైనా ముఖం పాతదే!
పాత ముఖం కనిపించకుండా కొత్త జెండా!
పార్టీలు మారిన అసలు రంగు మారునా?
తరతరాల తలరాతలు ఎన్నికలతో మారునా?

నమో

మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి వెలిగి నిలుచును...
గురజాడ మాట కాదన్నది గుజరాతు! దేశమంత 'నమో' నమామి!
నెత్తురు తాగి మనిషి మాంసం రుచిమరిగిన పెద్దపులేనట ఇక రాజు!
'లౌకిక' రాజ్యానికెప్పుడూ శ్రీరాముడే రక్ష! దులపాలి ఎర్రకోట బూజు!

నన్నూ నా తరాన్నీ కూలేసిన / ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం / వైఫల్యానికి చిహ్నం ఇది / ఈ వారసత్వం ఇకముందు సాగదు - చెరబండరాజు

కథ :

ముందుకొచ్చాయి కొన్ని జీవాలు.
అవి వలను కొరకడం మొదలు
పెట్టాయి.
'ప్రతి ఒక్కరూ తమ పళ్ళని
వినియోగించు కోవాలి. పళ్ళు
పవిత్రమయినవి...' నక్కలు ఊలలు
వేస్తుంటే – కొరకని వాళ్ళని ఖూనీ
కోర్లుగా చూస్తుంటే – 'ఏ రాయి
అయితేనేం పళ్ళు
ఊడగొట్టుకోవడానికి' అని – 'కొరక్క
చస్తానా?... కొరికీ చస్తాను'
అనుకొని మరికొన్ని జీవులు
ముందుకొచ్చి పళ్ళకు పని చెప్పాయి.
ఓ పనై పోతుందన్నట్టు...
అదేమిటో సగటున సగం
జంతువులే తమ పళ్ళను
ఉపయోగించుకుంటున్నట్టు లెక్కలు
తేల్చాయి. అది కూడా భయపడి
లోభపడి వేసేవేనట!? అధికారంలో
ఉన్న పంజాలుగాని స్థానికంగా ఉన్న
పంజాలు గాని తామే ఎక్కడ
వలలను కొరికేసుకుంటాయోనని
తమ పళ్ళను
వినియోగించుకుంటున్నారట...
కల్లు పోసినందుకో నాణేలు
ఇచ్చినందుకో తమ
కులపోడయినందుకో
ఎందుకోకందుకు పళ్ళను
వినియోగించుకొనేవాళ్ళే ఎక్కువట.
మరి మిగతా సగం పళ్ళకు పని
చెప్పకుండా ఏం చేస్తున్నట్టు?
అలక్ష్యమో నిర్లక్ష్యమో కాదట...

గల్పికలు / అల్పికలు

భరించలేక మైకులు విరగొట్టేసారట.

నోరున్న మనుషుల కన్నా నోరు లేని మైకులే బెటరని కొందరు మేధావులు గుసగుసలాడుకున్నారట!

కొత్త చిత్రం

కథాంశం :	ప్రేమంటే – ఇవ్వడమే కాదు, తీసుకోవడం కూడా! ఒక్క మాటలో చెప్పాలంటే ఇచ్చిపుచ్చుకోవడం.
నటీనటులు :	మీరెరిగిన వారే
సాంకేతిక నిపుణులు :	తెర వెనుక ఎ1 నుండి ఎ10 వరకు అందరూ!
రీమిక్స్ సాంగ్ :	నీకు నేనూ నాకు నువ్వూ ఒకరికొకరం నువ్వూనేనూ చరితలోనూ నిలిచిపోయే ప్రేమికులమే నువ్వూ నేనూ నింగి నేలా నీరూ సాక్షిగా కొండా కోనా వాగూ సాక్షిగా ఆలయాన దైవం సాక్షిగా గుండెలోని ప్రేమ సాక్షిగా
చిత్రం పేరు :	క్విడ్ ప్రో కో
విడుదల తేదీలు :	తెలంగాణలో ఏప్రిల్ 30 ఆంధ్రప్రదేశ్‌లో మే 7

గుసగుసలు

పవన్ కళ్యాణ్ పార్టీ ఏదో పెట్టబోతున్నాడట... వార్త వచ్చీ రాగానే ఉ'భయ' కమ్యూనిస్టులు స్వాగతం పలికారట! జనసేన పార్టీ ప్రకటించాక... ముచ్చటగా మూడో మీటింగు చూసి మూడ్ పాడు చేసుకున్నారట 'ఐ' అండ్ 'ఎమ్' బాధ పడ్డారట!?

మోడీలాంటి మతతత్వ వాదికీ – సామ్రాజ్యవాది చంద్రబాబుకీ మద్దతు ఇచ్చినందుకేమో?నని కొందరు అనుకున్నారట?!

ఉభయులూ అప్పుడే పుట్టిన పార్టీ మీద అంత అక్కసూ అంత ద్వేషమూ అంత అసూయ పడడం దేనికో?'నని మరి కొందరు ఆరా తీసారట!?

'వీడి వల్ల మనకి ప్రమాదం!' ఉభయులదీ ఒకే గొంతట.

ఇంతకీ ఎందుకంత ఆవేదన' అని అడిగితే –

'జనసేన పార్టీ పుట్టకముందే పొత్తులు పెట్టుకుంది. పుట్టాక మనల్ని మించిపోతుందేమో' అని గుసగుసగా ఉభయులూ వాపోయారట!?

జంపర్స్

టిక్కట్లు ఖరారయిన అభ్యర్థులతో ఎక్కడికక్కడ మీటింగులు పెట్టాయి పార్టీలు.

తెరాస మీటింగులో 'కాంగ్రెస్‌కే మీ ఓటు...' అనేసి అభ్యర్థి నాలుక్కరచుకున్నాడు.

కాంగ్రెస్ మీటింగ్‌లో 'కారు గుర్తుకే మీ ఓటు...' అనేసి అభ్యర్థి నాలుక్కరచుకున్నాడు.

తెలుగు దేశం మీటింగులో 'మోడీకీ మీ ఓటు...' అనేసి అభ్యర్థి నాలుక్కరచుకున్నాడు.

బీజేపి మీటింగులో 'ఫేను గుర్తుకే మీ ఓటు...' అనేసి అభ్యర్థి నాలుక్కరచుకున్నాడు.

వైయ్యస్సార్ సీపీ మీటింగులో 'చెయ్యి గుర్తుకే మీ ఓటు...' అనేసి అభ్యర్థి నాలుక్కరచుకున్నాడు.

సామెతలు :

చింత చచ్చినా
పులుపు చావదు!

హామీలు ఇచ్చినా
అమలు పరచరు!

* * *

పిండి కొద్దీ రొట్టె!
పెట్టుబడి కొద్దీ
ఓటు!

* * *

ఉట్టికెగరబాకలేనమ్మ
స్వర్గానికెగబాకినట్టు

వార్డు మెంబరుగా
పనికిరానోడు
అసెంబ్లీకు అర్హత
తనకే ఉందన్నాడట

* * *

వారసులు

ఒక చెంపను కొడితే
వేరొక చెంపను చూపాలి!
ఒక సీటుని ఇస్తే
మన వాళ్ళకు మరో సీటుని కోరాలి!

ఉప్పు సముద్రం

కాంగ్రెస్ పార్టీ ఒక మహా సముద్రమట!
నదులన్నీ వచ్చి చేరి కలవాల్సిందేనట!
నిజమే, ఏనాటిదీ నిలువ నీరు?
దాహం తీర్చదు గదా ఉప్పునీరు?

చల్లబడదు చల్లబడదు తెలంగాణ విప్లవాగ్ని / మళ్లా చెలరేగుతుంది ఆగకుండ పోరుతుంది / నక్సల్‌బరి అడుగులోన అడుగు వేసి నడుస్తోంది - చెరబండరాజు

కథ :

క్రూర జంతువుల పట్ల నమ్మకం లేకనేనట. చిన్నదయినా పెద్దదయినా క్రూర జంతువు క్రూర జంతువేనని నమ్మడం వల్లనేనట.

అందువల్ల అది బహిష్కరణ అవుతుంది. అది ప్రమాదం! అదే తిరస్కరణ అయితే అది ప్రమోదం?

'వలను కొరక్కుండా తిరస్కరించే హక్కు మీకుంది... అయితే పళ్ళను ఉపయోగించి మాత్రమే ఆ పని చేయాలి...' అంటూ కొత్త సవరణను తీసుకు వచ్చింది రాజ్య రక్షణ వాది కొండ చిలువ.

'తిరస్కరణ పెడితే – మనల్ని తిరస్కరించినట్టు కాదా?!' వృద్ధ జంబూకం అనుమానపడింది.

'ముందు ఈ ప్రజాస్వామిక ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి. కాదంటే వ్యవస్థ కుప్పకూలుతుంది. క్రూర జంతువులకు రక్షణ కరువవుతుంది...' తేల్చి చెప్పింది కొండ చిలువ.

'చిట్టి పొట్టి జంతువుల్లారా... మీరు స్వేచ్ఛగా మీ విలువైన పళ్ళను ఉపయోగించుకోండి... మీకు నచ్చిన వలను మీరే ఎంపిక చేసుకోండి... వెళ్ళండి.. కొరకండి...' నక్కల నగారా నింగి వరకు ప్రతి ధ్వనించింది.

అల్పప్రాణులన్నీ ఎప్పటిలాగ 'అదా? యిదా? ఏదో ఒకటి...'

గల్పికలు / అల్పికలు

అలవాట్లో పొరపాటని ఎక్కడి వాళ్ళక్కడ గప్‌చిప్ అయిపోయారు! మీటింగులన్నీ విజయవంతమయ్యాయి కూడా!?

ఓటేసే అవకాశమివ్వండి!

నోరు లేని మూగజీవాలన్నీ కలిసి రోడ్డెక్కాయట! మాకు ఓటు వేసే అవకాశం ఇవ్వాలని – మేం కూడా ఈ సమాజంలో భాగమేనని – ఆ మధ్య జరిగిన 'జీవ వైవిధ్య సదస్సు'లో జరిగిన ఒప్పందాలన్నీ అమలు చెయ్యాలని డిమాండ్ చేసాయట!? కుక్కలూ, కోళ్ళూ, ఆవులూ, గేదెలూ, గాడిదలూ, గుర్రాలు లాంటి పెంపుడు జంతువులతో పాటు అడవి వదిలి నగరాలకొచ్చిన చిరుతపులులూ, ఎలుగుబంట్లూ, ఏనుగులూ గొంతు కలిపాయట!

అదెలా సాధ్యం?' అని అడిగితే – ఓటు వేయడమే గాని ఏనాడూ నోరు విప్పని మనుషులు మాలాగే మూగజీవాలు కాదా?' అని తిరిగి ప్రశ్నించాయట. పైగా ప్రకృతి సమతుల్యతకీ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత యిచ్చిన వాళ్ళకే మా ఓటు' అని కూడా చెప్పాయట. (అలాంటి వాళ్ళు అగుపించడం లేదని నొచ్చుకున్నాయట) దాంతో బ్లూక్రాసు వాళ్ళే కాదు, పర్యావరణ ప్రేమికులూ మూగజీవాల డిమాండ్లకు మద్దతు పలికారట కూడా!?!

రెండు విన్నపాలు

ప్రధాన మంత్రి అయ్యే అవకాశం లేనే లేకపోవు గాక! అద్వానీ గారి పరిస్థితి ఎంత అధ్వాన్నమైనా అవుగాక! అశలు అడుగంటి పోవుగాక! అయినా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న తపనతో తహతహతో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఆయన లేఖ రాసారట! 'గత ఎన్నికల్లో ఎవరైతే ఓటు వెయ్యలేదో అలాంటి వారికి ఈసారి ఓటేసే అవకాశాన్ని నిషేధించాలని! అలాగే కొన్ని దేశాల్లో ఓటు వెయ్యని వారికి జరిమానా విధిస్తారని... కాని మన దేశంలో ఓటేయని వారిని నిషేధించాలని...' కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళారట!

ఓటు వేసినా వెయ్యకపోయినా తమ జీవితాల్లో వచ్చే తేడాలేదని – ఓటేయని ఓటర్లంతా ఒక చోట చేరి ఏకగ్రీవ తీర్మానం చేసేరట?! ఆ వివరాలు ఎన్నికల కమిషన్‌కు పంపాలనుకున్నారట? 'మ్యానిఫెస్టోలతో ఆశలు నింపి, హామీల మీద హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పార్టీలు గాని ఆయా పార్టీల నాయకులు గాని చెప్పినవి నెరవేర్చకోకపోతే – ఆ పార్టీలనీ ఆయా నేతల్ని మళ్ళీ ఎన్నికల్లో నిలబడే అవకాశం ఇవ్వకుండా నిషేధించాలని...' విన్నవించుకున్నారట!

అయితే ఈ రెండు విన్నపాలలో మొదటి విన్నపం కన్నా రెండవ విన్నపానికే మంచి ప్రతిస్పందన ప్రజల నుండి వచ్చిందని అభిజ్ఞ వర్గాల భోగట్టా అట!?!

?

హెల్ప్ లైన్ నెం : 1950

ఉద్దేశం : ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై ఫిర్యాదు చేసేందుకు గాను –

సెక్షన్ : '171 బి' కింద కేసుల నమోదు!

శిక్ష : ఏడాది జైలు!

కేంద్ర ఎన్నికల కమిషను ఏర్పాటు చేసిన హెల్ప్‌లైను'కు లైను దొరకడం లేదు, ఫుల్ బిజీ వస్తోందట!

ఏడాది జైలు శిక్ష పడ్డవాళ్ళందరిని జైళ్ళో పెట్టాలంటే వేలాది జైళ్ళు నిర్మించాలట!

అప్పుడు పోటీ పడడానికి నాయకులే మిగలరట!

ప్రలోభ పెట్టిన వాళ్ళనే కాదు, ప్రలోభ పడ్డ ఓటర్లను కూడా

సామెతలు :

దొంగలు
దొంగలు చేరి
ఊళ్ళు
పంచుకున్నట్టు
పార్టీలు ఎగస్పార్టీలు
అన్నీ చేరి ఓట్లు
పంచుకున్నట్టు

* * *

చెల్లని నోటుకు
కన్నాలెక్కువ!
చేతగాని వాడికి
హామీలెక్కువ!

* * *

కడవంత
గుమ్మడికాయ
కత్తిపీటకు లోకువ!

అర్థబలమున్న
అభ్యర్థి ఒక్క
ఓటరుకి తక్కువ

* * *

ప్రజలిచ్చిన సెలవు

కనబడుట లేదు' అన్నది కాంగిరేసు ప్రకటన!
అభ్యర్థులు కావలెను' అన్నది అధిష్ఠానం అభ్యర్థన!
కోరినోళ్ళందరికీ వరించింది సెలవు!
ఎన్నికల్లో గెలవడం కాదేమంత సులువు!

కప్పలు

రోజుకు మూడు పొద్దులు!
మారడానికి లేవు హద్దులు!
ఎటుగాలి వీస్తే అటే ప్రబుద్ధులు!
ఏరు దాటాక తెప్ప తగలేసే నిబద్ధులు!!

కథ :

అనుకొని తమ పళ్ళతో ఎంచుకున్న వలల్ని కొరికేయడంతో వలల్లోని క్రూర జంతువులకి మళ్ళీ బలం వచ్చింది. అవి జూలు దులిపి గర్వంగా సింహాసనాన్ని అధిష్టించడానికి పరుగులు తీసాయి. అయితే అల్ప ప్రాణులకు మాత్రం బతుకు భయం పోలేదు!

ఎలగెలగ? అలగలగ?

ఆ మధ్య ఒకడు కోతిని ఆడిస్తున్నాడు!

కోతి చేష్టల్ని మర్చిపోయినట్టుంది కోతి!? చేసేవన్నీ మనిషి చేష్టలే!

కోతి చేస్తున్న మనిషి చేష్టల్ని చూసి కోతిచేష్టలని నవ్వుకున్నారట మనుషులు!

కోతి నీళ్ళు మోస్తోంది. లేని కుండను నెత్తిన పెట్టుకొని మరీ మోస్తోంది. ఆ బరువుకి మందు కొట్టిన మనిషిలా అటూ ఇటూ ఊగిపోతూ ఎటు పడితే అటు అడుగులు వేస్తూ నడుస్తోంది.

'అబ్బో అబ్బో... లజ్జునక... మన కొత్త కోడలుగారు ఇప్పటి దాక సిగ్గులే మోసారు, ఇప్పుడు నీళ్ళు కూడా మోస్తున్నారు...' ఆడించేవాడి మాటలనను సరించి సినిమా తారల్ని మించి మరీ నటిస్తోంది కోతి.

'ఎవరీ దండీ ఆ కుండ?' ప్రశ్న తానే అడిగి 'అత్తోరి కుండ' జవాబు తానే చెప్పాడు. ఆడించేవాడు.

గల్పికలు / అల్పికలు

జైళ్ళో పెట్టాలని కొంత నాయకులు కోరుతున్నారట!

ఎన్నికల కమిషన్ చెప్పింది అమలు చేస్తే ఈసారే కాదు, ఏసారీ ఎన్నికలు జరగవట... సామాజిక విశ్లేషకుల మనో భావమట!

మరి పెద్దలో...?

అతని తండ్రి అందరి నెత్తి మీద చెయ్యి వేసేవాడు. తల నిమిరేవాడు. తండ్రికి తగ్గ తనయుడొచ్చాడు. చెంపలు నిమిరాడు. బుగ్గలు నిమిరాడు. నుదిటి మీద ముద్దులు కూడా పెట్టాడు.

అతని చేష్టల్ని గమనించిన సైకాలజిస్టు ఒకాయన రిపోర్టు యిలా యిచ్చేడు!

పిల్లలకి ఓటు హక్కు ఉంటే అతనే గెలిచేవాడట!?

టూ మచ్

అసలు ఆస్తులు వదిలేసి అఫిడవిట్లో ఆస్తుల విలువ రూ. 400 కోట్లు వరకూ ఉన్న యువరాజుకి... జగన్‌బాబుకి అతని కంపెనీల్లో సుమారు ఆరొందల మంది డ్రైవర్లు ఉన్నా గాని... అతనికి సొంత వాహనం కూడా లేదట!? విడ్డూరం గుడ్డెడితే తెల్ల ఉళ్ళిపాయ పిల్లెట్టిందంటే ఇదే మరి...!

గొర్రెలు

'మీకు అది చేస్తా... ఇది చేస్తా... ఏదేదో చేసేస్తా'నని గొంతెండి పోయేలా హామీలిచ్చాడు ఎం.పి. ఒకడు. ఏమేమి చేద్దామనుకుంటున్నాడో కూడా చెప్పాడు.

అప్పుడు జనంలోంచి 'మీ ఎం.పి. నిధులు ఐదు కోట్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చెయ్యలేదేం?' అరిచారెవరో.

'ఎలక్షన్ కోడ్ అడ్డం వచ్చింది... లేకపోతేనా?' ఖర్చు చేసేద్దునన్నట్టు చెప్పాడు ఎం.పి.

'మరి ఇంతవరకూ యేం చేసావయ్యా' మళ్ళీ అడిగారెవరో.

'గొర్రెలు కాచాను!' చమత్కరించాడు ఎం.పి.

'ఈసారి మేం గొర్రెలు కాదల్చుకోలేదు..' అన్నారు జనం!

అదీ కథ

పబ్లిక్ టాక్ :

'మేం అధికారంలోకి వచ్చినా - భూకుంభకోణాలకు పాల్పడిన సోనియా అల్లుడు వాద్రాపై ప్రతీకార చర్యలు ఉండవు' - మోడీ.

ప్రైవేట్ టాక్స్ :

'అధికారంలోకి రావడానికి పోటీగాని అధికారంలోకి వచ్చాక కొనసాగే పొత్తు ఇదే మరి'...

'లేదండీ బాబూ... మోడీగారేం తెలివితక్కువ వారు కాదు, ఈ స్టేట్‌మెంటుతో వాద్రా, ప్రియాంక ఓట్లతో పాటు సోనియా ఓట్లూ తన ఖాతాలోనే వేసుకోవాలని...'

ఇదో కథ

నేతి బీరలో నెయ్యి లేదు. బీరకాయలో బీరా లేదు. బీర పంట వేసి 'కారు' మీద పోటీ చేసే కేసీఆర్‌కు కారూ లేదు!?

విజ్ఞప్తి

దేశంలోనే కా(రా)టోయే రెండు రాష్ట్రాలూ మొదటి స్థానంలో నిలిచాయి! ఇది తెలుగు వారి ఉమ్మడి విజయం! ఈ విజయానికి కారకులైన మన నాయకుల్ని మనం ఓటింగ్ ద్వారా కూడా అభినందించొచ్చు! అనధికారలెక్కల్ని అవతలకు నెట్టి... అధికారికంగానే దేశంలో 265 కోట్ల రూపాయల నగదు ఎన్నికల సందర్భంగా దొరికింది.

సామెతలు :

పిల్లిని చంకన
పెట్టుకొని పెళ్ళికి
వెళ్ళినట్టు!

ఛార్జిసీట్లు చంకన
పెట్టుకొని ఓట్లు
అడిగినట్టు!

* * *

చిలుక ముక్కుకి
దొండపండు
జంప్ జిలానీకి
జాక్‌పాటు

* * *

దేవుడు
వరమిచ్చినా
పూజారి
వరమివ్వనట్టు
పార్టీ టిక్కెట్టిచ్చినా
ఓటరు
ఓటెయ్యనట్టు

* * *

సమీక'రణం'

శత్రువులంతా మిత్రుళ్ళే!
రాక్షసులంతా దేవుళ్ళే!
పార్టీల కంతా పొత్తుళ్ళే!
ప్రజలకంతా ఆరళ్ళే!

వాడి - నాడి

ముందొచ్చిన చెవులకంటే
వెనుకొచ్చిన కొమ్ములు వాడి!
జెండా మోసే కార్యకర్తల కంటే
జంప్ జిలానీలకే దొరుకుతుంది నాడి!

ముప్పై రూపాయిలకి నేరస్థుణ్ణి ఉరి తీసేది తలారి - / ముప్పై లక్షలకి ముప్పై కోట్లకి దేశానికి ఉరి బిగించేది దళారి - అలిశెట్టి ప్రభాకర్

కథ :

'అత్తోరి కుండ' మాట వినడంతోనే దబ్బున కుండ ఎత్తేసింది కోతి.

జనం ఘొల్లుమన్నారు.

మళ్ళీ కోతి నెత్తిన లేని కుండను భారంగా ఎత్తి పెట్టి 'కన్నోరి కుండ' అన్నాడు ఆడించేవాడు. 'కన్నోరి కుండ' మాట వినడంతోనే ఎంతో జాగ్రత్తగా - కుండని పడెయ్యకుండా ఒద్దికగా వయ్యారంగా నీళ్ళు మోసింది కోతి.

జనం ముక్కున వేలేసుకొని మరీ ఘొల్లుమన్నారు.

ఈ మధ్య ఒకడు కోతిని ఆడిస్తున్నాడు!

కోతి చేష్టల్నే కాదు, మనిషి చేష్టల్ని సయితం మరిచిపోయినట్టుంది కోతి!? చేసేవన్నీ మహనీయుల చేష్టలే!

కోతి చేస్తున్న మహనీయుల చేష్టల్ని చూసి కోతి చేష్టలని నవ్వుకున్నారట మనుషులు!

ఎలక్షన్లు కదా... తమ మహానాయకుల్ని కోతిలో చూసుకోవాలని కూడా జనం అనుకొని తోసుకొని మరింత ముందుకొచ్చారట.

'అబ్బో అబ్బో... లబ్బునక... మన కాబోయే ప్రధాని గారు ఇప్పటిదాక ప్రసంగించారు, ఇప్పటిదాక అభిమానులతో కౌగిళ్ళూ కరచాలనాలు కూడా చేస్తారు...' ఆడించే వాడి మాటలననుసరించి

గల్పికలు / అల్పికలు

అందులో తెలుగువారి వాటా రూ. 109 కోట్లు! అధమంలో ప్రథమంగా నిలిపిన మన నాయకుల్ని ఏరీతిగానైనా అభినందించ విజ్ఞప్తి!

100%

ఎన్నెన్నో చోట్ల ఎన్నికలు జరిగాయి. ఎవరికి వారే మా పోలింగ్ అరవై శాతమూ... మాది డెబ్బై శాతమూ... డెబ్బై నాలుగు శాతమూ అని గొప్పలు చెప్పుకున్నారు. అయితే నూటికి నూరు శాతం ఓటింగ్ ఓ చోట జరిగింది!?

ఔను మరి ఆ పోలింగు సెంటర్లో ఉన్నది ఇద్దరు ఓటర్లే!!

ఆ ఇద్దరూ తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారట!?!

నిబంధన అను అభ్యర్థన

'మీ ఓటు నాకెయ్యండి!' కలవని అన్ని పార్టీలు గొంతు కలిపాయి!

ఓటరు ఓరగా చూసి - తన చేతిలో ఉన్న అభ్యర్థన పత్రాల్ని అభ్యర్థులందరికి పంచాడు.

పత్రమ్మీద సంతకం పెట్టిన వాళ్ళకే నా ఓటు అని కూడా విన్న వించుకున్నాడు.

ఆ పత్రంలోని కొన్ని వాక్యాలు -

అయిదేళ్ళలో ఒక్కసారన్నా కనిపించాలి!
అసెంబ్లీ సమావేశాలకి ఒక్కసారన్నా హాజరు కావాలి!
ప్రజా సమస్యల మీద ఒక్కసారన్నా నోరు విప్పాలి!
లంచం తీసుకోకుండా ఒక్కసారన్నా పని చేయాలి!
జనం నెత్తిన ఒక్కసారన్నా టోపీ పెట్టకుండా ఉండాలి!
తినగలిగినంతే దోచుకోవాలి - దాచుకోవాలి!
చదివిన అభ్యర్థులు చటుక్కున మాయమయిపోయారు.

తెలుసా?

'అవనీతి'కి పాస్‌వర్డ్ 'అభివృద్ధి'!
'సిస్టమ్' కరప్ట్ అయిపోయింది...
ఏ సిస్టమో తెలుసా?

సిక్కోలు సోంపేటలో 'ఈల' గుర్తు మీద పోటీ చేసే అభ్యర్థికి అనుమానమొచ్చింది. 'ఈలంటే తెలుసా?' అని అడిగి 'ఈలంటే బిగులు!' అని కూడా చెప్పాడట.

'ఈలంటే తెలీదు కాని బీలంటే తెలుసును' అన్నారట ఓటర్లు.

బీలంటే ఏమిటో ఈల పార్టీ అధ్యక్షుడు జేపీకి తెలుసా?

నకిలీ నోట్లిచ్చారు... నాయాళ్ళు!... 'తెలుసా?' అని అడిగాడో ఓటరు

నకిలీ మద్యం పోసారు... నాయాళ్ళు!... 'తెలుసా?' అని అడిగాడు మరో ఓటరు

నకిలీ అభ్యర్థిని నిలబెట్టారు... నాయాళ్ళు!... 'తెలుసా?' అని అడిగాడు ఇంకో ఓటరు

నకిలీ పాలనే అందిస్తారు... నాయాళ్ళు! 'తెలుసు!' అని అందరు ఓటర్లు అర్థం చేసుకున్నట్టుగా అన్నారు!

గుర్తు

మొహాలు లేని మనుషులుంటారా?
జెండాలు లేని దేశాలుంటాయా?
చిహ్నాలు లేని పార్టీలుంటాయా?
పార్టీలు లేని ఎన్నికలుంటాయా?

సామెతలు :

పాముకి పాలు
పోస్తే కాటేసినట్టు

స్వార్థపరుడుకి
ఓటేస్తే దేశాన్ని
దోచేసినట్టు

* * *

మంచివాడి
గుణం మత్స్య
మాంసాలకాడ
తేలుతుంది

మంచి ఓటరు
గుణం మనీ
మద్యాల దగ్గర
తేలుతుంది

* * *

కొత్త రాముడు

అప్పుడైనా ఇప్పుడైనా ఎప్పుడైనా
అడవుల పాలవుతూనే ఉంది సీతమ్మ తల్లి
లోకకళ్యాణం కోసమేనన్నదా శ్రీరాముడు!
సంఘ పరివారం కోసమే తానన్నదీ మోడీ!

పాత బంగారం

కాదు కాదు... బెర్లిన్ రాయి
జై సమైక్యాంధ్ర కదే పునాది రాయి!
పాడిన పాటే పాడితే ఎలాగే పాత పచ్చడీ?
కొత్త ఆవకాయకు రుచెక్కువని తెలీదా గుమ్మాడీ?

చూస్తూండగానే బోడిగుండుమీద / వెంట్రుకలు మొలిచి ఉంగరాలు తిరగటమెంత అబద్ధమో / ఎనికల్లో వాగ్దానాలంత అబద్ధం! - అలిశెట్టి ప్రభాకర్

కథ :

నాయకుల్ని మించి మరీ నటిస్తోంది కోతి.

కాషాయపు కండువా ధరించి రాజసంగా లేని గడ్డాన్ని దర్పంగా నిమురుకుంటూ అడుగులు వేసింది కోతి. 'వీర శివాజీ...' అన్నాడు ఆడించేవాడు. అన్నదే తడవు ఆడించేవాడి చేతిలోని కర్రను అందుకొని కరవాలంలా తిప్పి నడుముకు కట్టిన ఒరలో దోపుకుంది. ఎవరో జనంలోంచి త్రిశూలం ఇస్తే తీసుకుంది. కాదన లేదు. విసిరి కొట్టలేదు. తలపాగా ఇస్తే పెట్టుకుంది కోతి.

మందిలోంచి మస్తాన్ వచ్చాడు. అభిమానంతో తన నెత్తిమీద టోపి తీసి కాబోయే ప్రధానికి ఇచ్చాడు. ధరించమని చెప్పి ఆలింగనం చేసుకోబోతే, కోతే మస్తాన్ని వెనక్కి తోసి - నెత్తిమీది టోపి తీసి నేలకు కొట్టింది. జనం ఘొల్లుమనలేదు.

మళ్ళీ కోతినెత్తిన తలపాగాను పెడితే గర్వంగా గంభీరంగా కాబోయే ప్రధాన మంత్రిని నేనే నన్నట్టు రాజసంగా నడిచింది కోతి!

జనం ముక్కున వేలేసుకోకపోయినా మస్తాన్ మాత్రం చలిజ్వరం వచ్చినట్టు గజగజ వణవణ వణికాడు!

గల్పికలు / అల్పికలు

గుర్తులు లేని అభ్యర్థులుంటారా?

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకెక్కిన ఒక్కరికే గుర్తు లేదు!? అది అభ్యర్థికి కాదు, ఓటరుకి! ఓటరు ఓటమి అక్కడే ఆరంభమైంది! అభ్యర్థులు పార్టీకి ప్రతినిధులైతే, 'నోటా' ప్రజలకు ప్రతినిధి! ప్రజలకు గుర్తింపు లేదు! నోటాకి గుర్తులేదు! 'నోటా' అంటే ఏమిటని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు అడిగినట్టే - ప్రజలు అడగకుండా ఉండాలంటే దానికో గుర్తు ఉండాలి - 'గుర్తు లేదు' అన్నట్టు నాలుక్కరుచుకుంది ఎలక్షన్ కమిషన్!

నోటా' గుర్తు ఎలా ఉండాలని చర్చ మొదలైంది!

"చెప్పు తీసి కొట్టినట్టే కదా?... నోటా మీట నొక్కడమంటే - సో... 'చెప్పు' గుర్తును కేటాయిస్తే బాగుంటుంది..." ఆశపడ్డాడో ఆవేశపరుడైన కుర్రాడు.

"పాము" గుర్తు కేటాయిస్తే పక్కాగా ఉంటుంది. సరైన అభ్యర్థుల్ని సరిగా నిలబెట్టకపోతే ఓటుతో కాటు వేసినట్టు ఉంటుంది! ఓ కవి 'ఓటరు పామై పడగ విప్పాలి' అని కవిత్వం చెప్పాడు కూడా!

"అభ్యర్థులందరూ అడ్డ గాడిదలే అని చెప్పడానికి 'గాడిద' గుర్తుని కేటాయిస్తే అర్థవంతంగా ఉంటుంది..." అందో అమ్మాయి.

"పేడ" కాకపోయినా 'పిడక' గుర్తుకు అయితే బాగుంటుంది. గోడకు గుద్దినట్టు... ముఖం మీద గుద్దినట్టు సరిగ్గా సరిపోతుంది...' అందో పెద్దావిడ.

"ఎలక్షన్లూ - ఎలక్షన్లో నిలబడ్డ అభ్యర్థులూ అంతా మురుగు కంపు కొడుతున్నారు... డ్రైనేజీ గుర్తుని కేటాయిస్తే భేషుగ్గా ఉంటుంది...' అన్నాడో ముసలాయన!

మరి కొంత మంది ఎందుకో గాని 'పంది' గుర్తును కోరితే, అంతకన్నా 'పందికొక్కు' గుర్తు నప్పుతుందని మరి కొంతమంది వాదన చేసారు!

ఏమయితేనేం 'మేధో మథనం' ముగిసింది!?

అందరూ కలిసి ఆఖరికో గుర్తు మీద ఏకాభిప్రాయానికి వచ్చారు!

అదే 'చిలుక' గుర్తు!!

'మాయల పకీరు ప్రాణం చిలుకలో ఉన్నట్టు... మీ గెలుపు ఓటములే కాదు మీ ప్రాణాలు మా చేతిలో ఉన్నాయి... అని చెప్పడానికి చిలుక' చేవ గలిగిన గుర్తు!' అని తీర్మానించారు!

ఎలక్షన్ కమిషన్ పెద్దలు మాత్రం గుసగుసగా ముసిముసిగా నవ్వుకున్నారట!? ఎందుకంటే ఈ ఎన్నికల్లో - సుప్రీంకోర్టు సోదపడలేక నోటా' పెట్టినా సరే - గుర్తు కేటాయించలేదు!... వచ్చే ఎలక్షన్ల నాటికి కదా? అప్పుడు చూసుకుందాం గుర్తు' గుర్తుంటుందో లేదోనని అనుకున్నారట!?

ఎవరే అతగాడు?

'వీరి వీరి గుమ్మడి పండు... వీరి పేరేమి?' అని మైక్ ఒక చేత్తో - పెద్ద ఫొటో వోచేత్తో పట్టుకున్న యాంకర్ జనంలోకి వచ్చింది. ఎదురు పడ్డవాళ్ళ నల్లా ఈ పెద్దమనిషి ఎవరో తెలుసునా అడిగింది. అందరూ అడ్డంగానే తలలూపారు. కొందరు అప్పుడప్పుడూ టీవీల్లో మాట్లాడగా చాశామన్నారు. పేపర్లో చూశామన్నారు ఒకరిద్దరు. కానీ ఎవరూ అతనెవరో చెప్పలేకపోయారు.

చెప్పిన వాళ్ళకి బహుమతి కూడా ప్రకటించారు ఛానెల్‌వారు.

అయినా అతనెవరో ఎవరూ చెప్పలేకపోయారు!

ఇంతకీ అతనెవరో తెలుసా?!

అతను ఆ నియోజక వర్గం ఎం.ఎల్.ఎ.!!

సామెతలు :

కొత్త బిచ్చగాడు
పొద్దెరగడు

కొత్త అభ్యర్థి
పొద్దెరగడు

* * *

సోది

సోది చెపుతానమ్మ
సోది...
నువ్వే పేపరు
చదువుతావో చెప్పు!
నువ్వే పార్టీయో
చెపుతా!
నువ్వే ఛానెల్
చూస్తావో చెప్పు!
నువ్వే పార్టీయో
చెపుతా!

ని(స)త్య వాక్కు

కారణం లేని నవ్వూ
తోరణం లేని పందిరీ
పూరణం లేని బూరె
పొత్తులు లేని పార్టీ లేనే లేవ్!

అయిదేళ్ళకోసారి అసెంబ్లీలోకి మొసళ్ళు / పార్లమెంటులోకి తిమింగలాలూ / ప్రవేశించటం పెద్ద విశేషం కాదు / జనమే ఓట్ల జలాశయాలై వాటిని బతికించటం విషాదం...? - అలిశెట్టి ప్రభాకర్

కథ :

గురువులు

కోతి ఒకటి చిన్నప్పుడే దారి తప్పింది. వనారణ్యంలోంచి అది జనారణ్యంలోకి వచ్చింది. దానికి నేల మీద గెంతడం తప్ప చెంగుమని ఈ కొమ్మ మీంచి ఆ కొమ్మ మీదికి దూకడం తెలీదు. పాపం కోతికి కోతి కొమ్మచ్చి ఆడడం కూడా రాదు! కోతిని ఆడించేవాడు ఎన్నో విధాల కోతికి నేర్పించాలని చూసాడు. చేత కాలేదు. విసిగి వేసారి పోయిన కోతులాడించే వాడి తలలో ఒక ఉరుము ఉరిమి మెరుపు మెరిసింది. దేవుడికి దండం పెట్టి కొబ్బరికాయ కొట్టాడు - కోతికి కొబ్బరి ముక్క ఇచ్చిన కోతులాడించేవాడు చూసి నేర్చుకోమన్నాడు. కోతి చూసింది. నేర్చుకుంది. నైపుణ్యం సంపాదించింది. ఈ కొమ్మ మీంచి ఆ కొమ్మ మీదికి దూకి కొమ్మలు మారడం నేర్చుకుంది!

అయినా కోతికి గాని కోతిని ఆడించేవాడికి గాని రవ్వంత సంతోషం కలగలేదు. ఎందుకంటే కోతిని ప్రపంచం గుర్తించలేదు!? పార్టీలు మారిన పొలిటీషియన్లనే గుర్తించింది!

తమ గురువులకి ఆ మాత్రం గుర్తింపు రావడం తనకీ గౌరవమేనని సరిపెట్టుకుంది కోతి!

గల్పికలు / అల్పికలు

తొలి పాఠం

వక్తగా ప్రసంగకర్తగా రాణిస్తేనే రాజకీయాల్లో రాణిస్తామని గ్రహించిన చాలా మంది రాజకీయనాయకులు ఇనిస్ట్యూటుల్లో చేరిపోయారు. శిక్షణ అనివార్యమని గుర్తించారు. మాట్లాడడం ఒక కళని నమ్మారు! కానీ ఏం మాట్లాడాలి? ఇదే తొలిపాఠమని చెప్పిన అధ్యాపకులు 'మీరు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారు?' నిజాయితీగా చెప్పమన్నారు. ఒక్కొక్కరూ ఒక్కో విషయం ఇలా చెప్పారు.

'నేను ఆర్థికంగా స్థిరపడాలి!' 'నాకు మంచి భవిష్యత్తు కావాలి!' 'నాకు భద్రత కావాలి!' 'నా చేతుల్లో ప్రభుత్వం ఉండాలి!' 'నాకు మేలు జరగాలి!' 'నేను బాగా లాభపడాలి!' 'నేను హాయిగా ఉండాలి!'

ఇలా అనేకం చెప్పారట అందరూ. అప్పుడు అధ్యాపకుల వారు లేచి 'ఇవే విషయాలు ప్రజలకు చెప్పండి' అన్నాడట. అందరూ నివ్వెరపోయి చూశారట. అప్పుడు అధ్యాపకుల వారు 'చిన్న సవరణ... మీ మాటల్లో 'నేను - నాకు - నా' అని ఉన్నచోటల్లా 'మీరు-మీకు-మీ' ని మార్చి చెప్పండి చాలు.... ప్రజలు పడిపోతారు...' అని నవ్వుతూ చెప్పారట.

అర్థం చేసుకున్న రాజకీయ నాయకులు అంతులేని ఆనందంతో తొలిపాఠం నేర్చేసుకున్నారట!!

దిద్దుబాటు

పిల్లలు దేవునితో సమానం... అయితే ఈ పిల్లాడు పిల్లాడు కాదు, పిడుగు! పిడుగులాంటి ప్రశ్నలే అడుగుతుంటాడు.

'తప్పు చేస్తే దిద్దుకోవచ్చునా?' అమాయకంగా అడిగాడు.

'దిద్దుకోవచ్చును' చెప్పారు మాష్టారు.

'దిద్దుకోకపోతే...?' అనుమానంగా అడిగాడు పిల్లాడు.

'తప్పు చెప్పి, మనమే దిద్దాలి!' అర్థమయినట్టు చెప్పిన మాష్టారుకి అసలు ప్రశ్నేమిటో అర్థం కాలేదు.

'భూములూ గనులూ తినేసి అడ్డదిడ్డమైన పనులు చేసేసి అవినీతికి అడ్రసు అయిపోయిన పెద్దాయన...' అని అనగానే 'పాపం... పోయాడు కదా?!' అన్నారు మాష్టారు.

'సరే, అతను దిద్దుకోలేదు సరే, అతని పేరు కడప జిల్లాకు పెట్టారు కదా? అదీ దిద్దలేరా?' పిల్లాడిది ప్రశ్న కాదు పిడుగే!

పాపం మాష్టారు మౌనంగా ఉండిపోయారు!

ఆ ఒక్కటీ అడక్కు!

దేవునికి అభిషేకం ముఖ్యం! యువరాజుకి పట్టాభిషేకం మరీ ముఖ్యం!! పట్టపగ్గాలు తన చేతిలో ఉన్న పట్ట మహిషి తన తల్లి కావడంతో యువరాజా వారు పాటందుకున్నారు!

'ఓయ్... రాజాధిరాజాను నేనురా
ఇక, వైజాగు వైభోగం చూడరా
సరదాల సామ్రాట్టు నేనురా
ఇక, సర్కారు, సీడెడ్ నావిరా -
జాక్‌పాటే నేను కొట్టేస్తా
జైపూరే నేను పట్టేస్తా
టాటాతో మాట కలిపేస్తా
బిర్లాకే బీటు వేసేస్తా -

'ఆ ఒక్కటీ అడక్కు' అంది అమ్మలగన్న అమ్మ. పాట గురించి చెప్పారో - రేపటి ఆట గురించి చెప్పారో అంగరక్షకుడికి అర్థం కాలేదు!?

తేడా!

రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉంది. పాలనలో కూడా ఎలాంటి తేడా లేకుండా ఉంది.

ఒక ఆర్థిక నిపుణుడికి మాత్రం లెక్క తేడా వచ్చింది!? ఖజానాలో బోలెడంత మిగులు కనపడింది.

అప్పటి వరకూ మంత్రులుగా ఉండి... ఎం.ఎల్.ఎ.గా ఉండి... రాజీనామా చేసిన ఎం.పి.లుగా ఉండి... జీతాభత్యాలూ నిర్వహణా నిర్వాకాల వల్ల బోలెడన్ని నిధులు ఖర్చయిపోయేవి. అవన్నీ ఇప్పుడు మిగిలిపోయాయి మరి!

తినడం తప్ప పన్చేయ్యడం మర్చిపోయిన మంత్రివర్యులు తమ తమ శాఖలకు దూరంగా ఉండడంతో - మందీ మార్బలాలకు పెట్టే ఖర్చు లోటు పోయి మిగులు కనపడింది... ఖజానా కళకళలాడింది!

మూణ్నెళ్ళలో ఎలక్షన్లు ముగిసాయి!

ఉత్పత్తికి దూరంగా ఉత్తుత్తిగా ఉంటూ తింటూ ఉంటే ఖజానాకు మళ్ళీ కన్నాలు పడ్డాయి! కళ తప్పింది!

రౌతు మెత్తనైతే గుర్రం పరిగెడుతుందా?!

సామెతలు :

మూఢ నమ్మకం

సీమాంధ్రలో
మా కాంగ్రెస్ పార్టీ
అధికారంలోకి
వస్తుంది!

నీతి వాక్యం

ఓటు వేసిన
వారిని కాటు
వేయకూడదు!

నే(నో)టి మాట

"ఓడి పోతారా?"
"లేదు,
వీడిపోతాను!"

* * *

"నేను ముఖ్యమంత్రి
అయినంక.."
"సేవలందివ్వడానికి
ముఖ్యమంత్రే
అవ్వాలా?"

జనారణ్యంలో పెంచి, పోషించబడే పులి - మతం / దానాకలి తీర్చాల్సినప్పుడల్లా నువ్వో నేనో - ఖతం! - అలిశెట్టి ప్రభాకర్

మార్చి 8, 9 తేదీలలో కోదాడలో జరిగిన విరసం తాత్విక పాఠశాలలోని ప్రసంగ పాఠం

దండకారణ్య మహిళా ఉద్యమాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి?

- నల్లూరి రుక్మిణి

దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్రను చదువుతుంటే ఆశ్చర్యంగానూ, ఆలోచనపూరకంగానూ అనిపించింది. జనతన సర్కారు, దాని అభివృద్ధి, ఆ ఉద్యమ క్రమం, ఆ చరిత్రంతా ఒక ఎత్తుకాగా, క్రాంతికారీ మహిళా సంఘటన్ కార్యకలాపాలు, ఆ ప్రాంతపు స్త్రీల చైతన్యం, మహిళా ఉద్యమం పట్ల విప్లవోద్యమం అనుసరిస్తున్న వైఖరులు ఎంతో సంయమనంతోనూ, దీర్ఘకాలిక దృష్టితోనూ వున్నట్లుగా తోస్తున్నది. అది మీతో పంచుకోవాలనే ఈ ప్రయత్నం.

ఏ పోరాటమైనా ఏ సాంఘిక సామాజిక మార్పులైన, స్త్రీల భాగస్వామ్యం లేనిదే విజయం సాధ్యం కాదని దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర మరోసారి మనముందుంచింది. తొలి కమ్యూనిస్టు కమ్యూన్‌ని నడిపిన పారిస్ కమ్యూన్ గూర్చి విశ్లేషకులు వ్యాఖానిస్తూ 1789-1847 పారిస్ కమ్యూన్‌కి ముందు నడిచిన తొలి తిరుగుబాట్లలో స్త్రీల భాగస్వామ్యం లేనందువల్లే ఆనాడు విఫలమైందనీ అదే పారిస్‌లో 1871 నాటికి స్త్రీలు ప్రవాహంలాగా కదిలి రావటంతో పోరాటం విజయవంతమైందన్నారు. బారికేడ్లు కట్టడంలో, శత్రువును చికాకు పరచటంలో స్త్రీలు అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించారు. పారిస్ కమ్యూన్‌ను ప్రష్యన్ సైన్యాలు చుట్టుముట్టి నప్పుడు కూడా కమ్యూన్‌ను కాపాడుకోవాలని స్త్రీలు ఎంతగానో పోరాడారు.

థేర్స్‌కు వ్యతిరేకంగా పారిస్ స్త్రీలు తమ ప్రాణాలను ఎదురొడ్డి నిలబడ్డారు. వారి మరణం తొలి కమ్యూన్ మనగలగటానికి దోహదం చేసింది. అది ప్రపంచానికి కొత్త కాంతిని ఇచ్చి పేదల రాజ్యం సాధ్యమేనని చూపించింది. అంత చైతన్యాన్ని, పోరాటశీలతను, చూపించటానికి ఆ కార్మిక స్త్రీలను ప్రభావితం చేసినది ఏమిటి? అసలు స్త్రీలను ఇటువంటి పోరాటాలలోకి నడిపించే ఇంధనం ఏమిటి?

ఎలుక కన్నాల్లాంటి ఇళ్ళలో మగ్గిపోతున్నవారికి అద్దెలు లేకుండా చేస్తామన్న కమ్యూన్ వాగ్దానం, స్త్రీలకు విద్య, కార్మిక స్త్రీలకు నర్సరీలు అందుబాటులోకి తెస్తామని, పేదల బతుకులకు సంబంధించిన చర్యలు ఆ స్త్రీలను అంతగా కదిలించాయి. పారీస్ కమ్యూన్ అతి తక్కువ కాలమే నిలిచినా, ఆనాటి అట్టడుగు జనాలకు బతుకుల మీద భరోసాను ఇవ్వగలిగింది.

అట్లాగే తొలి జనతన సర్కారు రూపొందే క్రమానికి దండకారణ్య స్త్రీలు సైతం ప్రాణాలకు తెగించి, పోరాటాల్లో పాల్గొనడానికి వారిని ఉత్తేజితులను చేసినది ఏమిటి? అక్షర జ్ఞానం కూడా లేని, బాహ్య ప్రపంచానికి దూరంగా అడవులలో ఉంటూ నాగరికత లేనివారిగా ముద్ర వేయించుకున్న ఆ ఆదివాసీ స్త్రీలు ఇప్పుడు ప్రాథమిక వైద్యం అందించే డాక్టర్లుగా, కమాండర్లుగా, జనతన సర్కారులో బాధ్యతాయుతమైన స్థానాలలోను, న్యాయకమిటీలలోను పాలు పంచుకోవటం అంటే మాములు విషయం కాదు. నిజానికి మనందరం కోరుకుంటున్న సమాన హక్కులు దిశగా పోరాటంలోనే ఉండి సాధించుకుంటున్నారు. ఈ రోజు మహిళలు లేని మావోయిస్టు ఉద్యమం ఊహించలేం. ఆదివాసీ స్త్రీలు ఎంత చైతన్యవంతం అయ్యారంటే కుటుంబంలోని మగవారు (భర్తగాని, అన్నతమ్ములుగాని) వెనక్కి తగ్గి ఉద్యమం నుంచి దూరమైనా గాని ఎందరో స్త్రీలు ఉద్యమాన్ని వదలకుండా కొనసాగుతున్నారు. సామాజిక మార్పు కోసం జరిగే పోరాటాలు సాధారణ మనుషులని సైతం ఎంతగా సానబడతాయో దండకారణ్య స్త్రీలను చూస్తే మనకు అవగతమవుతుంది. వీరు తమపై జరిగే అత్యాచారాలను, అకృత్యాలను ఎదిరించటమే గాక, తమ సన్నిహితులైన కుటుంబ సభ్యులను కోల్పోతూ కూడా ఈ ఉద్యమానికి ఎంతో వెన్నుదన్నుగా వున్నారంటే వాళ్లను ప్రేరేపించింది ఏమిటి? తరతరాలుగా జంగ్లాతు వాళ్ళ, వ్యాపారస్తుల లైంగిక హింస, ఆచారాల పేరుతో పితృస్వామ్య అణచివేత వీరిని కదిలించింది. పోరాటంలోనికి మళ్ళించింది. అదే ఇప్పుడు పురుషులతో పాటు సమాన హక్కుల దిశగా సాగడానికి అడుగులు వేయిస్తోంది.

ఇక్కడ ఆగి ఇంకోమాట చెప్పుకోవాలి. దాదాపు 18వ శతాబ్దం నుండి కూడా మధ్య తరగతి మహిళలు హక్కుల కోసం చేస్తోన్న పోరాటాలు మనకు తెలిసినవే, వీరి స్లోగన్స్ ఎంత రాడికల్‌గా ఉండేవంటే ఓటు హక్కు గురించేగాక, గర్భ నిరోధక సాధానాల గురించి కూడా మాట్లాడిన వాళ్ళు వున్నారు. అయినప్పటికీ ఈ రోజుకు కూడా పట్టణ మధ్య తరగతి స్త్రీలు సమానహక్కులు సాధించుకోలేక పోయారు. పురుషాధిపత్యాన్ని కదిలించలేక పోతున్నారు. పైగా రోజు రోజుకూ స్త్రీలపై హింస ఎక్కువవుతోంది. పోరాట ప్రాంతంలో పురుషులు తమ తోటి స్త్రీల పట్ల గౌరవం, మన్నన చూపగా... అత్యాచారాలు అనే మాటను తరిమివేయగా... మైదాన ప్రాంతాలలో అనేక చోట్ల కుటుంబ సభ్యులే, తమ ఆడవారి మీద ముఖ్యంగా పసిపిల్లల మీద లైంగికదాడులు చేయడం ఈనాడున్న దృశ్యం. హక్కులు అడిగేకొద్దీ అణచివేత మరింత ఎక్కువవుతోంది.

అయితే మరి పై సమస్యలను పరిష్కరించటంలో దండకారణ్య మహిళా ఉద్యమం ఎటువంటి అడుగులు వేసింది? అది వారి అనుభవం నుండి మనం తెల్సుకోవాల్సి ఉంది.

నాగరిక ప్రపంచానికి దూరంగా ఉండటంతో ఆదివాసీలు అనేక మూఢనమ్మకాలలో ఉన్నారు. ఆడవాళ్ళు నాగలి దున్నరాదని, వేటకు వెళ్ళరాదనీ, ఆయుధం పట్టకూడదనీ, విత్తనాలు వేయటం వంటి ఉత్పత్తి సంబంధమున్న పనులలో స్త్రీలను దూరంగా పెట్టేవారు. అది ఆదివాసీలతోనే కాదు, మన గ్రామీణ వ్యవస్థలో కూడా ఆడవాళ్ళు

అరక దున్నటం అనర్థమని ఇప్పటికీ ఉన్నది.

ఇక కుటుంబం, పెళ్ళిళ్ళు వంటి వాటిల్లో అనాగరిక జాతుల ఆచారాలకు గుర్తుగా మిగిలిపోయిన అతి ప్రాచీన కాలపు పురుషాధిపత్యపు సాంప్రదాయాల్లో మునిగివున్నారు. బహిష్టు అయిన స్త్రీని ఊరికి దూరంగా ఉన్న పాకలో ఉంచటం, పెళ్ళి అయిన తరువాత రవిక తీసిపారేయటం, మేనరికపు పెళ్ళిళ్ళ పేరుతో చిన్నప్పట్నుంచే అల్లుడిని తెచ్చుకొని ఇంట్లో పెట్టుకుని బలవంతంగా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయటం వీటన్నిటికంటే తను మనస్సు పడినవాడిని చేసుకుంటానని ఎదురు తిరిగితే 'కెర్ధ' పేరుతో ఆమె మీద అత్యాచారం చేయించటానికి కూడా తల్లిదండ్రులే వెనుకాడకపోవటం వంటి ఆచారాలతో ఆదివాసీ స్త్రీల బతుకు దుర్భరంగా ఉండేది. గ్రామంలోని ఆదివాసీ స్త్రీల మీద యువకులందరికి హక్కు ఉన్నట్టుగా ప్రవర్తించేవారు. ఇటువంటి దుర్భరమైన సంస్కృతిలో మగ్గిపోయిన స్త్రీలే నేడు వాటిని ఎదిరించి తమ బతుకులు బాగుచేసుకుంటున్నారు. అక్కడ ఒక్క స్త్రీల బతుకులే కాదు మొత్తంగా ఆదివాసీ జీవితాలు ఎంతో మెరుగుపడ్డాయి. తమను దోపిడి చేస్తున్న జంగ్లాతు వాళ్ళ నుండి, కాంట్రాక్టర్ల నుండి, మొత్తంగా ఈ వ్యవస్థ దుర్మార్గం నుండి బయటపడటానికి తెలివిడి తెచ్చుకున్నారు. వాళ్ళను వాళ్ళు బాగుచేసుకునే పనిలో నిమగ్నం అయినారు. ఈ క్రమమంతా ఆదివాసీలకు విప్లవ పోరాటం ద్వారానే సాధ్యపడింది. ఆ పోరాటమే స్త్రీలు కూడా పురుషాధిపత్యాన్ని ప్రశ్నించే వైపుగా, సమాన హక్కుల దిశగా ముందుకు నడిపిస్తోంది. ఇదంతా ఏదో సిద్ధాంత చర్చలు చేయడం ద్వారా జరిగింది కాదు. యుద్ధం చేస్తూ, యుద్ధం మధ్య నుంచే ఇది సాధించుకున్నారు. విప్లవోద్యమం కూడా ఎంతో చైతన్యంతో పట్టుదలతో ఆదివాసీలను తీర్చిదిద్దటానికి ప్రయత్నిస్తూంది.

మొట్టమొదట మావోయిస్టులు అక్కడకు వెళ్ళినప్పుడు ఆడవాళ్ళను ఎత్తుకెళతారని, ముక్కుచెవులు కోస్తారని, వాళ్ళ దగ్గర ఉన్న ముక్కుపుడకలు, చెవికమ్మలు, తీసుకుంటారని చేసిన తప్పుడు ప్రచారాన్ని నమ్మిన దశ నుంచి ఈ రోజు వెనుదిరిగి చూసుకుంటే అదే స్త్రీలు ఇప్పుడు మావోయిస్టు పార్టీ కార్యకర్తలుగా, దండకారణ్య రథ సారథులుగా పరివర్తన చెందిన దశకు ఎదిగారంటే మనం ఆ ఉద్యమాన్ని ఎలా అంచనా వేసుకోవాలో ఆ పోరాటం నుంచి మనమేం గ్రహించాలో అర్థమవుతుంది.

ఆదివాసీలకు అత్యంత దుర్మార్గమైన దోపిడీ, ముందుగా జంగ్లాతు వాళ్ళతోనే ప్రారంభమైంది. చిన్న చిన్న అవసరాలకు కట్టెలు కొట్టినా, ఆకు తుంచినా జరిమానా వేయటం, ఆ కొట్టిన కట్టెలు కూడా జప్తు చేసుకోవటం జరిగేది. అదే స్త్రీలైతే వీటితో పాటు ఆమెను బలాత్కారం చేయటం పరిపాటి. ఒక్క జంగ్లాతు వాళ్ళే కాదు, ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టర్లు బలవంతంగా ఆ స్త్రీలను లైంగిక హింసకు గురిచేసేవారు. కూలికి వచ్చే ఆదివాసీ స్త్రీలను పనికి దగ్గరగా ఉంటే తొందరగా పనిచేయటానికి వీలుగా ఉంటుందని కనక అక్కడే గుడిసెలు వేసుకోవాలని బలవంతం చేసేవాళ్ళు. రాత్రిపూట గుడిసెల్లో దూరి ఆ స్త్రీలను బలవంతంగా అనుభవించే వారు. ఆదివాసీ స్త్రీల శరీరాలు వాళ్ళందరికి ఒక వస్తువుగా మారిపోయాయి. చివరకు ఆదివాసేతరులు వ్యాపారానికో, ఉద్యోగానికో వచ్చి అక్కడ భూములను ఆక్రమించుకోవటానికి ఆ స్త్రీలను మోసపూరిత పెళ్ళి చేసుకోవటం మరొక దుర్మార్గం. లైంగిక హింస ఆదివాసీ స్త్రీలనే గాక, మగవాళ్ళను కూడా వ్యథకు గురిచేసేది. తమ ఇంటి ఆడది తమ కళ్ళముందే అత్యాచారానికి గురవుతుంటే ఎదిరించే ధైర్యం లేక, ఎదిరించినా ఫలితం లేక దిగమింగుకుని ఉండలేక మనోవేదన పడేవారు.

ఈ స్థితిని ఆదివాసీలు మొట్టమొదటి సారిగా దళాల అండతో ఎదిరించారు. విజయం సాధించుకున్నారు. ఈ రోజు ఆదివాసీ స్త్రీల వైపు కన్నెత్తి చూడాలంటే వారికి గుండెల్లేవు. అయితే ఇదంతా లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగా కేవలం ఆ ఒక్క సమస్య మీదే ప్రత్యేక పోరాటంగా చేయలేదు. తొలిదశలో తునికాకు కూలిరేటు పెంపుదల, వెదురుకూపులు నరికే కూలి పెంపుదల వంటి వాటి కోసం ప్రారంభమైన ఆదివాసీల పోరాటంలో స్త్రీలు భాగస్వామ్యం అయ్యారు. క్రమంగా ఆ పోరాటాలే 'దున్నేవానికే భూమి హక్కు' కోసం, పురుషాధిపత్యాన్ని ప్రశ్నించే దిశగానూ సాగాయి. ఇదంతా ఒక దీర్ఘకాల దృష్టితో ప్రజా విముక్తి పోరాటం అవగాహనతో సాగిన విప్లవ లక్ష్యం. అందులో భాగంగా స్త్రీలు ఆ సమ్మెలలో, ఊరేగింపులలో, ఉద్యమాలలో పాల్గొన్నారు.

మొట్టమొదట సిరొంచ, అహిరి ప్రాంతాలలో రైతుకూలీ సంఘాల నిర్మాణం జరిగింది. సిరొంచ తాలుకా అసిరెల్లి భూస్వామి రాఘవరావు ఓ మంగలి కులానికి చెందిన మహిళ భూమిని దౌర్జన్యంగా లాక్కున్నాడు. ఆమెకు భర్త కూడా లేకపోవడంతో అతన్ని ఎదిరించలేకపోయింది. అయితే ఆమెకు ధైర్యం చెప్పి అండగా నిలిచి ఆ భూస్వామికి వ్యతిరేకంగా ఆమె భూమికోసం రైతుకూలీ సంఘం కదిలింది. ఆమె భూమిని తిరిగి ఇప్పించింది. ఈ సంఘటన ఆ ప్రాంతంలో ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. స్త్రీలను ఆలోచింప చేసింది.

ఇదంతా ఏమి చెప్తుంది మనకు? ఆనాడు తెలంగాణలో చాకలి ఐలమ్మ భూమి కాపాడినా, ఈ రోజు ఆదివాసీ స్త్రీల భూమి హక్కులు కాపాడినా స్త్రీ, పురుషులు కలిసిన ఐక్య రైతు కూలీ ఉద్యమాలలో మాత్రమే స్త్రీల సమాన హక్కుల సాధన సాధ్యమని మనకు అర్థమౌతోంది.

అయితే విప్లవ కాలంలో మనం సాధించుకున్న ఫలితాలు విప్లవ పోరాటాలు వెనకపడినప్పుడు నిలబడకపోవచ్చు. అంత మాత్రాన బతుకులు బాగుచేసుకోవాలను కోవటం, పోరాటాలే తప్పనుకోవటం పాలకవర్గాలకు పనికొచ్చే పరోక్ష ప్రయత్నాలే తప్ప మరొకటి కాదు. పోరాటాలు లేకుండా సాధించిన ఘన విజయాలు నిజమైన అర్థంలో ఏ దేశంలోనైనా శాశ్వతంగా నిలబడి ఉన్నట్లు కొన్నైనా మనకు కనిపిస్తే ఆ విజయాలను చూసి నేర్చుకోవచ్చు. గుణపాఠాలు తీసుకోవచ్చు. పోరాటాలు ఎందుకు చేయకూడదో అర్థం చేసుకోవచ్చు. ఏ విజయమైనా, అపజయమైనా ఎప్పటికప్పుడు కిందికీ, మీదికీ అవుతూనే కాలం ముందుకు సాగుతుంది. శాశ్వత సత్యంగా ఆవిష్కరణ అయ్యేది వర్గరహిత సమాజం ఒక్కటే. అయితే అదొక సుదూరమైన ప్రయాణం అయినప్పటికీ అది కూడా ఏ మార్పు లేకుండా శాశ్వతంగా మధుర స్వప్నంగా ఉండి పోతుందనుకోను. నిరంతరం బూర్జువా వర్గం చేసే ప్రతిఘటన వల్ల తిరిగి వర్గ రాజ్య

అవశేషాలు తిరగదోడబడుతూనే ఉంటాయి. దానిపై మరల పోరాటం సాగుతూనే ఉంటుంది. ఆ అవగాహనతోనే కల్చరల్ రెవెల్యూషన్ వచ్చింది. అది నిరంతరం కూడా అవసరమవుతూనే ఉంటుంది. అట్లా ఆ ఘర్షణే మానవ సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుంది. మనిషి శాస్త్రీయమైన మనిషిగా రూపొందే క్రమం సాగుతుంది. బహుశ ఇది అనంతంగా సాగుతుండవచ్చు. అది ఎక్కడి దాక సాగుతుందంటే మనుషుల మధ్య వైరుధ్యాలు అన్నీ సమసిపోయి మానవుడికి ప్రకృతిని ఎదుర్కోవటమే అతి ముఖ్యమైన సమస్య అయ్యేదాక.

అయితే ఇదంతా ఇప్పటికిప్పుడు కానప్పుడు, ఈ పోరాటం ఎందుకు, ఈ ప్రాణత్యాగాలు ఎందుకు అని అనిపించవచ్చు. ఈ పోరాటాలే మానవ జీవితాలను నిరంతరం అభివృద్ధిలోకి, జీవిత సారాన్ని నిజమైన అర్థంలో అర్థం చేసుకోవటానికి, దోపిడిని నిలవరించటానికి ఉపయోగపడతాయి. ఎన్ని రకాలైన సిద్ధాంత చర్చలైనా సామాజిక క్రమం ఇలానే ఉండబోతుంది. ఈ అంతటిలో ఎప్పటికప్పుడు పాలకవర్గాల కొమ్ముకాచే ఒక సెక్షను ఉండనే ఉంటుంది.

ఈ క్రమంలో 1984 నాటికి సిరొంచ, అహిరి ప్రాంతాలలో 50 వేల ఎకరాల అటవీ భూములు సాగులోకి వచ్చాయి. ఫారెస్టు వాళ్ళతో తమశక్తినంత ఒడ్డి సాధించుకున్న ఈ విజయాలలో స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూములను తిరిగి స్వాధీనం చేసుకోవటానికి వచ్చిన అటవీ అధికారులతో స్త్రీలు తలపడ్డారు. ఇట్లా రైతుకూలీ సంఘంతో కలిసి భూపోరాటాలలో భూమి మీద నిలబడి కొట్లాడటం వల్ల పెరిగిన ధైర్యంతో స్త్రీలు స్వతంత్రంగా, చొరవతో తమ మీద జరుగుతున్న అత్యాచారాలను నిలవరించటంలో ఆదివాసీ స్త్రీలు ఎంతో చొరవతో ముందుకు వచ్చారు.

రేషన్‌పల్లి అనే గ్రామంలో ఒక రైతు అడవికి పోయి ఇంటికి అవసరమైన కట్టెలు కొట్టి బండిలో తెచ్చుకుంటుండగా ఫారెస్టు గార్డు ఆ ఎడ్లబండిని జప్తు చేస్తాడు. అది తెలిసిన ఆ వూరి సంఘ నాయకురాలు సద్మెక్ సమ్మక్క చొరవచేసి ఓ పదిమందిని వెంట తీసుకుపోయి ఫారెస్టుగార్డును తిట్టి బండిని విడిపించుకొని వచ్చింది. అట్లా ఫారెస్ట్‌గార్డును తిట్టి, ఎదిరించటమంటే ఆదివాసీలకు సామాన్యమైన విషయం కాదు. ఇది ఆ చుట్టు ప్రక్కల గ్రామాలలో ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఎడ్లబండిని జప్తుచేసుకోవడం, స్త్రీలకు సంబంధం లేని పనిగా వారు అనుకోలేదు. దానికి పురుషులే ఉండాలనుకోలేదు. ఎండ్లబండి స్త్రీ, పురుషులిద్దరికి సంబంధించిన ఉమ్మడి వ్యవసాయ పరికరం, దానిని విడిపించి తెచ్చుకోవటం రైతు స్త్రీలుగా వాళ్ళ బాధ్యత అనుకున్నారు. తమకు భూమితోను, భూమి కోసం జరిగే పోరాటాలతోనూ రాజ్యహింసను ఎదిరించటంలోనూ కర్తవ్యముందనుకున్నారు. అప్పటికే ప్రత్యేక మహిళా సంఘాలు ఏర్పడి ఉన్నప్పటికీ మహిళల సమస్యలొక్కటే తమవని అనుకోలేదు, సమాజమంతటితోను తమకు సంబంధ ముందనుకున్నారు.

అదేగాక ఆ స్త్రీలు ఎంత ప్రజాస్వామ్యయుతంగా ఆలోచనలు సాగిస్తున్నారో చూస్తే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఆదివాసీలను నిత్యం వేధిస్తూ తరాలుగా వాళ్ళ జీవితాలను దుర్భరం చేసిన, చేస్తున్న ఫారెస్టు గార్డుల పట్ల తీవ్రమైన వ్యతిరేకత వున్నప్పటికీ, ఓ ఫారెస్టు గార్డు భార్యపట్ల, తోటి స్త్రీగా వారు చూపిన మానవత్వం మనకు అద్భుతంగా అనిపిస్తుంది. ఓ పోలీస్ కానిస్టేబుల్ ఓ గార్డు భార్యతో వెకిలిగా మాట్లాడుతూ, అసభ్యంగా ప్రవర్తించినప్పుడు ఆమె అవమానపడి బాధపడుతుంది. అది తెలిసిన మహిళా సంఘం ఫారెస్టుగార్డు భార్యను తమతోటి స్త్రీగా గౌరవించి ఆమెకు ధైర్యం చెప్పి అండగా నిలబడ్డారు. వారితో కూడా దురుసుగా వ్యవహరించడంతో మహిళలంతా కలిసి పోలీస్‌ని పట్టుకొని కొడతారు. అదే క్యాంపులో వున్న మిగిలిన పోలీసులు ఈ విషయంలో జోక్యం చేసుకుంటే, వాళ్ళను కొడతారు. దానితో వాళ్ళు అదనపు బలగాలను పిలిపించి ఆ ఫారెస్టు గార్డునీ అతని భార్యతో పాటు ఊరి మహిళలనంతా చితకబాదారు. దాదాపు ఊరందరికి దెబ్బలు తగిలాయి. అయినా ఆ మహిళలు వెనుకాడలేదు. వాళ్ళు చేసిన పని న్యాయమయిందనుకున్నారు. దీని మీద చుట్టుపక్క గ్రామాలలో ప్రచారం నిర్వహించి ఆ గ్రామాల మహిళలతో కలిసి అహిరిలో పెద్ద ర్యాలీ తీసారు. పోలీసుల్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇది ఆ ప్రాంతంలో మహిళలు సంఘటిత పడేందుకు మరింత దారి తీసింది. పోలీస్ గార్డు భార్య అవమానం అందరి స్త్రీల బాధలను రిప్రజెంట్ చేస్తూ ఉద్యమం సాగింది. ఈ రోజు దండకారణ్యంలో ఆదివాసీ స్త్రీల జోలికి వెళ్ళటానికి ఫారెస్టు వాళ్ళు, కాంట్రాక్టర్లు ధైర్యం చేయలేకపోతున్నారంటే ఇలాంటి పోరాటాలే దానికి వెన్నుదన్ను. నిజమేగానీ, ఐతే ఆదివాసీ స్త్రీలను అంత చైతన్యవంతంగా ఈ ఐక్య ఉద్యమాల దిశగా నడిపించిన, ఆ విప్లవోద్యమం యొక్క అంతస్సూత్రమేదో పట్టించుకొని దాని గురించి ఆలోచించవలసి ఉంది. ఆ స్త్రీలు తమ సమస్యలపై తామొక్కరమే పోరాడాలనుకోలేదు. ఈ అన్ని పోరాటాలలో ఆదివాసీ పురుషుల తోడ్పాటును కూడా తీసుకున్నారు. కలిసి పోరాడారు. జిందాల్ ఫ్యాక్టరీ కోసం మగవాళ్ళు లేని సమయంలో భూములు కొలుచుకోవటానికి వచ్చిన అధికారులను మహిళలొక్కరూ తమ సాంప్రదాయ ఆయుధాలతో ఎదుర్కొన్నారు. కొలతలకు వచ్చిన సిబ్బందిని పారద్రోలారు. అట్లా భూమికోసం, హక్కుల కోసం స్త్రీ, పురుషులు కలిసి నడిచారు. ఆకాశంలో సగం, పోరాటంలో సగం నినాదాన్ని బస్తర్ ఆచరణలోకి అనువదించు కున్నారు. పిల్లల్ని కనడమే తప్ప వేరే హక్కు లేదని చెప్పే పితృస్వామ్య సమాజం అమలు చేస్తున్న అమానవీయమైన విధానాలన్నిటికీ వ్యతిరేకంగా ఈ రోజు నాగలి పట్టి దుక్కులు దున్నుతున్నారు. భూమి మీద హక్కును సంపాదించుకున్నారు. జనతన సర్కారులో భాగం పంచుకొనే స్థాయికి ఆదివాసీ మహిళ ఎదిగింది.

అయితే ఇదంతా ఏదో అవలీలగా జరిగిపోయింది కాదు. దానికి వాళ్ళ జీవితాలనే బలిపెట్టాల్సి వచ్చింది. అందుకు 'రాంబత్తి' అనే కార్యకర్త అనుభవించిన దారుణహింస ఓ ఉదాహరణ. మల్లు గ్రామ సర్పంచి భూటాసింగ్ ప్రజా నిధులను కాజేయడమే కాక పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా ఉన్నాడు. ఆ ప్రాంత ప్రజలు అతనికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఆ ఉద్యమంలో పాలు పంచుకున్నందుకు 'రాంబత్తి'ని దాదాపు రెండు నెలల పాటు పోలీస్ కస్టడీలో ఉంచుకొని దఫాలుగా సామూహిక అత్యాచారం చేశారు. తల్లిదండ్రులను కలవనీయలేదు. ఆమె ఎక్కడ వున్నదనే సమాచారం కూడా తెలియనీయలేదు. తిండి పెట్టకుండా మాడ్చటమే కాకుండా స్నానానికి నీళ్ళు కూడా ఇవ్వలేదు. ఈ కాలంలోనే ఆమె బహిస్టు అయితే మార్చుకునే మారు గుడ్డ

లేకపోయింది. ఇట్లాంటి దారుణాలు అమెరికన్ సైన్యాలు చేసినట్లుగా అటు వియత్నాం యుద్ధకాలంలోను ఇటు బొలీవియా ఉద్యమంలోను విన్నాం, చదివాం. అప్పుడు ఆ అమెరికా సైన్యాలు ఇజ్రాయల్ దగ్గర తీసుకున్న శిక్షణలాంటిదే ఇప్పుడు భారతీయ స్పెషల్ పోలీసు అధికారులు తీసుకుంటున్నారు.

ఇట్లాంటి దారుణాలు చెప్పుకుంటూపోతే లెక్కలేనన్ని. అన్నా చెల్లెళ్ళను ఎదురెదురుగా నిలబెట్టి బట్టలు ఊడదీయటం, తండ్రి ముందే బిడ్డలను, భార్యలపై అత్యాచారం చేయటం వంటివే కాక, వీటన్నిటికి పరాకాష్టగా సాల్వాజుడుంను ప్రయోగించటం. ఇప్పటికే జుడుం అత్యాచారాలు ప్రపంచానికి తెలిసిన సంగతులే. సాల్వాజుడుం శిబిరాలు అత్యాచారాల కూపాలుగా మార్చివేశారు. ఈ శిబిరాలలో అత్యాచారానికి గురికాని మహిళ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇంత భీభత్సకాండ సృష్టించి రాజ్యమేమయినా సాధించగలిగిందా? అవును, ఒక్కటి మాత్రం సాధించగలిగింది. మనుషులన్నవారు సిగ్గుతో తలదించుకొనే పనులు చేసి, ఈ స్పెషల్ పోలీసులు మానవ జాతికి చెందిన 'స్పీసీస్' కాదని నిరూపించుకో గలిగారు. మరి ఆదివాసీలు మాత్రం ఒక్కటి తెలుసుకున్నారు, ఎలాగైనా జనతన సర్కారును నిలబెట్టుకోని తీరాలి. లేదంటే తమ భూములు, ప్రాణాలు, మానాలు దక్కవనుకుంటున్నారు. కొమురం భీమ్ చూపిన మార్గంలో ప్రయాణం చేయాలనుకుంటున్నారు. ఈ మొత్తం పోరాటంలో స్త్రీలు సగానికి కంటే ఎక్కువగా పాలుపంచుకుంటున్నారు. తమ గ్రామాలకు వచ్చిన పోలీసులను ఎదుర్కొంటున్నారు. తమ కార్యకర్తలను తీసుకెళ్ళకుండా అడ్డుకుంటున్నారు. గతంలో లాగా అత్యాచారాలు చేయబోతే మౌనంగా రోదించటం లేదు. ఎదురు తిరిగి దండిస్తున్నారు.

2006లో పామేడ్ పోలీస్‌స్టేషన్ పోలీసులు యాభైమంది దాకా జారపల్లి గ్రామానికి పోయి నానా భీభత్సం చేసి చివరికి ఇద్దరు కార్యకర్తలను దొరకబుచ్చుకొని తీసుకుపోవటానికి ప్రయత్నించగా ఆ గ్రామ స్త్రీలు పోలీసులకు ఎదురు తిరిగి ఆ కార్యకర్తలని తీసికెళ్ళకుండా అడ్డు తగిలారు. దాంతో రెచ్చిపోయిన పోలీస్ అధికారి "వాటిని రేప్ జేయండిరా ముందు బుద్ధి వచ్చుద్ది" అని భయపెట్టేట్టు అరుస్తాడు. ఆ అధికారి చేష్టలకు మహిళలు బెదరకపోగా, మరింత పట్టుదలగా... "రండి! ఎలా బలత్కారం చేస్తారో చూస్తాం. మీరు మమ్మల్ని బలత్కారం చేస్తే మీ స్టేషన్ ముందే కూర్చుంటాము" అని పోలీసుల ముందే బట్టలు విప్పి వాళ్ళను సవాల్ చేశారు. దాంతో పోలీసులు జంకారు. కాని ఎల్లాగైతేనేం కార్యకర్తలను జీపులో వేసుకుని స్టేషన్‌కు తీసుకుపోగా మహిళలంతా వెంటబడి స్టేషన్‌కు పోయారు. పోలీసు స్టేషన్‌లో లాఠీఛార్జీ చేసినా, అక్కడి నుంచి కదలలేదు. చివరికి పోలీస్‌లే లొంగి కార్యకర్తలను ఒదిలిపెట్టారు.

ఇలాంటి ప్రతిఘటనా సంఘటనలెన్నో ఆ ఆదివాసి మహిళలు నిర్వహించారు. విప్లవపోరాటంలో భాగంగా చేసిన ఈ ప్రతిఘటనలే ఆ స్త్రీలను ఐక్యపరిచింది. స్త్రీలూ, పురుషులే కాదు! ఆ గ్రామాలన్ని అలా ఐక్యంగా కదిలాయంటే ఆయా గ్రామాల సమస్యగాని, ఆయా వ్యక్తుల సమస్యగానీ వాళ్ళకి సంబంధించినది మాత్రమే అనుకోలేదు. అది అందరి ఉమ్మడి సమస్యగా భావించుకున్నారు. అది రాజ్య వ్యతిరేక సమస్య కూడా అనే గుర్తింపు, స్పృహ కలిగివున్నారు. హక్కులు, గౌరవం కావాలని దేహి అనలేదు. పోరాడి సాధించుకున్నారు. ఈ క్రమమంతా దండకారణ్య ఉద్యమాన్ని, దండకారణ్య మహిళా ఉద్యమాన్ని అధ్యయనం చేస్తే మనకు తెలుస్తూనే ఉంటుంది.

నిజానికి ఈ పోరాటంలో స్త్రీలు తొలిదశలో పురుషులతో ఘర్షణపడాల్సి వచ్చింది. వర్గ సమాజం పురుషులకిచ్చిన లెజిటమసీని ఒదులుకోవటం అంత తేలికైన విషయం కాదు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చే దగ్గర తమతో పాటు ఆడవాళ్ళకు సమానంగా కూలి ఇవ్వటమేమిటని ఆ పోరాటానికి సంఘీభావం తెలపకుండా వ్యతిరేకించారు, కొంతమంది ఆదివాసీ పురుషులు. దీన్నిబట్టి ఆ పురుషులలో ఎంతగా పితృస్వామ్యం వేళ్ళూనుకొని ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఆ దృక్పథం తప్పని, వారిని చైతన్యపరచడానికి అటు మహిళలు, ఇటు విప్లవోద్యమం వారికి అర్థం చేయించటంలో ఎంతో సంయమనాన్ని, సమన్వయాన్ని చూపించారు. సమాన పనికి, సమాన వేతనాన్ని సాధించుకోగలిగారు.

ఆదివాసీలు 'జీవసారె' ఎంత పటిష్టంగా అమలు చేస్తారంటే, పిల్లలందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాక అప్పటికే భర్త చనిపోయి ఉండటంతో తన గ్రామంలో మరొక వ్యక్తితో కలిసి ఉండాలను కొంటుంది మహిళ. ఆ గ్రామం కూడా దానికి అంగీకరించింది. కానీ ఆమె కొడుకు మాత్రం తండ్రి చెల్లించిన కన్యాశుల్కం తనకు ఇస్తేగాని ఒప్పుకోనని పట్టుబట్టాడు. కానీ తల్లిని చేసుకోవాలను కుంటున్న వరుడికి ఆ 'మగనాలి' శుల్కం కట్టే స్థితి లేదు. చివరికి విప్లవోద్యమ ప్రమేయంతో ఆ సమస్యని పరిష్కరిస్తారు. అంటే అతన్ని బెదిరించో, హెచ్చరించో చేయలేదు ఆ పని. ఆ కొడుకుతో ఆదివాసీ మహిళా సంఘం చర్చించింది. ఆ ఆచారంలోని భావజాలాన్ని తెలియజేసింది. అయినా ఒక్కసారిగా అతని మనోభావాలను ఇబ్బంది పెట్టటం మంచిది కాదనుకుని రెండు వందల రూపాయలకు బదులుగా ముప్పై రూపాయలు ఇచ్చేటట్లు ఇప్పించి, అవి కూడా గ్రామంలో చందా వేయించి ఇచ్చారు. అట్లా అతన్ని ఒప్పించడం దశలు దశలుగా సాగింది.

ఇదే కాదు, ముఖ్యంగా పెళ్ళిళ్ళ విషయంలో ఆదివాసీ స్త్రీల మీద వున్న అంక్షలు లేని అధికారాలకు అడ్డుకట్ట పడటం చాలామంది పురుషులు ముఖ్యంగా యువకులు సహించలేకపోయారు. మేనరికపు పెళ్ళిళ్ళు ఇష్టంలేకపోతే ఆ స్త్రీని యమ యాతనలకు గురిచేసేవారు. రుక్మాబాయి అనే మహిళ మేనరికపు పెళ్ళి వద్దన్నందుకు కాళ్ళు, చేతులు నాలుగు వైపుల కొయ్యలకు కట్టివేసి, పెళ్ళికొడుకు అన్నదమ్ములంతా బలవంతంగా రేప్ చేశారు. అయినా సరే రుక్మాభాయి లొంగక తను ఇష్టపడినవాడితోనే కలిసి ఉండాలను కొంది. అందుకు విప్లవోద్యమం ఆమెకు సహకరించింది. ఈ ఆచారాల విషయాల్లో పురుషులలో కొందరు ఎదురు తిరిగారు. అయితే స్త్రీలు సంఘటితపడ్డారు. ఈ విషయంలోనే కాదు కోళ్ళ పందేలకి, సారా తాగడానికి, గంజాయి సాగువంటి వాటికి వ్యతిరేకంగా మహిళలు ముందుండి పోరాడారు. ఈ పోరాటాలలో దాదాపు మగవాళ్ళంతా వ్యతిరేకమయ్యారు. కొందరు మౌనంగా ఉంటే, మరికొందరు వ్యతిరేకిస్తే, ఇంకొందరు తమ ఇంటి ఆడవాళ్ళను కంట్రోల్ చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. ఇట్లాంటి హింసా ప్రవృత్తి వున్న ఆచారాలు ఈ రోజు దండకారణ్యంలో దాదాపు లేకుండా పోయాయంటే దానికి మహిళల పటిష్టమైన సంఘటిత

విప్లవోద్యమమే కారణం.

ఈ సంఘటిత ఉద్యమం ఒక్క మహిళల హక్కుల కోసం, పితృస్వామ్య సాంప్రదాయాలను ఎదుర్కోవటం కోసమే కాక, రాజ్యహింసకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లోనూ, మగవాళ్ళు నిర్బంధాలలో ఉన్నప్పుడు, పోలీసులు అక్రమంగా లాక్కెళుతున్నప్పుడు! స్త్రీలు ప్రతిఘటించి వారిని కాపాడటంతో ఆ పురుషుల ఆలోచనల్లో సానుకూల మార్పు రాసాగింది. పితృస్వామ్య సాంప్రదాయాల పట్ల వాళ్ళ ఆలోచనలు చైతన్యపూరితం కాసాగాయి. కరువు పోరాటాలలో కూలి పోరాటాలలో తమతో పాటు చేయి చేయి కలిపి నిలిచిన మహిళగా, తాము స్త్రీలను గురించి ఆలోచించాల్సిన అవసరం, బాధ్యత ఆ పోరాటాలు కల్పించాయి.

నిజానికి ముందే చెప్పినట్లుగా ఆదిమ కమ్యూనిస్టు లక్షణాలున్న ఆదివాసులను అత్యాధునిక కమ్యూనిస్టు సమాజం వైపు మళ్ళించడానికి ఒక 'ఆయుధమే' పని చేస్తూందనుకుంటే అంతకంటే పిచ్చితనం మరొకటి లేదు. మావోయిస్టులు హింసావాదులు, దౌర్జన్య పూరితులు మాత్రమే అనుకునే వారికి ఆ సమాజంలో వస్తూన్న మార్పులు ఆ మార్పుల కృషితో వాళ్ళు అనుసరిస్తున్న పద్ధతులు తెలుసుకోవటం అవసరం. అప్పుడు మాత్రమే ఆ ఉద్యమాన్ని అర్థం చేసుకోగలం.

'దున్నేవానికే భూమి' అనే నినాదం చాలా దశాబ్దాలుగా వింటూనే ఉన్నాం. అది ఎంత ముందుకు పోయిందీ మనందరికి స్పష్టమే. అయితే దండకారణ్యంలో దీన్ని సాధ్యం చేయగలిగారు. జనతన సర్కారు కింద ఉన్న గ్రామాలలోని అన్ని కుటుంబాలకు ఈ రోజు భూమి ఏర్పాటైంది. అది కూడా స్త్రీలకు భాగస్వామ్యం కల్పించడం ద్వారా! జనతన సర్కారు ఆధ్వర్యంలో ప్రజలకు ఇస్తూన్న పట్టాలు స్త్రీ పురుషుల ఉమ్మడి పేరు మీదుగా ఇవ్వటం ఒక చారిత్రక సంఘటన. భూములకు పట్టాలే లేని దశ నుంచి స్త్రీలకు పట్టాలివ్వడం ఓ గొప్ప మలుపు. వ్యక్తిగత ఆస్తిగా వారికి పట్టాలు ఇచ్చినప్పటికీ, గొప్ప ముందు చూపుతో ఒక సమిష్టి కార్యాచరణను పాదుకొల్పే దిశగా గ్రామంలో ఉమ్మడి భూమిగా కొంత భూమిని కేటాయించటం ఒక ప్రయోగంగా ప్రజల ముందుకు తీసుకు వచ్చిన ప్రాథమిక సోషలిస్టు కార్యాచరణ. ఇది ప్రజలకు వ్యక్తిగత ఆస్తి ఆలోచన నుండి సమిష్టి ఆస్తి అన్న ఆలోచనకు దారితీయటానికి చేసిన చిన్న ఉన్నతమైన ఆలోచనతో కూడిన ప్రయత్నం. ఇదిలా ఉండగా ఆదివాసీ ప్రాంతంలో జరిగిన ఈ భూపోరాటాల వల్లే కదిలిన భారత ప్రభుత్వం అటవీ భూములకు పట్టాలు అన్న చట్టం తీసుకురావటానికి దారి తీసింది.

ఆస్తి, హక్కుల విషయాలలోనేగాక ఆచారాల విషయంలో కూడా ఇటువంటి దూరదృష్టిని విప్లవోద్యమం అనుసరించింది. 'గోటుల్'. ఒక నాటి గుంపు పెళ్ళి అవశేషంగా కొనసాగుతున్న ఆదివాసీల ఆచారం. ఈ గోటుల్‌లో పెళ్ళికాని యువతీ యువకుల మధ్య శారీరక సంబంధాలు నిషేధం కాదు. అయితే ఈ సంబంధాలలోకి వచ్చిన వ్యక్తులు పెళ్ళి చేసుకోవాలనే నిబంధన ఏదీ లేదు. ఇది ఒక దృష్టిలో ప్రోగ్రెసివ్‌గా అనిపిస్తుంది. పెళ్ళికి ముందు లైంగిక సంబంధాలు 'శీలవతి'గా నిర్ణయించటానికి గీటురాయిగా లేకపోవటం మంచిదే. అయితే దీనివలన జరిగే నష్టాలు స్త్రీలు భరించాల్సి రావటాన్ని విప్లవోద్యమం వారి ముందుకు తెచ్చింది. ఏ నియమ నిబంధనలు లేని ఈ సంబంధం వల్ల వారికి పుట్టే బిడ్డలకు తండ్రిగా బాధ్యత పడేవారు ముందుకు రాకపోవడం, ఈ గోటుల్ ఆచారాల వల్ల పుట్టిన పిల్లలను పెద్దయ్యాక పెళ్ళి చేసుకోవటానికి ఎవరూ ముందుకు రాకపోవడం, తల్లి మళ్ళీ పెళ్ళి చేసుకొంటే ఆ భర్త వీరిని సాదరంగా అంగీకరించకపోవడం వంటి సమస్యల వల్ల స్త్రీలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపి వారిని చైతన్యవంతం చెయ్యటానికి కృషి చేశారు. పైగా గోటుల్ ఉత్సాహంలో అపరిపక్వ వయస్సులోనే శారీరక సంబంధాలపై ఆసక్తి కలిగి ఆరోగ్యం కూడా పాడవటం వంటివి వాళ్ళ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గోటుల్ వ్యవస్థ మీద చైతన్య కార్యక్రమానికి తొలుత ఆదివాసీ యువకులు నిరాకరించారు. అయితే ఈ ఆచారాన్ని అర్థం చేయించటానికి ఒక సుదీర్ఘ ప్రణాళికతో విప్లవోద్యమం తన ప్రయత్నం కొనసాగించింది. అనేక గ్రామాలలో గోటుల్ లైంగిక సంబంధాల వ్యతిరేక కమిటీలను ఏర్పరిచారు. ర్యాలీలు, బహిరంగ సభలు ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన కాంపెయిన్స్ నిర్వహించారు. స్త్రీ, పురుషులిద్దరూ ఈ కమిటీలలో వున్నారు. ముఖ్యంగా స్త్రీలు, ముసలివాళ్ళతో సహా ఈ కార్యక్రమాలకు భారీగా కదిలివచ్చారు. ఈ మొత్తం ఉద్యమం వల్ల గోటుల్ ఆచారంలో అనేక మార్పులు తీసుకురాగలిగారు. ఆనందం కోసం, మానసిక ఉత్సాహం కోసం అందరూ కలిసి ఆటా, పాటా సాగించవచ్చు. పెళ్ళి చేసుకోవాలని ఖచ్చితంగా అనుకున్న వాళ్ళే, లైంగిక సంబంధం పెట్టుకోవడం వాళ్ళ ఇష్టానికి వదిలివేయబడింది. అయితే అట్లా సంబంధాలలోకి వచ్చిన ఆ జంట వీలయినంత త్వరగా పెళ్ళి చేసుకోవాలి. ఈ నిర్ణయాలన్నీ ప్రజల భాగస్వామ్యంతోనే జరిగాయి. ఇట్లాంటి సుదీర్ఘమైన చైతన్య కార్యక్రమం ద్వారా ఈ రోజు గోటుల్ స్థలాలు పాఠశాలలుగా మారాయి. ఉమ్మడి సాంస్కృతిక వేదికలుగా గ్రామ సమిష్టి అవసరాలు చర్చించుకొనే కేంద్రాలుగా రూపాంతరం చెందాయి.

స్త్రీలు భూముల్లో విత్తనాలు నాటటం, ధాన్యం వున్న ఇళ్ళల్లోకి వెళ్ళనీయక పోవటం, నాగలి పట్టనీయక పోవటం, ఆయుధం పట్టి వేటకు వెళ్ళనీయక పోవటం వంటి ఆచారాల విషయంలోనే కాక పురుషులు ఇంటి పనులలో పాల్గొనకపోవటం వంటి పితృస్వామ్య ఆచరణ మీద దండకారణ్య వ్యాప్తంగా దిద్దుబాటు కార్యక్రమాలు, ఆత్మవిమర్శ వంటి కాంపెయిన్స్ ద్వారా ఎంతో అభివృద్ధిని సాధించారు. మొట్టమొదటి దశలో సంఘాలలో ఉన్న పురుషులను చైతన్య పరచి ముందుగా అటువంటి వారి ఇళ్ళల్లో అమలు చేయడం ద్వారా గ్రామాలలో పురుషుల ఆలోచనలలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నం చేశారు.

ఇదంతా విప్లవోద్యమం అరాచకంతోనూ, అతివాదంతోనూ చేసిందా? అన్న ప్రశ్న సామాన్య ప్రజల ఆలోచలనకు వదిలివేస్తూ... విత్తనాలు స్త్రీలతో విత్తించడం వంటి పనులకు వాళ్ళేం చేశారో ఏ పద్ధతులు అనుసరించారో చూద్దాం. అన్ని వ్యవసాయపనులు స్త్రీలు చేస్తారు, తప్పులేదు కానీ స్త్రీలు విత్తనాలు నాటితే అరిష్టమని, ధాన్యపు కల్లలు తొక్కితే నష్టమని వాళ్ళ పాత విశ్వాసాలు. అసలు చెట్లకు నీళ్ళు పోయటం ఏమిటి? విత్తనాలు వేయటం ఏమిటి? అన్న ప్రాథమిక నమ్మకం దగ్గర నుండి ఈ రోజు స్థిర వ్యవసాయం సాగించే దాకా సాగిన వారి ఉత్పత్తి క్రమం ఓ గొప్ప మార్పుకు నాంది పలకగా స్త్రీలను విత్తనాలు వేయటానికి ఒప్పించటం విప్లవోద్యమానికి ఒక

బాధ్యతగా మారింది. అందుకోసం ముందు జనతన సర్కారు పంచి పెట్టినవే, అయినా... అవి వ్యక్తిగత భూముల కింద మారటంతో ఆ భూములలో విత్తనాలు వేయటానికి ఆదివాసీలు ఒప్పుకోలేదు. ఇది పురుషులు అంగీకరించకపోవటం ఒకటైతే స్త్రీలు తమ పాత విశ్వాసాలు వదులుకుని విత్తనాలు నాటటానికి సిద్ధమవడం మరొకటి ఈ రెండింటిని సమన్వయం చేసి తొలుత జనతన సర్కారు కింద వొదిలిన సమిష్టి భూములలో స్త్రీలతో విత్తనాలు నాటించారు. దానికి తెగ పెద్దలు అభ్యంతరం చెప్పినా, గ్రామస్తులను కన్విన్స్ చేశారు.

ఇట్లా నాటిన సమిష్టి భూములలో 210 క్వింటాళ్ళ ధాన్యం పండింది. దాంతో వారికి నమ్మకం పెరిగింది. ఇక్కడ కూడా ఆ పండిన ధాన్యాన్ని పంపకం చేయటంలో జనతన సర్కారు ఎంత ప్రజాస్వామికంగా, ముందు చూపుతో వ్యవహరించిందంటే.. పండిన పంటలో ఒక వంతు ధైర్యంగా ముందుకు వచ్చి విత్తనాలు నాటిన స్త్రీలకు పంచారు. రెండవ వంతు సాల్వాజుడుం వల్ల నష్టపోయిన కుటుంబాలకు ఇచ్చారు. మూడవ వంతు ఆ గ్రామాలలో ప్రజారోగ్యం మీద ఖర్చుపెట్టారు. దీనివలన ఆదివాసీల ఆలోచనలలో సానుకూలతను సంపాదించటమే కాక మిగిలిన చోట్ల స్త్రీలు ధైర్యంగాను విత్తనాలు వేయటానికి ముందుకు రాసాగారు.

అలాగే ఇంటి పనులలో పాలుపంచుకోవాలని విప్లవోద్యమం పురుషులకు ప్రత్యేక శ్రద్ధతో నిరంతరం చైతన్యం చేసే పనిని కొనసాగించింది. వంట చెరుకు తీసుకురావడం, వడ్లు దంచటం, పిల్లల సంరక్షణలో బాధ్యత వహించాలని కాంపెయిన్స్ చేస్తూ ముందుగా సంఘ బాధ్యులను ఆ పనులకు ఒప్పించింది. ఈ నిరంతర చైతన్య కార్యక్రమం వల్ల కుటుంబ శ్రమ స్త్రీలకు పోయిందని చెప్పలేం కానీ కొంత మార్పు వచ్చింది. గతంలో లాగా కుటుంబ హింస మాత్రం ఖచ్చితంగా తగ్గింది. పెళ్ళిళ్ళ పేరుతో అనేక మూఢనమ్మకాలకు తెగపెద్దల అఘాయిత్యాలకు నిత్యం బలైపోయిన మహిళలు వాటి నుంచి తేరుకోవడంతో స్వేచ్ఛని, మనశ్శాంతిని పొందారు. అందుకే జనతన సర్కారు ఉండాలని ఆ స్త్రీలు దృఢంగా నమ్ముతున్నారు. అది లేకపోతే తిరిగి పాత పద్ధతులు వచ్చి తమ బతుకులు నాశనమైపోతాయని ఆందోళన చెందుతున్నారు. దానికి రుజువుగా సాల్వాజుడుం కాలంలో వాళ్ళపై జరిగిన అత్యాచారాలే నిదర్శనం. అందుకే ఎన్ని బాధలనైనా ఓర్చి జనతన సర్కారును కాపాడుకోవటానికి నమ్మకమైన బలమైన సైన్యం స్త్రీలదేనని స్పష్టంగా చెప్పవచ్చు. దళాలలో ప్లాటూన్‌లలో కమాండర్‌లుగా ఆయుధాలు పట్టి స్త్రీలు ముందు భాగాన ఉన్నారంటే ఈ దృఢ విశ్వాసమే వాళ్ళకి ప్రేరణ.

ఇట్లా ఆదివాసీ జీవితాల్లో పెనుమార్పులు రావడంలో విప్లవోద్యమం కృషి, మావోయిస్టు పార్టీ, ఆ కార్యకర్తల దీక్ష, త్యాగం అనన్య సామాన్యమైనవి. నూతన మనిషిగా ఆదివాసీలను తీర్చిదిద్దటానికి మావోయిస్టులు చేస్తున్న కొత్త ఆలోచనలు వారి సృజనాత్మక ఆచరణకు నిదర్శనం. అయితే దీనంతటిలో విప్లవోద్యమం పొరపాట్లు ఏమి చేయలేదా అంటే చేసిందనే చెప్పాలి. అయినప్పటికి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం కాన్షస్‌గా చేస్తూంది.

పితృస్వామ్యాన్ని ఎదిరించే కొన్ని చోట్ల ముఖ్యంగా రాజకీయ అవగాహన తక్కువ ఉన్నచోట దేహశుద్ధులు, కాళ్ళు మొక్కించటాలు భార్యతో భర్తను కొట్టించటాలు వంటివి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటువంటి వాటిని సమీక్షించుకొని విమర్శ చేసుకోవటమే గాక దీని మీద ఒక సరైన అవగాహనకు రావటం కూడా జరిగింది. అది ఎట్లాగంటే ప్రజల మధ్యన సామరస్యపూర్వకంగా పరిష్కారమయ్యే వైరుధ్యాన్ని శత్రుపూరితంగా చేయరాదని పరిష్కారం చూపించటంలో దూరదృష్టితో ఆలోచించుకోలేకపోయామని సమీక్షించుకున్నారు. అలాగే ధాన్యపు గదులలోకి స్త్రీలు రావటం, గాదెల నుండి ధాన్యం తీయటం వంటి వాటి మీద అల్లబడి ఉన్న సాంప్రదాయపు భావజాలాన్ని ఒప్పించటం ద్వారా పరిష్కరించకపోగా తొందరపడి కాంపెయిన్స్ తీసుకోవటం సరైన పద్ధతి కాదని ఉద్యమం సమీక్షించుకుంది. అయితే ఆ సమీక్షించుకున్న విషయాలు, భవిష్యత్తులో మార్పులు తప్పని సరిగా రావలసినవే. అయితే ప్రజలకు అర్ధం చేయించకుండా సెక్టేరియన్ పద్ధతులను అనుసరిస్తే వ్యతిరేక ఫలితాలు వస్తాయని వాళ్ళ అనుభవాలు చెప్పాయి. వ్యక్తులు చైతన్యవంతమైనంత మాత్రాన... సమాజం ఆ స్థాయిలో ఉండదని కొత్త విలువలు మంచివే అయినా... నమ్మకం కలిగించాలే గానీ... రుద్దటం వల్ల ప్రజలకూ, మనకూ పొంతన లేకుండా పోతుందని గ్రహించారు. మనం చెప్పే విషయాల పట్ల అపనమ్మకంతో చూడటం ఉద్యమాలకు నష్టం. వ్యక్తులంటే వారి వారి చైతన్యం వారి వారి సంసిద్ధతను బట్టి వ్యక్తిగత స్థాయిలో అభ్యుదయ కరంగా ఆలోచించ వచ్చు. ఆచరించవచ్చు... కానీ ప్రజలను తమతో పాటు నడిపించాల్సిన ఉద్యమం... లింకు తెగిపోయిన ప్రయాణంలా ఉండరాదు.

సాంస్కృతిక విప్లవ కాలంలో చైనాలో జరిగిన కొన్ని సంఘటనలు ఇక్కడ సమీక్షించుకోవాల్సి వచ్చింది. కుటుంబ తగాదాలలో పాక్షికంగా వ్యవహరించి భర్తకో, అత్తకో ఎప్పుడూ వ్యతిరేకంగా ఉండటం వల్ల ప్రజలలో సానుభూతిని కోల్పోయామని చైనా కల్చరల్ రివల్యూషన్ కాలంలో జరిగిన వాటిని సమీక్షించుకున్నారు. అలాగే స్త్రీలను సంఘటితం చేయటంలో వారి వారి జీవనోపాధి సమస్యలను పరిగణనలోనికి తీసుకోవాలనీ, స్త్రీలకు అర్ధం కాని భాషలో పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చే సభలకు తీసుకుపోయి వారి శక్తిని వృథా చేయరాదని, చైనా విప్లవ కాలంలో వచ్చిన ఇటువంటి అనుభవాలను అధ్యయనం చేయటం ద్వారా దండకారణ్య మహిళా ఉద్యమం తన పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నమే గాక స్థానిక ఆచార వ్యవహారాలు ప్రజల సంసిద్ధతను దృష్టిలో పెట్టుకొని కూడా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్నారని అర్థం అవుతుంది.

మార్క్స్ చెప్పినట్లుగా అణగారిన వర్గాలు చైతన్యమై తిరగబడినప్పుడే మార్పు సాధ్యమని దండకారణ్య మహిళా ఉద్యమంతో మరోసారి రుజువైంది. స్త్రీలు ఎప్పుడూ కింద వర్గంలోని వారే. వారే ఈ రోజు విప్లవోద్యమంలో ముందున్నారంటే స్త్రీలకు ఈ ఉద్యమం వల్ల కలిగిన స్వేచ్ఛ, సమానత్వం ఎంత విలువైనవో మనం అర్థం చేసుకోవచ్చు. అణిచివేయబడ్డ జనం తలెత్తి నిలబడి స్వేచ్ఛను ఆస్వాదించడంలోని ఔన్నత్యాన్ని తెలుసుకున్నారు. ఇక వారు వెను తిరిగి చూడటం అంటే ప్రాణవాయువు పోయినట్లే. తెలంగాణ పోరాట విరమణ తరువాత ఆ పోరాటంలో పాల్గొన్న స్త్రీలు అనుభవించిన విషాదం మన ముందున్న చరిత్రే.

అయితే ఇక్కడ ఆగి, మనం మైదాన ప్రాంతాలలో జరుగుతున్న మహిళా ఉద్యమాల గురించి కూడా ఒకసారి ఆలోచించుకుంటే బాగుండుననిపిస్తోంది. నేను ఈ ప్రస్తావన ఎందుకు తెస్తున్నానంటే దాదాపు ఎనభైల నుండి వెల్లువగా సాగిన మహిళా ఉద్యమాలకు తెలుగునేల పెట్టింది పేరుగా ఉంది. ఇంత సుదీర్ఘకాలంగా సాగుతున్న ఈ ఉద్యమం స్త్రీలకు ఏ మేరకు సమాన హక్కులను సాధించపెట్ట గలిగింది? ఆర్థికంగా ఎంతో మెరుగైన జీవితాలను అనుభవిస్తున్న వారు కూడా సాంస్కృతికంగా ఏ స్థాయిలో ఉంటున్నారు. పట్టణ మధ్య తరగతి స్త్రీలు ఈ రోజు సంపాదించుకొన్న సమానహక్కులు నిజమైన అర్థంలో సమానమైనవేనా? ఆ సమాన భాగస్వామ్యాన్ని అర్థం చేయించటంలో ఉద్యమాలు వేసిన అడుగులు సరైన ఫలితాలనే ఇచ్చాయా? దీన్ని దండకారణ్య మహిళా ఉద్యమంతో పోల్చి సరిచూడాలనిపిస్తుంది.

ఇట్లా ఆలోచించినప్పుడల్లా నాకు తరచుగా వేటపాలెం వెంకాయమ్మ గారే గుర్తుకు వస్తారు. ఆమె ఈ విషయం మీద మహిళా సంఘ సమావేశాల్లో తరుచుగా ఘర్షణ పడేవారు. ఆమె ఎప్పుడూ ఒక విషయం చెబుతుండేది. సమానహక్కులు సాధించాల్సిన దిశగా సమాజాన్ని అర్థం చేయించాల్సింది పోయి అది వ్యక్తిగత స్థాయికి దిగి మన కుటుంబాలలోనే కొట్లాడుకోనే స్థితి రావడం ఉద్యమాలకు నష్టమేగాని మంచిది కాదని ఆమె ఓ ఉదాహరణ చెప్పేవారు. వీవర్స్ కమ్యూనిటీకి చెందిన ఓ కార్యకర్త మంచి నిజాయితీపరుడు, ఉద్యమం అంటే అపారమైన అభిమానం ఉండేదతనికి. అయితే వారిది పేదకుటుంబం కనుక మగ్గం నేస్తేనే గాని కుటుంబం గడవదు. మగ్గం పని అంటేనే, కుటుంబంలోని అందరూ శ్రమ పడాల్సిందే. అయితే అతను ఉద్యమం పని మీద బయటకు పోయినప్పుడు ఆ పనిభారం భార్యమీద పడేది. ఈ స్థితిని అర్థం చేసుకుని ప్రత్యామ్నాయాలను గురించి ఆలోచించుకోవాల్సి ఉండగా దాన్ని అంత దూరదృష్టితో సమన్వయం చేసే కార్యకర్తలు లేకపోవడం వల్ల చివరికి అది హక్కుల చర్చగా మారి అతని భార్య కూడా నేతపని జోలికి వెళ్ళడం మానేసింది. నిజానికి ఆమె కూడా ఉద్యమ సానుభూతిపరురాలే... మంచి మనసున్నామే, కానీ ఘర్షణలు ఎక్కువై అంతిమంగా ఆ కార్యకర్త కూడా ప్రజాసంఘాలలో పనిచేయటం మానివేశాడు. వెంకాయమ్మగారు ఇది ఆమె అనుభవంగా చెప్తూ ఉండేవారు. చివరకు చైతన్యం ఇట్లా మన కుటుంబాలలో ఘర్షణలను ఎక్కువ చేసి... రెంటికీ చెడ్డ రేవడయిందనే వారు. ఇది ఎందుకు ప్రస్తావిస్తున్నాను అంటే, ప్రజల చైతన్య స్థాయిని, వ్యక్తుల చైతన్య స్థాయిని అర్థం చేసుకోకుండా ఇచ్చే పిలుపు రాజకీయ ఉద్యమంలోనైనా, మహిళా ఉద్యమాలలోనైనా వ్యతిరేక ఫలితాలు ఇస్తాయనే. అంతమాత్రం చేత స్త్రీ పురుషుల మధ్య అసమాన సంబంధాలు యథాతథంగా కొనసాగడం ఉద్యమ చైతన్యానికి విరుద్ధం. రాజకీయ ఉద్యమం స్త్రీ పురుషుల చైతన్య స్థాయిని పెంపొందిస్తూ అది ఉద్యమ పురోగతికీ అదే సమయంలో స్త్రీ సమస్యల పరిష్కారానికి దారులు వేస్తూ పోతుంది. ఇది క్రమానుగతంగా పురోగమిస్తుంది. దండకారణ్య పోరాట ప్రాంతపు స్త్రీలు మనకు చెబుతున్న అనుభవాలు ఇదే రుజువు చేస్తుంది.

సమాజంలో ఆర్థిక, సామాజిక, పరపతి స్థాయి ఎగువనున్న వ్యక్తులు చైతన్యంతో ఆచరించే అన్ని విలువలూ, అవి పురోగామి దృక్పథం కలిగినవి, అయినప్పటికీ!, సామాన్య ప్రజలకు ఆచరణలో అందుకోవటానికి సాధ్యం కావు. నిజానికి ఏ ఉద్యమ నేపథ్యం లేకపోయినా! ఏ కాలంలోనైనా హక్కుల విషయంలో, అధిపత్యంలో, ఆస్తుల విషయంలో పై వర్గంవారు ఎదిరించి సాధించుకోగలిగారు. వారు సమాజాన్ని చూసి జడుసుకునే స్థితి ఎన్నడూ లేదు. వేమన చెప్పినట్లు వారి "పుష్టంబు మీద పుండు పుర్విలో వార్త" అయిపోతుంది. కాని అట్టడుగు వర్గాలను, వారి సాంఘిక సామాజిక స్థితి నుండీ... ఆ స్త్రీల చైతన్య స్థాయి నుండే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో మనతోటి కలిసి నడిచి, మన ఉద్యమానికి అండదండలుగా ఉండాల్సిన తోటి మానవులను శతృవులుగా చూడరాదనేది కూడా ఈ ఉద్యమం మనకు నేర్పుతుంది. ఒక్క దండకారణ్య ఉద్యమమే కాదు చైనా సాంస్కృతిక విప్లవ అనుభవాలు ఇవేనని తెలుసుకుంటాం. మహిళల జీవితాల్లో ఆ కాలంలో చైనాలో వచ్చిన మార్పులు అద్భుతమైనవి. కానీ తిరిగి అవి తిరోగమన దిశగా నడిచాయంటే స్త్రీ, పురుషుల మధ్యే కాదు మనుషులందరి మధ్య చైతన్యం నిరంతరం సాగే ప్రక్రియగా కొనసాగాలి. పురుషులకి అనుకూలం, సుఖవంతం, సౌకర్యవంతం, విలాసవంతమైన ఈ స్థితిని వదులుకోవటానికి ఇష్టపడే చైతన్యం వారిలో రావాలంటే అందుకు భౌతిక ప్రేరణ కూడా కావాలి. లేదంటే శత్రువులుగానే మిగిలిపోతారు.

సాల్వాజుడుం కాలంలో మహేంద్రకర్మలాంటి వాళ్ళు "ఇద్దరు భార్యలను చేసుకుందాం, చేసుకుందాం" అంటూ యువకులను రెచ్చగొట్టి ప్రేరేపించారు. మహిళా సంఘం శిక్షలకు గురైన వారిని జుడుంలోనికి లాగగలిగారు. బలవంతంగా అమ్మాయిలను ఎత్తుకు పోవటాన్ని నిరోధించినందుకు, బలవంతపు పెళ్ళిళ్ళు ఆపినందుకు మహిళల మీద జుడుం పచ్చి రౌడీలుగా మారి కసి తీర్చుకున్నారు. జుడుం శిబిరాలను అత్యాచార కూపాలుగా మార్చారు. ఎందరినో సామూహిక అత్యాచారాలు చేసి చంపి వేశారు.

అయితే దండకారణ్య మహిళలు వాటిని చూసి బెంబేలెత్తి పోరాటం నుంచి తప్పుకోలేదు. జుడుం శిబిరాలలో అత్యాచారాలను రాజకీయ అణచివేతలో భాగంగా అర్థం చేసుకొని ధైర్యం తెచ్చుకున్నారు. తొలిదశలో అత్యాచారానికి గురైన మహిళలు మానసికంగా కుంగిపోయిన స్థితినుంచి, ఈ రోజు అలాంటి స్త్రీలను తోటి మహిళలు అక్కున చేర్చుకుంటున్నారు, ధైర్యమిస్తున్నారు. తమ మీద జరుగుతున్న అత్యాచారాలు తమకు వ్యక్తిగతంగా జరిగిన అవమానంగా పరిగణించటం లేదు. అది రాజ్యహింసగా, జనతన సర్కార్ మీద జరుగుతున్న దాడిలో భాగంగా అర్థం చేసుకుంటున్నారు. ఇది ఆ ప్రాంత స్త్రీలలో వచ్చిన నిజమైన చైతన్యం.

అట్లా రాజ్య వ్యవస్థ మీద సాగిస్తున్న యుద్ధంలో భాగంగా పురుషాధిపత్యాన్ని ఎదిరించి సమానహక్కుల దిశగా పోరాటంలో సగభాగంగా, మిలిషియాలో కమాండర్లుగా, తీర్పులకు బలైన వాళ్ళే తీర్పరులుగా, న్యాయ కమిటీలలో భాగస్వాములుగా ఇవాళ దండకారణ్య మహిళ నిజమైన అర్థంలో 'ఆకాశంలో సగం, పోరాటంలో సగం' సాధించుకుంటూ సాగిపోతోంది. ఆ ఉద్యమం వైపుగా మనం దృష్టిని సారించటం మన ముందున్న కర్తవ్యం.

☆

వ్యాసం

ఆర్ ఎస్ రావు స్మారక సదస్సు 10 నవంబర్ 2013 లో సమర్పించిన పత్రం

సాహిత్యంలో సమాజ చలనపు ప్రతిఫలనం : అవకాశాలూ అవరోధాలూ

- ఎన్ వేణుగోపాల్

ఉపోద్ఘాతం

ఆర్ ఎస్ రావు గారి సంస్మరణలో జరుగుతున్న ఈ సదస్సులో సమాజ సాహిత్య సంబంధాల మీద ఆయన ఆలోచనలతోనే ప్రారంభించడం సముచితం. మార్క్సిస్టుగా, సామాజిక శాస్త్రవేత్తగా, సాహిత్యాభిమానిగా ఆయన ఆ మూడు స్థాయిలలోనూ చాల లోతుగా సమాజ సాహిత్య సంబంధాలను అధ్యయనం చేశారు. గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం', కాళీపట్నం రామారావు 'యజ్ఞం', సాధన 'రాగో'ల మీద విస్తృత వ్యాఖ్యలలో, మరెన్నో రచనల మీద అభిప్రాయాలలో ఆయన సమాజ సాహిత్య సంబంధాలను గురించిన తన అవగాహనలను వెల్లడించారు. ఇవాళ ఈ సదస్సుకు ఎంచుకున్న ఇతివృత్తం 'సాహిత్యంలో సమాజ చలనపు ప్రతిఫలనం' గురించి ఆయన సైద్ధాంతిక స్థాయిలోనో, అన్వయ స్థాయిలోనో నేరుగా రాయలేదు గాని ఎన్నో వ్యాసాల్లో ఆ దిశలో ఆలోచనలు చేశారు. ప్రస్తుత సందర్భానికి తగిన రెండు వ్యాఖ్యలు మాత్రం ఇక్కడ గుర్తు చేసుకోవడం అవసరం.

వాస్తవికతను సాహిత్యంలోకి తీసుకువచ్చేటప్పుడు మూడు పద్ధతులు ఉన్నాయని ఆయన 'గురజాడ రచనలు - వాస్తవికత' (2002) వ్యాసంలో విశ్లేషించారు. వాస్తవిక పాత్రలతో, వాస్తవిక సన్నివేశాలతో సాహిత్యసృజన చేయడం ఒక పద్ధతి. వాస్తవిక పాత్రలను తీసుకుని సన్నివేశాలను మాత్రం కాల్పనికత, వాస్తవికతల మేళవింపుగా మార్చడం రెండో పద్ధతి, కాల్పనిక పాత్రలతో వాస్తవ సన్నివేశాలను చిత్రించడం మూడో పద్ధతి. ఈ మూడు పద్ధతుల గుణదోషాల చర్చ చేస్తూ మొదటి పద్ధతి పాఠకులకు పాక్షిక అవగాహననే ఇస్తుందని, మూడో పద్ధతి పరాయీకరణకు దారితీస్తుందనీ, రెండో పద్ధతి చదువరుల ఆలోచనాశక్తిని పెంపొందించి, ఆచరణ కార్యకలాపాల వైపు నడిపిస్తుందనీ ఆయన అన్నారు.

అలాగే సామాజిక పరిణామాన్ని, చలనాన్ని, మార్పులను సాహిత్యం ఎలా ప్రతిఫలిస్తుందో వివరించే మరొక విలువైన వ్యాఖ్యను ఆయన కాళీపట్నం రామారావు 'కథాకథనం' ముందుమాట 'ఆంటీ హీరో నుంచి ఆల్టర్నేటివ్ హీరో దాకా' (1990) లో చేశారు. అది వివరంగానే ఉటంకించవలసి ఉంది:

"50ల చివరలో అనుకుంటాను, భారతీయ పార్లమెంటులో రామ మనోహర్ లోహియా మనదేశంలో చాలామంది రోజుకి అర్ధరూపాయి కూడా ఖర్చుపెట్టలేని బీద ప్రజలున్నారంటే అతనికీ నెహ్రూకీ జరిగిన వాగ్యుద్ధం. తరువాత ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ చాలా కష్టపడి అభివృద్ధి జరిగిన మాట నిజమే కాని బీద ప్రజలు పెరగడం కూడా నిజమేనని చెప్పింది. అది యజ్ఞం కథ ప్రచురించిన సమయంలో వచ్చిన రిపోర్టే. తేడా ఏమిటంటే అది గణాంకాలు. ఇది చరిత్ర. అది ఫలితాన్ని చెబితే, ఇది క్రమాన్ని చెబుతుంది. రామారావుగారి కథలు నిజజీవితాన్ని ప్రతిబింబించడంలో, ఆ నిజజీవితంలో చలనాన్నీ, చలనంలో సమగ్రతనీ మన ముందు ఉంచుతాయి. అవి మనకు ఉపన్యాసాలు ఇవ్వవు. జ్ఞానాన్ని ఇస్తాయి. చరిత్ర గురించి చెప్తాయి.

అందుచేత కొంతకాలం క్రితం ప్లానింగ్ అండ్ అగ్రేరియన్ పూర్ మీద 1947 తర్వాత భారతదేశ చరిత్ర మీద ఒక పాపులర్ వ్యాసం రాయమన్నప్పుడు వాళ్లు నేనేదో ఎకనమిక్స్ మీద రాస్తాననుకున్నారు. నాకేమో ఎకనమిక్స్ డాటా మీదగల నమ్మకం చేత వాటిని వదిలేసి నక్సల్బరీ ముందు చరిత్రకి యజ్ఞం కథనీ, తరువాత అంత గొప్ప రచన కొమురం భీంని తీసుకుని 'ఇదే పొలిటికల్ ఎకానమీ అనుకోండి, ఇదే భారతదేశ చరిత్ర అనుకోండి, ఇదే ప్లానింగ్ అనుకోండి' అన్నాను. నక్సల్బరీకి ముందు స్వాతంత్ర్య భ్రమలలో అభివృద్ధి అనే ఐడియాలజీలో పడి ఉన్న సమాజంలోని సాంఘిక మార్పులను ప్రతిఫలించే కథ యజ్ఞం అయితే, నక్సల్బరీ తరువాత ఆ అభివృద్ధి క్రమంలో పెరుగుతున్న అట్టడుగు వర్గాల చేత రాయబడుతున్న చరిత్ర క్రమం, ఆ వర్గాల దృక్పథంలో గత చరిత్రను తిరగరాసుకోవడం కొమురం భీం నవల మనముందు ఉంచుతుంది. ఇవి రెండూ కళారూపాలు. అందులోని పాత్రలు సమాజంలోని చలనాన్ని సూచిస్తాయి. ఆ సూచించడంలో నిజజీవితానికి ప్రతిబింబమవుతాయి. నిజజీవితంలోంచి కథలోకీ, కథలోంచి నిజజీవితంలోకీ ప్రయాణం చేయడానికి వీలు కల్పించి మరపురాని అనుభూతినిస్తాయి" అని ఆ ముందుమాటలో ఆర్ ఎస్ రావు అన్నారు.

నిజానికి సరిగ్గా ఇటువంటి వ్యాఖ్యనే మార్గరెట్ హార్క్ నెస్ కు రాసిన ఉత్తరం (ఏప్రిల్ 1888) లో ఎంగెల్స్ కూడ చేశాడు. ఫ్రెంచి రచయిత బాల్జాక్ తన నవలలో ఫ్రెంచి సమాజపు సంపూర్ణ చరిత్రను ఎలా పట్టుకున్నాడో రాస్తూ "ఆ కాలపు పేరుపొందిన చరిత్రకారులు, అర్థశాస్త్రవేత్తలు, గణాంక శాస్త్రవేత్తలు అందరి నుంచీ కలిపి నేర్చుకున్న దానికన్న ఎక్కువ, చివరికి ఆర్థిక వివరాలతో సహా, ఈ నవల నుంచి నేర్చుకున్నాను" అని ఎంగెల్స్ రాశాడు.

పైన ఉదహరించిన ఆర్ ఎస్ రావు వ్యాఖ్యల నుంచి గ్రహించగలిగేదేమంటే:

- అవాస్తవ పాత్రల, అవాస్తవ సన్నివేశాల సాహిత్యాన్ని సాహిత్యంగానే గుర్తించనక్కరలేదు.
- వాస్తవ పాత్రల, వాస్తవ సన్నివేశాల, కాల్పనిక పాత్రల, కాల్పనిక సన్నివేశాల కలగలుపుతో వెలువడగల మూడు రకాల చిత్రణను మాత్రమే గుర్తించవచ్చు.
- వీటిలోనూ వాస్తవిక పాత్రలతో, వాస్తవిక-కాల్పనిక కలగలుపు సన్నివేశాలతో జరిగే చిత్రణ మాత్రమే అర్థవంతమైన సాహిత్య ప్రయోజనాన్ని నెరవేర్చగలుగుతుంది.

- సాహిత్య రచనలు సామాజిక శాస్త్ర నివేదికల కన్న మిన్నగా సామాజిక చలనాన్ని, మార్పును, క్రమాన్ని గుర్తించగలవు, అవి చరిత్రను, జ్ఞానాన్ని ఇవ్వగలవు.
- సాహిత్యంలోని పాత్రలు సమాజంలోని చలనాన్ని సూచిస్తూ నిజజీవితానికి ప్రతిబింబంగా ఉంటాయి, పాఠకులు కథలోంచి నిజజీవితంలోకీ, నిజజీవితంలోంచి కథలోకీ ప్రయాణించ డానికి వీలు కల్పిస్తాయి.

ఈ అవగాహనల పునాది మీద నిలబడి కొన్ని గాలిపటాలు ఎగరేయడం, సాహిత్యంలో సమాజమూ, సమాజ చలనమూ ఎలా ప్రతిఫలిస్తాయో, అలా ప్రతిఫలించడానికి ఉన్న అవకాశాలూ అవరోధాలూ ఏమిటో చర్చించడం ఈ వ్యాస లక్ష్యం.

సాహిత్యం వాస్తవికతకు, సమాజానికి అద్దం పడుతుందనీ, సాహిత్యంలో సమాజం ప్రతిఫలిస్తుందనీ, సాహిత్యం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోవచ్చుననీ చాల మామూలు మాటలుగా చెప్పుకుంటాం. మరి సమాజం నిత్యం, అనుక్షణం, వేగంగా మారుతూ ఉన్నప్పుడు సాహిత్యం ఆ మార్పును నిజంగా పట్టుకోగలుగుతుందా? పట్టుకుంటే ఎలా పట్టుకుంటుంది? సమాజం ఉన్నంత గతిశీలంగా సాహిత్యం ఉండగలదా? సమాజానికి గతిశీలత ఉత్పత్తి నుంచీ, పునరుత్పత్తి నుంచీ, వర్గపోరాటం నుంచీ వస్తుందని మార్క్సిజం చెపుతుంది. (సరైన భావాలు ఉత్పత్తి నుంచీ, శాస్త్ర ప్రయోగం నుంచీ, వర్గపోరాటం నుంచీ వస్తాయని మావో అన్నాడు గాని శాస్త్రప్రయోగం ఉత్పత్తి ప్రక్రియలో భాగమే). ఈ మూడు మూలాలలో సాహిత్యం ఉత్పత్తి చేత ప్రభావితమవుతుంది గాని ప్రత్యక్షంగా ఉత్పత్తిని తన వస్తువుగా చేసుకోవడం తక్కువ. పునరుత్పత్తినీ, వర్గపోరాటపు విభిన్న వ్యక్తీకరణలనూ మాత్రమే సాహిత్యం తన వస్తువుగా తీసుకుంటుంది. ఈ మూడు తలాలలో నిరంతరం అనుక్షణం జరిగే మార్పులను గ్రహించగల, చిత్రించగల శక్తిసామర్థ్యాలు సాహిత్యానికి ఉన్నాయా అనేది ప్రశ్నే.

ప్రకృతి, సమాజం, మనిషి నిత్య చలనశీలమైనవని అందరికీ తెలుసు. ఎప్పటికీ మారనిది మార్పు ఒక్కటే. మరి అంత విస్తృతమైన, సర్వవ్యాపితమైన, సార్వకాలికమైన, సార్వజనీనమైన, అనంతమైన మార్పులలో ఏ మార్పును విడదీసి సాహిత్యం తన వస్తువుగా తీసుకుంటుంది? సామాజిక చలనాన్ని సాహిత్యం పట్టుకుంటుందనో, పట్టుకోవాలనో మనం అనుకుంటున్నప్పుడు ఆ చలనంలో ఏ భాగం గురించి, ఏ స్థాయి గురించి, ఏ క్రమం గురించి మనం ఆలోచిస్తున్నాం?

ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాలంటే అసలు మార్పు అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. సామాజిక చలనాన్ని, మార్పులను స్థూలంగా పరిమాణాత్మక మార్పులు, గుణాత్మక మార్పులు అని విడదీసి అర్థం చేసుకుంటాం. పరిమాణాత్మక మార్పులు గుణాత్మక మార్పులుగా మారుతాయి గాని రెంటికీ స్వభావరీత్యా తేడాలున్నాయి. పరిమాణాత్మక మార్పులు నిరంతరం, అనుక్షణం, అతి వేగంగా కోటానుకోట్లు జరుగుతుండగా గుణాత్మక మార్పులు గంతులుగా, నింపాదిగా, తక్కువగా జరుగుతాయి. ప్రకృతిలో గుణాత్మక మార్పులు దాదాపు సహజంగా, అనివార్యంగా జరుగుతాయి గాని సమాజంలో గుణాత్మక మార్పులను అడ్డుకోవలసిన స్వార్థ ప్రయోజనాలు, అడ్డుకునే శక్తులు ఉంటాయి. అందువల్ల సమాజంలో పరిమాణాత్మక మార్పులు నిరంతరం జరుగుతున్నప్పటికీ, గుణాత్మక మార్పులు జరగడానికి అవరోధాలు ఉంటాయి. సాహిత్యంలో పాత్రల చలనం ప్రస్ఫుటం కావాలంటే వాటి జీవితాలలో గుణాత్మక మార్పులు రావలసి ఉంటుంది. సన్నివేశాలు ప్రేరణాత్మకం కావాలంటే గుణాత్మక మార్పుల చిత్రణ జరగ వలసి ఉంటుంది. సాధారణ సాహిత్యం పరిమాణాత్మక మార్పులను చిత్రించే దగ్గర ఆగిపోతుంది. సామాజిక ప్రయోజనాన్ని ఉద్దేశించే సాహిత్యం గుణాత్మక మార్పులను చిత్రిస్తుంది. ఏ పరిస్థితుల నేపథ్యంలో గుణాత్మక మార్పు సాధ్యమవుతుందో సన్నివేశాలను వాస్తవికంగాగాని, కాల్పనికంగాగాని చిత్రిస్తుంది. ఆ సాహిత్యం విడివిడి మార్పులను కుప్పపోయడం, జాబితా వేయడం కాకుండా ఆ మార్పుల చలన దిశను, చలన స్వభావాన్ని చిత్రించడానికి ప్రయత్నిస్తుంది. పైన ప్రస్తావించిన కన్యాశుల్కం, యజ్ఞం, కొమురం భీం, రాగో వంటి రచనలు సామాజిక చలనాన్ని అలా పట్టుకున్నాయి గనుకనే ఆ కథాకాలపు సామాజిక శాస్త్ర వివరణల, నివేదికల కన్న ఎక్కువగా ఆ కాలం గురించి అవగాహన కలిగించగలిగాయి.

సాహిత్యం సమాజానికి అద్దం అనే భావన

అయితే ఇక్కడ మరికొన్ని ప్రశ్నలకు అవకాశం ఉంది. సాహిత్యం సమాజాన్ని అద్దం పట్టడానికో, ప్రతిబింబించడానికో, ప్రతిఫలించడానికో ఉన్న అవకాశాలేమిటి? ఆ అవకాశాలు సాహిత్యకారులకు అనివార్యంగా, సహజంగా వస్తాయా? సాహిత్యకారులు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించవలసి ఉంటుందా? సాహిత్యకారులందరూ ఆ అవకాశాల్ని వినియోగించుకో గలరా? వినియోగించుకోలేని వాళ్ల సాహిత్యంలో సమాజం ఎలా ప్రతిఫలిస్తుంది? ఒక సాహిత్య సమాజంలో ఆ అవకాశాల్ని వినియోగించుకునేవాళ్లు ఎక్కువ ఉంటారా? వినియోగించుకోనివాళ్లు ఎక్కువ ఉంటారా? అసలు సమాజం సాహిత్యంలో ప్రతిఫలించడం అంటే అర్థం ఏమిటి? ఒకవేళ అలా సమాజాన్ని సాహిత్యం అద్దం పట్టడమో, ప్రతిబింబించడమో, ప్రతిఫలించడమో జరగకపోతే అందుకు ఏ అవరోధాలు కారణమవుతాయి?

సాహిత్యం సమాజానికి అద్దం పడుతుందనే మాట సాహిత్యవిమర్శలో చిరకాలంగా, వాస్తవికతావాదం ప్రవేశించిన నాటినుంచీ, ఉంది. ప్రధానంగా పంతొమ్మిదో శతాబ్దపు ఫ్రెంచి సాహిత్యంతో ఉనికిలోకి వచ్చిన వాస్తవికతావాదం దృష్టిలో సాహిత్య రూపాలు అద్దం లాగ సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. ఒక రచన సమాజానికి అద్దంపట్టింది అని ప్రశంసాత్మకంగా అనడం ఇప్పటికీ ఉంది. కాని ఈ అద్దం పట్టడం అనే మాటతో కొన్ని సమస్యలున్నాయి. అద్దం ఒక యాంత్రిక ప్రతీక. వస్తువు ఎలా ఉంటే దాని ప్రతిబింబం అదే విధంగా ఉంటుంది. కొన్ని కుంభాకార, పుటాకార అద్దాలు, చెడిపోయిన అద్దాలు, పగిలిపోయిన అద్దాలు వస్తువును మార్చి చూపవచ్చు గాని మామూలుగా అద్దం ఉన్నది ఉన్నట్టుగా కూడ కాదు, కనబడినది కనబడినట్టుగా చూపుతుంది. అంటే ఒకే కోణాన్ని చూపుతుంది. ఆ కనబడేదాని వెనుక ఉన్నదేమిటో, దాగి ఉన్న కోణాలేమిటో చూపజాలదు. అలాగే అద్దానికీ వస్తువుకూ మధ్య ఎటువంటి చర్య-ప్రతిచర్య ఉండవు. అద్దం ప్రభావం ప్రతిబింబం పైన ఉండదు. సాహిత్యాన్ని అద్దంతో పోలచడమంటే సమాజం మీద

సాహిత్య ప్రభావం ఉండదని మరో మాటల్లో చెప్పడమే.

అందువల్ల అద్దం పట్టడం, ప్రతిబింబించడం అనే మాటలు సాహిత్యం గురించి చాలకాలంగా ఉన్నప్పటికీ అవి సాహిత్య స్వభావాన్ని, సాహిత్య ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకున్నవి కావు. మరి ఆ అవగాహనలు పొరపాటువో, అసమగ్రమైనవో అయితే, సాహిత్యం సమాజాన్ని ప్రతిఫలిస్తుంది అనే మాటయినా పూర్తిగా సరైనదేనా? నిజంగానే సాహిత్యం సమాజాన్ని ప్రతిఫలిస్తుందా? అసలు సమాజాన్ని ప్రతిఫలించడం అంటే ఏమిటి?

సాహిత్యం సమాజానికి ప్రతిఫలనం

ప్రతిబింబించడం, ప్రతిఫలనం అనే మాటలకు అర్థంలో తేడా లేనప్పటికీ వాడకంలో ప్రతిఫలనం అనే మాటకు లోతైన, విశాలమైన అర్థం వచ్చింది. కనబడని కోణాలను కూడ చూపగలగడం, పరస్పర ప్రభావానికీ, చర్య-ప్రతిచర్యకూ అవకాశం ఇవ్వడం అనే అర్థాలలో ప్రతిఫలనం అనే మాట వాడుతున్నారు. త్రిపురనేని మధుసూదన రావు ప్రతిఫలనం బదులు పరావర్తనం అని వాడారు. నిజానికి ఈ మాటల మధ్య అర్థ భేదాలకు మూలం తత్వశాస్త్ర చరిత్రలో ఉంది.

అసలు భౌతిక వాస్తవికతను మానవమేధ గ్రహించగలదా లేదా, గ్రహిస్తే ఎలా గ్రహిస్తుంది అనే చర్చ తత్వశాస్త్రంలో పందొమ్మిదో శతాబ్దపు చివరిలో, ఇరవయో శతాబ్ది మొదట్లో పెద్ద ఎత్తున జరిగింది. జ్ఞానసిద్ధాంతంగా ప్రఖ్యాతమైన ఈ చర్చ ఎన్నో కొత్త ఆలోచనలకు దారి తీసింది. మానవమేధ భౌతిక వాస్తవికతను గ్రహించే పని యాంత్రికంగా జరగదు. అది ఒక చలనశీలమైన ప్రక్రియ. భౌతిక వాస్తవికత పంచేంద్రియాల ద్వారా మనిషికి అందుతుంది. అది అద్దం పట్టడం. లేదా ప్రతిబింబించడం. మెదడులో అప్పటికే ఉన్న ముద్రల ఆధారంగా ఆ భౌతిక వాస్తవికతకు ఒక అర్థం సమకూరుతుంది. ఇలా బైటి నుంచి ముద్రలు వేసే భౌతిక వాస్తవికతకూ లోపలి మెదడుకూ మధ్య అన్యోన్య చర్య-ప్రతిచర్య క్రమం జరుగుతుంది. ఇంద్రియగ్రహణ క్రమం మానవమేధలో అనేక సంకీర్ణ, గుణాత్మక మార్పులను పొందుతుంది. అది ప్రతిఫలనం.

ఈ తత్వశాస్త్ర చర్చ ప్రకృతి గురించీ, మానవ జ్ఞాన సముపార్జనా క్రమం గురించీ ఉన్న అవగాహనలను విప్లవీకరించింది. అప్పటివరకు భౌతిక వాస్తవికత యాంత్రికంగా, జడాత్మకంగా, స్థిరంగా ఉంటుందని అనుకుని, పదార్థానికీ చైతన్యానికీ మధ్య ఏకముఖ, సరళ సంబంధాన్ని ప్రతిపాదించిన యాంత్రిక భౌతికవాదుల ఆలోచనను గతితార్కిక భౌతికవాదులు విమర్శించారు. పదార్థానికీ చైతన్యానికీ మధ్య పరస్పర చర్యకు అవకాశం ఉందని చెపుతూ, మానవ చైతన్యానికి గల విస్తృతినీ, సంక్లిష్టతనూ ప్రకటించారు. ఈ తాత్విక చర్చలో భాగంగానే వ్లాదిమిర్ ఇల్యిచ్ లెనిన్ రాసిన భౌతికవాదం - అనుభవవాద విమర్శ అనే పుస్తకంలో 'పదార్థం అనేది ఒక తాత్విక ప్రత్యయం. అది మనిషికి ఇంద్రియాల ద్వారా అందే భౌతిక వాస్తవికతను సూచిస్తుంది. ఆ భౌతిక వాస్తవికత స్వతంత్రంగా ఉంటూ ఇంద్రియాలద్వారా ప్రతిబింబిస్తుంది, ఛాయాచిత్రాలను రూపొందిస్తుంది, ప్రతిఫలిస్తుంది' అని నిర్వచించారు.

ఇలా భౌతిక వాస్తవికత మనిషి మెదడులో వ్యక్తీకరణ పొందే మూడు సంవిధానాలలో ఒకటయిన ప్రతిఫలనం ఆ తర్వాత సాహిత్యవిమర్శ లోకి కూడ ప్రవేశించి ప్రతిఫలన సిద్ధాంతం పేరుతో ప్రఖ్యాతమయింది.

ప్రతిఫలన సిద్ధాంతం ప్రకారం సాహిత్యంతో సహా అన్ని సామాజిక చైతన్య రూపాలు భౌతిక ప్రపంచపు ప్రతిఫలనాలే. అన్ని సామాజిక చైతన్య రూపాల లాగనే మానవ జ్ఞానం కూడ మనిషి నుంచి స్వతంత్రంగా ఉండే ప్రకృతిని, అంటే అభివృద్ధి చెందుతున్న పదార్థాన్ని ప్రతిఫలిస్తుంది. ఈ ప్రతిఫలనం సాపేక్షికంగా సంపూర్ణంగానైనా ఉండవచ్చు, లేదా ఉజ్జాయింపుగానైనా ఉండవచ్చు. భ్రమాజనితంగానైనా ఉండవచ్చు, యథార్థంగానైనా ఉండవచ్చు. కాని మనిషి దాన్ని చూడడానికి ముందే, మనిషికి స్వతంత్రంగానే అది ఉనికిలో ఉంటుంది. వాస్తవికతకు మనిషి ప్రతిఫలనం ఎంత కచ్చితంగా ఉంటే పరిసరాల గురించి ఆ మనిషి జ్ఞానం అంత సంపూర్ణంగా, అంత లోతుగా ఉంటుంది.

ప్రతిఫలన సిద్ధాంతానికి సంబంధించిన ఈ సాధారణ తత్వశాస్త్ర సూత్రాలను సాహిత్యం అనే విశిష్ట సామాజిక చైతన్య రూపానికి కూడ అన్వయించవచ్చు. మనుషులుగా సాహిత్యకారులు మొదట తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తమ పంచేంద్రియాల ద్వారా గ్రహిస్తారు. ఆ ప్రపంచాన్ని వస్తువుగా తీసుకుని తమ సాహిత్య సృజన చేసేటప్పుడు తమ చైతన్యంతో, ఊహలతో, అవగాహనలతో, దృక్పథంతో ప్రభావితం చేసి సాహిత్య రూపంగా మలుస్తారు. వాస్తవికత సాహిత్యకారుల ద్వారా సాహిత్యంగా మారే క్రమంలో ప్రతిఫలనానికి గురవుతుంది. ఉన్నది ఉన్నట్టుగా మాత్రమే కాక, ఆ రూపానికి సారం ఏమిటనే ప్రశ్నతో, ఆ రూపం మీద విమర్శతో, ఆ రూపం ఎలా ఉంటే బాగుంటుందనే స్వీయమానసిక ఊహలతో అది సాహిత్యంగా మారుతుంది. అయితే ఇదంతా కేవలం వ్యక్తిగా ఆ సృజన కర్త ప్రత్యేకత మాత్రమే కాదు. సాహిత్యానికి సమాజంలో మొత్తంగానే ఉండే స్థానం వల్ల అలా జరుగుతుంది.

సామాజిక చలనం - సాహిత్యం

సాహిత్యానికి సమాజంలో, సమాజ చలనంలో, సమాజ చలనాన్ని అర్థం చేసుకోవడంలో, అర్థం చేయించడంలో కీలకపాత్ర ఉంది. సాహిత్యం మానవ సంబంధాలలోని ఉద్వేగాల వ్యక్తీకరణ. మనిషంటే మానవసంబంధాల సమాహారమే అని మార్క్స్ అన్నట్టు మానవ సంబంధాలు లేకుండా మనుషులు ఉండరు గనుక ఆ మానవ సంబంధాల గురించి చెప్పే సాహిత్యం మనిషికి అనివార్య అవసరమవుతుంది. అది లిఖిత, ఆలంకారిక, కళాత్మక, ప్రత్యేక నైపుణ్య రూపంలోనే ఉండనవసరం లేదు. మానవ సంబంధాల ఉద్వేగాల వ్యక్తీకరణగా ఉంటే చాలు. సమాజ చలనంతో పాటుగా ఆ సంబంధాలు, ఆ ఉద్వేగాలు కూడ మారుతుంటాయి గనుక తమ జీవితాలలో చలనాన్ని మనుషులు సాహిత్యంలో వెతుక్కుంటారు, గ్రహిస్తారు, అర్థం చేసుకుంటారు. మార్చడానికి ప్రయత్నిస్తారు. వర్గ అంతరాల సమాజంలో సమాజ చలనాన్ని గ్రహించడంలో కూడ అంతరాలు ఉంటాయి గనుక ఒకరు గ్రహించిన పద్ధతిని మరొకరు తెలుసుకోవడానికి కూడ సాహిత్యమే ఉపకరిస్తుంది. మొత్తంగా సమాజ చలనం ఏదో ఒక స్థాయిలో సాహిత్యం వంటి భావజాల, సామాజిక చైతన్య రూపాలలోనే మనుషులకు అందుతుంది.

సుప్రసిద్ధమైన కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్

ఎకానమీ ముందుమాటలో మార్క్స్ సామాజిక విప్లవ యుగం గురించి చెపుతూ, ఆ సామాజిక పరివర్తనను గుర్తించడంలో పాటించవలసిన ఒక జాగ్రత్త గురించి హెచ్చరించాడు. ఉత్పత్తికి సంబంధించిన ఆర్థిక పరిస్థితుల భౌతిక పరివర్తన క్రమాన్ని భౌతిక శాస్త్రాల కచ్చితత్వంతో కనిపెట్టవచ్చుననీ, కాని ఆ పరివర్తన గురించి మనుషులు సాహిత్యంతో సహా భావజాల రూపాలలో చైతన్యవంతులై ఆ ఆర్థిక పరిస్థితుల మీద పోరాడుతారనీ అన్నాడు. సామాజిక ఉత్పత్తి శక్తులకూ ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణ నుంచే చైతన్యాన్ని వివరించగలమన్నాడు. ఈ సూత్రీకరణను మరో మాటల్లో చెప్పాలంటే సాహిత్యాన్ని సమాజానికి ప్రతిఫలనంగా మాత్రమే సమగ్రంగా వివరించగలం.

అయితే సమాజాన్ని వివరిస్తే సాహిత్యాన్ని వివరించినట్టేనా? సాహిత్యం సమాజాన్ని ప్రతిఫలించే పద్ధతి ప్రత్యక్షంగా, సూటిగా, సరిసమానంగా ఉంటుందా?

సమాజం, సాహిత్యం రెండూ వేరువేరు వ్యవస్థలు. రెంటికీ వాటివైన చలన నియమాలు ఉన్నాయి. వీటిలో సమాజం మౌలికమైనదీ, విస్తారమైనదీ, సంకీర్ణమైనదీ కాగా సాహిత్యం సమాజం నుంచి ఉత్పన్నమైనది. సాహిత్యంలో కూడ విస్తృతీ, సంకీర్ణతా ఉండవచ్చుగాని అవి సమాజ లక్షణాలంత సంక్లిష్టమైనవి కావు. ఒకరకంగా సమాజం అనియతమైనదీ అనంతమైనదీ కాగా సాహిత్యం నియతమైనదీ, పరిమితమైనదీ. సమాజాన్ని శాసించే చలన నియమాలు ఉత్పత్తి సాధనాలూ ఉత్పత్తి సంబంధాలూ కాగా, సాహిత్యాన్ని శాసించే చలన నియమాలు ఉత్పత్తి సంబంధాలలో భాగంగా రూపొందిన భాషతో, ఆలోచనతో, మానవమేధకు సహజమైన ఊహాశక్తితో తయారవుతాయి. సాహిత్య వ్యవస్థలో అదనంగా పాత సాహిత్యం రూపొందించిన ప్రక్రియలు, సంప్రదాయాలు, రీతిరివాజులూ, కవిసమయాలూ కూడ అవకాశాలుగానో, అవరోధాలుగానో ఉంటాయి. అందువల్ల సాహిత్యం సమాజాన్ని ప్రతిఫలించే పద్ధతి పరోక్షంగా, నర్మగర్భంగా, ప్రతీకలతో, అలంకారాలతో, ధ్వనితో, వ్యంగ్యంతో వేరువేరుగా ఉండవచ్చు.

సమాజం సాహిత్యంలో ప్రతిఫలించే తీరులోని ఈ విశిష్టత అర్థం కావాలంటే, సమాజ చలనానికీ, సాహిత్యం వంటి ఉపరితల రూపాల చలనానికీ మధ్య తేడా గురించి ఎంగెల్స్ చేసిన సూత్రీకరణలను గమనంలో ఉంచుకోవాలి: "రాజకీయాలు, చట్టవ్యవస్థ, తాత్వికత, మత, సాహిత్య, కళా, తదితర రంగాల అభివృద్ధి ఆర్థికాభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది. కాని ఆ రంగాలన్నీ కూడ ఒకదాని మీద మరొకటి ప్రభావం వేసుకుంటాయి, ఆర్థిక పునాది మీద ప్రభావం వేస్తాయి. ఆర్థిక స్థితే కారణమూ, అది ఒక్కటే క్రియాశీలమూ, మిగిలిన వాటన్నిటికీ పరోక్ష ప్రభావం మాత్రమే ఉంటుంది అనడం సరికాదు. కాకపోతే ఆర్థిక ఆవశ్యకత పునాది మీద పరస్పర చర్య - ప్రతిచర్యలుంటాయి. ఆర్థిక పునాది అంతిమంగా తనను తాను నిర్ధారించుకుంటుంది" అని వాల్టర్ బోర్జియస్ కు 1894 జనవరి 25న రాసిన ఉత్తరంలో ఎంగెల్స్ అన్నాడు. అలాగే కొన్రాడ్ ష్మిట్ కు 1890 అక్టోబర్ 27న రాసిన ఉత్తరంలో ఎంగెల్స్ ఉపవ్యవస్థల ప్రత్యేక చలనం గురించి అంతకన్నా ఎక్కువగా రాశాడు. "శ్రమ విభజన సామాజిక స్థాయిలో జరిగినప్పుడు వేరు వేరు పని రంగాల మధ్య పరస్పరాశ్రిత సంబంధాలుంటాయి. అంతిమ పరిశీలనలో ఉత్పత్తే నిర్ణయాత్మక అంశం. కాని ఆ ఉత్పత్తి అయిన వస్తువుల వ్యాపారం ఉత్పత్తి క్రమంతో వేరయి స్వతంత్రంగా ఉన్నప్పుడు, ఆ వ్యాపారం తనదైన సొంత చలనాన్ని అనుసరిస్తుంది. అది మొత్తంగా ఉత్పత్తి చేత పాలించబడినప్పటికీ, ప్రత్యేక సందర్భాలలో, ఈ సాధారణ పరాశ్రయత లోపలే ఈ కొత్త అంశపు స్వభావానికి తగిన ప్రత్యేక నియమాలను అనుసరిస్తుంది. ఈ చలనానికి తనవైన దశలు ఉంటాయి. అవి మొత్తంగా ఉత్పత్తి చలనం మీద ప్రభావం వేస్తాయి."

సాహిత్య ప్రత్యేకత, అవకాశాలు, పరిమితులు

అలా సాహిత్యం ఒక సామాజిక చైతన్య రూపంగా తప్పనిసరిగా సమాజాన్ని ప్రతిఫలించవలసిందే గాని ఒక ప్రత్యేక వ్యవస్థగా దానికి తన సొంత చలన నియమాలు వచ్చిచేరాయి. ఇక్కడ సమాజాన్ని, సమాజ చలనాన్ని గ్రహించడానికీ, చిత్రించడానికీ, విశ్లేషించడానికీ మనం సాధారణంగా ఉపయోగించే సాధనమైన సామాజికశాస్త్రాలతో సాహిత్యాన్ని పోల్చి చూస్తే సాహిత్యపు ప్రత్యేకత అర్థమవుతుంది. సామాజిక శాస్త్రాలు ఘటనలను బట్టి సామాజిక మార్పును గణిస్తాయి. సాహిత్యం మానవ ఉద్వేగాలను, సంబంధాలను చిత్రించి సామాజిక మార్పును దృశ్యమానం చేస్తాయి. సాధారణంగా సామాజిక శాస్త్రాలు పరిమాణాత్మక మార్పులను గ్రహించగలిగినంతగా గుణాత్మక మార్పులను గ్రహించజాలవు. కాని సాహిత్యం మానవ సంబంధాల చలనంలో భాగంగా గుణాత్మక మార్పులను గ్రహిస్తుంది, చిత్రిస్తుంది, విశ్లేషిస్తుంది. మరొక ముఖ్యమైన తేడా సామాజిక శాస్త్రాలు వర్గ సమాజం తర్వాత, వర్గ ఆధిపత్యాన్ని సమర్థించడానికి పుట్టి, కాలక్రమంలో ధిక్కార ధోరణులను కూడ సంతరించుకున్నాయి. కాని సాహిత్యం (కళ) వర్గ విభజన కన్న చాల ముందు ఒక రకంగా మనుషుల సాంఘిక జీవనంతో పాటు పుట్టింది. దోపిడీ పీడనలు, సొంత ఆస్తి సాంఘిక జీవనానికి వ్యతిరేకమైనవి గనుక సాహిత్యానికి మౌలిక లక్షణం వాటిని ధిక్కరించడమే. మరొక మాటల్లో చెప్పాలంటే సాహిత్యానికి సహజంగా, అనివార్యంగా సమాజాన్ని సమగ్రంగా, సర్వంగా ప్రతిఫలించి సామాజిక చైతన్యాన్ని వ్యాపింపజేసే అవకాశం ఉంది.

కాని సామాజికంగానే, వస్తుగతంగానే సాహిత్యంలో సమాజ ప్రతిఫలనానికి కొన్ని ఆటంకాలు, అవరోధాలు ఉండే అవకాశం కూడ ఉంది. వర్గసమాజంలో పాలక భావజాలమే ఆధిపత్యం వహిస్తుంది గనుక, ఆ భావజాలం పని సామాజిక చైతన్యాన్ని తలకిందులుగా, తప్పుడు చైతన్యంగా, సరుకుల ఆరాధనగా మార్చడమే గనుక ఒక భావజాల రూపంగా సాహిత్యం కూడ అటువంటి స్థితిలోకే వెళ్తుంది. భాష కూడ వర్గ సమాజ పరిమితులకు లోబడి ఉంటుంది గనుక పాలితుల భాష మీద, వ్యక్తీకరణ శక్తి మీద పాలకుల ఆంక్షలు అమలవుతుంటాయి. సాహిత్యం మౌఖిక స్థాయి దాటి, లేఖన ప్రక్రియ మొదలై, లిఖిత సాహిత్యమే సాహిత్యంగా గుర్తింపు పొంది, అది పాలకవర్గాల గుత్తాధిపత్యంలో ఉండిపోవడంతో, లిఖిత సాహిత్యానికీ ప్రజల మౌఖిక సాహిత్యానికీ అంతరం పెరిగిపోతుంది. వేల ఏళ్ల అభివృద్ధి క్రమంలో సాహిత్యంలో విస్తృతీ వైవిధ్యమూ పెరిగిపోయి, అనేక ప్రక్రియలు, రూపాలు ఏర్పడి ఆయా ప్రక్రియలకు కూడ

స్వతంత్ర చలన నియమాలు తయారవుతాయి. ఈ అన్ని పరిణామాలూ సాహిత్యంలో సమాజ చలనం వాస్తవికంగా ప్రతిఫలించడం మీద అవరోధాలను ఏర్పరుస్తాయి.

ఇవన్నీ జరిగిపోయిన వందల సంవత్సరాల తర్వాత మనం సాహిత్యం సమాజాన్ని, సమాజ చలనాన్ని ఎంత వరకు ప్రతిఫలించగలదు, ఎంత విశ్వసనీయంగా, ఎంత సమగ్రంగా ప్రతిఫలించగలదు అని చర్చిస్తున్నాం.

సాహిత్యంలో సమాజ ప్రతిఫలనం మొట్టమొదట ప్రక్రియల పరిధులలోపల కుంచించుకుపోతుంది. కొన్ని ప్రక్రియలు సమాజం గురించి పట్టించుకోనక్కరలేదని, అవి మానవ అనుభూతులను వ్యక్తీకరిస్తే చాలునని, అవి సృజన కర్త ఉద్వేగాల చిత్రణకు మాత్రమే పరిమితమవుతాయని సిద్ధాంతాలు కూడ ఉన్నాయి. ప్రధానంగా కవిత్వ ప్రక్రియ విషయంలో అలా సమాజం నుంచి వ్యక్తిని వేరు చేసి ఆ ప్రక్రియ వ్యక్తి ప్రధానమైనదని చెప్పడం జరుగుతోంది. చరిత్రలో చూస్తే కూడ అది నిజం కాదు, మనిషికి తెలిసిన మొదటి ప్రక్రియగా సామూహిక శ్రమలోంచి బృందగానం లోంచి పుట్టిన పాట, కవిత సామాజికమైనవే, వయ్యక్తికమైనవేమీ కావు. కాని ఆధునిక కవిత్వం, ముఖ్యంగా వచన కవిత్వానికి సామాజిక చలనాన్ని సమగ్రంగా పట్టుకునే శక్తి లేదని, అది వ్యక్తి దృక్కోణం మాత్రమేనని అభిప్రాయం బలంగానే ఉంది.

కాగా, కథ, నవల వంటి ప్రక్రియలలో విస్తృతంగా మనుషులు, వారి మధ్య సంబంధాలు, వారి ఉద్వేగాలు చిత్రణకు వస్తాయి గనుక ఆ ప్రక్రియలు సమాజాన్ని, సమాజ చలనాన్ని ప్రతిఫలిస్తాయని అంగీకరిస్తున్నారు. కవిత్వం కన్న నవల, కథ, నాటకం వంటి ప్రక్రియలకు సమాజాన్ని, సమాజ చలనాన్ని ప్రతిఫలించే అవకాశం ఎక్కువగా ఉన్నప్పటికీ, సమాజపు విస్తృతితో పోలిస్తే సాహిత్యం ప్రతిఫలించగలిగేది తక్కువ. సమాజం కోట్లాది మందితో, అనేక రంగాలలో, స్థాయిలలో, పొరలుపొరలుగా ఉండగా ఎంత విశాలమైన సాహిత్య రచన అయినా కూడ కొద్ది మంది పాత్రలుగా కొన్ని రంగాల, కొన్ని స్థాయిల, కొన్ని పొరల జీవితాన్ని మాత్రమే చిత్రించ గలుగుతుంది. ఎప్పుడైనా ఒక సమాజంలోని సాహిత్యమంతా కలిపి చూసినా కూడ ఆ సాహిత్యానికి ఎక్కని సమాజం, సమాజ చలనం చాల ఉండిపోతాయి. అలాగే ఒక సమాజపు మొత్తం సాహిత్యానికి ఆ సమాజ చలనాన్ని గ్రహించే శక్తి ఉండవచ్చు గాని, ఆ సాహిత్యంలోంచి ఒక రచనను విడదీసి చూసినప్పుడు దానికి ఆ శక్తి లేకపోవచ్చు.

ఈ ప్రక్రియా భేదాలకు, పరిమితులకు తోడు సాహిత్యానికి అదనపు పరిమితి వ్యక్తిగా సాహిత్య సృజనకర్తకు ఉండే దృక్పథం, వ్యక్తిగత శక్తి సామర్థ్యాలు. సాహిత్యానికి మొత్తంగా సమాజాన్ని ప్రతిఫలించే శక్తి ఎంత ఉన్నా ఆ ప్రత్యేక సృజనకర్త దృక్పథాన్ని బట్టి, శక్తిసామర్థ్యాలను బట్టి మాత్రమే ఆ ప్రతిఫలనపు విస్తృతి, లోతు, దృష్టి, స్థాయి, నాణ్యత ఉంటాయి. తన సాహిత్యంలో సమాజాన్ని ప్రతిఫలించే ముందు ఆ సృజనకర్త అసలు సమాజాన్ని సరిగా, సమగ్రంగా అర్థం చేసుకోవాలి. అంటే ఆ సృజనకర్తకు దృక్పథ స్పష్టత ఉండాలి. రచయితకు సమాజం గురించి లోతుగా ఆలోచించే దృక్పథం లేకపోతే, అసమానతలు దోపిడీ పీడనలు సహజమైనవేనని, వాటి గురించి ఏమీ చేయలేమనే దృక్పథం ఉంటే ఆ రచయిత సాహిత్యంలో యథాతథ స్థితికి సమర్థనే కనబడుతుంది. ఆ అసమానతలు, దోపిడీ పీడనలు తప్పు అనీ, ఆ సమాజం మారాలనీ అనుకునే రచయిత సాహిత్యంలో ఆ స్థితి పట్ల విమర్శ, ఆ స్థితి తొలగిపోవాలనే ఆకాంక్ష, ఆ స్థితి తొలగిపోతుందనే విశ్వాసం వ్యక్తమవుతాయి. ఈ రెండు రకాల సాహిత్యాలలో మొదటిది ప్రతిబింబం స్థాయిలో, సమర్థన స్థాయిలో మిగిలిపోతే, రెండవది ప్రతిఫలనం స్థాయికీ, విమర్శ స్థాయికీ, ఆచరణకు ప్రేరేపించే స్థాయికీ ఎదుగుతుంది. అలాగే రచయిత దృక్పథం ఎంత స్పష్టంగా, విస్తృతంగా ఉంటే అంత లోతుగా రూపాన్ని దాటి సారాన్ని చూడడానికీ, కనిపించే కోణాన్ని దాటి కనిపించని కోణాల్ని చూపడానికీ అవకాశం దొరుకుతుంది. అప్పుడు సమాజం నుంచి రూపొందిన సాహిత్యం మళ్లీ సమాజం మీద ప్రభావం వేయడానికి తగిన శక్తిని సంతరించుకుంటుంది.

ఉదాహరణలు

పైన చర్చించిన అంశాలు విడిగా ఒక సాహిత్య రచనకన్న ఎక్కువగా మొత్తం సాహిత్యానికి వర్తిస్తాయి. విడిగా ఒక సాహిత్య రచనను ముఖ్యంగా కథ, నవల వంటి ప్రక్రియలను తీసుకుని కూడ ఈ అంశాలు విశ్లేషించవచ్చు గాని సమాజ చలనాన్ని, గుణాత్మక మార్పులను మొత్తంగా పట్టుకునే అవకాశం ఒకేఒక్క కథకో నవలకో ఉండదు. ఆయా రచయితల దృక్పథాన్ని బట్టి, శక్తి సామర్థ్యాలను బట్టి, ఆ రచన వెలువడిన సందర్భాన్ని బట్టి, ఆ రచనకు ప్రేరణగా నిలిచిన సామాజిక ఉద్యమాన్ని బట్టి ఆ రచన ప్రమాణాలు, అది ఎంత సమగ్రంగా సమాజ చలనాన్ని చిత్రించిందనే విషయం నిర్ణయమవుతాయి.

ఒకే వస్తువు మీద రాసిన రెండు రచనలను పోల్చి చూసినప్పుడు ఈ ప్రతిఫలనంలో తేడాలు స్పష్టంగా చెప్పవచ్చు. తెలంగాణలో సాగిన విప్లవోద్యమం సామాజిక పునర్నిర్మాణానికి, ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాధికారానికి, వికాసానికి దోహదపడుతుందని అనుకునే సాహిత్య దృక్పథం ఒక పక్కన ఉండగా, ఆ విప్లవోద్యమం సామాజిక విధ్వంసానికీ, హింసకూ, కల్లోలానికీ, రక్తపాతానికీ, మానవసంబంధాల విచ్ఛిన్నానికీ, గ్రామీణ శాంతి విఘాతానికీ దారితీసిందని అనుకునే సాహిత్య దృక్పథం కూడ ఉండవచ్చు. ఒకటి సామాజిక చలనాన్ని సవ్యంగా గ్రహించి, ఆ చలనానికి మద్దతును కూడగట్టి, దాన్ని వేగవంతం చేయదలచుకున్న దృక్పథం కాగా, మరొకటి ఆ సామాజిక చలనాన్ని వ్యతిరేకించి, దానిపట్ల వ్యతిరేకత కలిగించడానికి సాహిత్యం ద్వారా ప్రయత్నించేది. మొదటి దృక్పథానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఒక ఉదాహరణగా అల్లం రాజయ్య కథలూ నవలలూ చెప్పుకోవచ్చు. రెండో దృక్పథానికి ఉదాహరణగా నిలిచే పూర్తిస్థాయి రచనలు ఎక్కువ లేకపోవచ్చుగాని నవీన్ రాసిన రక్తకాసారం నవల ఒక ఉదాహరణ. ఇటువంటి రెండు రకాల రచనలను పోల్చిచూస్తే సమాజ చలనం సాహిత్యంలో ఎలా ప్రతిఫలనం పొందుతుందో దానికి ఉండే అవకాశాలూ అవరోధాలూ ఏమిటో స్పష్టమవుతుంది.

అవి రెండూ సమాజ చలనాన్ని సాహిత్యం ఎలా గ్రహిస్తుందనే దానికి అనుకూల, ప్రతికూల నిదర్శనాలు కాగా, స్థూలంగా అనుకూల చిత్రణలో కూడ తేడాలు ఉన్న రచనలను పోల్చిచూస్తే ఈ అవకాశాల,

హిందూ ఫాసిజాన్ని ఐక్యంగా ప్రతిఘటిద్దాం!

- బాసిత్

ముజఫర్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసిన ముస్లిం మహిళలపై అత్యాచారాలు, పురుషుల హత్యాకాండ సంఘటన నేపథ్యంలో కవి యాకూబ్ మాట్లాడుతూ హిందూ ఫాసిజాన్ని ఎదుర్కొనె బలమైన గొంతు కావాలని అన్నారు.

'మళ్ళీ సలుపుతున్న గుజరాత్ గాయం' పేరిట ఫిబ్రవరి 28, శుక్రవారం సాయంత్రం, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కవులు, కళాకారులు, రచయితలు, ప్రజాస్వామికవాదులతో లౌకిక, ప్రజాస్వామిక, సాంస్కృతిక, కళాకారుల వేదిక ఆధ్వర్యంలో సభ జరిగింది.

సభకు అధ్యక్షత వహించిన యాకూబ్ మాట్లాడుతూ 2002 సంవత్సరంలో ఇదే రోజు 20 మంది కవులు, రచయితలు గుజరాత్ వెళ్ళి వచ్చి ఇదే వేదిక పేరుతో సభ పెట్టడం జరిగిందని, ఆనాటి 'గుజరాత్ గాయం' నేపథ్యంలో పెద్ద ఎత్తున కవిత్వం, వ్యాసాలు, రిపోర్టులు, ఇతర రచనలు వచ్చాయని అన్నారు. "ఇవ్వాళ ముజఫర్ నగర్‌లో ముస్లిం మహిళలపై వికృత అత్యాచారాలు, పురుషుల్ని ముక్కలుగా నరికిన హత్యాకాండ నేపథ్యంలో 'లౌకిక ప్రజాస్వామిక, సాంస్కృతిక, కళాకారుల వేదిక' (సెక్యులర్, డెమోక్రెటిక్, లిటరరీ కల్చరల్ ఫోరం – ఎస్‌డిఎల్‌సిఎఫ్) ను పునరుత్తేజితం చేసుకోవాల్సి ఉంది. ఎందుకంటే ఏ మోడీ అయితే గుజరాత్‌లో 'చర్యకు-ప్రతిచర్య' అని చెప్పి ముస్లింలను చంపివేసాడో అదే మోడి, ఇవ్వాళ 'చాయ్‌వాలా'నని బి.సి.లని ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుకు వస్తున్నాడని" ఆయన అన్నారు. "ప్రగతిశీల భావాలున్నవారు 'మోడీబృందం' చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోతున్నారు. 'మోడీ బృందం' చేస్తున్న ప్రచారం డొల్ల అని చెప్పగలిగె బలమైన గొంతు కావాలి. సోషల్‌మీడియాలో కొంతవరకు స్పందన కన్పిస్తున్నప్పటికీ అది చాలదు. ఇవ్వాల్టి నుంచైనా ఈ వేదిక ద్వారా, ఒక ఆరంభంలాగా ఆ గొంతును వినిపించాలని, 1930 ల నాటి 'ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' దారిలో ఫాసిజాన్ని ఎదుర్కోవాలని యాకూబ్ కోరారు.

'వీక్షణం' ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ – "బొటన వేలుకు రక్తం అంటించుకొని/అరె బద్మాష్/ఏవరి చాయ్ అమ్ముతావ్ నువ్వు/ఓ ఒ.బి.సి. శిఖండీ/మసీదులు, చర్చలు కూల్చి/గడ్డం నిగార్చుకున్న/ఓ దయ్యపు హింసోన్మాదీ/ధర్మపత్నిని తన్ని తరిమి/బ్రహ్మచారినని విర్రవీగుతున్న/ సిగ్గులేనివాడా/ మనిషి కావడానికి/ అవసరమైన దేదీ చేయకుండా/ ఎవరి చాయ్ అమ్ముతావ్? అంటూ 'చాయ్‌వాలాగా' 'చాయ్ పే చర్చ' పేరు మీద మోడీ పొందుతున్న ప్రచారానికి స్పందించి కవి బ్రజ్‌రంజన్ మున్షీ రాసిన 'కిస్ కె చాయ్ బేజ్‌తాహై తూ' అనే కవితను తాను తెలుగులోకి అనువదించియున్న చరణాలను భావోద్వేగంతో చదివి తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

మోడీ గురించని ప్రచారంలో మధ్య తరగతి అతడు చాయ్‌వాలా అని, ఒ.బి.సి. అని, అతడు చూపిస్తున్న అభివృద్ధి నమూనా తమ బతుకుల్లో ఏదో మార్పు తెస్తుందని నమ్ముతున్నట్లు అన్పిస్తోందని, ఈ మూడు రకాల ప్రచారం అబద్ధం అని వేణుగోపాల్ అన్నారు. దీంతో పాటు పోటీ వాతావరణం కూడా సృష్టించారని, అవినీతిలో కూరుకుపోయిన అగ్రవర్ణ కుటుంబపు రాహుల్ కావాలా? చాయ్‌వాలా కావాలా? అనే పోటీ తీసుకువచ్చారని ఆయన అన్నారు.

పదమూడో యేటనే ఆర్.ఎస్.ఎస్.లో చేరి 57 ఏళ్ళ దాకా అనేక హింసాకాండల్లో పాల్గొని నెత్తురు పారించని వ్యక్తి చాయ్ అమ్మిన వ్యక్తి కాదని 'చాయ్‌వాలా ముఖౌటా'లో ఉన్న రక్తపిపాసి అని వేణు అన్నారు. ఆయన తన్ను తాను ఒ.బి.సి. లేదా శూద్రుడని భావిస్తే ఆర్.ఎస్.ఎస్.లో ఉండడానికి వీల్లేదని లేదా ఆర్.ఎస్.ఎస్.లో ఉంటె ఒ.బి.సి. అని చెప్పుకోవడానికి వీల్లేదని ఆయన అన్నారు.

అలాగే మోడీ అభివృద్ధి ప్రచారంలో కూడా వాస్తవం లేదని, ఆయనను ఒక ప్రత్యామ్నాయంగా చెప్తున్నారని, పెద్ద ఎత్తున ఊదరగొడ్తున ఆయన అభివృద్ధి నమూనాలో లబ్ధిపొందేవారు టాటాలు, అంబానీల, 2002 నాటి నుండి 2006, 2007 నాటికి అమ్మకం పన్ను రాయితీలన్నీ పెట్టుబడిదారులకేనని, ప్రభుత్వ పన్నుల వల్ల వచ్చే ఆదాయంలో 66% పెట్టుబడిదారులకు రాయితీ ఇవ్వడం వల్లనే గండి పడిందని వేణుగోపాల్ అన్నారు. వజ్రాలకు సానపట్టే పరిశ్రమలన్నీ ముస్లింల నుండి బెదిరించి లాక్కొని వాళ్ళకు ఉపాధి లేకుండా చేసి అభివృద్ధి అంతా 'ఆర్.ఎస్.ఎస్.', మోడీ అనుచరులకు అందేట్లు చేస్తున్న స్థితిని ఆయన వివరించారు.

"గౌరవీ గుజరాత్ పేరిట చేస్తున్న దందా వల్ల, సెజ్‌ల వల్ల రైతులు నిర్వాసితులు అవుతున్నారు. పదివేలకు ఎకరా చప్పున రైతుల నుంచి భూమి గుంజుకొని 4,5 కోట్లకు ఎకరా చొప్పున అంబానీలకు, బడాబాబులకు అమ్ముకుంటున్నారు. అట్లా 15,000 ఎకరాల భూమి రూ. 60,000 కోట్ల దాకా అమ్ముకొని ప్రజలకు కాళ్ళ కింద నేల లేకుండా చేస్తున్నారని" అన్నారు. "పారిశ్రామిక రాబడి రూ. 1,67,000 కోట్లు వస్తుందని అన్నారు. కాని కేవలం రూ. 60,000 కోట్లు మాత్రమే వచ్చింది. ఇంగ్లిషు మీడియా ఊదరగొడ్తున్నట్లు మోడి

అవరోధాల గురించి మన అవగాహన పెరుగుతుంది. ఉదాహరణకు అల్లం రాజయ్య, సాహుల నవల 'కొమురం భీం'ను, అదే ఇతివృత్తంతో పులుగు శ్రీనివాస్ రాసిన నవల 'అడవి తల్లి'ని పోల్చి చూడవచ్చు. రెండు నవలల్లోను చిత్రితమైనది కొమురం భీం పోరాటమే. కాని కొమురం భీం నవలా రచయితల దృక్పథంలోని సమగ్రత వల్ల సమాజ చలనం గురించి ఆ నవల సమగ్ర స్వరూపాన్ని, సారాన్ని పాఠకుల ముందు ఉంచగలిగింది. అడవితల్లి నవల కొమురం భీం సహచరి జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని, జర్నలిస్టు ప్రధానపాత్రగా, ఆదివాసి జీవితాన్ని, గత, వర్తమాన పోరాటాలను చిత్రించడానికి ప్రయత్నించినప్పటికీ సమాజ చలనం గురించి అసమగ్ర దృక్పథం వల్ల అటు రూపమూ సంపూర్ణంగా వ్యక్తం కాలేదు, సారం దాకా నవల ప్రయాణించనే లేదు.

సూపర్‌మాన్ కాదని, వరదలు వచ్చినప్పుడు 200 ఇన్నోవాలతో 1000 మందికి మించి తరలించడం సాధ్యం కాదని, కాని మీడియా మోడి లక్షలాది మందిని తరలించినట్లు ఒక 'అబద్ధపు ఇమేజ్' ను సృష్టించిందని" ఆయన అన్నారు. "ప్రథమ్" అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం గుజరాత్ అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడితే మరి 'ఈ అంకెలు' ఏం చెబుతున్నాయో అర్థం చేసుకోవాలని" ఆయన అన్నారు. 'పహలె శౌచాలయ్-బాద్ మే దేవాలయ్' అని చెప్పిన మోడీ గుజరాత్‌లో దేశ సగటు కన్న కొంచెం ఎక్కువ మాత్రమే అంటే 24% మాత్రమే టాయ్‌లెట్లు ఉన్నాయని గుర్తించాలని, అహ్మదాబాద్‌లో ఇంకా 126 కేంద్రాల్లో 'మనుష్యులు మలం ఎత్తడం'అనే పని చేస్తున్నారని, ఇంతకంటే అనాగరికం ఇంకేముంటుందని ఆయన అన్నారు. "గోద్రా నేపథ్యంలో 3000 మందిని ఊచకోత కోసిన మోడీ, తెలంగాణ పుణ్యమా అని 'నిరభ్యంతరం' అయ్యాడని, అవతలి మతాన్ని ద్వేషించే వాడు ప్రధాని కావాలనుకోవడం అభ్యంతరం కాకుండా పోయిందని" ఆయన అన్నాడు.

"దారిద్ర్యం, పేదరికం, ఆకలి నిరుద్యోగిత వంటి సమస్యలతో నిరంతరం సతమతమయ్యే ముస్లింలను ఎక్కడ ఏం జరిగినా అనుమానించే స్థితి నెలకొని ఉందని, ఈ నేపథ్యంలో ఆయా సంఘటనల్లో ముస్లింలకు ఏ సంబంధం లేదని డజన్ల సార్లు తేలినాక కండ్లు తెరిచిన కేంద్ర ప్రభుత్వం, 'హేతువుకు అతీతంగా' (బియాండ్ రీజనబుల్) ముస్లింలపై కేసులు పెట్టకండి' అని రాష్ట్రాలకు సర్క్యులర్ పంపిస్తే - 'ఇది రాజ్యాంగ వ్యతిరేకమని' నరేంద్రమోడి ముస్లిం వ్యతిరేక వైఖరి తేసుకున్నాడని" వేణు అన్నారు.

నిజానికి ఇవ్వాళ సలుపుతున్న గాయం ముజఫర్‌నగర్ అని, రక్షిస్తామని చెప్పి తీసుకెళ్ళి ఒక్కో ముస్లిం స్త్రీ పై పదిమంది దాకా అత్యాచారం చేసి, ముజఫర్‌నగర్ చుట్టూ ఉన్న గ్రామాల్లో హిందుత్వ శక్తులు బీభత్సకాండ సృష్టించాయని, '2002'లో గుజరాత్ పాఠం చెప్పామని 2013లో ముజఫర్‌నగర్‌లో 'లవ్‌జీహాద్' చేసామని అశోక్ సింఘాల్ చేసిన ప్రకటనను వేణు గుర్తు చేసారు. ఈ దేశ సాంస్కృతిక సమున్నతికి దోహదం చేయడంలో ఘన భాగస్వామ్యం వహించిన ముస్లింల పక్షంలో నిలబడదామని చెప్తూ వేణు తన ప్రసంగాన్ని ముగించారు.

"టెలివిజన్లలో ప్రతి మెదడును మార్చే విధంగా ముస్లింల పట్ల విద్వేషాన్ని ఎక్కిస్తూ, ఏ బీభత్స, భయానక బహుమతిగా మోడీని ఈ దేశానికి ఇవ్వబడుతున్నదో, దానికి అంగీకరిద్దామా?" యాకూబ్ అన్నారు.

మరో వక్త డానీ మాట్లాడుతూ 12 ఏళ్ళ క్రితం యాకూబ్ నాయకత్వంలో గుజరాత్ వెళ్ళివచ్చి జరిపిన సభ కన్నా, ఇవ్వాల్టి సభ చిన్నదని, హిందూత్వ రుగ్మత మరింత పెరిగిన నేపథ్యంలో స్పందన ఇంకా పెరగవలసిన అవసరం ఉందని అన్నారు.

"లెజిటిమసీని కోల్పోయినప్పుడల్లా రాజ్యానికి, మతం అవసరం ఏర్పడుతుందని, మోడీ బి.సి. అయినంత మాత్రాన ప్రధానమంత్రి అయిపోతాడని తాను అనుకోవడం లేదని 'హిందూత్వ' వేరు, హిందువులు వేరని, ఇదంతా మోడీని ప్రమోట్ చేస్తున్న కార్పొరేట్ మీడియా మాయ" అని డానీ అన్నారు.

"2002లో గుజరాత్‌లో ముస్లింల మీద దాడికి ఇజ్రాయిల్ నుంచి తెచ్చిన కెమికల్స్ వాడారని, హైదరాబాద్ కార్గో మీద రాసిన పేరును బట్టి ఈ విషయం ప్రపంచానికి తెల్సిందని" ఆయన అన్నారు."1925లో హిట్లర్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే భారతదేశంలో 'ఆర్.ఎస్.ఎస్.' కూడా ప్రారంభం అయ్యిందని, జర్మనీలో యూదులందర్నీ చంపేసి క్రైస్తవులు సుఖంగా ఉండొచ్చునని హిట్లర్ ప్రకటించినట్లుగానే, ముస్లింలందర్నీ చంపేసి హిందువులు సుఖంగా ఉండాలని ఆర్.ఎస్.ఎస్. భావిస్తోందని, ఒక చిన్న మైనారిటీ, గ్రూపును శత్రువుగా చిత్రీకరించి మోడీ, అద్వానీలు ఇండియాలో ప్రయగాత్మకంగా నిరూపించాలనుకుంటున్నారని" ఆయన అన్నారు.

"గుజరాత్‌లో కార్మికులకు, చాయ్‌వాలాలకు మోడీ చేసిందేమీ లేదని, పెట్టుబడిదారులకు ఊడిగం తప్ప కార్మికులకు ఏదైనా చేయడం ఆయనకు సాధ్యం కాదని" డానీ అన్నారు.

"ఇటలీలో ముసోలినీని తోలుతీసి చంపారని అదే రోజు హిట్లర్ పెళ్ళి చేసుకున్నాడని, ముసోలినీ చనిపోయిన విషయం తెలిసిన వెంటనే హిట్లర్ సయనైడ్ తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, ఇక్కడ కూడా అలాగే జరుగుతుందని" ఆయన అన్నారు. "ఎందుకంటే హిందువులు వేరు, హిందుత్వం వేరని అయితే మనందరి మధ్య సమన్వయం లేదని 12 సంవత్సరాలుగా మనం కలువక పోవడమే నిదర్శనమని" ఆయన అన్నారు.

"అద్వానీ రథయాత్రను, ముస్లింలుఅడ్డుకోలేదని, నిజానికి ముస్లింలకు అంత శక్తి లేదని, బీహార్ దాటకుండా లల్లూప్రసాద్ యాదవ్ అడ్డుకున్నాడని, అందువల్లనే మండల్ కమీషన్ సిఫార్సులను ముందు వ్యతిరేకించనట్టే బి.జె.పి. తర్వాత పట్టించుకొని బి.సి.ల మీద కేంద్రీకరించడం ప్రారంభించిందని డానీ అన్నారు. "ఈ కారణం వల్లనే కళ్యాణ్‌సింగ్ ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి కాగలిగినారని, నిజానికి అన్ని ప్రయోగాలు విఫలమయ్యాకే బి.సి.కార్డ్‌తో మోడీ బయటికి వచ్చాడని, మోడీ రావటం వల్లనే గుజరాత్ అభివృద్ధి రేటు పెరగలేదని, ఇలాంటి తుంటరి, మొండి వాడైనప్పటికీ మోడీ అవసరం వాళ్ళకేదో ఏర్పడినందువల్లనే సూది వాడాల్సిన చోట 'గునపం' లాంటి మోడీని వాడుతున్నారని" ఆయన అన్నారు. 'ఆ' అవసరం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేయడమేనని, యూదులను అంతం చేసి సుఖపడాలనుకున్న యూరప్ ప్రయత్నం విఫలమైనట్లుగానే హిట్లర్, ముస్సోలినీలు అంతం అయినట్లుగానే 'మోడీత్వను' కూడా అంతం చేస్తారని డానీ అన్నారు.

మరో వక్త అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులు రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ మతం, కాన్సర్ వంటిదని దాన్ని కీమోథెరపీ చేసినంత మాత్రాన పూర్తిగా అంతరించిపోదని, దాన్ని నిరంతరం అప్రమత్తంగా ఉండి తిరిగి మొలకెత్తకుండా చూడాలని అన్నారు.

విప్లవ రచయితల సంఘం కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ గుజరాత్ గాయం నుండి ముజఫర్‌నగర్ బీభత్సానికి పయనించిన 12 ఏళ్ళలో హిందూత్వ, మోడీత్వగా మారిందన్నారు.ముజఫర్‌నగర్‌ను మీడియా పట్టించుకోలేదు సరే, మనం ఎక్కడున్నామని విరసం ఆత్మావలోకనం చేసుకుంటోందని ఆమె అన్నారు. హిందువులంతా, ముస్లింలను ద్వేషిస్తారన్న సూత్రం కరెక్టే అయితే బీజేపీనే ఎల్లప్పుడూ గెలుస్తూ ఉండాలి కదా అని ఆమె అన్నారు. బి.జె.పి., మోడీలు సాధారణ ప్రజాస్వామికవాదులను ఆకర్షించే భాషను మాట్లాడుతూంటే కాషాయం ధరించినవారు, హిందుత్వను ప్రచారం చేస్తున్నారని అయితె తిరుపతిలో ఇటువంటి ఒక ప్రయత్నాన్ని, 'తిరుపతి పవిత్రతకు ఏదో భంగం

స్పందన

గంగాధర్ మరణం ఏం చెబుతోంది

- శాఖమూరి రవి

చావు మనిషికి సహజమే కావచ్చు కానీ అన్ని చావులూ సహజమైనవి కావు. ఆత్మహత్యల పేరిట జరుగుతున్న అసహజ మరణాల పట్ల ఆలోచించాల్సినంతగా సమాజం ఆలోచిస్తున్నట్లు అనిపించడం లేదు. ఈ ఉదాసీనత వల్ల కలుగుతున్న ఉపద్రవపు దుష్ఫలితాలు రోజు రోజుకీ తీవ్రమౌతున్నాయి. సామాజిక మార్పు కోసం సాయుధ పోరాటం చేసిన గడ్డ మీద, తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే ఇక్కడి రైతాంగం చావును ఒక పరిష్కారంగా ఎంచుకోవడం కొనసాగుతూ వస్తున్నది.

రైతులతో మొదలైన ఈ పరంపర ఇప్పుడు రైతు నాయకుల దాకా వచ్చేసింది. వరంగల్ జిల్లా రేగొండ మండలం...పద్దంపల్లి గ్రామానికి చెందిన రైతు నేత కుసుంభ గంగాధర్ మరణం ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నది. గంగాధర్ స్వయానా రైతు, రైతుల సమస్యలు పరిష్కరించే క్రమంలో వారికి అండగా నిలబడుతూ నాయకుడిగా ఎదిగి వచ్చినవాడు. సామాజిక మార్పులో రైతు సమస్యలను ఒక భాగంగా భావించి వాటి పరిష్కారానికి తనదైన పద్ధతిలో కృషి చేసినవాడు. రైతు సంఘం ఏర్పాటులో భాగస్వామియై మార్కెట్ యార్డ్ మోసాలను అరికట్టినవాడు.

గతంలో తెలంగాణ జన సభలోనూ, ప్రస్తుతం తెలంగాణ ప్రజా ఫ్రంట్‌లోనూ, జిల్లా స్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నవాడు. వీటి కార్యక్రమాల నిర్వహణలో అనేక ఇబ్బందులు పడినవాడు. ఈ క్రమంలో నిర్బంధాన్ని కూడా తట్టుకొని నిలబడిన గంగాధర్ తనను నడిపించిన నాయకుడి మరణాన్ని చూసి మాత్రం తట్టుకోలేక పోయాడు. ఆకుల భూమయ్య మరణం అనేక మందినికలచి వేసినట్లుగానే ఈయనను కూడా కలచివేసి ఉంటుంది.అయితే అది ఇంతటి తీవ్ర నిర్ణయం తీసుకునే దాకా వెళుతుందని ఆయన సన్నిహితులెవరూ ఊహించలేకపోయారు. తను బలవన్మరణాన్ని కోరుకునే ముందు కూడా ఆయన తను నమ్మిన వ్యవస్థ ఉండాలని కోరుకున్నాడు. అది లేకపోవడం వల్లనే సమాజానికి ఈ దుస్థితి దాపురించినట్లు తన మరణ వాంగ్మూలంలో రాసి పోయాడు. అన్నలు తమకు అవసరం లేదని మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి ముప్పాళ్ళ లక్ష్మణ్‌రావు సొంత ఊరు కరీంనగర్ జిల్లా బీర్‌పూర్‌ల ప్రభుత్వ అంతర్మధన 'శాంతి' ర్యాలీ ఏర్పాటు చేసి మరీ చెప్పించిన సందర్భంలోనే గంగాధర్ ఇట్లా అభిప్రాయ పడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఏది నిజం? ఈ రెండు సంఘటనలు యాధృచ్ఛికంగా జరిగినవి కావచ్చు కానీ ఒకానొక వాస్తవాన్ని అవి బలంగా తెలియజెపుతున్నాయి. అన్నలు లేక అనాధలవుతున్న సమాజానికి అన్నల అవసరం ఎంత ఉందో గంగాధర్ ఆత్మహత్య చెప్పకనే చెబుతోంది.

ఆత్మహత్యలకు అనేక కారణాలు ఉండొచ్చు అందులో వ్యక్తిగత కారణాలు కూడా కొన్ని ఉండొచ్చు. కానీ గంగాధర్ ఆత్మహత్య వ్యక్తిగతమైనదిగా కనిపించడం లేదు. సమాజపు ఉదాసీనత - దాని దుష్పరిణామాల వలన జరిగినట్లు అది జరిగిన నేపథ్యాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆ విధంగా చూసినప్పుడు ప్రతి ఆత్మహత్య ఒక విధంగా రాజ్యం చేసిన హత్యే అవుతుంది. బలహీనులను అమాయకులను ఆశల పల్లకీలో ఊరేగించి వారి మద్దతుతో అధికారాన్ని చెలాయిస్తున్న పాలకులకు, ఆ బడుగులకు బలహీనులకు నైతిక మద్దతునివ్వడంలో తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వల్లనే బాధితులు ఆత్మహత్యల బారిన పడుతున్నారు.

వాగ్దానాలు, పథకాలు వాటి అమలు జరిపే చర్యలు ఎంత మొక్కుబడిగా ఉంటున్నాయంటే అరవయ్యేడేండ్ల స్వాతంత్ర్యం అనంతరం ప్రజల జీవించే హక్కుకు ఏ మాత్రం గ్యారంటీ లేని దుస్థితి ఏర్పడింది. అందుకే గంగాధర్ లాంటి వాళ్ళు ప్రజల జీవితాలకు అన్నలు మాత్రమే గ్యారంటీ ఇవ్వగలరని బలంగా కోరుకోవడం. అన్నల ప్రవేశం తిరిగి జరిగితేనే ఆకలి అణచివేతలు లేని సమాజం అవతరిస్తుందని నమ్మిన కుసుంభ గంగాధర్ చివరి కోరిక నిజం కావాలని కోరుకుందాం. అందుకు మన వంతు ప్రయత్నం సాగిద్దాం.

కల్గుతుందనే' పేరుమీద జరుగుతున్న ఆ ప్రయత్నాన్ని ప్రజాసంఘాలు ప్రతిఘటిస్తున్నాయని వరలక్ష్మి అన్నారు. అయితే ఇదంతా మీడియాలో రాలేదని, సామ్రాజ్యవాద పెట్టుబడికి, హిందూత్వ మత ప్రచారానికి మీడియా నిరంతరాయంగా సహకరిస్తోందని ఆమె అన్నారు. 'గుజరాత్ అభివృద్ధి అంతా బూటకమనే ప్రచారం కూడా జరుగుతున్నప్పటికీ, అది సోషల్ మీడియాకే పరిమితమని, దానికి వెనుక కాంగ్రెస్ హస్తం ఉందని ఆమె అన్నారు.

వీటన్నింటిలోంచి మతానికి, మార్కెట్‌కి, మతానికి, సామ్రాజ్యవాదానికి ఉన్న సంబంధాన్ని విప్లవ రచయితల సంఘం పదేపదే చెప్తుందని, ఇప్పుడు 'బి.సి.' అనే పేరు మీద నరేంద్రమోడీనీ ప్రజల మీద రుద్దుతున్నారని ఆమె అన్నారు.'క్రైస్తవులను, ఆదివాసీలను వాళ్ళ రోజువారి సమస్యల నుంచి పక్కదారి పట్టించి, వాళ్ళందర్నీ మైనారిటీలకు వ్యతిరేకంగా వ్యవస్థీకరిస్తున్నారని, దీన్ని తిప్పి కొట్టడానికి మోడీత్వ అభివృద్ధికి, హిందూమత ప్రచారానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక, సాంస్కృతిక, కళాకారుల వేదిక మళ్ళీ పునస్సమీకరణ అయిన సందర్భంగా ఇంతకు ముందు పని చేసినట్లుగానే రచయితల్ని, కళాకారుల్ని కలుపుకొని అవసరమైన అన్ని చోట్ల - నరేంద్రమోడీ ఎన్ని ముసుగులేసుకున్నా, ఆ ముసుగులన్నింటిని తొలగించి ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని" ఆమె అన్నారు. అందర్నీ లౌకిక, ప్రజాస్వామిక, సాంస్కృతిక, కళాకారుల వేదికలోకి రమ్మని ఆహ్వానిస్తూ వరలక్ష్మి తన ప్రసంగాన్ని ముగించారు.

సభలో డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ ప్రచురించిన "ఎ రిపోర్ట్ ఆఫ్ ముజఫర్‌నగర్ సాలిడారిటీ టీం" అనే పుస్తకాన్ని డానీ ఆవిష్కరించారు. షేక్‌బాబా, ప్రసంగాల నడుమ పాటలు పాడారు.

సభ ముగింపులో కవి యాకూబ్ మార్చి 23, భగత్‌సింగ్ వర్ధంతి రోజున మళ్ళీ లౌకిక, ప్రజాస్వామిక, సాంస్కృతిక, కళాకారుల వేదిక సభ, ర్యాలీ నిర్వహిస్తుందని అందరూ పాల్గొనాలనీ, సహకరించాలనీ కోరారు.

లేఖ

రెండు పోరాట గాథలు పుస్తకంలోని బాసిత్ ముందుమాటపై...

- సాబిత్

భారతి రాసిన 'రెండు పోరాట గాథలు'కు ముందు మాటలో విరసం రచయిత బాసిత్ లేవనెత్తిన ప్రశ్నలకు, అనుమానాలకు స్పందనగా.

తిరుగుబాటునే జెండాగా చేసుకొని పోరాడిన సంస్కృతి, భూస్వామ్య ఫ్యూడల్, దళారీ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఎన్నోసార్లు పిడికిలి బిగించిన వారసత్వం తెలంగాణది. ఎటువంటి దోపిడీ, పీడన లేని నూతన వ్యవస్థ నిర్మాణం కోసం విప్లవమే మార్గమని, విప్లవం ద్వారానే అసలైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం జరుగుతుందని పీడిత ప్రజల, శ్రమజీవుల రాజ్యం కోసం ఎంతో మంది వీరులు రక్తతర్పణం చేసిన వరంగల్ జిల్లాలో లక్ష్యసాధన కోసం ఎంతో త్యాగనిరతితో పోరాడిన ఒక దళం అనుభవాలుగా వచ్చిన ఈ కథ చదివితే అర్థమవుతుంది ఆ ఉద్యమకారులకు విప్లవోద్యమం పట్ల ఎంత కన్విక్షన్ ఉందో. అదే విధంగా విప్లవకారులను తమ కంటికి రెప్పగా కాపాడుకున్న ఆ ప్రజలకు విప్లవకారుల పట్ల, విప్లవోద్యమం పట్ల ఎంత ప్రేమ ఉందో.

కథా వస్తువు చాలా బలమైంది. కథే కథనమవుతుంది.

ఈ కథలు ఆ పోరాటాన్ని మళ్ళీ ఒకసారి మనముందు కన్పించేట్లుగా చేశాయి. 'చంద్రగిరి అమరత్వం' కథలో చూసినట్లయితే... ఎన్‌కౌంటర్ అయితే గ్రామాల్లో పొయ్యి వెలిగించని ప్రజలు, దళాలకు తిండి పెట్టడం కోసం ఆరాటపడిన ఎంతోమంది నాయనలు, 'మీరు మా కోసం ప్రాణాలే త్యాగం చేస్తున్నరు బిడ్డా, మీరు మా కన్నబిడ్డల కంటే ఎక్కువ' అన్న ఎంతో మంది తల్లులు కనిపిస్తరు. ఆర్.కె. (రామకృష్ణ)ని కలిసినందుకు ఎంతో సంతోషపడ్డ మైలారం యువకుడు 'నిన్ను చూడాలని వరంగల్ జిల్లాలో ప్రతీ వ్యక్తి (యువకుల నుంచి వృద్ధుల దాకా అందరు) అనుకుంటారు'. ఆర్.కె.ని కలిస్తే ఎవరైనా ఆనందపడ్తారని ఆ యువకుడు అన్నాడంటే విప్లవకారుడి పట్ల, విప్లవోద్యమం పట్ల, దాని లక్ష్యం పట్ల ప్రజల్లో గల అభిమానం తేటతెల్లమవుతుంది. విప్లవకారులు ప్రజల కోసం నిస్వార్థంగా, నిజాయితీతో పోరాడుతున్నారనే స్పృహ, విప్లవోద్యమం పట్ల గల అపారమైన ప్రేమ, ఆత్మీయతకు నిదర్శనం. రాజ్యం అత్యంత క్రూరంగా అణచివేస్తున్న కాలంలోనూ విప్లవకారులను గుండెలలో కాపాడుకున్న ప్రజలు వేలాదిమంది సాయుధ పోలీసు బలగాలతో పదుల సంఖ్యలో ఉన్న విప్లవకారులు పోరాడిన తీరు రచయిత చెప్పినట్లుగా కౌకొండ 'ఎన్‌కౌంటర్' కాదు యుద్ధమే. అంత గొప్ప పోరాట పటిమను కనబర్చిన ప్రజలు, విప్లవకారుల గురించి కాకుండా ముందుమాటలో బాసిత్ అన్నట్లు... 'బోల్షివిక్ విప్లవం విజయవంతం కావడానికి, చైనా విప్లవం విజయవంతం కావడానికి పట్టిన కాలం కంటే భారత్‌లో విప్లవం విజయవంతం కావడానికి ఎందుకు ఎక్కువ కాలం పడ్తోంది?' అని, అక్కడితో ఆగకుండా 'విప్లవానికి ఆటంకం కలిగిస్తున్న శక్తుల్ని మన గతితార్కిక జ్ఞానం ఒడిసిపట్టలేకపోయిందా?' అంటూ బాసిత్ కథలోని (గల అంశాలకు) సబ్జెక్టుకు దూరంగా తన స్వీయ అభిప్రాయాలను, తనలో జనించిన అనుమానాలను వ్యక్తం చేశారు. బోల్షివిక్, చైనా విప్లవాలతో పోల్చి చూస్తే భారతదేశంలో రష్యాలో ఉన్న, చైనాలో లేని జాతుల సమస్య ఉంది. మత సమస్య ఉంది. చైనా, రష్యాలలో ప్రపంచంలో ఎక్కడా లేని అంత్యంత సంక్లిష్టమైన కుల వ్యవస్థ, బలమైన అస్తిత్వ పోరాటాలు దేశంలో ఉన్నవి.

మొదటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, తరువాత నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాల వెల్లువ నుంచి దాదాపు నలభై సంవత్సరాల విప్లవోద్యమం అనేక శక్తులతో పోరాడుతూ వస్తోంది. భారతదేశాన్ని చూసినట్లయితే భారతదేశం అనేక బహుళ జాతుల సమ్మేళనం. ఇది ఏనాడు ఒక దేశంగా కానీ, ఒక జాతిగా కాని, తన ఐక్యతను ప్రదర్శించినది కాదు. ఐక్యంగా లేని భిన్నజాతుల కలయిక అయిన భారతదేశంలో బ్రిటిష్ పాలనా సమయానికే ప్రజలంతా భిన్న జాతులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోను ఈ జాతులన్నింటిని సమ్మేళనం చేసి పోరాటం నిర్వహించడం అనేక ఇబ్బందులతో కూడుకున్నది. బ్రిటిష్ విభజించు పాలించు సూత్రాన్ని అనుసరిస్తున్న నేటి భారత దళారీ, దోపిడీ పాలకవర్గాలు జాతి (సమస్యలను) పోరాటాలను అణచివేస్తూ అవి ఈ సమస్యకు గల పరిష్కార మార్గాన్ని అణచివేతనే ఆయుధంగా ఎంచుకున్నాయి. జాతి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించవు. అది వాటి నైజం. రాజ్యం అణచివేత ద్వారా తన మార్కెట్ పెత్తనాన్ని నిలుపుకోవడానికి భారత దళారీ పాలక వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. విప్లవోద్యమంలోను వివిధ జాతుల ప్రజలందర్ని సంఘటితపరచి పోరాడడం అంత సులువైనదేం కాదు. అక్టోబర్ విప్లవం కన్నా ముందు మెన్షివిక్కులతో లెనిన్ చేసిన పోరాటం నుంచే ఉక్కు శిక్షణ గల బోల్షివిక్ పార్టీ ఆవిర్భవించింది. కానీ భారతదేశంలో స్వాతంత్ర ఉద్యమం జరిగిన తీరును గమనించినట్లయితే సంస్కరణవాదం నుంచి స్వాతంత్ర ఉద్యమంగా మారిన పోరాటంలో లిబరిస్టుల పాత్ర, ఆ లిబరిస్టులు అనుసరించిన సిద్ధాంతాలు నేటి సమాజంలో వాటి ప్రభావం కూడా ఎక్కువగానే ఉంది. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి వారు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసినప్పటికీ దాన్ని ఒక పార్లమెంట్ పొగ బాంబు ఘటనకు పరిమితం చేసిన, చేస్తున్న చారిత్రక వక్రీకరణలు ప్రజలకు అసలైన పోరాట వారసత్వం అందకుండా ప్రజా పోరాటాల గురించి తెలియకుండా పాలకవర్గాలు చేస్తున్నాయి. చైనాలో గల స్పష్టమైన జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేకత లాగా బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై అప్పటి లిబరిస్టులకు స్పృహ లేకపోవడం కూడా సామ్రాజ్యవాద వ్యతిరేకత, నేటి సమాజంలో ఆ భావజాలం ప్రజలలో ప్రతిబింబించకపోవడానికి ఒక కారణం.

భారతదేశంలో ఒక బలమైన ఫ్యూడల్ వ్యవస్థ, సమాజంలో

మతాల పేరిట ప్రజలను విభజించిన పాలక వర్గాలు, హిందు ఫాసిస్టు శక్తులు మైనారిటీ మత మైనారిటీలపై చేస్తున్న దాడులు ఒకపక్క సామ్రాజ్య వాద శక్తులు కూడా మతాలను ఉపయోగించుకొని తమ వ్యాపారాలను ముందుకు తీసుకుపోతున్నాయి. భిన్న మతాలుగా ప్రజలలో గల ఒక తీవ్రమైన అనైక్యత కూడా ఉంది. (ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో మతపరమైన అనైక్యత అధికంగా ఉంది). బ్రాహ్మణీయ ఫ్యూడల్ భావజాలం సృష్టించిన, ప్రపంచంలో ఎక్కడా లేని అత్యంత సంక్లిష్టమైన కుల వ్యవస్థ వాటి బలం మన అర్థం చేసుకోవచ్చు. కుల అణచివేత ద్వారా వచ్చిన అస్తిత్వ పోరాటాలు సామాజిక విముక్తి పోరాటాలుగా ఎదగకుండా కుచించుకుపోయి వాటికవిగా పరిమిత, సంకుచిత పోరాటాలుగా గిడసబారుతున్నాయి. ఈ అర్థంలో విప్లవోద్యమాల చైతన్యానికి, అచరణకు కొన్ని సార్లు అవరోధంగా కూడా తయారవు తున్నాయి. అస్తిత్వ పోరాటం ప్రధానంగా వర్గాన్ని నిరాకరిస్తు, ఒక కుల (లేదా) మహిళలు (లేదా) మైనారిటీలు ఆధారంగా గ్రూపులు మాత్రమే అస్తిత్వంలో ఉన్నాయంటోంది. అస్తిత్వవాదం, ఆ సిద్ధాంతం దోపిడీకి గురవుతున్న ఆ ప్రజలంతా కలసి ఒక ఐక్యతా పోరాటం చేయాల్సినవసరం లేదు, అది అసాధ్యం అంటుంది. ఆయా గ్రూపుల ప్రజలు ఆయా ప్రయోజనాల కోసం పోరాడ్తారని అంటుంది. అస్తిత్వవాద భావజాలంపై బలమైన పోస్ట్‌మోడర్నిస్టు సిద్ధాంత ప్రభావం ఉంది. అస్తిత్వవాదాలు సాయుధ పోరాటాన్ని తిరస్కరించి బూర్జువా ప్రజాస్వామ్యంపై భ్రమలు కలిగిస్తున్నాయి. విప్లవోద్యమాన్ని బలహీనపరిచే లక్ష్యంతో పాలకవర్గాల మద్దతుతో అస్తిత్వవాద ఉద్యమాలు ముందుకొస్తున్నాయి. భారతదేశంలో బ్రిటీష్ పాలనా కాలం నుంచే పార్లమెంటరీ వ్యవస్థ నిర్మాణంలో ఉంది. (చైనాలో ఫ్యూడల్ ప్రభువులు చేత రాజ్యమేల బడింది. రష్యాలో డ్యూమా వంటి అంత్యంత బలహీనమైన పార్లమెంట్ ఉంది. అంటే చైనా, రష్యాలో కన్నా భారత్‌లో పటిష్టమైన పార్లమెంటరీ వ్యవస్థ ఉంది.) నక్సల్‌బరీ విప్లవకాలం నాటికే 20 ఏళ్ల పార్లమెంట్ చరిత్ర ఉంది. భారతదేశంలో ఎన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ ఇక్కడ విప్లవోద్యమం ముందడుగులోనే ఉంది. ఇన్ని ప్రతికూలతల కారణంగా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగడం, విజయానికి దగ్గర కావడం ఎక్కువ కాలం పట్టవచ్చు. మావో-సే-టుంగ్ చెప్పినట్లుగా విప్లవోద్యమం అనేది ఒక దీర్ఘకాలిక పోరాట ప్రక్రియ. చైనాలో 'త్వరితగతిన విజయం' (quick victory) అనే భావాలు ఎర్రసైన్యంలో వచ్చినప్పుడు 'మావో' రాసిన (on protracted war) 'దీర్ఘకాలిక ప్రజా యుద్ధం'లో పోరాటాన్ని మూడు దశలుగా సూత్రీకరించాడు. (1) Strategic defensive (వ్యూహాత్మక ఆత్మ రక్షణ), (2) Strategic counter offensive (వ్యూహాత్మక ప్రతిదాడి) - నేడు దేశంలో విప్లవోద్యమం రెండు దశలను దాటుకొని మూడవ దశ అయిన strategic counter offensive దశలో పోరాటం ఉందన్న విషయాన్ని మనమంతా గుర్తించుకోవాలి. అదే విధంగా మావో ప్రజా సైన్యం సిద్ధాంతాన్ని చెబుతూ (on correcting Mistaken idea in party) "ఎర్రసైన్యం బాధ్యత యుద్ధం మాత్రమే కాదని ప్రజల మధ్య విప్లవ పంథా గురించి, విప్లవోద్యమం వాటి లక్ష్యాల గురించి ప్రచారం నిర్వహించడం, ఆ ప్రజలను ఆర్గనైజ్ చేయడం, ఆ ప్రజలను ప్రజాసైన్యంలో భాగం చెయ్యడం, వారిని సాయుధులను చేసి వారి ద్వారా విప్లవ ప్రజా సంస్థలను ఏర్పాటు చేయడం' అని చెప్పాడు. నేడు దండకారణ్యంలో విప్లవోద్యమం ఆదివాసీ ప్రజలకు విప్లవ అవగాహనను తెలియజేసింది. ప్రజలను ఆర్గనైజ్ చేసి ప్రజా సైన్యంలో భాగం చేసింది. వారి ద్వారా జనతన సర్కార్ రూపంలో ఒక విప్లవ ప్రజాసంస్థను, ఒక ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వాన్నే ఏర్పాటు చేశారు. నేడు ఆదివాసులంతా మావోయిస్టులయ్యారంటే విప్లవోద్యమం ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సమాజంలో దోపిడీ, పీడన, అసమానతల వలన ప్రజలు వర్గాలుగా విభజింపబడినంత కాలం వర్గ పోరాటం జరుగుతుంది.

వాస్తవానికి 'రెండు పోరాట గాథలు' చదివిన తర్వాత ఉత్పన్నమయ్యే, ఉత్పన్నం కావలసిన ప్రశ్నలు బాసిత్ ముందుమాటలో ప్రస్తావించినవి ఎంత మాత్రం కావు. వరంగల్ పట్టణానికి కూతవేటు దూరంలో జరిగిన కౌకొండ ఎన్‌కౌంటర్ ఘటనలో ఎంతో గొప్ప పోరాట పటిమను కనబర్చిన ఆ దళంలోని విప్లవకారులు ఆ గుట్టలోని దోనలలో మండుటెండల కాలంలో ఉదయం నుంచి రాత్రి వరకు శత్రువు భాష్పావాయువులు, గ్రెనైడ్ల ప్రయోగం చేస్తున్నప్పుడు ఆ పోగకు ఏ మాత్రం శబ్దం చేయకుండా, బుల్లెట్ గాయాలతో రక్తమోడుతున్నప్పటికీ కొన్ని గంటలపాటు భరించిన ఆ వీరుల గాథ చదువుతుంటే ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు (ఈ దళం నుంచే) ఇంత పోరాట పటిమను కనబర్చిన దళం నుంచే, ఆ వీరయోధుల నుంచే లొంగుబాట్లు ఎందుకయ్యాయి? చూట్టు తుపాకులతో దేగాల్లా వెదుకుతున్న పోలీసుల నుంచి ప్రాణాలకు అపాయం ఉన్నప్పటికీ లెక్కచేయకుండా విప్లవకారులను కాపాడుకున్న ఆ ప్రజలు నేడు ప్రధానంగా తెలంగాణలో విప్లవకారులను విప్లవోద్యమాన్ని కాపాడుకో లేని పరిస్థితి ఎందుకు వచ్చింది...? భారతి రాసిన రెండు పోరాట కథల ద్వారా ఈ ప్రశ్నలు ప్రేరేపితమవుతున్నాయి.



శబ్దం

ప్రజా సాంస్కృతికోద్యమ ప్రతిధ్వని

చదవండి
చదివించండి

ప్రచురణ : ప్రజా కళామండలి

వెల : రు. 15/-

చిరునామా : జాన్, ఇ.నెం. 6-30, సర్వే నెం. 5/347,
మోహన్‌రావు కాలనీ, బాలాజీనగర్, రంగారెడ్డి - 500 057.
ఫోన్ : 83414 72895, Email : shabdampkm@gmail.com

కరపత్రం

షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ అమరులైన మార్చి 23ని హిందూ ఫాసిస్టు వ్యతిరేక దినంగా జరుపుకుందాం! ఫాసిజంపై భగత్ సింగ్ భావాలను విస్తృతంగా ప్రచారం చేద్దాం!

హిందూ ఫాసిస్టు వ్యతిరేక సభ..
'కిల్లింగ్ ఫీల్డ్స్ ఆఫ్ ముజఫర్ నగర్' డాక్యుమెంటరీ ప్రదర్శన
మార్చి 23, ఆదివారం సాయంత్రం 6 గంటలకు
సారస్వత పరిషత్ కళాశాల (ఎస్‌పీ హాలు), బొగ్గుల గుంటలో
అధ్యక్షత : యాకూబ్, ఎస్‌డీఎల్‌సీఎఫ్ కన్వీనర్
వక్తలు : కె. శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి సంపాదకుడు
జాహెద్ అలీఖాన్, సియాసత్ సంపాదకుడు

తాను చిక్కుల్లో పడినప్పుడల్లా పెట్టుబడిదారీ వ్యవస్థ విరజిమ్మే విషమే ఫాసిజం. దోపిడీతత్వంతో పాలించే ప్రభుత్వాల దన్నుతో అది ఆధిపత్య మతతత్వంగా పడగ విప్పుతుంది. భారతదేశంలో హిందూ ఫాసిజం రూపంలో మత మైనారిటీలను కాల్చుకు తింటున్నది. పెట్టుబడిదారీ దిగుమతి విధానాలను గత అరవై ఏళ్లుగా మోస్తూ..రాజ్యాంగంలో గొప్పగా ప్రకటించుకొన్న లౌకిక ఆదర్శం అమలు దగ్గరకు వచ్చేసరికి మాత్రం చేతులు సచ్చుబడిపోయే ఈ దేశ పాలకవర్గాల ప్రధాన భావజాల అణచివేత సాధనం హిందూ మతోన్మాదం. అది పెట్టుబడిదారీ సంక్షోభ పర్యావసానంగానే మిగిలిపోలేదు. మరో సంక్షోభిత ప్రతిఫలనం అయిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో జతకట్టి దేశ దోపిడీ వ్యవస్థకి ముప్పు వాటిల్లినప్పుడల్లా హింసాయుతంగా స్పందిస్తూ ఉంటుంది. ఫలితంగానే ఈ దేశ పార్లమెంటరీ పాలకవర్గ రాజకీయాలూ, పార్టీలూ మతవర్గతత్వాన్ని పుణికిపుచ్చుకున్నాయి. దేశ విభజన నాటి దారుణాలు మొదలు ఇప్పటి సలుపుతున్న మరో గుజరాత్ గాయం 'ముజఫర్‌నగర్' ఊచకోతల దాకా.. నేపథ్యాన్ని అందించిన పరిస్థితులను మనం బహుళ, స్వావలంబన, స్వేచ్ఛా ఆకాంక్షల సమాజం పట్ల పాలకవర్గ విధాన వైఖరుల్లోనే వెతుక్కోవాల్సి ఉంటుంది. ఈ అర్థంలోనే షహీద్ భగత్ సింగ్ పాలకవర్గ దోపిడీని, దాని రాజకీయార్థిక సారమైన సామ్రాజ్యవాదాన్ని, భావజాల విషకోర అయిన మతోన్మాద సంస్కృతిని తుదకంటా నిరసించాడు. సాంస్కృతిక, భావజాల ఉద్వేగ ప్రధానంగా సాగిన జాతి విముక్తి సాయుధ పోరాటాల దిశను మార్చి..హేతుబద్ధతని, శాస్త్రీయతని కల్పించాడు. తన సహచరులతో కలిసి సామ్రాజ్యవాదంపై సాయుధంగా తిరగబడే క్రమంలో మత సంబంధ చిహ్నాలను, ప్రతీకలను, సమీకరణాలను, పోరాట రూపాలను పూర్తిగా త్యజించాడు. ప్రత్యామ్నాయ విముక్తి మార్గానికి తిరుగులేని ప్రతీకగా నిలిచాడు.

అలాంటి భగత్‌సింగ్‌ని, ఆ సోషలిస్టు విప్లవకారుడిని..దోపిడీ వ్యవస్థని వెయ్యి చేతులతో కాపుకాస్తున్న హైందవ నాగరాజులు, ఆధిపత్య కులతత్వవాదులు 'బ్రాండ్'గా మార్చే దుస్సాహసం చేస్తున్నారు. కార్పొరేట్ దోపిడీ పోతపోసిన రూపం అయిన నరేంద్రమోడీకి భద్రతా వలయం నిర్మిస్తున్న ప్రైవేట్ సాయుధ గుండాలు 'భగత్ సింగ్ క్రాంతిసేన' పేరిట ప్రజాస్వామిక, జాతీయవాదులపై దాడులకు పాల్పడుతున్నారు. సామాజిక న్యాయం, సామ్యవాదం అంటూ నంగినంగిగా మాట్లాడుతూ భగత్ సింగ్ బొమ్మ ముందు నిలబడి ఓ నటుడు ఫోజు కొడుతున్నాడు. జీవితాంతం నిర్మాణానికి, సిద్ధాంతానికి, శ్రామికవర్గ రాజ్యాధికార లక్ష్యానికి అంకితమైన భగత్‌సింగ్‌ని ఈ పద్ధతుల్లో ప్రచారంలో పెట్టడం వెనుక, పాలకవర్గాల వ్యూహం పనిచేస్తున్నది. వక్రీకరించిన పద్ధతిలో జాతి వీరుల చరిత్రను, బోధనలను పెద్దఎత్తున అందుబాటులోకి తీసుకువచ్చే ఎత్తుగడ అందులో దాగి ఉంది. కాబట్టే, భిన్న, బహుళ సమాజాల్లో ప్రాణం పోసుకున్న లౌకిక, ప్రజాస్వామిక సంప్రదాయాలను కాపాడుకోవడం అంటే..సాంస్కృతిక ప్రత్యామ్నాయ పథాన్ని నిర్దేశించిన భగత్ సింగ్ వంటి వీరులను ప్రతీకల రూపంలో పరిరక్షించుకోవడం కూడానని ఎస్‌డీఎల్‌సీఎఫ్ బలంగా విశ్వసిస్తున్నది. అందులోభాగంగానే షహీద్ భగత్ సింగ్, ఆయన విప్లవ సహచరులు అమరులైన మార్చి 23ని హిందూ ఫాసిస్టు వ్యతిరేక దినంగా జరుపుకోవాలని నిర్ణయించింది. సామాజిక సంబంధాల్లో లౌకిక విధానాలను కాంక్షించే ప్రతి ఒక్కరినీ సభకు, ఎస్‌డీఎల్‌సీఎఫ్ నిర్మాణంలోకి ఆహ్వానిస్తున్నది.

గోపాల్ మీనన్ డాక్యుమెంటరీ కిల్లింగ్ ఫీల్డ్స్ ఆఫ్ ముజఫర్‌నగర్

మరుభూములను మోస్తున్న ముజఫర్‌నగర్
(సంక్షిప్త పరిచయం)

బాధిత సమాజాలకు తన సహానుభూతిని దృశ్యరూపకంగా పంచుతున్న ప్రజాపక్ష డాక్యుమెంటరీ దర్శకుడు గోపాల్ మీనన్. పాలకవర్గ మత, ఆధిపత్య క్రౌర్యం ఏ రూపంలో విరుచుకుపడినా కెమెరా కంటితో ఖండించే మీనన్, జాతి ఉద్యమాలపై ఉక్కుపాదం మొదలు హక్కుల హననం దాకా ఎన్నో సున్నితమైన అంశాలపై డాక్యుమెంటరీలను నిర్మించారు. దేశవ్యాప్తంగా గత దశాబ్ద కాలంలో జరిగిన మత కలహాల్లోకెల్లా అత్యంత పాశవికమైనది, తీవ్ర గర్హనీయమైనది అయిన ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ ఊచకోతల ఘటనని విస్మయపరిచేవిధంగా చిత్రీకరించారు. దేశ రాజకీయ, సామాజిక వ్యవహారాల్లో మతతత్వం, ద్వేష రాజకీయాలు ప్రధానంగా

ముందుకొచ్చిన ప్రతి సందర్భంలో మత మైనారిటీలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే..వీటిని కేవలం పాలనా యంత్రాంగం వైఫల్యంగా చిత్రీకరించేందుకు ప్రధాన స్రవంతి మీడియా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ముజఫర్‌నగర్ బాధితుల బాధామయ వాస్తవిక స్థితి, వ్యథ, వారు దాటొచ్చిన నిస్సహాయ, పరితాప సందర్భాల కథన సమాహారంగా ఈ డాక్యుమెంటరీని మీనన్ రూపొందించారు. సార్వత్రిక ఎన్నికల క్రీడలో భాగంగా, పశ్చిమ యూపీ ప్రాంతంలోని సామాజిక జీవన వైవిధ్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు హిందుత్వ రాజకీయ సంస్థలు జరిపిన కుట్రని వాంగ్మూలాల రూపంలో రికార్డు చేశారు. ఊచకోతల సజీవ దృశ్యాలను అందించడంతోపాటు కత్తులూ, తుపాకులూ ధరించి హిందూ మతోన్మాదంతో ఊగిపోతున్న గుంపుల బహిరంగ ప్రదర్శనలను, ఫాసిస్టు నేతల రెచ్చగొట్టే ఉపన్యాసాలను, ముస్లిం ఆవాసాల్లోకి చొచ్చుకెళ్లి గృహాలను, దుకాణ సదుదాయాలను కాలబెట్టిన వైనాన్ని కళ్లు చెమ్మగిల్లేలా చిత్రీకరించారు. మొత్తం 180 మంది మహిళలు ఊచకోతల్లో భాగంగా సామూహిక అత్యాచారాలకు గురయ్యారు. అయితే.. వీటికి సంబంధించి ఇప్పటిదాకా నమోదయింది ఆరు ఎఫ్ఐఆర్‌లు మాత్రమే. అధికారిక లెక్కల ప్రకారం 13 మంది హిందువులు సహా మొత్తం 59 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే.. ఘటనా ప్రాంతాలకు వెళ్లివచ్చిన వారూ, స్థానికులూ చెబుతున్నదాన్నిబట్టి, అంతకు కొన్ని రెట్లు ఎక్కువగా హత్యలకు గురయ్యారు. లక్షాయాభై వేలమంది తమ సొంత భూమిపైనే నిర్వాసితులయ్యారు. వేలాదిమంది ఇప్పటికీ పునరావాస శిబిరాల్లో మగ్గుతున్నారు.

Secular Democratic Literary
& Cultural Forum (SDLCF)
లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక

రచనలకు ఆహ్వానం

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తీకరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపిండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

- సంపాదకుడు

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : arunatara1977@gmail.com
http://www.facebook.com/arunatara.virasam
virasam website : www.virasam.in

కరపత్రం

తొలి తరం విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ రవూఫ్‌ను స్మరించుకుందాం

మార్చి 3వ తేదీ సోమవారం సా. 5.30 గంటలకు, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్

ఫిబ్రవరి 9న అనారోగ్యంతో మృతి చెందిన కా. రవూఫ్ నక్సల్బరీ తరం విప్లవ కమ్యూనిస్టు నేతల్లో ఒకరు. సి.పి.ఐ., సి.పి.ఎం. రివిజనిస్టు రాజకీయాలతో తీవ్ర ఘర్షణ పడి విప్లవోద్యమం నిర్మించడానికి ఆ రోజుల్లో అపారమైన సిద్ధాంత పటుత్వం, పోరాట నిబద్ధత, త్యాగపూరిత ఆచరణతో ముందుకు వచ్చిన ముఖ్యుల్లో రవూఫ్ పాత్ర ఎన్నదగినది. విప్లవోద్యమం ప్రారంభ దినాల్లో ఎన్నో ఆటుపోట్లు, నిర్బంధాలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన ఆనాటి నుంచి చివరి దాకా నక్సల్బరీ పోరాట మార్గాన్ని అంటిపెట్టుకొని కొనసాగారు.

1969లో సి.పి.ఐ. ఎంఎల్ పార్టీ ఏర్పడ్డప్పటి నుంచి చారుమజుందార్ మార్గాన్ని అచంచలంగా ఆయన విశ్వసించి, ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించారు. బహుశా ఆ రోజుల్లో ఆయనను కలిసి మాట్లాడిన అతి కొద్ది మంది నాయకుల్లో రవూఫ్ ఒకరు. చారుమజుందార్ రాజకీయ పంథాలో కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి వంటి వాళ్లతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమ నిర్మాణంలో ఆయన కీలకంగా పని చేశారు. అయితే విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడంలో, పునఃసంఘటితం చేయడంలో కామ్రేడ్ కె.ఎస్. తీసుకున్న నిర్ణయాల్లో ఆయనకు మితవాదం కనిపించింది. దీర్ఘకాల ప్రజా యుద్ధానికి సన్నాహాలు చేయవలసిన తరుణంలో సాయుధ పోరాటానికి, ప్రజాపంథాకు మధ్య అనవసరమైన పోటీ తీసుకొని వచ్చారు. దీంతో ఆనాటి సి.ఒ.సి.తో విభేదించి రవూఫ్ బయటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత సి.పి.ఐ. ఎంఎల్ రెడ్‌ఫ్లాగ్ పేరుతో పార్టీని నిర్మించారు. ఆ తరువాత దాని కేంద్ర నాయకులతో వచ్చిన విభేదాల వల్ల అక్కడి నుంచి బయటికి వెళ్ళి సి.పి.ఐ.ఎంఎల్ నక్సల్బరీ అనే పార్టీని నెలకొల్పారు.

ఈ కాలమంతా ఆయన తీసుకున్న వైఖరుల మాట ఎలా ఉన్నా ప్రజల సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించారు. వాటన్నింటిని విప్లవోద్యమంలో భాగంగానే నిర్మించారు. ఆయన నేతృత్వంలో ఉన్న పార్టీలు ప్రభుత్వ దారుణ నిర్బంధానికి గురై చాలా విలువైన కామ్రేడ్లు అమరులయ్యారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రవూఫ్ గ్రూప్ పేరుతో, ఆ తర్వాత రెడ్ ఫ్లాగ్ పేరుతో ఆయన నాయకత్వంలో పార్టీ పని చేసింది. ముఖ్యంగా వరంగల్, నల్గొండ, అనంతపురం జిల్లాలో సాయుధ పంథాలో విప్లవోద్యమ నిర్మాణానికి ఆయన కృషి చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళ మొదలైన ప్రాంతాల్లో ఆయన సహచరులు ఉండేవారు.

నిర్బంధంతోపాటు ఇతర అనేక కారణాల వల్ల ఆయన నేతృత్వంలోని విప్లవ పార్టీ క్షీణించిపోయింది. అయినా ఆయనలో విప్లవ దీక్ష చివరి రోజుల దాకా సడలలేదు. అనారోగ్యంతో, వయోభారంతో కుంగిపోయిన చివరి రోజుల్లో కూడా విప్లవం పట్ల ఆయన అచంచలమైన విశ్వాసంతో జీవించారు. నిర్మాణపరంగా ఆయన రాజకీయ ప్రస్థానం ఎన్ని మలుపులు తిరిగినా సాయుధ విప్లవోద్యమంతో దృఢంగా నిలబడ్డారు.

శ్రీకాకుళ పోరాట కాలంలో పార్వతీపురం కుట్ర కేసులో జైలు జీవితం గడిపారు. ఆ తరువాత కూడా అనేక కేసుల్లో చెరశాల నిర్బంధాన్ని అనుభవించారు. జైలు జీవితాన్ని కూడా రాజకీయ ఆచరణ క్షేత్రంగా భావించి, ప్రజా జీవితంలోకి వచ్చినప్పటి నుంచి విప్లవోద్యమం కోసం పని చేశారు. వెనుకబడిన రాయలసీమలోని కదిరి పల్లెసీమలో పుట్టిన రవూఫ్ నక్సల్బరీ పంథాను దేశవ్యాప్తం చేయడానికి జీవితమంతా వెచ్చించారు. అత్యంత నిరాడంబర జీవితం గడిపి అనేక మంది విప్లవోద్యమ అమరులు నెలకొల్పిన ప్రజా జీవిత సంప్రదాయాలను, విలువలను ఆయన సుస్థిరం చేశారు. విప్లవమనే చారిత్రక పరిణామ క్రమంపట్ల ఆనాటి తరంలో ఉన్న భావోద్వేగ పూరిత విశ్వాసానికి ఆయన జీవితమే ఉదాహరణ. విప్లవోద్యమం అంతిమంగా జయిస్తుందనే నమ్మకమే ఆయన వ్యక్తిత్వంలోని మలగని కాంతి. అందువల్లనే సొంత జీవితాన్ని అన్ని రకాలుగా వదులుకొని అవివాహితుడిగా విప్లవోద్యమానికే వెచ్చించారు. భారత విప్లవోద్యమం తొలి దశలో చాలా కీలకపాత్ర పోషించి చివరి దాకా విప్లవం కోసమే బతికిన వాళ్లలో బహుశా ఆ తరానికి చెందిన చివరి వ్యక్తి కామ్రేడ్ రవూఫే కావచ్చు. ఒక చారిత్రక సమయంలో సాహసోపేతమైన రాజకీయ నిర్ణయాన్ని తీసుకొని నక్సల్బరీ పంథాని సజీవంగా భవిష్యత్ తరాలకు అందించిన ఆయనలాంటి వాళ్ల అనుభవాలు, ఆచరణ, త్యాగం చాలా విలువైనవి. రాజకీయ సంఘర్షణలు ఎన్ని జరిగినా, ఆశా నిరాశల మధ్యనే ప్రజా ఉద్యమ గమనం సాగినా... అంతిమంగా ప్రజలు జయిస్తారనే నమ్మకాన్ని ఎత్తిపట్టవలసిన కాలం ఇది. ఈ వ్యవస్థకు విప్లవమే ఏకైక ప్రత్యామ్నాయమని నినదించవలసిన రోజు ఇది. ఈ రెంటికీ కామ్రేడ్ రవూఫ్ గొప్ప చిరునామా. అందువల్ల ఆయన స్ఫూర్తికి, విప్లవ దీక్షకు, జీవితాచరణకు విరసం వినమ్రంగా జోహార్లు చెబుతూ... మార్చి 3వ తేదీ సోమవారం సా. 5.30 గంటలకు, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో సంస్మరణ సభ నిర్వహిస్తున్నది. కా. రవూఫ్ ఎత్తిన నక్సల్బరీ సాయుధ పోరాట జెండాను అందరం సమున్నతంగా ఎత్తిపడదాం రండి!!

అధ్యక్షత	:	వరవరరావు
వక్తలు	:	ఇమాన్యుఅల్, పోరాట్టం కేరళం
		యాదగిరి రెడ్డి, రవూఫ్ సహచరుడు
		ప్రొ. శేషయ్య, సిఎల్‌సి అధ్యక్షుడు
		వెంకన్న, రవూఫ్ సహచరుడు
		భూపాల్, విరసం
		శశికళ, విరసం

BCO

-: స్వీకారం :-



ప్రజా ప్రత్యామ్నాయాల్లో నూరేళ్ల కాళోజీ
రచయిత : వరవరరావు
ప్రచురణ : స్వేచ్ఛాసాహితి
వెల : రు. 60/-
పేజీలు : 109



తడి ఆరని నేల
రచయిత : అరసవిల్లి కృష్ణ
ప్రచురణ : పాలపిట్ట బుక్స్
వెల : రు. 60/-
పేజీలు : 119



మహిళ లేని చరిత్ర లేదు
ఉద్యమాలలో భారత మహిళలు
రచయిత : వి. గార్గి
ప్రచురణ : మహిళా మార్గం ప్రచురణలు
వెల : రు. 120/-
పేజీలు : 328



దాక్షిణ్యవాదం నుంచి దండకారణ్యం దాక భారత మహిళా ఉద్యమం
రచయిత : యం. రత్నమాల
ప్రచురణ : నూతన ప్రచురణలు
వెల : రు. 200/-
పేజీలు : 328



పాఠకులతో నూతన సంభాషణ
రచయిత : యం. రత్నమాల
ప్రచురణ : నూతన ప్రచురణలు
వెల : రు. 80/-
పేజీలు : 96



చివరంచు
రచయిత : యార్లగడ్డ రాఘవేంద్రరావు
ప్రచురణ : శ్రావ్య పబ్లికేషన్స్
వెల : రు. 80/-
పేజీలు : 100



లెనిన్ ప్రసిద్ధ రచన
రాజ్యమూ-విప్లవమూ
క్లుప్తీకరణ : ఎన్.వి.ఎస్. నాగభూషణ్
ప్రచురణ : తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్
వెల : రు. 20/-
పేజీలు : 48



ప్రజా కళామండలి
పాటలు 2014
ప్రచురణ : ప్రజా కళామండలి ప్రచురణలు
వెల : రు. 20/-
పేజీలు : 222



నాటకం నాటిక
వీధి నాటిక
ప్రచురణ : ప్రజా కళామండలి ప్రచురణలు
వెల : రు. 20/-
పేజీలు : 67

సముద్రమంత... చెమట చుక్క
కవిత్వం
రచయిత : మొయిద శ్రీనివాసరావు
ప్రచురణ : సాహితీ సంస్కృతిక సంస్థ
వెల : రు. 50/-
పేజీలు : 95



Leaders Beyond Media Images
రచయిత : కె. బాలగోపాల్
ప్రచురణ : పర్స్పెక్టివ్స్
వెల : రు. 150/-
పేజీలు : 130



దిష్టిబొమ్మ
కవిత్వం
రచయిత : చిలుకూరి శ్రీనివాసరావు
ప్రచురణ : చిలుకూరి ప్రచురణలు
వెల : రు. 80/-
పేజీలు : 84



కశ్మీర్‌లో నిషిద్ధరాత్రి
రచయిత : బషారత్ పీర్
ప్రచురణ : మలుపు ప్రచురణలు
వెల : రు. 150/-
పేజీలు : 224

మహోన్నత భారతీయుడు
డా॥ బి.ఆర్. అంబేద్కర్
రచయిత : బొర్రా గోవర్ధన్
ప్రచురణ : బుద్ధభూమి ప్రచురణ
వెల : రు. 15/-
పేజీలు : 40

కాలాన్ని గెలుస్తూ...
ప్రత్యేక ప్రతిభావంతులపై కవితా సంకలనం
సంపాదకుడు : బిల్లా మహేందర్
ప్రచురణ : వికలాంగుల హక్కుల పోరాట సమితి
వెల : రు. 100/-
పేజీలు : 200

ARUNATARA ... Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
• RNI Regn.No.21152/72 • Published on 03/06/2014 304 - March-May, 2014

KLVA101M168

"మిథ్యా ప్రపంచంలా కనబడే భయంకర వాస్తవం మధ్య మనం నిలబడి ఉన్నాం. కథలు సృష్టించే మేము. ఏ విషయాన్నైనా నమ్మేసే వాళ్లమైన మేము. ఈ భయానక వాస్తవానికి వ్యతిరేకమైన కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించడానికి సమయం మించిపోలేదని నమ్ముతాము. మనం సృష్టించబోయే ఆ ప్రపంచం ఒక నూతన ప్రపంచం. అది జీవితాన్ని వివరించే ప్రపంచం. అక్కడ ఇతరుల చావును ఏ ఒక్కరూ శాసించడానికి వీలు ఉండదు. అక్కడ ప్రేమ నిజమని రుజువవుతుంది. అక్కడ ఆనందం సాధ్యమని ధృవపడుతుంది. అక్కడ వందేళ్ల ఒంటరితనానికి గురిచేయబడిన జాతులు చిట్టచివరికి శాశ్వతంగా భూమిమీద తాము పొందదగిన అవకాశాల్ని పొందుతాయి."

- గాబ్రియెల్ గార్షియా మార్కెజ్
(06.03.1927-17.04.2014)

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M168
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Bhanusree
స్కాన్ చేసినది	Afsan
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good